

కామ్రేడ్ సత్యాంకు అరుణారుణ జోహార్లు

# అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక

ARUNATARA

సంపుటి: 44 సంచిక: 4 హైదరాబాద్ 324 మే, 2016 పేజీలు: 68 వెల: రు. 20



నీ దేశం దేశద్రోహి
నీ దాహం దేశద్రోహం
అన్నాక
నేనెందుకు ముడుచుకుపోవాలింక
రాసుకోండిరా మీ చీకటి చట్టాల్లో
నేను దేశద్రోహినే...
పలవరిస్తున్న ప్రపంచ శిశువుకు
పాలను కలగంటున్న దేశద్రోహినే...

మీ నిఘంటువు వ్యర్థార్థాల్లో
ఒకప్పుడు నేను రాక్షసుణ్ణి
ఇప్పటికిప్పుడు దేశద్రోహిని
ఈదేశ మనుభద్రత వెన్నుపూసపై
ఎక్కుపెట్టిన గన్నునే
మన్నువాసన పెన్నునే...

# ప్రస్తుతం మా వద్ద అందుబాటులో ఉన్న విరసం, ఇతర ప్రచురణలు, వాటి ధరలు

## కథ, నవల, కవిత్వం, సాహిత్య విమర్శ

| | | |
|---|---|---|
| 1. | కొడవటిగంటి కుటుంబరావు - 1 (కథలు) | 200-00 |
| 2. | కొడవటిగంటి కుటుంబరావు - 2 (కథలు) | 200-00 |
| 3. | కొడవటిగంటి కుటుంబరావు - 8 (నవలలు) | 250-00 |
| 4. | కొడవటిగంటి కుటుంబరావు - 9 (నవలలు, కథలు నాటికలు) | 250-00 |
| 5. | కొడవటిగంటి కుటుంబరావు - 10 (సైన్స్ వ్యాసాలు) | 300-00 |
| 6. | కొడవటిగంటి కుటుంబరావు - 11 (చరిత్ర వ్యాసాలు) | 150-00 |
| 7. | కొడవటిగంటి కుటుంబరావు - 12 (రాజకీయ వ్యాసాలు) | 400-00 |
| 8. | కొడవటిగంటి కుటుంబరావు - 13 (సంస్కృతి వ్యాసాలు) | 300-00 |
| 9. | కొడవటిగంటి కుటుంబరావు - 14 (సినిమా వ్యాసాలు) | 300-00 |
| 10. | కొడవటిగంటి కుటుంబరావు - 16 ఎ (సాహిత్య వ్యాసాలు) | 300-00 |
| 11. | కొడవటిగంటి కుటుంబరావు - 16 బి (సంస్కృతి వ్యాసాలు) | 300-00 |
| 12. | కొడవటిగంటి కుటుంబరావు - 17 (తాత్విక వ్యాసాలు) | 150-00 |
| 13. | కొడవటిగంటి కుటుంబరావు - 18 (లేఖలు) | 125-00 |
| 14. | కె.వి.ఆర్. సాహిత్య వ్యాసాలు (మొదటి భాగం) | 300-00 |
| 15. | కె.వి.ఆర్. సాహిత్య వ్యాసాలు (రెండవ భాగం) | 250-00 |
| 16. | కె.వి.ఆర్. సాహిత్య వ్యాసాలు (మూడవ భాగం) | 250-00 |
| 17. | కె.వి.ఆర్. సామాజిక వ్యాసాలు (నాల్గవ భాగం) | 250-00 |
| 18. | కె.వి.ఆర్. మహోదయం | 200-00 |
| 19. | వసంతగీతం (అల్లం రాజయ్య) | 250-00 |
| 20. | కొమురం భీం (అల్లం రాజయ్య) | 150-00 |
| 21. | సృష్టికర్తలు (అల్లం రాజయ్య) | 150-00 |
| 22. | సాహిత్య సమాలోచన (కృష్ణాబాయి) | 300-00 |
| 23. | భావవిప్లవకారుడు కొకు | 80-00 |
| 24. | కొకు సమకాలీనత - విశ్లేషణా వ్యాసాలు | 75-00 |
| 25. | అక్షరతుణీరం (కె.వి.ఆర్. సాహిత్య విమర్శ వ్యాసాలు) | 20-00 |
| 26. | సుబ్బారావు పాణిగ్రాహి కవిత్వం, పాటలు | 25-00 |
| 27. | అంతస్సూత్రం (వరవరరావు కవిత్వం) | 40-00 |
| 28. | బీజభూమి (వరవరరావు కవిత్వం) | 100-00 |
| 29. | గుమ్మెటమోత (పాణి నవల) | 100-00 |
| 30. | కలిసి పాడాల్సిన గీతమొక్కటే (పాణి కవిత్వం) | 10-00 |
| 31. | చలసాని ప్రసాద్ రచనలు | 100-00 |
| 32. | దండకారణ్య కథలు | 100-00 |
| 32. | తెలుగు భాష - కొన్ని సంగతులు (వి.చెంచయ్య) | 15-00 |
| 33. | సామాజికం (వి. చెంచయ్య) | 30-00 |
| 34. | సాహిత్యధోరణులు - విప్లవ దృక్పథం | 30-00 |
| 35. | కథల పంట-3 | 120-00 |
| 36. | కదిలే కథ | 80-00 |
| 37. | తీత్వాల్ కుక్క మరికొన్ని కథలు (సాదత్ హసన్ మంటో) | 60-00 |
| 38. | జాజిపూల పరిమళం (షహీదా కథలు) | 150-00 |
| 39. | ఒక మాట, ఒక సంభాషణ (షహీదా కవిత్వం) | 75-00 |
| 40. | సామాన్యుల సాహసం (నిత్య, మైనా, సుజాత కథలు) | 60-00 |
| 41. | ఫాల్గుణ (పద్మకుమారి నవలిక) | 30-00 |
| 42. | లాల్‌బనో గులామీ ఛోడో బోలో వందేమాతరం (ఎన్కె దీర్ఘ కవిత) | 25-00 |
| 43. | తెహెల్కా అద్దంలో సర్కారు బింబం మరికొంత కవిత్వం (బాసిత్) | 100-00 |
| 44. | ఆఖరి బిడ్డ (బాసిత్ నాటిక) | 10-00 |
| 45. | కిటికీ పిట్ట (పి. మోహన్ కవిత్వం) | 10-00 |
| 46. | మంజీరా మూడ్స్ (మంజీరా కవిత్వం) | 25-00 |
| 47. | కవితా ఝంకార్ (విరసం కవితా సంకలనం) | 75-00 |
| 48. | ఎర్రనక్షత్రం (చైనా నవల) | 50-00 |
| 49. | నెగడు (కథలు) | 90-00 |
| 50. | పరామర్శ (నల్లూరి రుక్మిణి) | 80-00 |
| 51. | ఒంద్రుమట్టి (నవల) | 170-00 |
| 52. | Wake of Telangana? - A docu-drama by basith | 10-00 |
| 53. | యంత్రాల మధ్య | 35-00 |
| 54. | అక్షర కిరణం (కె.వి.ఆర్.) | 50-00 |
| 55. | డావిన్సి (మోహన్) | 150-00 |
| 56. | మార్క్సిస్టు సాహిత్య విమర్శ (డా॥ శ్రీనివాస్) | 100-00 |
| 57. | అగ్నిశిఖ | 80-00 |
| 58. | కార్మిక వర్గ పుత్రుడు | 70-00 |
| 59. | బలహీనుడి బలం | 25-00 |
| 60. | పాలమూరు వలస బతుకు చిత్రాలు - గీతాంజలి | 150-00 |
| 61. | ఏది నేరం?! (హజారీబాగ్ జైలు గాథలు) - బి. అనూరాధ | 75-00 |
| 62. | వెలుగు రవ్వల జడి (ఆలూరి భుజంగరావు) | 70-00 |
| 63. | అరణ్య పర్వం (ఆలూరి భుజంగరావు) | 120-00 |
| 64. | ప్రజలు అజేయులు (ఆలూరి భుజంగరావు) | 25-00 |
| 65. | నైనా (ఆలూరి భుజంగరావు) | 50-00 |
| 66. | గమ్యం దిశగా గమనం (ఆలూరి భుజంగరావు) | 30-00 |
| 67. | దిక్కు మొక్కు లేని జనం (ఆలూరి భుజంగరావు) | 30-00 |
| 68. | సాహిత్య వ్యాసాలు (చలసాని ప్రసాద్) | 100-00 |
| 69. | కలం యోధుడు చెరబండరాజు (వి. చెంచయ్య) | 20-00 |
| 70. | ఫాలింగ్ (నల్లూరి రుక్మిణి కథ) | 10-00 |
| 71. | దండకారణ్య కథలు (2013-2015) | 70-00 |
| 72. | లొంగిన ప్రతిసారీ (కిరణ్ కవిత్వం) | 50-00 |
| 73. | చిగురించే పాదం (మేడక యుగంధరరావు కవిత్వం) | 40-00 |
| 74. | అమర శ్రుతి (వరంగల్ యూనిట్ కవిత్వం) | 25-00 |
| 75. | మందిపాట ఒరవడిలో (సిటీయూనిట్ కవిత్వం) | 40-00 |
| 76. | కాశీం కవిత్వం | 140-00 |
| 77. | తెలంగాణ సాహిత్య వ్యాసాలు (కాశీం) | 140-00 |
| 78. | కవిత్వంతో ములాఖత్ (ఎన్.వేణుగోపాల్) | 120-00 |
| 79. | వెలివాడ తొలిపొద్దు | 70-00 |
| 80. | విప్లవ స్వాప్నికుడు కా. రవూఫ్ | 50-00 |
| 81. | దండకారణ్య కథలు (2013-2015) | 70-00 |
| 82. | ముడిమనిషి (అరుణతార కథలు 1) | 30-00 |
| 83. | చేపలు (అరుణతార కథలు 2) | 30-00 |
| 84. | కథ అడ్డం తిరిగింది (అరుణతార కథలు 3) | 30-00 |
| 85. | కో...బలి (అరుణతార కథలు 4) | 30-00 |
| 86. | అడవిలోని వెన్నెల (అరుణతార కథలు 5) | 30-00 |
| 87. | నెలవు (అరుణతార కథలు 6) | 30-00 |
| 88. | ఒక వీరుడు మరణిస్తే (అరుణతార కథలు 7) | 30-00 |
| 89. | బదిలీ (అరుణతార కథలు 8) | 30-00 |
| 90. | అరణ్య పర్వం (అరుణతార కథలు 9) | 30-00 |
| 91. | పద్మ (అరుణతార కథలు 10) | 30-00 |
| 92. | విప్లవంలో మాతృత్వం (అరుణతార కథలు 11) | 30-00 |

## సంస్కృతి, చరిత్ర, రాజకీయార్థిక, సైద్ధాంతిక రచనలు

| | | |
|---|---|---|
| 1. | సామ్రాజ్యవాద సంస్కృతి (జేమ్స్ పెట్రాస్ వ్యాసాలు) | 125-00 |
| 2. | మావో రచనలు - 1 | 220-00 |
| 3. | మావో రచనలు - 2 | 220-00 |
| 4. | రివిజనిజం (మావో) | 75-00 |
| 5. | మార్క్సిజం, లెనినిజం, మావోయిజం | 125-00 |
| 6. | మార్క్సిస్టు తత్వశాస్త్రం | 80-00 |
| 7. | చారుమజుందార్ 8 డాక్యుమెంట్లు | 50-00 |
| 8. | మంద్రస్థాయి యుద్ధం | 100-00 |
| 9. | విద్యార్థి యువజనోద్యమాలు (లెనిన్) | 30-00 |

(మిగతా 3వ కవర్ పేజీలో.. )

# అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

324

సంపుటి : 44 ◆ సంచిక : 4 ◆ మే, 2016 వెల : రు. 20/-



ఎడిటర్

**దుప్పూరి వెంకట రామక్రిష్ణారావు**

12-15-963, మాణికేశ్వరినగర్,
ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్, తార్నాకా,
హైదరాబాద్-500007.

**రచనలు పంపించాల్సిన చిరునామ:**

ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా, మౌలాలి,
హైదరాబాద్ - 500 040.

* **కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్** ల ద్వారా
రచనలు పై చిరునామాకూ,
ఇ-మెయిల్ ద్వారా
**arunatara1977@gmail. com** కూ
పంపవచ్చు

సంపాదకవర్గం :

**ఉజ్వల్, బాసిత్, కూర్మనాథ్**

మేనేజర్

**యాటెల్లి రామచంద్రం**

12-15-963, మాణికేశ్వరినగర్,
ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్,
తార్నాకా, హైదరాబాద్-500007.
**సెల్ : 9949391028**
**(ఫోన్ చేయాల్సిన సమయం**
**ఉ. 9 గంటల లోపు, సా. 8 గంటల తర్వాత)**

**విరసం కార్యదర్శి చిరునామా**

**పి. వరలక్ష్మి**

5-1820, గీతాశ్రమం వీధి,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.

**డి. టి. పి. అండ్ లే అవుట్**

**ఆర్. భాగ్యలక్ష్మి, డి. వైజయంతి**

**కవర్ డిజైన్ : పి. వరలక్ష్మి,**
**ఆర్. భాగ్యలక్ష్మి**

Like Page://viplava rachayitala sangham arunatara

facebook ://viplava rachayitala sangham virasam

Virasam website : *www. virasam. org, www. virasam. in*


**సంపాదక లేఖ..**

కొన్ని అంబేద్కర్‌ను దళితుల మనుసుల్లోంచి తీసేసి విగ్రహంగా మార్చే పని ముమ్మరమైంది. గతంలోనూ ఆయన విగ్రహాలను నెలకొల్పే సంప్రదాయం ఉన్నా.. అది ఆత్మగౌరవ చిహ్నం. అందుకే అంబేద్కర్ విగ్రహ స్థాపన వలె ఆయన విగ్రహాలను అవమానపరచడమూ జరుగుతున్నది. దళితుల ఆత్మగౌరవ వ్యక్తీకరణను అంగీకరించలేని అగ్రకుల దురహంకారానికి ఇది గుర్తు.

ఈ స్థితి నుంచి అగ్రకుల పాలకవర్గాలు ఏకంగా అంబేద్కర్‌ను తమ ఖాతాలోకి వేసుకోవాలనే కుట్ర మొదలుపెట్టారు. ఊళ్లలో అంబేద్కర్ పేరుతో సంఘాలు పెట్టుకుంటేనే దాడులు చేసే దశ నుంచి పార్లమెంట్‌లో అంబేద్కర్ చిత్రపటం పెట్టేదాకా, ఆయన 125వ జయంతిని దేశవ్యాప్తంగా ప్రభుత్వమే నిర్వహించేదాకా, ఐక్యరాజ్య సమితిలో సహితం ఆయనను స్మరించుకునే దాకా వెళ్లింది. దీన్నంతా అంబేద్కర్ పాపులారిటీగా, ఆయన పట్ల పాలకవర్గాల ఆమోదంగా గుర్తించాలా? లేక హిందూ అగ్రకుల శక్తుల కో ఆప్షన్ అనుకోవాలా?

నిస్సందేహంగా హిందూ ఫాసిస్టు శక్తులు ఆయనను విగ్రహమాత్రుడిగా మార్చివేయాలనుకుంటున్నాయి. బుద్ధుడి వలె అంబేద్కర్‌నూ హైందవ పరంపరలోని ఒకానొక విగ్రహంగా చేయాలనుకుంటున్నాయి. అనేక బ్రాహ్మణేతర సంప్రదాయాలను తనలో కలిపేసుకున్నట్లే అంబేద్కర్ ఆలోచనాధారనూ హిందుత్వ తనలో కలిపేసుకొనే బహిరంగ కుట్ర ఇది. జీవితమంతా హిందుత్వకు, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన అంబేద్కర్‌ను నిర్భయంగా సంఘపరివార్ స్వాహా చేయదల్చుకున్నది. హిందువుగా పుట్టానుగాని, హిందువుగా మరణించనని ప్రకటించి, బౌద్ధంలోకి వెళ్లిపోయిన అంబేద్కర్ మీద కాషాయనీడ పరుచుకుంటున్నది. మరో వైపు సంఘపరివార్ అంబేద్కర్ విషయంలో అనేక చారిత్రక వక్రీకరణలకు పాల్పడుతున్నది. ఆయన హిందుత్వ వ్యతిరేకి కాదని చెప్పే దుర్మార్గం ఇందులో ఉంది.

దళితుల ఆత్మగౌరవ ప్రతీకను అవమానపరచడం, తప్పుగా చిత్రీకరించడం అనే ఈ కుట్రకు వ్యతరేకంగా సామాజిక, ప్రగతిశీల శక్తులు ముందుకు వచ్చి అంబేద్కర్‌లోని హిందుత్వ, కులవ్యవస్థా వ్యతిరేక ఆలోచనాధారను కాపాడుకోవాల్సి ఉన్నది. ఈ నేల మీది సామాజిక చైతన్య వికాసంలో అంబేద్కర్‌ను, ఆయన గురువుగా భావించిన ఫూలే వంటివారి స్ఫూర్తిని పోరాటశక్తులు నిలబెట్టుకోవాల్సి ఉన్నది. ఈ క్రమంలో అంబేద్కర్‌పై మరింత లోతైన అధ్యయనంతో సంఘపరివార్‌ను ఎదుర్కోవాల్సి ఉన్నది. ఆయన వారసత్వం ప్రజాస్వామిక శక్తులదేగాని సంఘపరివార్‌ది కాదని, అలా కానీయమని ప్రకటించాల్సి ఉంది. అనేక దృక్కోణాల్లో ఆయన మీద ఉన్న అంచనాల్లో సహజంగానే తేడాలు ఉండవచ్చు. ఉన్నాయి కూడా. దానికి అంబేద్కర్ ఆలోచనారీతి కూడా కారణం కావచ్చు.

అయినా ఆయన సామాజిక విముక్తి ఆకాంక్షలకు ప్రతినిధి. అందువల్ల అంబేద్కర్ బూర్జువా శక్తుల పరం కాకుండా, కాషాయీకరింపడకుండా కాపాడుకోవాలి. ఆయనది మన దేశీయ ప్రజాస్వామిక కంఠస్వరం. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఆయన విశ్వసించిన రోజులకంటే అది తన సహజ స్వభావం వల్లే ఇవాళ మరింత దారుణంగా తయారైంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఫాసిజంగా మారిపోయింది. కాబట్టి సామాజిక విముక్తికి ఇక బూర్జువా మార్గం ఏ కొంచెం కూడా పనికి రాదని తేటతెల్లమైపోయింది. ప్రగతిదాయకమైన వ్యవస్థాగత పరివర్తన, సామాజిక విముక్తి అనే లక్ష్యాల దిశగా పోరాటాలను వేగవంతం చేయాల్సిన ఈ తరుణంలో అంబేద్కర్‌ను విగ్రహమాత్రుడిగా మార్చే ప్రయత్నాలను ఓడించాలి.

తాజా కలం : విప్లవ రచయిత కామ్రేడ్ సత్నాం (గురుమిత్ సింగ్) (65) ఏప్రిల్ 27 రాత్రి పంజాబ్‌లోని పాటియాలలోని తన స్వగృహంలో ఆత్మహత్య చేసుకుని చనిపోయారు. ఆయన నాలుగు దశాబ్దాలకు పైగా విప్లవోద్యమాలతో భుజం కలిపి నడిచారు. ఆయన 'జంగల్‌నామా' పుస్తకం సహా అనేక విలువైన రచనలు, అనువాదాలు చేశారు. సత్నాం స్మృతికి విరసం అరుణారుణ జోహార్లు అర్పిస్తోంది. ఆయనపై రచనలను వచ్చే సంచికలో ప్రచురిస్తాం. - సం.

## సంచిక - 324


**సంపాదకీయం (5, 56)**
కశ్మీర్, క్రికెట్, దేశభక్తి - **పి. వరలక్ష్మి**

**పాటలు, కవిత్వం (6-10)**
పొడిచేటి పొద్దయ్యి రావా కామ్రేడ్ సృజనా.... - **డప్పు రమేష్**
కానుగపూల పరిమళం...- **కెక్యూబ్‌వర్మ**
అక్షరాలు - **సూర్యచంద్ర**
ఇదే అదను - **మహమూద్**
దేశోద్రోహి వాంగ్మూలం - **డి. ఉదయ్ భాను**
మా 'కూర' - **బి. సత్య**

**వ్యాసాలు (10-14)**
కుట్రదారుడు, రాజద్రోహి, నిషిద్ధ మానవుడు కవి కాశీం?! - **వివి**
ఉన్నత విద్యాశాలలా? ఉద్యమ భానుల వధ్య శిలలా? - **వరవరరావు**

**కథలు (15-34)**
ఒక శీతాకాలపు రాత్రి - **మాక్సిం గోర్కీ**, తెలుగు : **శివలక్ష్మి**
సహచరులు - **తాయమ్మ కరుణ**
దేవరగద్దె - **నల్లూరి కాంతి**
సన్ స్ట్రోక్! - **బమ్మిడి జగదీశ్వరరావు**

**వ్యాసం (34, 35)**
అమరుల స్థూపాలు - విప్లవ సంస్కృతి- **భూసారం**

**నివాళి (35, 39)**
రారాసి (రామారావు సింగంపల్లి) - **సింగంపల్లి అశోక్‌కుమార్**

**సంస్మరణ వ్యాసం (36-39)**
ఉద్యమ స్ఫూర్తి అనసూయమ్మ - **డాక్టర్ నళిని**

**వ్యాసం (40-46)**
పినాకపాణిపై అర్థరహితమైన ఆరోపణలు - **డాక్టర్ శ్రీనివాస్**

**విమర్శ (46-53)**
'నవీన బూర్జువా సోషలిస్టు ధోరణుల'పై ఒక విమర్శ - **వై.వి.ఆర్.**

**పుస్తక పరిచయాలు (54-56)**
'చెదిరిన పిచ్చుక గూళ్లను సవరించే ఉపాధ్యాయిని - **మాతంగి**
'నల్లమల' ఉద్యమ ప్రస్థానం - **బుర్ర తిరుపతి**

**సీరియల్ (57-60)**
మార్క్స్ పెట్టుబడి - రచనా క్రమం - 8 - **ఫ్రాన్సిస్ వీన్**,
అనువాదం : **ముక్తవరం పార్థసారథి**

**కరపత్రం (60-63)**
ఉదయభానుని చంపడానికి హిందూత్వ పన్నిన కుట్రను అడ్డుకుందాం! - **విరసం**

**ప్రకటన (64-66)**
రచయితపై కుట్ర కేసు భావప్రకటనా స్వేచ్ఛను కాలరాయటమే. డా.కాశీంపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించాలని రచయితలు, కవులు, కళాకారులు, జర్నలిస్టులు, మేధావులు, ప్రజాస్వామిక వాదుల ఉమ్మడి ప్రకటన


గమనిక : మిత్రులారా, కామ్రేడ్స్! అరుణతార డిటిపి, డిజైనింగ్, ప్రింటింగ్, పోస్టింగ్, రవాణా ఇలా అన్ని ఖర్చులు చాలా పెరిగిపోయాయి. అనివార్య పరిస్థితులలో విడి ప్రతి వెలను ఫిబ్రవరి **2016** సంచిక నుంచి రూ. **20** కు పెంచవలసి వచ్చింది. ఇది గమనించగలరు. ఎప్పటిలానే మీ ఆదరాభిమానాలను, సహకారాన్ని ఆశిస్తున్నాం. అలాగే ఫిబ్రవరి **2016** సంచిక నుంచి అరుణతార సంచికల క్రమాన్ని సంపుటి **44** గాను సంచిక **1** గాను సరిచేసాం. ఈ విషయాన్ని గమనించగలరు. - సం.

అరుణతార చదవండి!
చదివించండి!
చందాదారులు కండి!

చందాలు, బకాయిలు మనియార్డర్, డి. డి. ల రూపంలో మేనేజర్‌కు పంపించండి.
డి. డి. లను **డి. వి. రామక్రిష్ణారావు, హైదరాబాద్** పేర తీయండి.
విడి సంచిక వెల - రు. 20; సంవత్సర చందా - రు. 240;
రెండు సంవత్సరాల చందా - రు. 450; మూడు సంవత్సరాల చందా - రు. 680;
ఐదు సంవత్సరాల చందా - రు. 1100; దశాబ్ది చందా - రు. 2200/-

# కశ్మీర్, క్రికెట్, దేశభక్తి

పి. వరలక్ష్మి

మన దేశంలో జండాలు, నినాదాలతో పాటు క్రికెట్ ఆట కూడా దేశభక్తిని కొలిచే ఒక మీటర్. క్రికెట్ దేశభక్తి ఎంత ద్వేషం నింపుకుని ఉంటుందో అంత మార్కెట్ జూదమై పెట్టుబడికి సేవ చేస్తుంది. అందులో ప్రజలు కాదు కదా, పేరుకైనా దేశాలు ఉండవని ఐపీఎల్ వంటివి తేల్చేసాయి. పెట్టుబడి ఎంత తప్పుడు విలువలను నిలబెడుతుందో, ఎంతగా ద్వేషాలను సొమ్ము చేసుకుంటుందో క్రికెట్ చుట్టూ ఎగసే ఉద్రేకాలు ఒక ఉదాహరణ. శ్రీనగర్ ఎన్.ఐ.టి కాలేజీలో విద్యార్థుల మధ్య క్రికెట్ మ్యాచ్ కారణంగా వివాదం చోటు చేసుకుందని, ఇండియా ఓడిపోతే సంబరాలు జరుపుకున్న దేశద్రోహులను, దేశభక్త విద్యార్థులు వారిస్తే ఘర్షణ జరిగిందని, దాన్ని పరిష్కరించకపోగా అన్యాయంగా దేశభక్త విద్యార్థుల మీద పోలీసులు దాడి చేశారని మీడియాలో ప్రముఖంగా వచ్చింది. పోలీసు జులుం మీద ఎన్నడూ లేనంతగా కేంద్ర ప్రభుత్వం స్పందించి రంగంలోకి దిగింది. ఇక్కడ బాధిత విద్యార్థులు స్థానికేతరులు. గొడవకు కారణమని చెప్పున్నది కశ్మీరీ విద్యార్థులని. వివాదానికి కారణం క్రికెట్ మ్యాచేనా? దేశవ్యాప్తంగా యూనివర్శిటీల మీద సంఘపరివార్ చేస్తున్న ప్రయోగానికి, దీనికి సంబంధం ఉందా? కశ్మీర్ అంశం కేంద్రంగా జె.ఎన్.యూ.లో మొదలైన జాతీయత, దేశభక్తి చర్చను సంఘపరివార్ తనకనుకూలంగా మలచుకోడానికి సున్నితమైన కేంద్రాలను, ట్రిగ్గర్ అంచున ఉన్న భావోద్వేగాలను ఎంచుకుని దాడి చేస్తున్నది. ఇది దాని సహజ లక్షణమే. అయితే ఇవి ఇప్పుడిప్పుడు సంఘపరివార్ చేస్తున్నవి మాత్రమే కాదు. దానికి నేపథ్యం, తగిన వాతావరణం మన దేశ బూర్జువా ప్రజాస్వామిక వ్యవస్థలోనే ఉంది. అందుకు కశ్మీర్‌కు మించిన ఉదాహరణ ఉండదు.




మార్చి 19న కోల్‌కతాలో ఇండియా పాకిస్తాన్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగింది. దాన్ని కేవలం క్రీడగా చూసే విజ్ఞత ఎప్పుడో పోయింది. ఆరోజు గెలిచిన జట్టు భారతదేశానిది. అలవాటుగా దాన్ని 'ఇండియా' గెలిచిందని వ్యవహరిస్తారు కాబట్టి సంఘీయులు 'భారత్ మాతాకీ జై', 'హిందు'స్తాన్ జిందాబాద్, పాకిస్తాన్ ముర్దాబాద్ వంటి నినాదాలు ముస్లింలున్న ప్రాంతాల్లో రెచ్చిపోయి చేస్తారు. అట్లా శ్రీనగర్ ఎన్.ఐ.టి.లో 'ఇండియా' గెలిచినందుకు సంబరాలు చేసుకుంటూ కశ్మీరీ ముస్లింలను ఉద్దేశించి నినాదాలు చేశారు. మార్చి 31న వెస్టిండీస్ జట్టు చేతిలో భారత జట్టు ఓడిపోయినప్పుడు కాశ్మీరీ విద్యార్థులకు కౌంటర్ ఇచ్చే అవకాశం వచ్చింది. వాళ్ళు 'ఇండియా' ఓటమిని పండుగ చేసుకున్నారు. కశ్మీరీలు తమను దురాక్రమణలో ఉంచుకున్న భారతదేశం పట్ల వ్యతిరేకతను ఈ విధంగా వ్యక్తం చేయడం కొత్త కాదు. కశ్మీర్ జాతీయ పోరాటం, ఇండియా వ్యతిరేకత ఈనాటిది కాదు. దాన్ని 'హిందూ ఇండియా' వర్సెస్ 'ముస్లిం కశ్మీరు' పోరాటంగా, పాకిస్తాన్ ప్రేరేపిస్తున్న తీవ్రవాదంగా భారతదేశమంతటా కాంగ్రెస్ నుండి వామపక్షాల వరకు అన్ని పార్టీలు ప్రచారం చేశాయి. నిజానికి సంఘపరివార్ భావజాలం విడిగా ఒక పార్టీతోనో, ఆ పరివారంతోనో ఉండదు. అది భారత పాలకవర్గ భావజాలం. అందుకే దేశభక్తి అంశం తెర మీదికి వస్తే అన్నీ పార్టీలు పోటీపడతాయి. హెచ్.సి.యూలో రోహిత్ పక్షాన నిలిచిన ప్రతిపక్షాలు, జె.ఎన్.యూకు వచ్చేసరికి, అందునా కశ్మీర్ అంశం తెరమీదికి వచ్చేసరికి దేశభక్తులైపోయారు. కన్నయ్య కుమార్‌ను రాజద్రోహం కింద అరెస్టు చేసినప్పుడు, వామపక్షాలు 'అసలు నేరస్తులను' పట్టుకుని అతన్ని వదిలేయమని హోం మంత్రికి విజ్ఞప్తి చేశాయి. నిరసన ప్రదర్శనలోనూ మీకన్నా దేశభక్తులం మేము అని చెప్పుకుంటూ దేహం ముక్కలైనా దేశం ముక్కలు కానివ్వమన్నారు. అక్కడే సంఘపరివార్‌కు బలమొస్తుంది. ఇటువంటి మార్కు దేశభక్తిని వాళ్ళు ఇంతకన్నా అనేక రెట్లు ఎక్కువ ప్రదర్శించగలరు. ఈ దేశభక్తిలో ప్రజాస్వామ్యం ఉండదు. ఫాసిజమే ఉంటుంది. ఈ ఉన్మాదం పెరిగితే ప్రజాస్వామ్యం అక్కర్లేదు, ఫాసిజమైనా మాకు దేశభక్తే కావాలి అని ప్రజల చేతే అనిపించగలరు. ఆర్మీ తుపాకుల కింద ఊపిరాడకుండా బతుకుతున్న కశ్మీరీలు మాత్రం ఈ దేశభక్తిని ప్రశ్నిస్తారు. పరాయి పాలకుల కింద ఉన్నామని కశ్మీరీలు మాత్రమే భావించడం కాదు, భారత పాలకులూ కశ్మీరీలను అట్లాగే చూస్తారు. శ్రీనగర్ ఎన్.ఐ.టి.తో భారత ప్రభుత్వం వ్యవహరించిన తీరు అదే.

భారత ఓటమిని సంబరాలు చేసుకున్న స్థానిక విద్యార్థులతో బైటి (నాన్ లోకల్) విద్యార్థులు భారత్ మాతాకీ జై అంటూ ఘర్షణ పడ్డారు. ఇదెంతగా శృతి మించిందంటే కేంపస్‌లోకి వచ్చిన కొరియర్ ను పట్టుకుని భారత్ మాతా కీ జై అనమంటే అతను నిరాకరించాడని అతన్ని క్రికెట్ బ్యాట్‌తో కొట్టి, అతని మీదికి గాజు వస్తువును విసిరేసి గాయపరిచారు. ఇట్లా నినాదాలు చేస్తూ, హిందుస్తాన్ జిందాబాద్, పాకిస్తాన్ ముర్దాబాద్ అంటూ కేంపస్‌లో భారతదేశ జండా ఎగరేసే ప్రయత్నం చేశారు. ప్రతిగా కశ్మీర్ విద్యార్థులు ఆజాదీ నినాదాలు

(మిగతా 56వ పేజీలో.. )

# పొడిచేటి పొద్దయ్యి రావా కామ్రేడ్ సృజనా....

## డప్పు రమేష్

పొడిసేటి పొద్దయ్యి రావా ముద్దుల నా సృజనా
ఎర్రజెండాలిచ్చి పోవా బంగారు నా సృజనా ॥పొడి॥

నీ మేనమామయ్య జున్ను చిన్నాలన్న
అమరత్వ బాటల్లో అడుగులేశావమ్మ
అమరులాశయాల వారసత్వం నీవు
నెరవేర్చి నావమ్మ, ఆదర్శమయ్యినావు
పొడిసేటి పొద్దయ్యి రావా ముద్దుల నా సృజనా
ఎర్రజెండాలిచ్చి పోవా బంగారు నా సృజనా ॥పొడి॥

నీకంటె పెద్దోడు, నీ ఎనక తమ్ముళ్లు
నలుగురు పిల్లల్లో ఒక్కదానివి నీవు
ఆడపిల్లవని అల్లారుముద్దుగా
ఆడిస్తు పాడిస్తు బడికి పంపించేము
ముద్దుగా పెంచుకున్నామే ముద్దుల నా సృజనా
మురిపెంగా సాదుకున్నామే బంగారు నా సృజనా ॥పొడి॥

కూలి పనులకు పోయే కుటుంబము మనది
నిను బడికి పంపించి, నే పనికి పోయేది
చదువుకుంటే మనకు చైతన్యమొస్తదని
ఇంటరు వరకు నిను చదివించి నానమ్మ
బతుకు పాఠం చదివినావా ముద్దుల నా సృజనా
బతుకులు మార్చ కదిలావే బంగారు నా సృజనా ॥పొడి॥

అమరులా సభలకు, అంతిమ యాత్రలకు
నా ఎంట నడిచేవు, నా తోటి పాడేవు
వీరులకు జోహార్లు గట్టిగా చెప్పేవు
అమరత్వమును జూసి కన్నీళ్ళు పెట్టావు
అమరుల త్యాగాల బాటే ముద్దుల నా సృజనా
నా బాటయని తలచినావా బంగారు నా సృజనా ॥పొడి॥

కాలేజి బుక్కును పక్కకు బెట్టేసి
విప్లవ బుక్కును శ్రద్ధగా చదివేవు
సంఘాల సభలకు హాజరు అయ్యేవు
విప్లవ పోరాట పాఠాలు నేర్చావు
ఇల్లిడ్సి బయలెల్లినావా ముద్దుల నా సృజనా
పార్టీలో నువు చేరినావా బంగారు నా సృజనా ॥పొడి॥

పార్టీ పనిలో నిన్ను పట్టుకుని పోలీసు
పొల్ల పొల్లు గొట్టి జైల్లో బెట్టిన గాని
జైలు గోడల్లోన జంగ్ సైరానూది
బెయిలు రాగనె మల్ల అడివి కెళ్ళినావు
దండకారణ్యము లోనా ముద్దుల నా సృజనా
దండులో కల్సిపోయినావా బంగారు నా సృజనా ॥పొడి॥

కవితలు రాసావు, పాటలూ పాడావు
డాక్టరుగ జేసావు, యాక్టరుగ చేసావు
నీళ్ళల్లో చేపలా ప్రజలల్లో కలిసావు
గెరిల్లా దళములో గన్నులు పేల్చావు
కంప్యూటరూ నేర్చినావా ముద్దుల నా సృజనా
కమిటీలో నువ్వెదిగినావా బంగారు నా సృజనా ॥పొడి॥

అడవి సంపదలాను, ఖనిజ సంపదలాను
ఆదివాసుల తరిమి, కంపెనీలకు బెట్ట
ఆపరేషను గ్రీనుహంటు పేరుతోని
సైన్యాలను దించి కాల్చి పారేస్తుండ్రు
విప్లవ సేనతో మీరూ ముద్దుల నా సృజనా
ఎదిరిస్తు పోరాడుతుండ్రే బంగారు నా సృజనా ॥పొడి॥

ఇన్ఫారుమర్లతో మీరున్న జాడను
తెలుసుకొని పోలీసులు వెయ్యిమందొచ్చారు
మిము చుట్టుముట్టారు కాల్పులు చేసారు
ప్రాణాలతో పట్టినారా ముద్దుల నా సృజనా
కోసి కాల్చి కూల్చినారా బంగారు నా సృజనా ॥పొడి॥

వీరులను చంపితే విప్లవం ఆగదు
మీ పోరు బాటల్లో వేలమందొస్తారు
ప్రజల పోరాటమిది ప్రజలె సాధిస్తారు
ప్రజాసైన్యం మున్ముందుకే పోతుంది
మీ బాట నేవొస్తనమ్మో ముద్దుల నా సృజనా
మీ జెండ నేనెత్తుతానే బంగారు నా సృజనా ॥పొడి॥

జన్ను చిన్నాలన్న, కృష్ణస్వామియన్న
నేరెళ్ళ రజితక్క, ఎర్రం రజితక్క
రంజిత్తు అన్నల వారసురాలివి
పొడిచేటి పొద్దయ్యినావా ముద్దుల నా సృజనా

ఎరజెండా ఎరుపయ్యినావా బంగారు నా సృజనా ॥పొడి॥

# కానుగపూల పరిమళం...

## కెక్యూబ్‌వర్మ

కొన్ని సాయంత్రాలు దేహం కోల్పోయిన
ఆత్మను మోసుకొస్తాయి

అడుగుల పరిధి కుంచించుకొని
ఒక మాత్ర అందని దూరంలో విసిరేయబడతావు

పహరా చుట్టూ కంచె పెరుగుతూ
నడకను నియంత్రిస్తుంది

నీలోని ప్రతి అణువును మలేరియా తిని
మెదడుకు పాకి కళ్ళను పైకెగదోస్తుంది

నిట్ట నిలువుగా వెన్నును విరిచి
కాళ్ళను చేతులను హరిస్తుంది

నీ నుదుటి మీద వెన్నెల ఓ
దు:ఖపు ముద్దుగా మెరిసి కుంగిపోతుంది

నువ్వంటావు చివరిగా ఈ జెండా
భుజం మార్చుకుంటుందా అని

రవీ నువ్ నడిచినంత మేరా పరచుకున్న
ఈ కానుగ పూల పరిమళం అద్దుకుని

అటు చివర ఆ బాలుడు విల్లునలా
గురిచూస్తూ విసురుగా వస్తున్నాడు...

(మలేరియా కబళించిన కామ్రేడ్ సి.సి.కమాండర్ రవి స్మృతిలో)

# మా 'కూర'

## బి. సత్య

తర తరాల
తాత ముత్తాతల
వారసత్వమిది
నా పుట్టుకకు పూర్వం
మా అయ్యకు
వాళ్ళయ్య నేర్పిండు
గొడ్డు కూర తినుడు
ఇది మా కష్ట జీవులకు
ఇష్టమైన ఆహారం
రోగాలకు, నొప్పులకు
ఆయుర్వేదం
సర్వరోగ నివారణం
అట్టడగు వర్గాల
కష్టజీవులకు
జవం, జీవం

# ఇదే అదను

## మహమూద్

మా ఊరు మీద నుంచి పోతుంది
కానీ పారదు
ఎండిన నెలవంక పెన్న

ఏరు ఎండినా
తడి తగులుతుంది మనిషుల్ని తాకినపుడు
అది శతాబ్దాలుగా మా నరనరాల్లో దౌడుతీస్తున్న
పెన్న రుధిర దీవెన

రెండొందల అడుగులకు దిగిపోయిన జలాన్ని
తీసినా జీవనమే ఒలుకుతుంది
చావు బతుకు మధ్య నిరంతర ఘర్షణే వంతెన
దేహ సంచారం జరిగేదే ఎక్కడైనా

ప్రాణం ఎండిన చోటైనా
ప్రాణం నిండుగా ఉన్న చోటైనా
నడిచేవాళ్ళు నడిపించేవాళ్ళు సదా కావాలి
నడకకు కూడా ప్రాణం జలమైతే
ఆ జలం మా సొత్తు కాదు

కరువును కాకపట్టి తిష్టవేయించారు
కుట్రను మార్కెట్ చేసుకుంటున్న వాళ్ళు
దొంగలు కాదు దొరలే ఊళ్ళు పంచుకుంటున్నారు

ప్రకృతి కానే కాదు మా శత్రువు
తల్లి రొమ్ము మీద చిల్లు వేసి
క్షామ తీగలను గుండెకు చుడుతున్న
సీమ నేతలదే సీమ  ద్రోహం

ఒక ఖాళీ దోసిలి
కరువు కురుపుగా మారిన దేహం
పౌరుషం గురించడక్కండి
పరువు ఊరిడిసి పోయింది

తెలుగు సినిమా సింబాలిక్
రక్తచరిత్ర
కోస్తా పెట్టుబడికి వ్యూహాత్మక సబార్డినేట్

కరువు సృష్టించినవాళ్ళు
కరవును పోగొడతాం అంటారు
పూర్తికాని రాయలసీమ కలల ప్రాజెక్టు హంద్రీ నీవా లోని పంపులు
దొంగగా రాత్రికి రాత్రే తరలి పోతాయి పట్టిసీమకు
ఇది రాయలసీమను ఒట్టి సీమగా మార్చడానికి
పన్నిన కుట్రే కదూ

కట్టబడే రాజధాని నిర్మాణాల దాహం
తరతరాల మా ఆకలిదప్పులను పరిహసిస్తుంది
పండిన పైరు కలగా మిగిలి
అప్పుసొప్పు ఇంటి తోరణమై వేలాడుతుంటుంది

రైతు పొలం కంటే పోలవరం చుట్టూ అల్లుకున్న
రాజకీయ చదరంగం విలువైందని పదవి కూస్తుంది

పదవుల గుంజాటలో
గెలుపోటములు దోబూచులాడతాయి
అపజయం మాత్రం అనునిత్యం మాకెదురవుతుంది

ఒక కరువూ ఒక క్షామం
ఒకదాని తర్వాత ఇంకోటి
రెప్పవాల్చనీయవు
ఆత్మక్షోభను అడుగంటనీయవు

రాయలసీమంటే హంతకుల సీమ అని
బడాబాబులు సెలవిస్తారు
వాళ్ళ బాడీ గార్డులుగా ముఠా వీరులే ఉంటారు
ఊరికి ఉపకారం అంటే
కంట్లో కారం కొట్టడమని
తిని అరగాయించుకున్న నోరు
పారేసుకునే ఆవులింత చెప్పకనే చెబుతుంది

రాజకీయమంటే
సేవచేయడం కాదని
సేవకులను తయారు చేసుకోవడం అని
సంపద కేంద్రీకరణను ప్రోత్సహించడమని
కొత్త నిర్వచనం ఈ నేలమీదే పుట్టిందా అన్నట్టు
దళారులెప్పుడూ
పుట్టిన కడుపునే దగా చేస్తారు

అధికారం ఒక్కటే అన్నింటి కంటే ప్రియమైన మత్తుపానీయం
అది ఎడారిలో కూడా డబ్బు బావుల్ని తవ్వుతుంది

అది బతికి ఉన్నవాళ్ళని చంపుతుంది
కొన ఊపిరితో బేరం పెడుతుంది
బతికి బట్టకట్టినోళ్ళకంటే
చనిపోయిన వాళ్ళదే గొప్ప తలరాత అవుతుంది

రేపటికి ఒక ఆశ
ఇవాల్టికిదే నిట్టూర్పు
నిట్టూరుపులన్నీ ఏకమై
నిలబడుతుంది ఉద్యమ బురుజు

కరువానకాలమై
కదిలింది
ఉప్పెన కన్నీళ్ళు తుడుస్తూ
కలిసి సాగుతుంది ప్రజాయుద్ధనావ
గమ్యం వైపు
నూతన రాష్ట్రావతరణ పోరాటానికి
ఈ కాలమే అదును.

# దేశద్రోహి వాంగ్మూలం

### డి.ఉదయ్‌భాను

నీ దేహం దేశద్రోహి
నీ దాహం దేశద్రోహం
అన్నాక..
నేనెందుకు ముడుచుకుపోవాలింకా...
ఒరేయ్!
రాసుకోండిరా మీ చీకటి చట్టాల్లో
నేను దేశద్రోహినే...
పలవరిస్తున్న ప్రపంచ శిశువుకు
పాలను కలగంటున్న దేశద్రోహినే

కాలిపోయిన పూలతోటలమీద
ఎక్కిళ్ళతో ఎగురుతున్న సీతాకోకనూ..
చీముపట్టిన పుండ్లకోసం
పసరుల్ని వెతుకుతున్న పాలపిట్టనూ..
నెత్తురు స్రవిస్తున్న లేగదూడ కంటిని
నాలుకతో తుడుస్తున్న తల్లావునూ..
దేశద్రోహివన్నప్పుడు
నన్ను నేనెందుకు మడతపెట్టుకోవాలి?!
ఒరేయ్!
రాసుకోండిరా ఉచ్చుల రొచ్చు కొట్టాల్లో
నేను దేశద్రోహినే

పచ్చని అడవిలో
పగబట్టిన శత్రువు దూరాడని
ఆకాశ విశాలంలోంచి
వివరిస్తున్న విహంగాన్నీ...
మట్టి పెదవులను పెకిలిస్తున్న
మరఫిరంగుల మసి రహస్యాన్ని
కన్నీళ్ళతో కైగట్టిన కుమ్మరి పురుగునీ...
దేశద్రోహివన్నప్పుడు
నేనిక...
కందికొయ్యల కొసలకు దిగిన
కారుమబ్బును కాలేను
ఒరేయ్!
తోసెయ్యండిరా నన్ను..
క్రూరమృగాల కోర్టు బోనుల్లోకి
నేను దేశద్రోహినే

మాడు మాడిపోయే మండుటెండల్లో
పదునైన ఈతకమ్మల పక్కల్లో
పలకరిస్తున్న ఈతపండ్లకోసం
మెల్లెలకత్తి ఎత్తిన పసిబాలుణ్ణీ...
మధ్యరాత్రి...
మడికట్ల మూలమీద
బోరుముందు బోర్లాపడి
కరెంటుకై కాపుగాస్తున్న చివరి మనిషినీ...
ఆకలి రోకలిపోట్ల కల్లోలంలో
ఆఖరి కల్లాల అంచుల్లో
పరిగె గింజలేరుతున్న పండు ముసలితల్లినీ...
దేశద్రోహివన్నప్పుడు
నేనిక..
నా ఆత్మను...
మురికి కుంటల్లో పందులతో పొర్లాడించలేను
ఒరేయ్!
నెట్టేయండిరా నన్ను
ఊచల చీకటి ఖండాల్లోకి...
నేను దేశద్రోహినే

పుట్టినవాళ్ళు పుట్టినట్లే పోతుంటే
అమావాస్యనాడు పుట్టినవాడికి
పీరు పేరు పెట్టి బతికించిన
ఖాసీం పీర్లకాడి కరీం తాతనూ...
నా భుజాలమీద
జాజికొమ్మై పరుచుకొని
జీవిత గండం చుట్టూ
ధూలాడిన జమీర్‌భాయ్‌నూ
పల్లేరుగాయలమీద దొర్లిన పసివయసులో
పెద్దకూరకు తోడు పాయసం పట్టించిన
పెద్దమ్మ బువ్వమ్మనూ...
దేశద్రోహివన్నప్పుడు
నేనింకా...
కలత నిద్ర కార్చిచ్చుల్లో బూడిద కాలేను
ఒరేయ్!
ఎక్కించండిరా నన్ను
మధ్యయుగాల వధ్యశిల మీదికి
నేను దేశద్రోహినే

మీ..
నిఘంటువు వ్యర్థార్థాల్లో
ఒకప్పుడు నేను రాక్షసుణ్ణి
ఇప్పటికిప్పుడు దేశద్రోహిని

ఒరేయ్!
నాలుగు నడకలు కలిసే
నడి బజారులో నిలబడి
నగ్న హృదయంతో...దేహంతో
నిలబడిన పసిబాలుణ్ణై
చాటింపు వేసి మరీ చెప్తున్నా..
నేను దేశద్రోహినే...
ఈ దేశ మనుభద్రత వెన్నుపూసపై
ఎక్కుపెట్టిన దేశద్రోహ గన్నునే...
మన్నువాసన పెన్నునే...
ఏం చేసుకుంటావో చేసుకోపో
నీ ఇష్టం...

## అక్షరాలు

### సూర్యచంద్ర

రక్తసిక్తమైన ఓ కలను ప్రతిరోజూ కలత నిద్దురలో
ఆవిష్కరించేది ఆ ఆకుపచ్చని అక్షరాలే

అనుభవం పరోక్షమే కానీ
వెన్నులో దృఢత్వాన్ని
గుండెల్లో నమ్మకాన్ని..
నిజానిజానికి..వ్యాధిగ్రస్త దేహంలో
నిండుగా జవసత్వాన్ని దట్టించినదీ-ఈ అక్షరాలే

శత్రువెప్పుడూ అంతే
ఆశయానికి పూసిన అక్షరాలను చిదిమేసి వెర్రిగా నవ్వుతాడు...
కాని..వేళ్లూనుకున్న ఆశయాన్ని
ఏం చేయగలడు...?!

# కుట్రదారుడు, రాజద్రోహి, నిషిద్ధ మానవుడు కవి కాశీం?!

**వివి**

అది కేంద్రీయ విశ్వవిద్యాలయం అని పిలుచుకునే అగ్రహారంలో వెలివాడ. అక్కడ అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న రేసిస్టు(జాత్యాహంకారి) డొనాల్డ్ ట్రంప్ అనే మరుగుజ్జు (లిల్లీపుట్) అనిపించగల కులపతి, అంబేద్కర్ పుస్తకాలు చదివే విద్యార్థులకు సరఫరా చేసిన ఉరితాళ్లలో ఒకటి తాజాగా ఉపయోగించుకుని అమరుడయిన రోహిత్ (బలి)చక్రవర్తి ఆశయం అందరిని ఆవహించి ఉంది. ఆ విషాదుని అంతిమ శ్వాసనందుకొని 'చలో హైదరాబాదు యూనివర్సిటీ' అంటూ తరలివచ్చిన వారిలో అటువంటి నేపథ్యం నుంచే వచ్చి అదే యూనివర్సిటీలో చదువుకొని ఇపుడు నిజాం కాలేజిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ చింతకింది కాశీం జనవరి 25వ తేదీన ఆ వెలివాడ వేదిక నుంచి తన ప్రసంగాన్ని ఇట్లా ప్రారంభించాడు.

'నేనొక రాజద్రోహిని, కుట్రదారుణ్ని. ఇక్కడి వెలివాడలో ఉదయిస్తున్న సూర్యునిపై చిర్రా చిటికతో నిషిద్ధ మానవుని జీవనఘోష వినిపించడానికి వచ్చాను.'

అక్కడ వేలాది మంది నిషిద్ధ మానవులున్నారు. రాజద్రోహులు, కుట్రదారులు ఉన్నారు. మాట్లాడుతున్నారు. పాటలు పాడుతున్నారు. వింటున్నారు. అది నిషిద్ధస్థలం కూడ. అక్కడ చుట్టూ ఈ నిషేధాన్ని అమలుచేస్తున్న రాజ్యమూ ఉంది. సంస్కృతీ ఉంది. ఈ రాజద్రోహి, కుట్రదారు, నిషిద్ధ మానవునితో ఈ రాజ్యం, ఈ సంస్కృతి కుత్తుక ఉత్తరిస్తూనే మాట్లాడిన సందర్భాలు, విన్న సందర్భాలు ఏమైనా ఉన్నాయా అని గుర్తు చేసుకునే ప్రయత్నం చేసాను. ఎంత పరస్పర వైరుధ్యాలతో కూడిన వ్యవస్థలో బతుకుతున్నాం. ఎంత అసంబద్ధతతో వ్యవహరిస్తున్నాం అనిపించింది.

గత ఇరవై ఏళ్లుగా విద్యార్థిగా, లెక్చరర్‌గా, వేలాది సభల్లో తెలుగు నేలంతా బలమైన స్వరంగా, కవిగా, సాహిత్య విమర్శకునిగా, రాజకీయ విశ్లేషకునిగా ప్రజాస్వామిక తెలంగాణవాదిగా, విప్లవ రచయితగా తెలిసిన డాక్టర్ కాశీం మీద తెలంగాణ ప్రభుత్వం జనవరి 20వ తేదీన కుట్రకేసు నమోదుచేసింది. చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని సాయుధంగా కూల్చడానికి కుట్రపూరిత రాజద్రోహ నేరానికి తలపడ్డాడని యుఎపిఎ(అన్‌లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెంటివ్ యాక్ట్-చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం) సెక్షన్ 10, 18ల కింద కేసు నమోదుచేసింది. అంటే నిషేధిత మావోయిస్టు పార్టీ సభ్యుడని, ఆ పార్టీ కార్యకలాపాలకు సహకరిస్తున్నాడని. ఆధారమేమిటి? మూడు 'నడుస్తున్న తెలంగాణ' జనవరి నెల సంచికలు, రశీదు పుస్తకాలు. ఆదిలాబాదు జిల్లా మామిడిగట్టుకు చెందిన శ్యామ్‌సుందర్‌రెడ్డి కారులో ఇవి మెదక్ జిల్లా గజ్వేల్ మండలం ములుగు పోలీస్‌లకు దొరికాయని, వీటితో పాటు కాశీం, మరికొందరు ప్రజాసంఘాల వాళ్లు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యునికి రాసిన లేఖలు కూడా దొరికాయని ఆరోపణ. శ్యాంసుందర్‌రెడ్డి జనవరి 3వ తేదీన హైదరాబాదు నుంచి ములుగు మీదుగా మంచిర్యాలకు పోతూ ములుగు పోలీసుస్టేషన్ పరిధిలో యాక్సిడెంట్ చేసి కారు వదిలేసి పోయాడని, ఆ తర్వాత 18వ తేదీన లొంగిపోవడానికి వచ్చి ఈ విషయాలు చెప్పాడని, కనుక శ్యామ్‌సుందర్‌రెడ్డిని, చింతకింది కాశీంను కలిపి కుట్రకేసు నమోదుచేసారు. మూడో వ్యక్తికి కూడా తెలియకుండా ఇద్దరు వ్యక్తులు చేసిన కుట్ర అని పోలీసుల ఆరోపణ. నడుస్తున్న తెలంగాణ పత్రిక నడుపుతున్న కుట్ర. మావోయిస్టు పార్టీ కొరకు 'నడుస్తున్న తెలంగాణ' పత్రిక నడుపుతున్న కుట్ర. పత్రిక పారదర్శకంగా ఉంది. రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్‌పేపర్స్ చట్టం కింద రిజిస్టర్ అయి, ఐఎస్ఎస్ఎన్ నెంబర్ కలిగి(అంటే పౌరగ్రంథాలయాలకు, పరిశోధక విద్యార్థులకు విశ్వవిద్యాలయ అధ్యాపకులకు ప్రయోజనకరమైందిగా గుర్తింపబడి) తెలంగాణ అంతటా విస్తృత ప్రచారంలో ఉన్న పత్రిక. ప్రొఫెసర్ అడపా సత్యనారాయణ గౌరవ సంపాదకుడుగా, అల్లం నారాయణ, (చైర్మన్ ప్రెస్ అకాడమీ), చిక్కుడు ప్రభాకర్ సలహామండలిగా ఉన్న పత్రిక. బ్యాంకు అకౌంట్ నెంబర్ పత్రికలో ప్రచురించి, రశీదు పుస్తకాల ద్వారా చందాలు తీసుకుంటున్న పత్రిక. వాస్తవానికి ఎఫ్ఐఆర్(ప్రాథమిక విచారణ నివేదిక)లో కారులో దొరికినట్లు చూపుతున్నవి మూడు 'నడుస్తున్న తెలంగాణ' పత్రికలు. ఆ పత్రిక రశీదు పుస్తకాలు. ఆరోపణ-నడుస్తున్న తెలంగాణ మావోయిస్టు పార్టీ పత్రిక. దొరికినవంటున్న లేఖలు-పెదగోపన్న పెట్టెలోని ఆకాశరామన్న ఉత్తరాలు-ఉంటే గింటే.

ఇంతకూ మావోయిస్టు అజెండా అమలుచేస్తానని అధికారంలోకి వచ్చిన పార్టీ అధికారం చేపట్టినప్పటి నుంచి మావోయిస్టు పార్టీ అజెండానే అమలు చేస్తున్నానంటున్న ఆ పార్టీ ప్రభుత్వం శ్యామ్‌సుందర్‌రెడ్డి దగ్గర కాశీం మావోయిస్టు పార్టీకి రాసిన లేఖలు దొరికాయని రాజద్రోహాన్ని, కుట్రను ఆరోపిస్తున్నది! తెలంగాణ ప్రజల గొంతుకగా ఐదున్నర సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా నెలనెలా వెలువడుతున్న 'నడుస్తున్న తెలంగాణ'ను నిషేధిత మావోయిస్టు పార్టీ పత్రిక అంటున్నారు.

ఆశ్చర్యమేమిటంటే ప్రభుత్వాలు-అందులోను ఎంతో దుర్మార్గమైనవి దోపిడీ ప్రభుత్వాలు అని కాశీం, మేము, తెరాస కూడా ఆరోపించి ప్రతిఘటించి పోరాడిన చంద్రబాబు, వైఎస్ఆర్ పార్టీలు మావోయిస్టు పార్టీతో చర్చలు నిర్వహించాయి. ఆ పార్టీ నాయకత్వానికి ఆహ్వానం పలుకుతూ లేఖలు రాసారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2002 జూన్ 6, 9, 20 తేదీలలో

అప్పటికి పీపుల్స్‌వార్ పేరుతో ఉన్న పార్టీ ప్రతినిధులతో ప్రభుత్వం చర్చలు జరిపింది. అప్పుడు ఆ పార్టీపై నిషేధం ఉంది. నాయకత్వం తలలపై వెలలున్నాయి. చర్చలలో ప్రభుత్వం తరపున సిబిఐ చీఫ్‌గా పదవీ విరమణ చేసి టిడిపిలో చేరిన మంత్రి విజయరామారావు పాల్గొన్నాడు. చర్చలు సచివాలయంలో జరిగాయి. పార్టీ కార్యదర్శి రామకృష్ణ చర్చల కోసం పెట్టిన ప్రతిపాదనలను విజయరామారావు 'ఆదేశిక సూత్రాలు'తో పోల్చాడు. ఇంక వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంతో 2004 అక్టోబర్‌లో జరిపిన చర్చల గురించి బహుళ ప్రచారం జరిగింది. కాని మళ్లీ రాయనక్కర్లేదు. రెండు సందర్భాల్లోనూ కన్సర్న్‌డ్ సిటిజెన్స్ కమిటీ తరపున ఎస్ఆర్ శంకరన్, కె.జి.కన్నబిరాన్, పొత్తూరి వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి అటు నిషేధిత పార్టీ నాయకత్వం కలిసి ప్రభుత్వంతో చర్చలు జరపాలని కోరారు. కలిసి రాగానే ఇటు ప్రభుత్వాలతో కూడా ఆ పార్టీతో చర్చలు జరపాలని కోరారు. నిషేధిత పార్టీని కలిసి వచ్చామని ఆయా ప్రభుత్వాలకు చెప్పారు. రాసారు. ప్రజలకు చెప్పారు. ప్రజలకు కలిసి ప్రజల సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ క్రమమంతా మూడు సంపుటాలు, తెలుగు ఇంగ్లిషులలో ప్రచురించారు.

రెండు సందర్భాలలో చర్చలలో పాల్గొన్న విజయరామారావు, కె.కేశవరావులు ఇపుడు తెరాసలోనే ఉన్నారు. కాంగ్రెస్‌తో కలిసి 2004లో ఎన్నికలలో పాల్గొన్నప్పటి నుంచీ తెరాస తాను అధికారంలోకి వస్తే మావోయిస్టు పార్టీ అజెండానే అమలు చేస్తానని చెప్తున్నది. మైనస్ తుపాకీ. ఇపుడు అదే అమలు చేస్తున్నానంటున్నది. అది ప్రజల విజ్ఞతకు వదిలేద్దాం.

మావోయిస్టు పార్టీ 1968 నుంచి సిపిఐఎంఎల్‌గా, సిపిఐఎంఎల్ పీపుల్స్‌వార్‌గా ఆయా కాలాల్లో అంటే 1972, 1996 మొదలుకొని 2014 దాకా ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని బలపరచింది. నిర్వహించింది. మన భూమి, మన నీళ్లు, మన వనర్లు, మన చదువులు, మన కొలువులు, మన నిధులు, మన పరిపాలన మనది కావాలని పోరాడింది. సామ్రాజ్యవాద భూస్వామ్య దళారీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాడింది. 2004 చర్చలలో స్వావలంబన అంశంలో ప్రత్యేక తెలంగాణ గురించి చర్చించాలని ప్రతిపాదించింది. కాని రెండవ విడత చర్చలు జరుగలేదు.

కవి కాశీం 1995లో నిజాం కాలేజిలో బిఎ విద్యార్థిగా ప్రత్యేక తెలంగాణ కోసం విద్యార్థి ఉద్యమంలోకి వచ్చాడు. స్వయంగా విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించాడు. భువనగిరి సభ, వివి ఫంక్షన్‌హాల్ సభ, వరంగల్ సభలలో పాల్గొన్నాడు. 1998లో ఏర్పడిన జనసభ అనుబంధ సంఘం తెలంగాణ స్టూడెంట్ ఫ్రంట్ కన్వీనర్‌గా ఎనిమిదేళ్లు పనిచేసాడు. విద్యార్థులను చైతన్యం చేసాడు. ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రాచ్య కళాశాల లెక్చరర్‌గా, ఇపుడు నిజాం కాలేజిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా గత 20 సంవత్సరాలుగా తెలంగాణ గురించి, ప్రజాస్వామ్యం గురించి వేలాది సభల్లో ప్రజల్ని ఆలోచింపచేసే, ఆకట్టుకునే ఉపన్యాసాలు చేస్తున్నాడు. ఇటీవలనే ముగిసిన హైదరాబాదు బుక్ ఫెయిర్‌లో తన ఇరవై ఏళ్ల సమగ్ర కవితా సంపుటిని, తెలంగాణ సాహిత్య వ్యాసాలను ఆవిష్కరింపచేసాడు. ఇరవై ఏళ్లుగా తెలంగాణ ప్రజాస్వామిక స్వరాన్ని ప్రసంగంలో, కవిత్వంలో, గానంలో, విశ్లేషణలో వినిపిస్తున్న బలమైన యువ నాయకత్వం ఆయనది. ఆయన ఎవరితో జరిపే సంభాషణ అయినా అది ప్రజాస్వామిక తెలంగాణ ఆకాంక్షతో జరిపేదే అయి ఉంటుంది. అందులోనూ ముఖ్యంగా తెలంగాణలోని అంటరానివాళ్ల, ఆదివాసుల, అణచివేతకు గురవుతున్న వర్గాల ప్రతినిధిగా జరిపే సంభాషణ అయి ఉంటుంది. ఎందుకంటే ఆయన తెలంగాణలోనే కాదు, దేశంలోనే కరువు జిల్లాల్లో ఒకటైన పాలమూరు జిల్లాలో పేద మాదిగ కుటుంబంలో పుట్టి ప్రతిభతో స్వయంకృషితో సమాజంలో ఒక గుర్తింపు పొందాడు. తన అవగాహన వలన, ఆలోచనల వలన, సాంస్కృతిక ఆచరణ వలన గుర్తింపు పొందినవాడు. ఆయన గత పదేళ్లుగా విప్లవ రచయితల సంఘం కార్యవర్గ సభ్యుడు కనుక సహజంగానే సమాజంలోని పీడిత, పోరాట ప్రజల పక్షం నిలబడి మాట్లాడుతాడు. రాస్తాడు. ఆదివాసులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్‌హంట్ ఆపరేషన్ పేరుతో చేస్తున్న విధ్వంసక, హింసాపూరిత దాడిని, ఆదిలాబాదులో గోండులపై, పాలమూరులో చెంచులపై జరుగుతున్న దోపిడీ, అణచివేత, దాడులు, వాళ్ల హింసను ఖండిస్తాడు. అన్యాయాన్ని అన్యాయం అంటాడు. అట్టడుగు వర్గాలకు న్యాయం కావాలంటాడు. ఇది కుట్ర ఎట్లా అవుతుందో, రాజద్రోహం ఎట్లా అవుతుందో, నిషేధమెట్లా అవుతుందో విజ్ఞతతో ఆలోచించాలని ప్రజాస్వామ్యవాదులకు, రచయితలకు, బుద్ధిజీవులకు విజ్ఞప్తి.

తొంబైశాతం అంగవైకల్యం ఉన్న ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబాను ఇటువంటి ఆరోపణలతోనే ఇరవై నెలల కింద అరెస్టు చేసి మొదట పద్నాలుగు నెలలు, మళ్లీ నెలరోజులుగా నాగపూర్ సెంట్రల్ జైలులో అండా సెల్‌లో పెట్టి తీవ్రమైన అనారోగ్యానికి, మానసిక చిత్రహింసలకు గురిచేసినందుకే తెలుగు సమాజమంతా స్పందిస్తున్నది. తెలంగాణలోని బుద్ధిజీవులు, ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా స్పందించి ఆయనకు సంఘీభావం ప్రకటించి నాగపూర్ దాకా వెళ్లి ధర్నా కూడా నిర్వహించారు. ప్రొఫెసర్ హరగోపాల్ నాయకత్వంలో అఖిల భారత స్థాయిలో ఏర్పడిన డిఫెన్స్ కమిటీ కృషి వలన, ప్రజాస్వామిక స్పందన వలన ఆయన జైల్లోనయినా తీవ్ర అనారోగ్యంతో మనోస్థైర్యం నిలుపుకోగలుగుతున్నాడు. ఇంక దేశవ్యాప్తంగా దభోల్కర్, గోవింద పన్సారే, కల్బుర్గి హత్యలు, అఖ్లాక్ హత్య మొదలుకొని హేతువాదులు, ప్రజాస్వామ్యవాదులు, రచయితలపై ఫాసిస్టు దాడులు జరుగుతున్న వాతావరణంలో, అరుంధతీరాయ్‌కి కంటెంట్ ఆఫ్ కోర్టు నోటీసు జారీ చేసిన వాతావరణంలో భావ ప్రకటన ఇంత ప్రమాదకరమా అని తెలంగాణలోని ప్రజాస్వామిక వాదులు విస్తుపోతున్న సమయంలో తెలంగాణ ప్రభుత్వం కూడా అటువంటి కుట్ర, రాజద్రోహం కేసుతోనే ముందుకు వచ్చింది. అది కూడా కాశీంపై.

నిజామాబాదులో బీడీ కార్మికుల సంఘం పెట్టుకున్న సభను భగ్నం చేసి, ఆ సభలో వక్తగా వెళ్లిన అరుణోదయ సమాఖ్య అధ్యక్షురాలు విమలపై కూడా తెలంగాణ ప్రభుత్వం ఇటువంటి

# ఉన్నత విద్యాశాలలా? ఉద్యమ భానుల వధ్య శిలలా?

**వరవరరావు**

నూతన నిర్మాణంలోని ఇటుకల కలల్లో
గునపాల కొసలు దింపడం
ఇప్పుడు 'వాడి' యుద్ధ విధానం
ప్రతిఘటించకపోతే
ఇది రాసిన నేనూ
చదివిన నువ్వూ మిగలం

పిల్లనగ్రోవి తుపాన్,
-ఉదయభాను

ఉన్నత విద్యాలయాల్లో భావ సంఘర్షణలు కొత్తకాదు. ముఖ్యంగా తెలుగు సమాజంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలం నుంచి, తిరిగి శ్రీకాకుళ రైతాంగ సాయుధ పోరాటం, జగిత్యాల జైత్రయాత్ర కాలాల నుంచి అగ్ర వర్గ, వర్ణ భూస్వామ్య వర్గాల పిల్లలు ఎబివిపి భావజాలానికి, దళిత, బడుగు, వర్గాల, కులాల పిల్లల రాడికల్ భావజాలానికి మధ్యన భావ సంఘర్షణలు భౌతిక దాడులకు దారితీసిన రోజులు 72 ఏప్రిల్ 14 జార్జ్‌రెడ్డి హత్యతో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మొదలై వరంగల్ ఆర్ఇసి, కెఎంసిలకు విస్తరించడం, ఆ తరువాత సిరిసిల్లలో చాంద్‌పాషా హత్య, 1985లో నల్గొండలో రాడికల్ విద్యార్థి శేషయ్య హత్య, శేషుసార్ పై దాడి ఇంక 82, 84 మధ్యన వరంగల్ కాలేజీల్లో రెండేళ్లపాటు నూట నలభై నాలుగో సెక్షన్ అమలు. ఎబివిపి విద్యార్థులకు లైసెన్స్ లేని పిస్టళ్లు, చురకత్తులు పోలీసులే సరఫరా చేయడం, ఎచ్.జె. దొర ఎబివిపి విద్యార్థులే మాకు కళ్లు, చెవులు అని ప్రకటించి రాడికల్, ప్రగతిశీల విద్యార్థులపై దాడులు చేయించడం, హయగ్రీవాచారి, నరేంద్ర నాయకత్వంలో కెయుపై సాయుధ శక్తుల దాడులు-ఇవన్నీ విద్యార్థి సంస్థల ఎన్నికల రద్దు దాక దారితీసినవి.

అయితే ఇప్పుడు మద్రాస్ ఐఐటిలో పెరియార్-అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను నిషేధించమని కేంద్ర మానవ వనరుల మంత్రి స్మృతి ఇరానీ లేఖ రాసిన నాటి నుంచి, పూనే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌కు టివిలో ధర్మరాజు వేషధారి చౌహాన్‌ను డైరెక్టర్‌గా నియమించిన నాటి నుంచి, హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో వేముల రోహిత్ చక్రవర్తి, ప్రశాంత్ మొదలైన ఐదుగురు దళిత విద్యార్థుల సాంఘిక బహిష్కరణ దాకా, జెఎన్‌యులో విద్యార్థి సంఘం అధ్యక్షుడు కన్నయ్య లాల్, డిఎస్‌యు నాయకులు ఉమర్ ఖలీద్, అనిర్బన్, వాళ్ల సహచరులపై కేసులు, అరెస్టులు, ఆత్మహత్యలకు, చంపుతామని బెదిరింపులకు కేంద్ర ప్రభుత్వ హోం మంత్రి, మానవ వనరుల మంత్రి, ఇతర కేంద్ర మంత్రులు, వైస్ చాన్సలర్లు మొత్తం కేంద్ర, రాష్ట్ర అధికార, ముఖ్యంగా పోలీసు యంత్రాంగం అండగా నిలవడం, ఆదేశాలివ్వడం-విశ్వవిద్యాలయాల భావ సంఘర్షణ వేదికలు-సమాజంలోనే భౌతిక దాడులకు దారితీసి పార్లమెంట్, శాసన సభల చర్చనీయాంశాలుగా మారడం-ఎచ్‌సియు విద్యార్థులు ప్రారంభించిన 'ముజఫర్‌నగర్ బాకీ హై' ఉద్యమ దార్శనికతకు దాఖలాగా ఉన్నవి. భావ వినిమయానికి, ఘర్షణకు ఏమాత్రం, అవకాశం లేకపోవడం వల్ల జెఎన్‌యు విద్యార్థి సంఘం ఫిబ్రవరి 9న నిర్వహించిన కవి సమయం-కవి సంధ్య 'పోస్టాఫీసు లేని దేశం' వలె ఉన్నది. అవును, ఇంత అంతర్జాల ప్రచారంతో అంతర్జాతీయ ప్రచారం మరుక్షణంలో జరుగుతున్నప్పటికి మరణ మృదంగం మోతలు-ఈ దేశాన్ని ఒక పోస్టాఫీసు లేని మరుభూమిగా మార్చేస్తున్నాయి. డెబ్భైలు, ఎనభైలకు మోడిత్వ 2014-16 తేడా ఏమిటంటే అప్పుడు విప్లవ భావాలకు-విప్లవ వ్యతిరేక భావాలకు ఘర్షణ. ఇప్పుడు హిందుత్వ కాషాయ జెండా నీడలో సామ్రాజ్యవాద-భూస్వామ్య దళారీలకు దళిత, ఆదివాసి, ముస్లిం మైనారిటీలు మొదలు మొత్తం ప్రగతిశీల, విప్లవ భావజాలాలతో ఘర్షణ. ఈ ఘర్షణ ఒక కీలవేన్మణి, ఒక కారంచేడు, ఒక బాబ్రీ మసీదు, ఒక పంజాబ్, ఒక చుండూరు, ఒక గుజరాత్ వంటిది. కాని దీని పేరు అభివృద్ధి, అచ్ఛేదిన్ ఆయేగా, ఘర్ వాపసీ, మేక్ ఇన్ ఇండియా-బంగారు తెలంగాణ.

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో దళిత విద్యార్థులు సాంఘిక బహిష్కరణకు గురవుతారు. వెలివాడలో బ్రాహ్మణాగ్రహారానికి దూరంగా ఆకాశం కప్పుగా అలమటిస్తారు. ఆక్రోశిస్తారు. ఉద్యమిస్తారు. రోహిత్ వేములను ఆత్మహత్యకు ప్రేరేపిస్తారు. ఉద్యమం పరిస్థితులను చక్కదిద్దితే వైస్ చాన్సలర్

---

కుట్ర కేసే పెట్టింది. అప్పుడే తగినంత నిరసన వచ్చి ఉంటే ఇంత దూరం వచ్చి ఉండేది కాదు. ఎన్నిసార్లు చెప్పుకున్నా హిట్లర్ కాలపు ఫాసిస్టు దమనకాండ నీతి మళ్లీ చెప్పుకున్న వాళ్లమే అవుతున్నాము.

అందుకే మళ్లీ అదే ప్రశ్న. మావోయిస్టు అజెండా అమలు చేస్తున్నానని చెప్పుకుంటున్న తెరాస పాలనలో ఒక నిషిద్ధ రాజకీయం ఉంటుందా? ఒక నిషిద్ధ మానవుడుంటాడా? అటువంటి ప్రభుత్వం రచయితలు, కవులు కుట్ర చేయగలరని ఆరోపించడం న్యాయమా? రాజద్రోహ నేరారోపణలకు కాలం చెల్లలేదా? డాక్టర్ బినాయక్‌సేన్, ప్రొ.జి.ఎన్.సాయిబాబా మొదలు, డా.సి.కాశీం వరకు అందరూ అన్ని ప్రభుత్వాల దృష్టిలోనూ కుట్రదారులు, రాజద్రోహులేనా? నిషిద్ధ మానవులేనా? ప్రభుత్వాలకు సరే. ఈ ప్రశ్న మనకు మనం కూడా వేసుకుందాం.

తిరిగి వచ్చి దౌర్జన్యాన్ని, హింసాకాండను రెచ్చగొట్టి క్యాంపస్‌ను ఒక కాన్‌సెంట్రేషన్ క్యాంపుగా మారుస్తాడు. దళిత, ముస్లిం, ఆదివాసి, ప్రగతిశీల విద్యార్థులను, ఆచార్యులను జైలుపాలు చేస్తాడు. రోహిత్ వేముల తల్లి రాధిక ఈ అందరి ఆవేదనను, ఆక్రోశాన్ని ఒక తల్లిగా వేదనతో వేసే ప్రశ్నకు జవాబు ఉండదా! నా కొడుకు డిసెంబర్ 18, 2015న వైస్ చాన్సలర్‌కు లేఖ రాశాడు కదా-ఉరితాడు, విషం ఇచ్చి అంబేడ్కర్ పుస్తకాలు చదివే విద్యార్థులని చంపమని. వైస్ చాన్సలర్ ముందు డొనాల్డ్ ట్రంప్ కూడా లిల్లీపుట్ అన్నాడు కదా- అని జనవరి 17న ఆత్మహత్య చేసుకున్నాడు కదా. ఈ నెల రోజులు వైస్ చాన్సలర్, ఆయన అధికారగణం-ఈ ఆత్మహత్య మానసికత నుంచి నా కొడుకును ఎందుకు కాపాడలేక పోయారు. అప్పారావు నా కొడుకు ఆత్మహత్యకు అబెటర్ (ప్రేరకుడు) కాదా? 2. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చర్యల కింద ఆరోపణలెదుర్కొంటున్న వైస్ చాన్సలర్ మళ్లీ లోపలికొస్తాడు. నాకు నా పిల్లలకు ఎందుకు ప్రవేశం లేదు. 3. కేంద్ర మానవ వనరుల శాఖ ఏక సభ్య కమిషన్ విచారణ పూర్తికాకుండానే సెలవుపై వెళ్లిన అప్పారావు తిరిగి ఎట్లా వస్తాడు, న్యాయస్థానంలో నేరమే అధికారమై విద్యార్థులను, అధ్యాపకులను బహిష్కరించి, అరెస్ట్ చేయించి యూనివర్సిటీనొక బేస్ క్యాంప్‌గా మార్చడం కాదా ఇది?

బస్తర్‌లో కేంద్ర పోలీసు బలగాలు, కోయ కమెండోలు, సాల్వాజుడుం మావోయిస్టు సానుభూతిపరులని వందలాదిమందిని బేస్‌క్యాంపుల్లో పెట్టి చిత్రహింసలకు, హత్యలకు స్త్రీలనైతే లైంగిక అత్యాచారాలకు గురి చేసినట్లుగానే హైదరాబాద్ యూనివర్సిటీలో జనవరి 17వ తేదీ నుంచి- ఇవాళ్టి వరకు జరుగుతున్న సంఘటనలు తలపిస్తున్నాయి. ఈ సందర్భంలో యూనివర్సిటీ అధికారులు, పోలీసులు కలిసి తయారుచేసిన అభియోగపత్రంలో 47 మంది ముద్దాయిలపై కేసు పెట్టారు. అందులో 26 మందిని అరెస్టు చూపి వారం రోజులు చర్లపల్లి జైల్లో పెట్టారు. జెఎన్‌యు సరేసరి, కన్హయ్యలాల్, ఉమర్‌ఖలీద్‌లతో పాటు వాళ్లకు సమర్థనగా ప్రెస్‌కాన్ఫరెన్స్ పెట్టిన సిఆర్‌పిపి అధ్యక్షులు ఎస్.ఆర్. గిలానీని దేశద్రోహ నేరం కింద తిహార్ జైల్లో పెట్టారు. బిజెపి, పిడిపి కశ్మీర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసే ఒప్పందం పుణ్యమా అని వీరంతా బెయిల్‌పై బయటకి వచ్చారు కానీ వీళ్లంతా దేశద్రోహులు, అఫ్జల్‌గురు ఉరిశిక్షను వ్యతిరేకించినవాళ్లు-కశ్మీర్ ఆజాదీని కోరినవాళ్లు. ఉరిశిక్షల రద్దు-ఆజాదీలు కోరినవాళ్లు అంటే అందులో తప్పేటమిటని ఎవరైనా అడుగుతారని భారత్‌కే బర్బాదీ, పాకిస్థాన్ జిందాబాద్ నినాదాలు ఇచ్చిన వాళ్లుగా చిత్రించ బడినవాళ్లు. గోబెల్స్ ప్రచారమంటే ఇట్లా వుంటుంది. ఏకీభవించని వారి పీకనొక్కు సిద్ధాంతమే ఫాసిజం అంటే ఇట్లా ఉంటుంది.

రెండేళ్లుగా నాగ్‌పూర్ సెంట్రల్ జైలు అండాసెల్‌లో శిథిలమవుతూ మగ్గుతున్న ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా జెఎన్‌యు, డిఎస్‌యు మెంటర్‌గా నాగ్‌పూర్ డిఐజి రవీంద్ర కదమ్‌కు కనిపిస్తాడు. కన్హయ్య, ఉమర్‌ఖలీద్‌ల తలలకు వెలలు ప్రకటిస్తారు. పోస్టర్లు వెలుస్తాయి, ఫత్వాలు జారీ అవుతాయి. హైదరాబాద్, విజయవాడ సభల్లో రాళ్లు విసురుతారు, చెప్పులు విసురుతారు. 24వ తేదీ లోపల జెఎన్‌యు నుంచి పారిపోకపోతే జెఎన్‌యులో ప్రవేశించి కాల్చి పారేస్తామంటారు. ఇదంతా భారత్‌మే ఆజాదీ కోరినందుకే. రోహిత్ వేముల విద్యార్థి లోకానికి ఆదర్శం అని ప్రకటించినందుకే. రోహిత్ వేముల నీలాకాశంలో ఇవ్వాళ ఒక ఎర్ర నక్షత్రమై నక్షత్ర ధూళిలో పథనిర్దేశికుడుగా నడుస్తున్నా డన్నందుకు ఐదుగురు దళిత విద్యార్థులను సాంఘికంగా బహిష్కరించి వెలివాడకు పంపినారు. విసి అప్పారావు తిరిగి వచ్చి తన లాడ్జిలో దౌర్జన్యాన్ని రచించుకుని అది సాకుగా మూడు వేలమంది పైచిలుకు విద్యార్థులకు ఆహారం, నీళ్లు, కరెంటు లేకుండా చేశాడు. మెస్‌లు మూసివేశాడు. కరెంటు కట్ చేయించాడు. యూనివర్సిటీ గేట్లు మూసివేసి ఒక ఓపెన్ ఎయిర్ జైలుగా మార్చేసాడు.

విద్యార్థులు, ఆచార్యులు అరెస్టయిన వాళ్లు పోను, ఎందరని నీళ్లు, ఆహారం లేకుండా నకనకలాడుతారు. కనుక రెండవరోజు క్యాంపస్‌లో ఎండలో చెట్ల కింద పక్షుల వలె రాళ్లు ఏరుకుని పొయ్యి, కర్రలు ఏరుకుని నిప్పు-గిన్నెలు పోగుచేసి వంట చేయాలని పూనుకున్నారు. అక్కడ మొదలవుతుంది మారణకాండ-అది ఉదయభాను మాటల్లో విన్నాం. ఉదయభాను పాలమూరు జిల్లా షాద్‌నగర్‌లో విశ్రాంత ఉపాధ్యాయుల సంతానమైన మాదిగ విద్యార్థి. తెలుగులో ఎం.ఫిల్. పూర్తిచేసి పి.ఎచ్.డి. చేస్తున్నాడు. ఏడేళ్లుగా ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ విద్యార్థి ఉద్యమానికి నాయకుడు. వక్త, కవి, నాటక ప్రయోక్త. రెండు కవితా సంకలనాలు-జంగ్ ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కవిత్వం, ముఖ్యంగా-గ్రీన్‌హంట్ ఆపరేషన్ పేరిట ప్రజలమీద యుద్ధాన్ని ప్రతిఘటిస్తూ పిల్లనగ్రోవి తుఫాన్ కవితా సంకలనం ద్వారా సుప్రసిద్ధుడైనవాడు. ఉదయమిత్ర రచించి విరసం పలుచోట్ల ప్రదర్శించిన బాసగూడ నాటకానికి దర్శకుడు. అత్యంత ప్రతిభాశాలి. ఇప్పుడు వైస్‌ఛాన్సలర్‌కు, రాజ్యానికి కన్నెర్రగా మారిన తథాగత్‌తో పాటు ఒరిస్సా ఇటుక బట్టి కార్మికులపై కాంట్రాక్టర్ల, పోలీసుల దాష్టీకాన్ని, దౌర్జన్యాల్ని ఎదిరించి పోరాడిన వాళ్లలో ఉండి పోలీసు కేసును ఎదుర్కొన్నాడు.

ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ కోసం విద్యార్థులకు మార్గదర్శక సూత్రాలను ఆలోచించిన పృథ్వీతో పాటు ఎచ్‌సియులో ఉద్యమించినందుకు అజ్ఞాత విప్లవకారుల అరెస్ట్ సందర్భంగా పోలీసుల నిఘాను ఎదుర్కొన్నవాడు. విప్లవ రచయితల సంఘం క్రియాశీల ఉద్యమకారుడుగా సహజంగా రాజ్యం నిఘా నీడలో మసులుకోక తప్పనివాడు. హైదరాబాద్ యూనివర్సిటీ రోహిత్ వేముల అమరత్వం తర్వాత ఏర్పడిన విద్యార్థి జాక్‌కు సహజంగానే నాయకత్వంలో ఉన్నాడు. అతడు రోహిత్, డాక్టర్ సి. కాశీంల వలె 'నిషిద్ధ మానవుడు'. అటువంటి విద్యార్థే భాస్కర్. ఎకనామిక్స్‌లో రీసెర్చ్‌స్కాలర్. వంట ప్రయత్నాల్లో ఉన్నవీళ్లు, వీళ్ల తోటి విద్యార్థుల మీద పడి పోలీసులేం చేశారో- ప్రత్యక్షసాక్షి ఉదయభాను. ఉదయభాను లేఖ ద్వారా విన్నాం. అతనికి చావు రుచి చూపించారు. తననెందుకు అంత చిత్రహింసలకు గురిచేసి చావు సరిహద్దుల దాకా తీసుకువెళ్లి వదిలిపోయారో కూడ కారణాలు ఊహించడానికి వాస్తవ గత వర్తమానాల మీద ఆధారపడి ఊహించాడు.

విచిత్రమేమిటంటే-ఆయనని నలభై ఏడుగురు ముద్దాయిలలో చూపలేదు. ఇంత చిత్ర హింసలు పెట్టి మళ్లా క్యాంపస్‌లో విసిరేసి పోయారు గాని ఆసుపత్రిలో చేర్చి మెడికో లీగల్ కేసు వేయలేదు. విసిరేసి పోయేప్పుడు ఒక ఎస్ఐ వచ్చి హెచ్చరించినట్లు ఉదయభానును వాళ్లు చంపదలుచుకున్నారు- పల్లెల్లో దళితుల్ని, బస్తీల్లో ముస్లింలను, అడవిలో ఆదివాసుల చంపుతున్నట్లు. మద్రాసు ఐఐటి పెరియార్-అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను నిషేధించవలసిందన్న స్మృతి ఇరానీ లేఖతో ప్రారంభించాము కదా. జెఎన్‌యుఎస్‌యు పై పోలీసుల ఎఫ్ఐఆర్ ఏమిటో తెలుసా? ఈ స్టూడెంట్స్ యూనియన్-బీఫ్ ఫెస్టివల్ చేస్తుందని, మహిషాసుర జయంతి జరుపుకుంటుందని-కనుక యాంటీ నేషనల్. దేశద్రోహి. అయితే అది మద్రాసు ఐఐటి కావచ్చు, హైదరాబాదు యూనివర్సిటీ కావచ్చు. ఇఫ్లు కావచ్చు, బొంబాయి, హైదరాబాద్‌లలోని టాటా ఇనిస్టిట్యూట్స్ కావచ్చు, అలహాబాదు యూనివర్సిటీ కావచ్చు, పూనె ఫెర్గూసన్ కాలేజీ కావచ్చు-ఏ ఉన్నత విద్యాలయం అయినా కావచ్చు-ఇక్కడి విద్యార్థులు- అధ్యాపకులు-సాయిబాబా వలె నాలుగేళ్ల డిగ్రీ కోర్సునూ వ్యతిరేకించ వద్దు, ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్ అమలు కోసం డిమాండు చేయవద్దు. వివక్షను ప్రశ్నించ వద్దు. విద్య ప్రైవేటీకరణను, కాషాయీకరణను ప్రశ్నించవద్దు. విదేశీ విశ్వవిద్యాలయాలను అడ్డుకోవద్దు. ఎస్ఆర్ గిలానీ వలె కశ్మీరీ కావద్దు. కశ్మీరు ప్రజల స్వయ నిర్ణయాధికారం గురించి మాట్లాడవద్దు. రాజకీయ ఖైదీల హక్కులు, విడుదల కోసం, సంఘాలు, ఉద్యమాలు నిర్వహించవద్దు. ప్రొఫెసర్ కె.ఏసురత్నం వలె పద్నాలుగేళ్ల విద్యార్థుల రస్టికేషన్ మొదలు ప్రస్తుత బ్రాహ్మణాగ్రహారాల వివక్షదాకా ప్రశ్నించవద్దు-పాతపెల్లి నుంచి ఎచ్‌సియు వరకు దళితులపై దాడి విషయంలో పీడితుల, విద్యార్థుల పక్షం వహించవద్దు. బస్తర్‌లో 2009 నుంచి గ్రీన్‌హంట్ ఆపరేషన్ పేరుతో ప్రజల మీద దాడి చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మారణకాండపై నిజనిర్ధారణలు, ప్రకటనలు చాలయ్యాయి. న్యాయవాదులను, జర్నలిస్టులను, సామాజిక కార్యకర్తలను-ఆదివాసుల పక్షాన మాట్లాడిన వాళ్లనంతా వేధిస్తున్నారు. దాడులు చేస్తున్నారు. బహిష్కరిస్తున్నారు. చంపుతామని హెచ్చరిస్తున్నారు. ఆదివాసీ సమాజం నుంచి వచ్చిన సోనిసోరిపై లైంగిక అత్యాచారం, యాసిడ్ దాడితో చాలకుండా కుటుంబాన్నంతా చంపుతామంటున్నారు. అటువంటి ఆదివాసి సమాజ ముఖ చిత్రాన్ని ఆవిష్కరించడమే కాదు, అంతరంగాన్ని కూడా స్కాన్ చేసి చూపాలని మొండిగా నిలిచిన బేలాభాటియా ఇంటిపై కూడా దాడిచేసి చంపుతామని-బస్తర్ విడిచి వెళ్లిపో అని హెచ్చరిస్తున్నారు. కనుక 'ఛలో బస్తర్' అని పిలుపు ఇస్తూ వెయ్యిమంది విద్యావంతులం, ప్రజాస్వామికవాదులం కదులుదామని ప్రయత్నిస్తున్న తథాగత్‌పై కేసులు మోపి జైల్లో పెడతారు. 20 మంది అధ్యాపకుల తొలగింపు జాబితా తయారవుతుంది-ఇది పీడిత పోరాట ప్రజల నుంచి బుద్ధి జీవులను-విద్యార్థి మేధావులను, ప్రజాస్వామిక వాదులను వేరుచేసే కుట్ర.

అడవి గురించి ఊరు మాట్లడకూడదు. అడవి, ఊరు పేగు బంధం గురించి నగరం మాట్లాడకూడదు. శ్రమజీవి గురించి బుద్ధిజీవి మాట్లాడకూడదు. ప్రజల గురించి మేధావులు, విద్యార్థులు మాట్లాడకూడదు. ఆంధ్రయూనివర్సిటీ సంఘం అధ్యక్షుడుగా 1972లో ప్రత్యేక ఆంధ్ర ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొని ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లి అంచెలంచెలుగా కేంద్రమంత్రి పదవికి ఎగబాకిన వెంకయ్యనాయుడు విశ్వవిద్యాలయాల్లో రాజకీయాలు వద్దని ఉపదేశాలు చేస్తాడు.

వాజ్‌పాయ్ నాయకత్వంలో 1974లో భూమయ్య కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షలను వ్యతిరేకించిన నోటితో ఉరిశిక్షను శిక్షాస్మృతి నుంచి తొలగించాలన్నవారిని దేశద్రోహులంటాడు. జల్, జంగల్, జమీన్ ఇజ్జత్‌ల కోసం పోరాడే ఆదివాసులను మావోయిస్టులుగా ఈ దేశంలో మేము రెండో శ్రేణి పౌరులుగా కాకుండా సమానత్వంతో, స్వీయగౌరవంతో జీవించాలన్న ముస్లింలను టెర్రరిస్టులుగా, మాది హిందూ మతం, హిందూజాతి కాదు, మమ్మల్ని వెలివాడల్లో అస్పృశ్యులుగా చూస్తు మా ఆత్మగౌరవాన్ని గాయపరుస్తున్నారన్న దళితులను యాంటీ నేషనల్స్‌గా, దేశద్రోహులుగా చిత్రించి రాజద్రోహ నేరం మోపుతున్న ప్రభుత్వాలను దళిత ఆదివాసీ ముస్లిం మైనారిటీ, జాతుల స్వయం నిర్ణయాక హక్కుల పోరాట ప్రజల పక్షాన చైతన్యవంతులుగా, ప్రజాస్వామిక వాదులుగా బలపరుస్తున్నందుకే ఇవ్వాళ ఉన్నత విద్యాలయాల్లో ఈ సామాజిక వర్గాల నుంచి వస్తున్న వాళ్లపై దాడులు జరుగుతున్నాయి. అరెస్టులు జరుగుతున్నాయి. బహిష్కరణలు జరుగుతున్నాయి. రోహిత్ ఆత్మహత్య తర్వాత ఇవ్వాళ ఈ వధ్యశిలపై ఉదయభాను నిలబడ్డాడు. ఆనాడు రోహిత్ నెలరోజుల ముందే వైస్‌ఛాన్సలర్‌కు లేఖ రాశాడు. ఆ కుట్రదారుడు అది బయటపెట్టక అతన్ని ఆత్మహత్యకు ప్రేరేపించాడు. ఆ హంతకుడు ఇపుడు విద్యార్థులపై, అధ్యాపకులపై పోలీసులను, సాల్వాజుడుంను విశృంఖలంగా వదిలేసి క్యాంపస్‌ను ఒక కాన్‌సెంట్రేషన్ క్యాంప్‌గా మార్చాడు. అందుకు ఉదయభానుపై హత్యాప్రయత్నం ఒక సంకేతం మాత్రమే. ఉదయభానును కాపాడుకోవడం, వ్యక్తిని కాపాడుకోవడం కాదు-ఉద్యమ భానులను వధ్యశిలకు బలికాకుండా కాపాడు కోవడమే అవుతుంది. ☆


**మీ రచనలను అరుణతారకు ఈ-మెయిల్ కూడా చేయవచ్చు!**

పేజ్‌మేకర్ ఓపెన్ ఫైల్, పి. డి. ఎఫ్. పద్ధతులలో (అను 6.0లో అయితే మేలు),

మైక్రోసాఫ్ట్ వర్డ్, ఎం. ఎస్. భాషాలో కూడా అరుణతారకు మెయిల్ చేయగలరు

ఈ-మెయిల్ : arunatara1977@gmail. com

**Like Page://viplava rachayitala sangham arunatara**
**Website : www. virasam. org, www. virasam. in**

# ఒక శీతాకాలపు రాత్రి

## మాక్సిం గోర్కీ

తెలుగు - శివలక్ష్మి

ఒక శరత్కాలపు చలిరాత్రి నా పరిస్థితి చాలా అసౌకర్యంగా పరమ ఘోరంగా ఉంది. నేను అప్పుడప్పుడే ఒక పట్టణం చేరుకున్నాను. అక్కడ నాకు తెలిసిన ఒక్క మానవమాత్రుడు కూడా లేడు. నా జేబులో ఒక్క పైసా లేదు. కనీసం నా చెయ్యి ఆనించుకునే చిన్న చోటైనా లేదా ఊళ్ళో.

ఒకటి రెండు రోజులు నాదగ్గరున్న బట్టలలో మరీ తప్పనిసరిగా అవసరం అనుకున్నవి తప్ప తక్కినవన్నీ అమ్ముకుంటూ బతికాను. నా బట్టలన్నీ ఐపోయాక 'అవుస్ట్యా' అనే చోట రేవులు, డాక్ యార్డ్ లున్నాయని తెలిసి అక్కడికి వెళ్ళి పని చూసుకోవాలని నిర్ణయించుకున్నాను. తీరా నేనక్కడికి చేరేసరికి అది అప్పటికే అక్టోబర్ చివరి వారం కావడంతో పని సందడి, ఆర్భాటమేమీ లేకుండా నిర్మానుష్యంగా ఉంది.

తడి మట్టిని కాళ్ళతో అటూ ఇటూ బాగా తొక్కుతూ నీళ్ళు ప్రతిచోటా పోస్తూ నా కాళ్ళ కింది నేలను ఎవరైనా పారేసిన ఆహారం ఎంత చెత్తదైనా సరే దొరుకుతుందేమోనన్న ఆశతో స్కాన్ చేసి పారేశాను. అసలేమీ తిననందున నా పరిస్థితి ఎంగిలి కోసం ఆబగా చూసే స్థితికి దిగజారింది.

కడుపు దహించుకుపోతున్నప్పుడు తట్టుకోలేక నేనంత హీనమైన స్థితికి దిగజారాను. జీవితంలో ఈ ఒక్కసారికి నా ఆకలి బాధ తీరితే ఈ జన్మకదే మహదానందం అనుకుంటూ నిర్మానుష్యంగా ఉన్న గుడిసెలవైపు, చిల్లర కొట్లవైపు దొంగ నక్కలాగా పొంచి పొంచి చూశాను. ఇప్పుడున్న సాంఘిక పరిస్థితుల్లో మానసికమైన ఆకలి తీరే పరిస్థితులున్నాయి కానీ దేహార్తినీ, ఆకలిదప్పుల్నీ తీర్చుకునే దారి లేదు గాక లేదు.

బ్రహ్మాండంగా అలంకరించబడిన భవనాల ముందు నుంచి దేశదిమ్మరిగా వీధుల వెంట తిరుగుతున్నప్పుడు ఎవరైనా ఆ ధనవంతులు బయటికి ఎంత విలాసవంతంగా కనిపిస్తున్నారో లోపల జీవితం కూడా అంతే అనుకుంటారు. ఆర్కిటెక్చర్, పారిశుధ్యం, ఎలివేషన్, కళలు మొదలైన నిర్మాణ రంగాల్లో సైన్స్ సాధిస్తున్న అద్భుతమైన ప్రగతి చనిపోవాలనుకుంటున్న వానికి కూడా విజయగర్వంతో కూడిన ఒక నిర్దిష్ట ఆలోచనలు రేకెత్తిస్తాయి! మంచి బట్టలు, డబ్బు - దర్పం గలవారిని లోకం సుముచితంగా సత్కరిస్తుంది. మా లాంటి పూటకు గతిలేని, చింకి బట్టలవారిని తెలివితేటలున్నప్పటికీ చీదరించుకుంటుంది. కాని పేదవారి మనసుల్లో ఉండే తేజస్సు గొప్పవారికుండదు. అలాంటి పరిస్థితుల్లో వాళ్ళు కొన్నిసార్లు హాస్యపూరితమైన పోలికలు వాళ్ళ కనుకూలంగా చేసుకునే అవకాశాలొస్తాయి.

సాయంత్రమైంది. భోరున, కుండపోతగా కురిసే వర్షం చెత్తనీ, బురదనీ, మురికినంతటినీ శుభ్రపరిచింది. ఉత్తరం వైపునుండి ఉధృతమైన గాలిదుమారం మహోద్రేకంతో చెలరేగింది. ఆ గాలి చేస్తున్న చెవులు చిల్లులు పడే శబ్దాలతో ఖాళీగా ఉన్న చిన్న చిన్న దుకాణాలు, గుడిసెలు దద్దరిల్లి కంపిస్తున్నాయి. నిర్మానుష్యంగా ఉన్న ఓడ్కా షాపుల కిటికీల తలుపులు గడగడా ధన ధనా కొట్టుకుంటున్నాయి.

ప్రచండంగా భీకరంగా వీచే గాలులకు అలలు పెద్ద ఎత్తున వాటి తెల్లని నురగల్ని నింగికి తాకిస్తున్నాయా అన్నట్లు ఎగిరెగిరి పడుతూ తీరాన్ని తాకుతున్నాయి. మళ్ళీ ఉధృతమైన ఆ నదీతరంగాలు ఆత్రంగా ఏదో ముంచుకుపోతున్నట్లు వెనక్కి తిరిగి బయలుదేరిన చోటికి వచ్చి ఒకదానినొకటి ఒరుసుకుంటూ ఆఘమేఘాలమీద దూకిపడుతున్నాయి.

శీతాకాలం అతి సమీపంలో అదేరోజు వచ్చేస్తుందేమోనన డానికి సంకేతంగా భయానకంగా వీచే గాలుల నుండి, మంచు దుప్పటిని తప్పించుకోవడానికా అన్నట్లు సముద్రం విఫలయత్నం చేస్తుంది. ఆకాశం నల్లగా మేఘావృతమైంది. చల్లని తుంపర తగిలిన చోట కోసుకుపోతుందేమోనన్నట్లుగా మొదలైంది. కొంచెం సేపట్లో చినుకులు కనిపించాయి.

అసలే నిరాశా, నిస్పృహలతో నేనుంటే, నాకు చుట్టూ ఉన్న భూభాగం వికారంగా ఉన్నదుంగలతోనూ, విచ్ఛిన్నమై కొట్టుకొచ్చిన చెట్టు మొదళ్ళతోనూ, ఆ చెట్టు వేళ్ళదగ్గర ఆగిపోయి విరిగి పడున్న ఒక పడవతో ఇంకా విషాదంగా కనిపించింది. విరిగి ముక్కలైన పడవ, గడ్డ కట్టే చలికి ఆకులన్నీ రాలిపోయిన రెండు పెద్ద వృక్షాలు కనిపించాయి. వాతావరణం పరమ బీభత్సంగా, నిర్మానుష్యంగా ఉండి ఏదీ పనికిరాకుండా పోయే దిక్కుమాలిన స్థితి దాపురించింది. ఈ విషాదానికి తుది మెరుగులద్దుతున్నట్లు ఆకాశం అంతు లేకుండా రోదిస్తున్నట్లు జోరుగా వర్షిస్తుంది.

నన్నావరించిన ఈ భీతవహ వాతావరణం చూసి ఈ ప్రపంచంలోని ప్రతిదీ సర్వనాశనమైపోయి నేనొక్కణ్ణే జీవంతో మిగులుతానేమోనని పించింది. నా అంతం కూడా ఎంతో దూరం లేదు. మంచుకి గడ్డకట్టిపోయే పరిస్థితి పొంచి ఉందని, నాకు చావు ఖాయంగా అతి దగ్గరలో ఉందనిపించింది.

తేమగా చిత్తడి చిత్తడిగా ఉన్న నేల మీద నడుస్తున్నాను. నా దంతాలు ఆకలి బాధకీ, చలి వణుకుడుకీ ఒకశ్రుతిలో పట పట శబ్దాలు చేస్తుంటే, అవి నా ఆలోచనల కనుగుణంగా వంత పాడుతున్నట్లుంది. అకస్మాత్తుగా ఒక దుకాణం మూలవైపుకి నా చూపులు చురుగ్గా ప్రసరించాయి. ఒక మహిళ దుస్తుల్లో ఉన్న ఒక ఆకారం వంగి ఉండడం గమనించాను. ఆమె బట్టలు పూర్తిగా

తడిసిపోయి ఉన్నాయి. నేనక్కడ ఆగిపోయి ఆమె ఏం చేస్తుందో చూడాలని ప్రయత్నించాను. మార్కెట్ లోని ఒక దుకాణంలో ఆమె తన చేతుల్తో, గోళ్ళతో తడిమట్టిలో గిరుతూ గొయ్యి తవ్వాలని ప్రయత్నిస్తుందని తెలిసింది.

ఆమె పక్కన కూర్చుంటూ "ఎందుకలా చేస్తున్నారు?"అని అడిగాను. మూలుగు లాంటి ఏడుపుతో ఒక్క ఉదుటున లేచింది. ఆమె నా ఎదురుగా నిలబడింది. ఆమె పెద్ద పెద్ద బూడిద రంగు కళ్ళల్లో విపరీతమైన భయం స్పష్టంగా కనిపించింది. బహు సుందరంగా, అందమైన ముఖంతో ఉన్న ఆమె కూడా దాదాపు నావయసుదేనని గమనించాను. కానీ గోళ్ళతో రక్కినట్లున్న మూడు నఖక్షతాలతో వికృతం చేయబడ్డ ముఖాన్ని చూసి నిరాశ, బాధ కలిగాయి. ఈ గాయాలు పచ్చిగా ఆమె అందాన్ని చెడగొడుతూ అడ్డంగా ఉన్నాయి. ఒకగాయమైతే సూటిగా ముక్కు బ్రిడ్జ్ కి పైభాగాన ఉంది. మిగిలిన రెండూ రెండు నల్లటి కళ్ళలాగా ఉన్నాయి. ప్రజల రూపురేఖల్ని మార్చగలిగిన ఒక చిత్రకారుడి చేతినుంచి సృజించబడినట్లు అన్నీ ఒకే సైజు లో ఉన్నాయి. ఆ అమ్మాయి నన్ను అదే పనిగా చూస్తూ నిలబడింది. నెమ్మదిగా కళ్ళలో ఇంతకుముందున్న భయం మాయమైపోయింది. చేతులకున్న ఇసుకను దులిపేసుకుంది. చేతిలోని జేబుగుడ్డను శుభ్రం చేసుకుని చిన్నగా వణుకుతున్న గొంతుతో "వెల్, మీరు కూడా ఆకలిగా ఉండి ఉంటారు. అలాగయితే కొంచెం ఇటొచ్చి కాసేపు ఈ నేలను తవ్వి మట్టిని తియ్యండి. నా చేతులు నొప్పి పుడుతున్నాయి. అటు చూడండి," అంటూ ఆమె సంభాషణని పొడిగిస్తూ తాను తవ్వడానికి ప్రయత్నిస్తున్న దుకాణం వైపుకి తలను తిప్పి చూపిస్తూ, "ఆ దుకాణాన్ని ఇంకా పూర్తిగా మూసివెయ్యలేదు కాబట్టి కొంచెం బ్రెడ్ కొంచెం సాస్ మనకు ఖచ్చితంగా దొరుకుతాయి" అని అంది

నేను తవ్వడం మొదలెట్టాను. కొన్ని నిమిషాలు విశ్రాంతి తీసుకుంటూ నన్ను గమనించింది. తర్వాత నా పక్కనే చతికిలబడి గొంతుక్కూర్చుని తనూ తవ్వడం మొదలుపెట్టింది.

ఈ నిశ్శబ్ద సమయంలో నా మనసులో చెలరేగే ఆలోచనల్ని చెప్పడం చాలా కష్టం. సభ్య సమాజం విధించిన న్యాయ నిబంధనలు, నైతిక సూత్రాలు, ఆస్తి హక్కులు, పౌర హక్కులు మొదలైన తెలివిమంతులు చెప్పే సమస్యాత్మక విషయాలేవీ మా బుర్రల్లో లేవు. కానీ గందరగోళపు ఆలోచనలన్నీ కలవరపెడుతున్నాయి. నిజం చెప్పాలంటే కడుపు దహించుకుపోతున్నప్పుడు ఎప్పుడెప్పుడు నా కష్టానికి, శ్రమకీ ఫలితం దొరుకుతుందా అని ఆకలి మనసంతా ఆక్రమించి అది తీరే మార్గం తప్పించి వేరే ఏ విషయం గురించీ పట్టడం లేదు. త్వరగా సాయంత్రమైంది. చుట్టూ సంజె చీకట్లు, దిగులు, కాలు కదిపితే జారిపోతామేమో ననిపించే బురద, జివ్వుమని వీచే చలిగాలులు, గడ్డ కట్టుకుపోయే చలి -ఇవన్నీ క్షణ క్షణనికీ ఇంకా ఇంకా సాంద్రత పెరిగిపోతూ చిక్కని చీకట్లు ముసురుకున్నాయి. అలల శబ్దం దూరంగా వినబడుతుంది కానీ వర్షం దడ దడా ఫెళ ఫెళా దుకాణాపు అంచుల్ని కంపింపజేస్తుంది. మరీ దూరం నుంచి కాకుండా కొంచెం దగ్గరగా మేము వాచ్ మేన్ విజిల్ విన్నాం.

"దుకాణానికి నేల ఉందా లేదా?" నాతోడుగా ఉన్నమ్మాయి గొంతు తగ్గించి అడిగింది

నాకు సరిగా అర్థం కాక జవాబివ్వలేదు.

"అసలు ఈ దుకాణానికి నేల ఉందా లేదా అని నేను నిన్నడుగుతున్నాను. ఎందుకంటే నేల గనక ఉంటే మనం ఎంత తవ్వినా ఉపయోగముండదు. మనకి బండ బండ దూలాలు గనక అడ్డమొస్తే ఏంచేయగలం? దానికంటే తాళాలు బద్దలు కొట్టడం వల్ల కాస్త ప్రయోజనముంటుంది కదా,"

కాంతివంతమైన ఆలోచనలు ఆడవాళ్ళకు తరచుగా వస్తుంటాయి. కానీ ఇలాంటి "సంతోషకరమైన ఆలోచనలు "వాళ్ళ మనసుల్లోకి చాలా అరుదుగా వస్తుంటాయి. నాకు వాటి పట్ల చాలా గౌరవముంది. ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తుంటాను.

నేను ఆమె చెప్పినట్లే తాళం పగలగొట్టడానికి రెంచ్ తో తాళాన్ని, మిగిలిన భాగాన్ని తోశాను. నా సహపాఠి వెంటనే కిందికి వంగి, పాములాగా మరీ నేలమీదికి జారిపోయి దుకాణం కప్పుని పైకి ఎత్తేసింది. ఆశ్చర్యానందానాలతో చిన్న కేకపెట్టింది.

"వెల్ డన్ మై బ్రేవ్ బాయ్!"

ఒక గొప్ప వాగ్ధాటి గల పురుషుడు కీర్తించడం కన్నా ఒక యువతి చిన్న పదంతో పొగిడినా చాలు కదా. కానీ ఇప్పుడున్నంత హాయిగా సరసంగా నేనప్పుడు లేనందువల్ల పట్టించుకోలేదు. ఆ అమ్మాయి ఆశ్చర్యం గానూ కాస్త అసహనంతోనూ అడిగింది.

"నీకక్కడ ఏం కనిపించింది?"

జవాబు చెప్పడానికి బదులు ఒక యాంత్రికమైన స్వరంతో రకరకాలైన వస్తువులను వివరిస్తూ పోయింది.

"ఒక పెద్ద గంప లో ఖాళీ సీసాలు, ఖాళీ సంచులు, ఒక గొడుగు, ఒక ఇనప కడవ."

ఈ వస్తువులేవీ తినడానికి పనికిరావు. వాళ్ళ ఆశలన్నీ అడుగంటిపోతున్నాయి. సడెన్ గా ఆమె ఆనందంతో పెద్ద కేక వేసింది.

"చివరికి దొరికాయి!"

"ఏం దొరికాయి?" తడితో బూజుతో ఉన్న చిన్న రొట్టె ముక్క. ఇదిగో, పట్టుకో!"

ఆ క్షణం లోనే రెండు రొట్టెలు దొర్లుతూ నా కాళ్ళదగ్గర కొచ్చాయి. వెంటనే ధైర్యశాలి యైన నా చిన్నారి స్నేహితురాలు నా పక్కకొచ్చి నిలబడింది.

ఈ లోపల నేను పెద్ద లావాటి ముక్కను తుంచి గబ గబా ఆశపోతు లాగా నోట్లో కుక్కుకున్నాను.

"వచ్చెయ్యండి, నాక్కూడా చిన్న ముక్క పెట్టండి. మనం ఇక్కణ్ణుంచి తొందరగా బయట పడాలి. తర్వాత ఎక్కడుంటే బాగుంటుంది?" ఆమె చురుకైన చూపులు చిమ్మ చీకటిని చీల్చుకుంటూ నలుదిక్కులా వెదుకుతున్నాయి.

"అక్కడొక పాత పడవ తలక్రిందులుగా పడిఉంది. మనం దానికిందకెళదాం."

"అలాగే వచ్చెయ్యండి."

రొట్టెను తుంచుకుంటూ, ఆ ముక్కల్ని నోట్లో కుక్కుకుంటూ నడిచి పడవ దగ్గరికి చేరుకున్నాం. భారీగా వర్షం పడుతుంది. నది పెద్దగా భీకరంగా గర్జిస్తుంది. దీర్ఘమైన నిస్పృహ కలిగించే అరుపులు

వినిపిస్తున్నాయి. దేనికైనా చివరికి ప్రాణానికి తెగించిన వారికి - ఈ భూమ్మీద ఈ దిక్కుమాలిన శీతాకాలపురాత్రి జరుగుతున్న ఈ దౌర్భాగ్యపు భీభత్సంలో మా ఇద్దర్నీ చూసి, మీరో పెద్ద హీరోలా అని ప్రకృతి ఎగతాళి చేస్తుందా అన్నట్లుంది. కీచు కీచుమని భయానకంగా వినిపించే ప్రతి కూతకూ మా గుండెలు అదిరిపోతున్నాయి. కానీ ఇవేవీ నేను నా రొట్టెను ఆత్రంగా ఆబగా తినడాన్ని ఆపలేకపోయాయి; నా పక్కనున్న అమ్మాయి పరిస్థితి కూడా అదే!

"మీ పేరేమిటి?"నేను అస్పష్టంగా ఆరా తీశాను.

"నటాషా," అని చటుక్కున చెప్పి శబ్దం చేసుకుంటూ రొట్టెముక్కను నములుతుంది.

నేను ఆమె వైపు చూశాను. నా హృదయం బాధతో విలవిలలాడింది. నేను నా చూపుని దట్టంగా అమావాస్య చీకటిలా కనిపిస్తున్న వైపుకి మరల్చాను. సమస్యాత్మకంగా, గతిలేకుండా, దిక్కులేకుండా ఉన్న నా బతుకుని చూసి ఆ చిమ్మచీకటి వెక్కిరింపుగా హేళనగా నవ్వుతుందా అనిపించింది.

తెరిపనేదే లేకుండా, నిరంతరం పడుతున్న వాన చినుకులకి అసలే పాత డొక్కులా ఉన్న పడవ చేస్తున్న చెవులు చిల్లులు పడే ధ్వని తోడైంది. అత్యంత విషాదమైన దుఃఖపు ఆలోచనలు మనసులో ఈగల్లా ముసురుకుంటున్నాయి. ప్రచండంగా ఉధృతంగా వీస్తున్న గాలి పడవ మాను పగుళ్ళలోకి ప్రవేశించి కీకారణ్యంలో కుక్కలూ, నక్కలూ క్రూరంగా అరుస్తున్నట్లు వస్తున్న శబ్దాలకి వాతావరణం భయానకంగా ఉంది. పడవలోని ఒక చెక్కముక్క వదులుగా ఉండి బడబడ మంటూ కంపించిపోతూ చనిపోయినవారికి విచారంతోనూ, విషాదంతోనూ పాడే పాట లా వినిపించి ఒకవిధమైన ఆరాటాన్నీ, ఆత్రుతనీ రేపుతుంది. నదీ తీరాన్ని ఉధృతంగా తాకుతున్న ఆ అలల శబ్దం యాంత్రికంగా చాలా నిరాశాజనకంగా ఉంది. నది కొందర్ని మింగేస్తుందేమో, కొందర్ని, అణచివేతకు గురి చేస్తూ దమన క్రియ జరప బోతుందేమో, మానవ మాత్రులు సహించరాని క్రౌర్యానికి బలి చేస్తుందేమో అని రకరకాల భయాలతో అలసిపోయిన వాళ్ళకు ఈ భారాన్నంతా పంచుకోవడానికి మనసులో మాట చెప్పుకోవడానికీ ఎవరో ఒకరు తోడుండాలి.

జోరుగా కురిసే వర్షపు శబ్దం-నురగలు కక్కుకుంటూ ఎగిసిపడే అలల శబ్దం రెండూ కలగలిసిపోయి సుదీర్ఘంగా ఎడతెగకుండా, గంభీరంగా భీతి గొల్పే విధంగా గాలిలో శబ్దాలు వినబడుతున్నాయి. భయంకరమైన వేడితో కాల్చేసే వేసవి కాలాలతోనూ ఆ తర్వాత శీతాకాలం తెచ్చే చిత్తడి నేల, వణికించే చలితో నిర్మానుష్యం గావించే మార్పు లేని ఈ వాతావరణంతో అలసి, డస్సిపోయిన భూమి నిట్టూరుస్తుందా అన్నట్లుంది. నిర్జనంగా ఉన్న ఆ తీరంలో దిక్కులు పిక్కటిల్లేలా అరుస్తూ గాలి ఊళ అక్కడున్న చెత్త చెదారం మొత్తాన్నీ ఊడ్చి వేయసాగింది. నురగలు కక్కే నది ఎప్పటిలాగే ఏ మార్పూ లేకుండా అశుభ శకునాన్ని సూచిస్తూ మొత్తుకుంటుంది. పడవలో మేం తల దాచుకున్న స్థలం ఏ రకమైన ఆధారం లేకుండా ఉంది. గతిలేక పడుండటమే గాని ఏ మాత్రం సౌకర్యంగా లేదు. అది సన్నగా ఉండి పూర్తి బురదతో ఉంది. మంచులా చల్లగా పడే వర్షపు చినుకులు, ఉండుండి కెరటాలు కెరటాలుగా వీచే ఈదురుగాలులు-ఇవన్నీ మేమున్న కొయ్య చెక్కలలోంచి చీల్చుకుని వస్తున్నాయి. మేమిద్దరం చలికి వణికిపోతూ నిశ్శబ్దంగా కూర్చున్నాం. నాకు నిద్ర వస్తున్నట్లుంది. నటాషా ఒక బాల్ లాగా ముడుచుకుపోయి వీపుని పడవకానించి, చేతుల్ని మోకాళ్ళమీద ఆనించి వాటిమీద తల పెట్టుకుంది. . స్థిరంగా ఆమె నది వైపు తన చూపులు నిలిపింది. విశాలంగా విచ్చుకున్న ఆమె కళ్ళు ఒక తేజస్సుతో వెలిగిపోతున్నాయి. కళ్ళకింద ఉన్న చారలు కూడా కనబడకుండా పత్తికాయల్లా విచ్చుకుంటున్నాయి. ఆమె నోరిప్పలేదు. కదలలేదు. నిశ్శబ్దంగా నిశ్చలంగా చిత్తరువులా ఉన్న ఆమె పట్ల నాకు గౌరవప్రదమైన స్ఫూర్తి, విస్మయం కలిగాయి. ఏదైనా మాట్లాడాలనిపించింది కానీ ఎలా మొదలుపెట్టాలో తెలియలేదు. చివరికామే నిశ్శబ్దాన్ని ఛేదించింది.

"మన జీవితాలెంత దౌర్భాగ్యంగా , అధమంగా ఉన్నాయి!" తన ప్రతి మాటనూ స్పష్టంగా స్థిరంగా గొప్ప నమ్మకంతో వత్తి పలికింది. అదొక ఫిర్యాదులా కాకుండా ఆమె గొంతులో సంయమనం ధ్వనించింది. నాకు చూస్తున్నప్పుడు తన గత జీవితాన్ని తనే ఒకసారి నెమరు వేసుకుంటున్నట్లు బయటికి అనిపించింది. చాతనయినంతవరకూ మాటల్లో పెట్టడానికి ప్రయత్నిస్తూ చివరికి ఒక నిశ్చయానికొచ్చినట్లు ఎంత దిక్కుమాలిన స్థితిలో ఉన్నాం అని అన్నది. నా మనస్సాక్షిగా ఆలోచిస్తే నా బతుక్కూడా అలాగే పరమ నీచంగా ఉన్నందున నేను ఆమెతో తర్కించదలచుకోలేదు. అంగీకారపూర్వకంగా మౌనంగా ఉండ దలచుకున్నాను. నా స్పందన ని గమనించకుండానే ఆమె మళ్ళీ కదలకుండా నిశ్శబ్దంగా ఉండిపోయింది.

"ఎంత పిచ్చిగా కప్ప కూత ల్లాగా మూల్గినప్పటికీ ప్రయోజనమేమిటి," అని బాధధ్వనించే గొంతుతో గొణుక్కుంటుంది. అయినా ఆ స్వరంలో ఏ రకమైన కంప్లైంట్ లేదు. మళ్ళీ ఒకసారి గతాన్ని గుర్తు చేసుకుంటూ ఈ బతుకునిలాగే కొనసాగించడం వల్ల ఏ రకమైన ఉపయోగం లేదు, వంచన, మోసం, హాస్యాస్పదంగా ఉన్న జీవితానికి "చావు" తప్ప వేరే శరణ్యం లేదు అనే దృఢ నిశ్చయానికొచ్చినట్లు చెప్పింది .

ఆమె స్థిర సంకల్పం నన్ను మరీ కదిలించి హృదయాన్ని మెలి తిప్పింది. ఏదో ఒకటి మాట్లాడాలి. లేకపోతే కడుపుతీరా ఏడ్చేసెయ్యాలి. ఒక అమ్మాయి ముందు అందులోనూ ఎంతటి క్లిష్టపరిస్థితుల్లోనూ ఒక్క కన్నీటి బొట్టు కూడా రాల్చని ఆ అమ్మాయి ముందు ఏడవడం అవమానమనిపించింది.

చివరికి ఎలాగోలా గొంతు పెగుల్చుకున్నాను.

"ఇప్పుడు నిన్ను ఎవరు చనిపోమంటున్నారు?" అని అడిగాను. ఆమె సూచించిన పరిష్కారానికి ఏ విధంగా అనునయించి చెప్పాలో తెలియలేదు నాకు.

"ఎందుకు లేరు? అఫ్ కోర్స్ పాష్కా"

"అతనెవరు?"

"నా ప్రియుడు. ఒక బేకర్."

"అతను తరచుగా అలా ప్రవర్తిస్తాడా?"

"అవును, చాలా తరచుగా. దాదాపు ప్రతిరోజూ తాగి దురుసుగా ప్రవర్తిస్తాడు."

నటాషా నా వైపుకి తిరిగి తనకు పాష్కా తో ఉన్న సంబంధం గురించి చెప్పటం మొదలెట్టింది. ఆమె "పట్టణంలో ఉండే ఒక అమ్మాయి"అతను, గోధుమ రంగులో మెరిసే మీసాలతో రొట్టెలు కాలుస్తూ జీవించేవాడు. హార్మోనీ ని పోలిన ఒక సంగీత వాద్యాన్ని అమోఘంగా వాయించేవాడు. అతడు ఆమెను "ఎస్టాబ్లిష్ మెంట్" అనే ఒక ఏర్పాటు మందిరంలో కలిశాడు. అతని చురుకైన, మర్యాదపూర్వకమైన ప్రవర్తన, స్వలింగ సంపర్కుల అలవాట్లు , ఉన్నత తరగతికి చెందిన ధనికులు వేసుకునే పాలిష్ తో మెరిసే బూట్లు, అద్భుతంగా , అందంగా ఉన్న బట్టలు ఆమె నాకర్షించాయి. 15 రూబుళ్ళ ఖరీదైన కోట్ ధరించాడు!-ఈ గుణ గణాలన్నీ చూసి ఆమె అతని ప్రేమలో పడి తనకు తానుగా అతని "అధీనం"లోకి వెళ్ళింది. తన దగ్గర రూబుళ్ళు అయిపోవడంతో ఆమె ఇతర "సందర్శకుల" నుండి సంపాదించిన రూబుళ్ళను లాక్కునేవాడు. తప్పతాగేవాడు. అలా తాగినప్పుడు ఎలాంటి కరుణా, దయా లేకుండా విపరీతంగా చావబాదేవాడు. ఇదంతా చెప్పింది కానీ ఇతర అమ్మాయిల ముందు సిగ్గులేకుండా అవమానించడం గురించి చాలా బాధ పడింది.

"ఈ విషయం నన్ను ఎక్కువగా గాయపరిచింది! ఆ రాస్కెల్ నాతో ఆటాడుకుంటున్నాడని పించింది. ఆ అమ్మాయిల ముందు నా పరిస్థితి దారుణంగా ఉంది! నిన్న గాక మొన్న నా యజమానురాలి'' దగ్గర బయటికి వెళ్ళడానికి అనుమతి తీసుకున్నాను. నేరుగా పాష్కా ఉండే చోటుకి వెళ్ళి చూస్తే అక్కడ 'డొనజా'తో ఉన్నాడు; ఆమె ఫూటు గా తాగి ఉంది. అతనూ ఆమె కంటే ఎక్కువ మోతాదులో తాగున్నాడు. నేనతనికోసం వెళ్ళాను. కాబట్టి కోపంగా "యూ రాస్కెల్, యూ డాగ్!" అని పెద్దగా అరిచాను. ఇక మొదలైంది రభస. నన్ను పడగొట్టాడు. జుట్టు పట్టుకుని బయటికి ఈడ్చు కొచ్చాడు, చెప్పలేని బూతులు నోటికొచ్చినట్లు వాగాడు. ఇంతవరకైతే ఫరవాలేదు. కానీ ఇంకా ఘోరమైన సంగతేంటంటే నా డ్రెస్ మొత్తాన్నీ చింపేసి పైన వేసుకునే జాకెట్ ని ముక్కలు ముక్కలుగా చింపి పోగులు పెట్టాడు. ఇప్పుడు నాకేంచెయ్యాలో దిక్కు తోచడం లేదు!-ఈ చింపిరి గుడ్డలతో మా యజమానురాలి దగ్గరకెళ్ళే ధైర్యం లేదు. నేను నా జాకెట్ 5 రూబుళ్ళతో కొనుక్కున్నాను. ఓ ! గాడ్ ! నేనిప్పుడేం చెయ్యాలి?

చివరి రెండు మాటలు దుఃఖంతో మొరబెట్టు కుంటున్నట్లు వణుకుతున్నగా మాట్లాడింది. గాలి అరుపులు-చలి అంతకంతకూ ఎక్కువవుతున్నాయి. నా పళ్ళు చలికి గజ గజ వణుకుతున్నాయి. ఆ అమ్మాయి వణుకుతూ నన్నల్లుకుపోసాగింది. ఎంత దగ్గరగా వచ్చేసిందంటే ఆమె మెరుస్తున్న కళ్ళను అంత దట్టమైన చీకటిలోకూడా నేను చూడగలుగుతున్నాను. "మీ పురుషులెంత మృగాలు! అందర్నీ నా కాళ్ళకిందేసి తొక్కాలనుంది! నాకే గనక శక్తుంటే అందర్నీ వికృతంగా కురూపుల్ని చేసి పారేస్తాను. మురికి కూపంలో మోరీల్లో పడి ఎవడైనా చస్తుంటే రవ్వంత కూడా జాలి లేకుండా ముఖం మీద ఉమ్మి అక్కడే వదిలేస్తాను. మీరంతా అతి నికృష్టమైన దుష్టులు, దుర్మార్గులు! మీరు మా దగ్గర కొచ్చేటప్పుడు నక్కవినయాలు పోతూ నీచమైన కుక్కల్లాగా చేరతారు. తర్వాత వెర్రి మూర్ఖపు పిల్ల ఎవత్తైనా దొరికితే , ఇక అంతే అంతా ఐపోతుంది. డర్టీ రాస్కెల్స్! వెక్కిరిస్తూ కాలితో తన్ని తిరస్కరిస్తారు!"

ఆమె తిట్ల పురాణం అంతూపొంతూ లేకుండా అదే ఆమెకున్న మూలధనంలా నటాషా అంటే తిట్టడమే ఆమె సార్థక నామంలా అనిపించింది. కానీ ఒక్క తిట్టు కూడా ఆవేశంగా లేదు. ఆ తిట్లలో "డర్టీ రాస్కెల్స్"పట్ల కోపం గానీ ద్వేషం గానీ వినిపించలేదు.

ఆమె స్వరానికీ-మాట్లాడే మాటలకూ ఏమాత్రం పొందిక లేదు. అంతకు ముందు వరకూ నేను విన్న గొప్ప మాటల్లోని వాక్చాతుర్యం, మంచి సామర్థ్యంతో కూడిన శక్తివంతమైన ఉపన్యాసాలు, గొప్ప ఆశలు, నిరాశా నిస్పృహలు కలిగించిన పుస్తకాల్లోని వాదోప వాదాలు మొదలైనవన్నీ ఆ రాత్రితో కొట్టుకు పోయాయి. ఆమె చెప్పిన విషయాలు నాలో చాలా గాఢమైన ముద్ర వేశాయి. ఏ పుస్తకమూ, ఏ ఉపన్యాసమూ ఎంత నిష్ణాతులైనా వర్ణించలేని చావు వేదన కలిగించే దుఃఖం ఎంత తీక్షణంగా ఉంటుందో, ఎంత ప్రకృతి సహజమైందో తెలిసిందని మాత్రం చెప్పగలను.

చాలా హింసగా వళ్ళంతా పోట్లు, నొప్పులుగా ఉంది. నేను పడుతున్న నరకయాతనకు కారణం గడ్డ కట్టే చలి వల్లో లేక నా తోడున్న అమ్మాయి మాటలవల్లో నాకు తెలియలేదు. ఖచ్చితంగా చెప్పలేకపోతున్నాను. సన్నని మూలుగుతో నా పళ్ళు పట పట లాడాయి. అదే క్షణంలో గజ గజ వణికే -రెండు చిన్నారి చేతులు నాకు దగ్గరగా వచ్చాయి. -ఒకచేతిని నా మెడ మీదా, ఇంకో చేతిని బుగ్గమీదా వేసి మృదువుగా లాలిస్తున్నట్లుగా ఆప్యాయంగా నిమురుతూ సానుభూతి ధ్వనించే కంఠంతో అడిగింది

"నువ్వెవరో నాకు చెప్పవా?"

నాకొక్క క్షణం అక్కడ నాతో పాటు ఇంకెవరో ఉన్నట్లని పించింది. చెప్పాలంటే కొన్ని నిమిషాలకు ముందే నటాషా మగ లోకాన్ని తన దూషణ తిరస్కారాలతో దుమ్మెత్తిపోసింది. ఈ అమ్మాయి ఆమేనా అని నాలో నేనే తెగ ఆశ్చర్యపోయాను. మళ్ళీ వెంటనే మారిపోయి, నేనూ మగవాణ్ణనే విషయం మర్చిపోయి ఆత్రంగా, ఆర్ద్రంగా తోటి మనిషి పట్ల ప్రేమ కురిపిస్తుంది.

"ఏమైంది నీకు? చలిగా ఉందా? గడ్డ కట్టుకు పోతున్నావా? అయ్యో! పూర్ ఫెలో!నాకెందుకు చెప్పలేదు?ఇంత చలితో బాధ పడుతున్నట్లు నాకు ముందే ఎందుకు చెప్పలేదు? ఇటొచ్చి పడుకో. నా దగ్గరకొచ్చి కాళ్ళు చాచి పడుకుంటే నేను కూడా పడుకుంటాను. నీ చేతులు నా చుట్టూ వేసి, ఇంకా దగ్గరకు రా. అప్పుడు నీకు కొంచెం వెచ్చగా హాయిగా ఉంటుంది. తర్వాత వీపులు ఆనించుకుని పడుకుంటే మన వీపులు కూడా వెచ్చబడతాయి. ఎలాగోలా ఈ రాత్రి నిభాయించుకుని గడిపేద్దాం. ఎందుకింత వేదన పడుతూ, అనాథ లాగా ఉన్నావ్? తాగుతున్నావా? లేకపోతే చేస్తున్న పని లోంచి తీసేశారా? పోనీలే, ఏదైతే అదవుతుంది! అదే తల్చుకుంటూ కుమిలిపోకు."

ఈ అమ్మాయి నన్ను కాస్త సౌకర్యంగా ఉంచడానికి

ప్రయత్నిస్తుంది. నిజం చెప్పాలంటే నా నిస్త్రాణ స్థితి నుంచి బయట పడేయడానికి ఎన్నో రకాలుగా ధైర్యం చెప్పి ఉత్తేజపరచడానికి పూనుకుంది.

ఏమిటిదంతా! జీవితంలో ఎంత భయంకరమైన పరిహాసం దాగుంది, ఊపిరి సలపని పనుల్లో నిరంతరం నన్ను నేను బిజీగా ఉంచుకుంటూ న్యాయంగా, మనస్ఫూర్తిగా పూట గడవని మానవజాతి విధిని మార్చడానికి కొన్ని పనుల్ని చెయ్యాలనుకున్నాను. సామాజిక క్రమాన్ని సంఘ సంస్కరణల ద్వారా సరిదిద్దాలని కలలుకన్నాను. రాజకీయ విప్లవాల గురించి దీర్ఘాలోచనలు చేశాను. వివేకాన్నీ విజ్ఞానాన్నీ ఇస్తాయనుకున్న గొప్ప పుస్తకాలు -వాటి అర్థాలు గాని, అవి అక్కరకు వస్తాయో రావో, ఆ రాసిన విషయాలు సంభవిస్తాయో లేదోనని స్పష్టంగా అవి రాసిన రచయితలకు కూడా తెలియని పరిస్థితుల్లో ఎదైనా మేలు జరుగుతుందేమోనని చదవాలనుకున్నాను. ఒక్క మాటలో చెప్పాలంటే ఒక ప్రముఖ సామాజిక, క్రియాశీల శక్తిగా, నన్ను నేను అన్ని విధాలుగా విశిష్టమైన, చురుకైన, సత్తాకలిగిన వ్యక్తిగా మలచుకుని నా పనుల్లో అధిక భాగం నెరవేర్చినప్పుడు నాకు అనివార్యంగా జీవించే హక్కు ఉంటుందని భావించాను. నేననుకున్న వాటిలో కనీసం కొన్నైనా పూర్తి చేసి చనిపోతే చరిత్ర పేదల బాగు కోసం కృషి చేసిన ఒక ప్రముఖ వ్యక్తి విజయం సాధించి చనిపోయాడని గుర్తిస్తుందని ఆశ పడ్డాను - అలాంటి గొప్ప ఆలోచనలు చేసే నేను, ఒక శీతాకాలపు రాత్రి శరీరానికి కావలసిన వెచ్చదనం కోసం ఒక పతితురాలైన, దౌర్భాగ్యమైన, శిధిలమైన, పురుష లోకపు వేధింపులు ఎదుర్కొన్న ఒక జీవి- ఈలోకంలో ఏ రకమైన దిక్కూ లేకుండా అన్ని విధాలుగా వెలివేయబడిన ఒక మానవ ప్రాణి శరీరాన్ని అవసరానికి ఉపయోగించుకుంటున్నాను. ఇలాంటి వారికోసం ఈ విశాల ప్రపంచంలో రవ్వంత జాగా లేదు! ఒక మహిళ పట్ల నేనే బాధ్యతతో రక్షించి పట్టించుకునేది పోయి ఆమే నన్ను ఓదారుస్తూ, ధైర్యం చెప్తూ, సౌకర్యంగా ఉంచడానికి తాపత్రయపడుతూ సేవలు చేస్తుంటే చక్కగా చేయించుకున్నాను. ఆమె పట్ల నాక్కూడా కొంత బాధ్యత, జాగ్రత్త తీసుకోవడం లాంటివి ఉంటాయి-ఉండాలనేదే నా బుర్రకెక్కలేదు. నాలో పశ్చాత్తాపం మొదలై, నా నేరాంగీకారాన్ని ఎలా తెలియజెయ్యాలో తోచలేదు. ఇదంతా ఒక కలగా , నిశి రాత్రి గాఢ నిద్రలో ఉన్నప్పుడు భయంతో వచ్చే ఒక అర్థం లేని అసంబద్ధమైన పీడకలగా నన్ను నేను నమ్మించుకోవాలని విఫలయత్నం చేశాను.

కానీ, అయ్యో! మంచులాంటి అతి శీతలంగా ఉన్న వర్షపు చినుకులు నా మీద పడుతున్నాయి. వెచ్చని ఊపిరులూదే ఆమె రొమ్ములు నన్ను గట్టిగా వత్తుకుంటున్నాయి. ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలనుంచి నీరసంగా ఉన్న నాకు వోడ్కా సుగంధ పరిమళం గుబాళించి, మహాద్భుతంగా స్వస్థత పరుస్తూ నన్ను ఈ లోకంలో పడేసింది. నా ఇష్టానికి వ్యతిరేకంగా నేను కల గనడం లేదనీ అది పరమ సత్యమనీ రుజువైపోయింది. గాలి ఉధృతంగా వీస్తూ భీకరమైన శబ్దాలు చేస్తుంది. వాన జోరు అంతకంతకూ పెరుగుతుండడంతో పడవ ఊగిసలాడుతుంది. కెరటాలు పగ బట్టినట్లు బుస కొడుతున్నాయి. ఇక మేము మా బిగి కౌగిలిలో చలికి వణికి పోతున్నాం. ఇది నవ్వాలో ఏడవాలో తెలియని ఒక కఠోరమైన వాస్తవం. ఎంత పాపిష్టి దైనా, ఎంత భరింప శక్యం గాని వికృతమైనదైనా, జీవించేవారెవారికీ రాకూడని మనుషుల్ని పీల్చి పిప్పిచేసే ఉపద్రవమైనప్పటికీ ఇది కల కాదు యదార్థం అనే దృఢ నిశ్చయానికొచ్చాను. నటాషా మాత్రం మృదువుగా, దయగా, ప్రేమగా, ఓదార్పుగా మాట్లాడుతూనే ఉంది, ఈ ప్రపంచంలో ఒక్క స్త్రీ తప్ప అలాంటి సమయంలో అంతటి ఉపశమనాన్ని ఏ నర మానవుడూ కలిగించలేడు.

ఆమె నిష్కల్మషమైన, శాంతినిచ్చే ఓదార్పు మాటలు నా హృదయాన్ని ఉత్తేజ పరుస్తున్నాయి. మనసు ఆర్ద్రతతో ద్రవీభూతమవుతుంది.

ఈ భయంకరమైన కాళ రాత్రి సమయంలో నాలో పేరుకుపోయిన నా కోపం, నా దుఃఖం, నా గర్వం, నా స్వీయ దర్పం, నా దుష్ట బుద్ధి- ఇవన్నీ నా బుగ్గల మీద నుంచి వరదలా కారుతున్న కన్నీటి ప్రవాహంలో పడి కొట్టుకుపోయాయి. మళ్ళీ నటాషా నన్ను శాంతింపజేయడానికి కృషి చేసింది.

"అలా ఏడవ కూడదు డియర్. ముందు నీ దుఃఖాన్నించి బయటపడి ప్రశాంతంగా ఉండు. దేవుని దయవల్ల ఏదో ఒక అద్భుతం జరుగుతుంది. నీకొక మంచి స్థావరం దొరుకుతుంది. త్వరలోనే నీకంతా శుభం కలుగుతుంది'' అంటూ లాలనగా, ఓదార్పుగా మాట్లాడుతూ ఆ మాటలతో పాటు తన సరసాన్ని జోడిస్తూ కమ్మగా వెచ్చదనాన్ని కలిగిస్తూ ముద్దులతో ముంచెత్తింది.

ఒక స్త్రీ నుంచి ముద్దుల రుచి అనేది నాకదే మొట్టమొదలు. అద్భుతం. ఆ అమోఘమైన మొదటి ముద్దు వెల కట్టలేనిది.

"రా, ఇంకా దగ్గరకు రా! విషాదమైన నిట్టూర్పులు ఆపు; పరాయి చోటు నుంచి వచ్చినప్పటికీ నీకేం భయం లేదు. రేపే నేను నీకు వేరే ఏదైనా పని చూసి పెడతాను.''

లలిత లలితంగా, మృదువుగా, అనునయంగా మనసు ద్రవించేలా చెవిలో చెప్పే గుస గుసలు కలలో వినిపించి మేఘాల్లో తేలిపోతున్నట్లనిపించింది. అలా మేమిద్దరం సూర్యోదయం వరకూ ఒకరిచేతుల్లో ఇంకొకరం ఇమిడిపోయి ఉన్నాం. తెల్లవారగానే పడవ అడుగు భాగం నుంచి పాక్కుంటూ పైకొచ్చి పట్టణం వైపుకి నడకసాగించాం.

ఒకచోట ఇద్దరం ఒకరికొకరం హృదయపూర్వకమైన వీడ్కోలు చెప్పుకుని మళ్ళీ ఎప్పటికీ కలుసుకోకూడదనుకుంటూ విడిపోయాం. అయినప్పటికీ ఆరునెలలకి పైగా ఆ పట్టణంలోని మురికివాడలన్నీ - ఒక శరదృతువు రాత్రి నాతోగడిపిన ఆ మనోహరమైన అమ్మాయి కోసం వళ్ళంతా కళ్ళు చేసుకుని గాలించాను.

ఒకవేళ ఆ అమ్మాయి ఇప్పటికే చనిపోయి ఉంటే ఆమె ఆత్మకు శాంతి కలగాలి! బతికే ఉంటే ఆమె తాను పతితననీ, భ్రష్టురాలిననీ ఎప్పటికీ గుర్తించకుండా దేవుడు ఆమెను అనుగ్రహించాలి. ఎందుకంటే అలాంటి అవమానకరమైన, నిరర్థకమైన వేదన, నరక యాతన ఈ భూ ప్రపంచాని కేమీ మేలు చెయ్యదు.

గోర్కీ: యాన్ ఆటమ్న్ నైట్ (ఏప్రిల్ 1902)

ఇంగ్లిష్ అనువాదం- ఎమిలీ జాకేలెఫ్, డొరా బి. మాంటెఫియోరే

# సహచరులు

తాయమ్మ కరుణ

"ఇన్నేండ్లయింది అడవికి వచ్చి. ఇప్పటికీ టెంటు కట్టడం రాదు." అసహనంతో గొణిగింది దీప.

దీప మీద చేయివేసిన వాడల్లా పక్కకు తిరిగి పడుకున్నాడు అనిల్.

బయట కుండపోతగా వాన. తడవకుండా ఎంత ప్రయత్నం చేసినా అక్కడికీ కొంత తడవనే తడిశారు. గబగబా టెంటు కడదామని దీప ఎంత ఆరాటపడినా అనిల్‌కు కట్టడమే రాలేదు. అందుకే వర్షం వచ్చినప్పుడు 'సైడ్'కు రావాలంటే అనిల్‌కు భయం. ఓపికగా ఉండీఉండి దీప ఏదో ఒక మాట అంటుంది. అనిల్ మనసంతా చిన్నబుచ్చుకుంటాడు. అనిల్ అట్లా అయిపోతాడని తెలిసి కూడా దీప పుసుక్కున మాట జారనే జారుతుంది.

దీప, అనిల్ ఉద్యమంలోకి పూర్తి కాలం కార్యకర్తలుగా వచ్చాకనే సహచరులయ్యారు. దీప గ్రాడ్యుయేట్, అనిల్ పోస్టు గ్రాడ్యుయేట్. పార్టీలోకి దీప కన్నా ఎనిమిదేండ్లు ముందు అనిల్ వచ్చాడు. ప్రస్తుతం సెక్రటేరియట్ మెంబర్, దీప జిల్లా కమిటీ సభ్యురాలిగా ఎవరి ఏరియాల్లో వాళ్లు పని చేస్తున్నారు. ఏ ఆర్నెల్లకో ఎనిమిది నెల్లకో ఓసారి కలుస్తారు. దీప పని చేసే ప్రాంతంలో జరిగే జిల్లా కమిటీ మీటింగులకు అనిల్ వచ్చినప్పుడో లేదంటే, లేదా వాళ్లిద్దరూ చాలా నెలలుగా కలవలేదని రాష్ట్రకమిటీ ప్లాన్ చేసి పిలిపించినప్పుడో కలుస్తారు. అదీ కూడా నెల లేదా నెలన్నర రోజులే. ఏదైనా ఫైరింగ్ జరిగిందా విడిపోక తప్పదు.

ఇద్దరికీ ఒకరంటే ఒకరికి విపరీతమైన అభిమానం, ప్రేమ. ముఖ్యంగా దీపకు అనిల్ మీద గౌరవం. దీప మీద ఎంత ప్రేమ ఉన్నా అనిల్ గుంభనంగా ఉంటాడు. అనిల్ చూడటానికి సున్నితంగా కనిపిస్తాడు. పనిలోకి దిగితే ఎటువంటి ఊగిసలాటా ఉండదు. ఏ పనినైనా కూల్‌గా హడావుడి లేకుండా చేసుకుపోతాడు. ఏదైనా ప్లాన్ చేశాడంటే సక్సెస్ అయ్యితీరుతుంది. ప్రతి ఒక్కరికీ వాళ్ల బాధ్యతలను అప్పగిస్తాడు. తమ వల్ల కాదేమో అని ఎవరైనా అంటే, "ఫర్వాలేదు మీరు చేయగలరు." అని నింపాదిగా ఆ పనిని ఎలా చేయాలో వివరిస్తాడు. అంతకుముందు చేయలేమని అన్నవాళ్లే రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగేవాళ్లు. అవసరమైతే తప్ప మాట్లాడని అనిల్.. క్యాడర్ దగ్గర మాత్రం విపరీతమైన జోక్స్ వేస్తాడు. క్యాడర్‌కు అతనంటే ప్రాణం. ఏమీ చూడనట్టే ఉన్నా క్యాడర్ గురించి ప్రతీది పట్టించుకుని అక్కడి బాధ్యులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తుంటాడు. తను కూచున్న మీటింగుల్లో విమర్శ పెట్టినవాళ్లు, విమర్శకు గురయిన వాళ్లు... ఇద్దరూ సంతృప్తి చెందుతారు. అదే అనిల్ గొప్పదనం.

దీపది బడబడా మాట్లాడే మనస్తత్వం. మనసులో ఏదీ దాచుకోదు. ఉద్యమంలో అయినా, ఎక్కడైనా సరే 'లౌక్యం' తెలిస్తే కండ్లు మూసుకుని బతికేయొచ్చు. అనిల్‌కు అదే బాధ. "అసలు నీకు ఇంత కూడా లౌక్యం లేదు. ఎట్లా బతుకుతావు దీపా!" అనేవాడు ఒకోసారి.

అట్లని దీపను వెనకేసుకొచ్చిందీ లేదు. దీప వైపు నుంచి ఏదైనా తప్పు జరిగితే మొదట విమర్శించేది అనిలే. "నా మీద రాయి వేయాల్సి వస్తే మొదట నువ్వే ఏస్తావులే" అంటుంది దీప.

పెళ్లయిన కొత్తలో కొంత కాలం 'డెన్'లో ఉన్నారు. అంటే మామూలు మనుషుల్లాగే ఏదో ఉద్యోగం చేస్తున్నామని చెప్పి ఇల్లు కిరాయి తీసుకుని ఉన్నారు. బయటి సమాజంలో దేవుడి మీద నమ్మకం లేని వాళ్లు పూజలు చేయరు. కానీ విప్లవకారులు అయిన వీళ్లు మాత్రం పూజలు, పునస్కారాలతో సహా పండుగలు, పబ్బాలు అన్నీ పద్ధతిగా చేసేవాళ్లు. అసలు ఎవ్వరికీ వీళ్లు పూర్తికాలం విప్లవ కార్యకర్తలు అనే అనుమానమే వచ్చేది కాదు. ఏదో ఒక పార్ట్ టైమ్ ఉద్యోగంతోపాటు పార్టీ పనినీ చేస్తారు. పార్టీ పత్రిక పని చేసేవాళ్లు, కొరియర్లు, ఆయుధాల చేరవేతకు సంబంధించిన వాళ్లు... రకరకాల పనుల మీద బయట 'డెన్'లలో ఉంటారు. దీప, అనిల్‌ల జంట మాత్రం కొంతకాలం పార్టీ పత్రిక పనిలో ఉన్నారు. పత్రిక పనికే (డెన్‌కే) అంకితమైతే ఎదుగుదల ఉండదని, ఇద్దరూ పట్టుపట్టి దళంలోకి వచ్చారు. దీపను ఎస్ఏసీ (స్క్వాడ్ ఏరియా కమిటీ)లోకి తీసుకున్నారు. అనిల్ అప్పటికే రాష్ట్రకమిటీ సభ్యుడు.

బస్తర్ ప్రాంతంలో విపరీతమైన చలి ఉంటుంది. రాత్రిళ్లు మంచు వర్షం లాగే కురుస్తది. ఇద్దరిద్దరు కలిసి రెండ్రెండు రగ్గులు కలుపుకుని కప్పుకున్నా చలి ఆగదు. ఆ పైన పాలిథిన్ కవర్ కప్పుకుంటారు. కొన్ని గంటలు నిద్రపట్టినా, అది కూడా లోపలంతా చెమ్మ వచ్చి చల్లగా అయిపోతుంది. ఆ చెమ్మ అంతా ఊపిరి నుంచి వచ్చేదే. శ్వాస నుంచి ఇంత తేమ బయటికి వస్తదా? అని దీప మొదట తెగ ఆశ్చర్యపోయేది. సెంట్రీకి లేస్తే మళ్లీ నిద్రపట్టడం అంత సులువు కాదు. అక్కడే పుట్టి పెరిగిన ఆదివాసీలకు కొంత అలవాటే. దీపకు మొదట్లో రాత్రిపూట నిద్రపట్టేది కాదు. అందుకని పగలు నిద్రపోయేది. బాధ్యతలు పెరుగుతున్నా కొద్దీ పగలు నిద్రపోవడం కుదిరేది కాదు. ఇక అంత చలిలోనూ కునుకు తీయడం అలవాటైంది. అనిల్ చలికి తట్టుకోలేడు. చలికాలం స్నానం చేయాలంటే చచ్చి ఊరుకునేవాడు. సాయంత్రమైతే మంటలు వేసుకుని కూర్చుంటారు.

అడవిలోకి వచ్చిన కొత్తలో రెండు నెలలు ఇద్దరూ ఒకే దళంలో ఉన్నారు. ఆ రెండు నెలల్లో పెద్ద పెద్ద మొద్దులను ఎట్లా లేపాలో దీపకు టెక్నిక్ తెలిసింది. మొద్దులను తెచ్చుకుని మంట వేసుకునేది.

పాపం, అనిల్‌కు చేతనయ్యేది కాదు. 'నా నిప్పు దగ్గర వచ్చి కూచోమ'ని దీప పిలిస్తే వచ్చేవాడు కాదు. పోనీ, నీ దగ్గర మంట వేయనా అంటే, అట్లా వద్దనేవాడు. మంట వేయమని ఏ కామ్రేడ్‌కైనా చెప్పు అంటే, క్యాడర్‌తో పనులు చేయించుకోవద్దని, అట్లా చెప్పేవాడు కాదు. 'మొండిమొగుడు' పైకే అనుకుంటూ వెళ్లిపోయేది దీప. నవ్వి ఊరుకునేవాడు అనిల్. నిజానికి రాష్ట్రకమిటీ సభ్యుడికి ఒక గార్డు ఉంటాడు. గార్డుకు చెప్పొచ్చు. కానీ అనిల్ చెప్పడు. చలికి ఇబ్బంది పడుతున్నాడని గార్డు గుర్తుపట్టి మంట వేస్తే వేసినట్టు, లేదంటే లేదు. పుస్తకాలను కూడా గార్డు కిట్టులో పెట్టకుండా ఇబ్బంది పడుతూ తనే మోసుకునేవాడు. మిగతా వాళ్ల గార్డుకు ఇస్తారు కదా అంటే, 'గార్డు డ్యూటీ... రక్షణే తప్ప, సేవలు చేయడం కాదు' అనేవాడు.

అడవిలోకి వచ్చాక దీపతో పగలు అస్సలు మాట్లాడేవాడుకాదు. అంతెందుకు పెళ్లయిన కొత్తలో ఇంట్లో ఇద్దరే ఉన్నా, ఎక్కువ మాట్లాడేవాడు కాడు. మాట్లాడేవాళ్లు ఇంకెవరూ లేరు కాబట్టి అనిల్‌తో ముచ్చట్లు చెప్తూ పోయేది దీప. తన మానాన తను పుస్తకం తెరిచి చదువుకునేవాడు. అసలు వింటున్నాడా లేదా అని దీపకు అనుమానం వచ్చేది. వెంటనే 'ఇప్పుడు నేను ఏమి చెప్పాను చెప్పు' అనేది. చెప్పిన విషయం చెప్పేవాడు. 'మరి పుస్తకం ఎందుకు తెరిచి పెట్టుకున్నావు' అంటే, 'నువ్వు మాట్లాడ్డం ఆపేస్తే చదువుకుందామని' అనేవాడు. దీప నొచ్చుకునేది. పక్కవాళ్లతోనన్నా మాట్లాడదామంటే అక్కడి భాష అంతరాదు. అదీకాక వాళ్లు ఏమేమి వివరాలు అడుగుతారోనని భయం ఒకటి. 'ఎప్పుడైనా నీకు నువ్వుగా నా దగ్గర కూచుని మాట్లాడావా' అని గొడవ పడింది ఓసారి.

"ఏం మాట్లాడాలి?" అన్నాడు.

దీప కోపంగా చూసింది.

దాంతో చెయ్యి పట్టి పక్కన కుర్చీలో కూచోపెట్టుకుని, "ఇప్పుడు మాట్లాడు" అన్నాడు.

"ఇట్లా మాట్లాడమని అంటే ఏం గుర్తొస్తది? నువ్వే మాట్లాడు." దీప.

నవ్వి మళ్లీ పుస్తకంలో తలదూర్చాడు.

"అసలు నీకు చాలా పొగరనుకుంటా" కచ్చిగా అంది దీప.

"ఆ మాట నేననాలి."

"నా పొగరు వల్లే నిన్ను ప్రతిక్షణం కనిపెట్టుకుని ఉంటాను కదూ. నీ పలకరింపు కోసం ఎదురు చూస్తూ ఉంటాను కదూ, అవును నా పొగరువల్లే" దీపకు గొంతు బొంగురుపోయింది. ఏ క్షణమైనా కన్నీళ్లు దునికేలా ఉన్నాయి.

"మరి నన్నెందుకు అన్నావు పొగరని" అనిల్.

"అవును, నీకు పొగరే. ఎవరితో మాట్లాడ్డానికి లేకుండా ఒక్కదాన్నే ఉంటున్న నన్ను పలకరించాల్సింది పోయి, మాట్లాడమని అడిగితే నీ సొమ్మంతా పోయినట్టు ఇంత కరకుగా మాట్లాడ్తావా?" దీపకు దుఃఖం ఆగలేదు.

పార్టీలోకి రావడమే 'డెన్'లో ఉండాల్సి రావడంతో దీప చాలా ఇబ్బంది పడుతోంది. తామిద్దరూ తప్ప ఎవరు కలువకపోవడం, అందులోనూ వేరే రాష్ట్రంలో ఉండాల్సి రావడం, అక్కడి భాష అంతగా రాక... చుట్టూ మనుషులున్నా మాట్లాడేవాళ్లు లేక, అనిల్ పలకరింపు కోసం పడిగాపులు పడటం.. ఒకోసారి తన మీద తనకే కోపం వచ్చేది దీపకు.

కొద్దిసేపు కామ్‌గా ఉండి, కుర్చీలోంచి లేచి వచ్చి దీప కాళ్ల దగ్గర కూచుని, "నిజమే. నీ గురించి కొంత పట్టించుకోవాల్సింది." దీప కళ్లలోకి చూస్తూ స్వయంవిమర్శ చేసుకుంటూ...

దీపకు కన్నీళ్లు మాత్రం ఆగడం లేదు.

"చిన్నప్పటి నుంచీ ఎక్కువగా మాట్లాడను. అది నా స్వభావం. కొందరు గంటలు గంటలు మాట్లాడతారు. అన్ని మాటలు ఎలా దొరుకుతాయో నాకు ఇప్పటికీ అర్థం కాదు. సాహిత్యం గురించో, సిద్ధాంతం గురించో, లేదా ఇతర మనుషుల గురించో మాటలు సాగుతాయని నాకు అర్థమైన విషయం. బహుశా ఇది కరక్టో కాదో నాకు తెలియదు. ఇతరుల గురించి మాట్లాడటం నాకు అస్సలు ఇష్టం ఉండదు, చేతకాదు. సాహిత్యం, సిద్ధాంతం గురించి మాట్లాడదామంటే మాట్లాడదాం."

"ఈ విషయం గురించి మాట్లాడుకుందామని చెప్పుకుని ఎవరైనా మాట్లాడుకుంటారా?" విచిత్రంగా చూస్తూ అంది దీప. సహజంగా మాటలు సాగుతాయి. అవతలి వ్యక్తి మీద ఉన్న ఇష్టాయిష్టాలను బట్టి మాటలు సాగుతాయికానీ. అనిల్ వింతగా కూడా అనిపించాడు.

"మాట్లాడలేకపోవడం నా బలహీనత"

అనిల్ గొంతు వణికినట్టుగా అనిపించి, దీప చూసింది. అనిల్ మొఖమంతా చిన్నబోయి ఉంది.

"మీ టీమ్ సభ్యులతో బాగానే మాట్లాడతావు, ఇంటికి వచ్చిన వాళ్లతోనూ బాగానే మాట్లాడ్తావు కదా" ఆశ్చర్యంగా చూస్తూ అంది దీప. 'మాట్లాడకుండా ఉండలేకపోవడం నా బలహీనత కదా అనిల్. అదెందుకు అర్థం చేసుకోవు.' మనసులో అనుకుంది.

"సమన్వయం చేయడానికో, పనులు చేయించడానికో, రాజకీయాలు చెప్పడానికో దేనికో ఓదానికి వాళ్లతో మాట్లాడక తప్పదు. వారి బాధ్యుడిగా కల్సినప్పుడు నేను మాట్లాడాలని వాళ్లూ ఆశిస్తారు."

"అట్లనే అనుకుని నాతో కూడా మాట్లాడు"

"నీ దగ్గర కూడా నేను నాలా ఉండకూడదా? ఒకోసారి నువ్వు మూడీగా ఉంటావు. ఎందుకో ఎప్పటిలా నేను మాట్లాడకపోయినా నాతో మాట్లాడవు"

దీప కోపంగా చూసింది.

"నిజమే కదా" అని నవ్వుతూ "అట్లాంటప్పుడు నీతోనే ఉంటాను. బయటికి తీసుకెళ్తా. సాహిత్యమో, రాజకీయాలో కబుర్లు చెప్తుంటాను. అసలు నీకు అర్థమైందా ఆ విషయం"

నిజమే. సాయంత్రాలు రోడ్ల వెంట తిప్పుతూ మాట్లాడతాడు, మాట్లాడిస్తాడు. తన ఇంటి వాళ్లను గుర్తు చేసుకోవడం దీపకు ఇష్టం. పార్టీలోకి వచ్చిన దగ్గరి నుంచి ఒక్కసారి కూడా వారిని చూడలేదు, మాట్లాడలేదు. దీప గుర్తు చేసుకుంటోంది.

"నువ్వు డల్‌గా ఉంటే చాలా కంగారు పడ్తా. పని మీద బయటికి వెళ్లినా, ఎప్పుడెప్పుడు నీ దగ్గరికి వద్దామా అని ఉంటది.

ఇంటికి వచ్చే లోపలే నిన్ను కలవాలని, బస్టాపుకు రమ్మని చెప్తాను. ఎందుకనుకున్నావు. ఆ కంగారుతోనే.''

దీప నవ్వింది.

"కథల గురించో, కవిత్వం గురించో, నీకు తెలియని విషయాల గురించో నువ్వు నా దగ్గర మొదలుపెట్టినప్పుడు చాలాసేపు నీతో మాట్లాడుతుంటాను. గమనించావా? అర్థం చేసుకోవాలమ్మా. అన్నీ చెప్పుకోవాల్నా?''

"అవును, అన్నీ నేనే అర్థం చేసుకోవాలి'' అంటూ చాయ్ పెడ్తానని లేచింది. కానీ అప్పటికే దీప మనసు తేలికైంది. అనిల్ ఏంటో అర్థమవడమూ మొదలైంది.

"బయటికి పోదామా'' వెనకాలే వస్తూ అనిల్.

నవ్వుతూ తలవూపింది.

కానీ, ఇంటికి ఎవరైనా వస్తే అదో బాధ. అసలు దీప అనే మనిషి ఒకతి ఉందన్న స్పృహ లేనట్టుగా ఉండేవాడు. వాళ్ల నెలల తరబడి ఉన్నా అంతే. మొదట్లో దీప చాలా ఇబ్బందే పడింది. ఏదైనా అవసరమై పని చెప్పినా 'ఊ', 'ఆ'లతో సరిపెట్టేవాడు. అది దీపకు అవమానంగా అనిపించేది. భార్యను లెక్కచేయడం లేదని ఇతరులకు గొప్పగా చూపించుకోవాలనుకుంటున్నాడా? పార్టీలోనూ ఇట్లా ఉంటారా? ఈ ఏడాదిగా చూస్తోంది. అటువంటి మనిషి కాదే. ఏమో ఈ మగవాళ్లకు 'మొగుడి' అహంకారం ఎక్కువ. రకరకాలుగా ఆలోచించేది దీప.

'వేరేవాళ్ల ముందు కనీసం సరైన సమాధానం ఇవ్వకపోవడం నాకు చాలా ఇబ్బందిగా ఉంటోంది. భార్యాభర్తలు మాట్లాడుకుంటే ఎవరేమనుకుంటారు? మన ఇంటికి వచ్చిన జంటలు మాట్లాడుకుంటున్నారు కదా' అని దీప ఎంత చెప్పినా మారలేదు. ఇద్దరి మధ్య మనస్పర్థలు. రోజుల తరబడి మాట్లాడుకోక పోవడాలు.

అందుకే, ఇంటికి ఎవరైనా వస్తారంటే దీపకు భయం మొదలయ్యేది. ఒకసారి దళకమాండర్ జానకి వీరి రూమ్‌కి వచ్చింది. అపాయింట్‌మెంట్‌కి వెళ్తాడని తెలుసు, ఓ వ్యక్తిని ఇంటికి తీసుకొస్తున్నట్టు మాత్రం తెలియదు. అయితే అనిల్‌కు కూడా తెలియదని దీపకు తర్వాత తెలిసింది.

జానకి బాత్‌రూమ్‌కు వెళ్లడం చూసి, "నువ్వు మాట్లాడకపోతే నాకు చాలా అవమానంగా ఉంటది చూడు'' అన్నది.

"నీకు బుద్ధి లేదు'' కోపంగా అన్నాడు అనిల్. ఇంతలో ఆమె వచ్చింది. తను వెళ్లిపోయాడు.

జానకి గురించి నేను అనుమానపడుతున్నాననుకున్నాడా? ఎందుకంత మాటన్నాడు. మా ఇద్దరికీ ఎక్కడో పడటం లేదు. పార్టీలో స్త్రీల మీద అణచివేత ఉండదని కదా అనుకుంది. నిజంగా ఇది అణచివేతనేనా? తన తండ్రితో పోలిస్తే అసలు అనిల్ మాట్లాడిన ఈ మాటలు సముద్రంలో నీటి బొట్టంత. కానీ తను వాటిని ఎదిరించి, మార్పును ఆశించి కదా పార్టీలోకి వచ్చింది. నిజంగా అనిల్ చెడ్డవాడా? కాదు, కానీ తన పట్ల బహుశా భార్యపట్ల ఉన్న చులకన భావం లేదా సమానంగా చూడలేనితనం ఏదైనా ఉందేమో. ఏదేమైనా తట్టుకోవడం కష్టంగా ఉంది.

దీపకు కోపం, బాధ, దుఃఖమూ వచ్చాయి. ఆ మోపున అనిల్‌ను ఇగ్నోర్ చేసింది. అనిల్ అనే ఒక మనిషి ఉన్నట్టుగా గుర్తించనే లేదు. పాలు తెచ్చి చాయి పెట్టడం, అంట్లు తోమడం, ఇల్లు ఊడ్చడం అనిల్ వంతు. వంట దీప వంతు. ఎవరి బట్టలు వాళ్లే ఉతుక్కునేవాళ్లు. ఆ తర్వాత ఎవరి 'ఉద్యోగం' పని మీద వారు వెళ్లిపోయేవాళ్లు. నెల గడిచిపోయింది. నెమ్మదిగా మాటలు కలపాలని చూశాడు. అడిగిన దానికి మామూలుగానే సమాధానం చెప్పి ఊరుకునేది. రెండు నెలలు గడిచిపోయాయి. దీప పరిస్థితిలో మార్పు రాలేదు. ఆ రోజు దీపకు ఒంట్లో బాగులేక డ్యూటీకి వెళ్లలేదు. జానకి స్నానానికి వెళ్లడం చూసి, దగ్గరకు వచ్చి కూచున్నాడు. దీప పట్టించుకోలేదు.

"ఎందుకు మాట్లాడ్డం లేదు''

"నీకు తెల్వదా''

"పొరపాటు జరిగింది''

"నాయకులు పొరపాట్లు చేస్తారా?''

"ఏం నాయకులు పైనుంచి ఊడిపడ్తారా?''

సమాధానం చెప్పాలనిపించలేదు. మౌనంగా ఉండిపోయింది దీప.

"నాకు నేనుగా పలకరించాననా ఈ వ్యంగ్యం?''

"ప్రతిసారీ నువ్వు చేస్తున్నది కూడా ఇదే కదా''

"నేను తప్పు చేస్తే, నువ్వూ అదే తప్పు చేస్తావా?''

"ఎన్నోసార్లు బతిమాలుకున్నా, అయినా నీకు అర్థమైందా?''

"ఇప్పుడు అర్థమైంది'' నవ్వుతూ దీప చెయ్యిని చెంపకు రాసుకున్నాడు.

చెయ్యి లాక్కుంది దీప.

"సాయంత్రం బయటకు వెళ్దామా?''

"వేరే వాళ్ల ముందు... నీకు అంత ధైర్యముందేం?''

"కోపం చాలింక. పార్కుకు వెళ్దాం''

జానకి స్నానం చేసి వచ్చింది.

డ్యూటీ నుండి వచ్చాక బయటకు వెళ్తున్నామని జానకికి చెప్పి బయలుదేర తీశాడు. పార్కులో కొంచెం జనం పలుచగా ఉన్న దగ్గరికి తీసుకెళ్లి కూచున్నాడు. దీప అనిల్ పక్కనే కూచోబోయింది. అక్కడున్న పుల్లలను తీశాడు. తన అభిమానాన్ని దీపకు అర్థంకాకుండా పోలేదు. కానీ తను తగ్గకూడదనుకుంది. ఆత్మాభిమానం దెబ్బతిన్నప్పుడు నిరసన తెలపాలని నిశ్చయించుకుంది. పుల్లలను ఏరివేసిన తర్వాత కూచుంది. కొద్దిసేపు ఇద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు. అనిల్ పుల్లలను తుంపుతూ, దీప జనాన్ని చూస్తూ కూచున్నారు. ఇద్దరి మధ్యన మాటలు బంద్ అయితే ఎప్పుడైనా సరే దీపనే మాట్లాడించేది. ఈసారి మాత్రం ఆ ప్రయత్నమే చేయలేదు. నెమ్మదిగా చెప్పడం మొదలుపెట్టాడు, అనిల్.

"నిన్ను పట్టించుకోవడం లేనని అనుకుంటావు. తలనొప్పి లేస్తుందనో, కాళ్లు లాగుతున్నాయనో, కడుపు నొప్పి లేస్తుందనో చెప్పి నీ మానాన నువ్వు పనులు చేసుకుంటూ ఉంటావు. నీ కోసం హోమియో పుస్తకాలను తిరగేసి వెళ్లి మందులు కొనుక్కొచ్చి ఇస్తా. వేసుకోవు. నీ సంగతి తెలిసి నేనే మందులు వేస్తా. ఇంతకంటే

ఇంకెట్లా ప్రేమను వ్యక్తం చేయాల్నో నాకు తెలియదు. మా అమ్మ, మా అక్క, మా చెల్లి ఇదే మాట అనేవారు. మీరందరు కోరుకున్నట్టుగా ఉంటే నేను నేనెలా అవుతాను. మా అమ్మలాగానో, మా చెల్లిలాగానో, మా అక్కలాగానో, నీలాగానో అవుతాను కానీ.

"ఇంటి కిరాయి కోసం వద్దన్నా ఒక్కదానివే వెతకడానికి వెళ్తావు. నువ్వు వచ్చే వరకు దర్వాజకు ఎదురుగుండానే కుర్చీ వేసుకుని టెన్షన్‌గా చూస్తూ కూచుంటా. ఏ పనిని చేయలేకపోతా. నేను బయటకు వెళ్లినా, నువ్వు ఇంటికి చేరుకున్నావో లేదో అనే ఆందోళన. అందుకే కారం పొట్లాం కట్టి, నీ బ్యాగులో వేసిన." కొద్దిసేపు ఆగాడు.

అవునన్నట్టుగా దీప తల ఊపింది.

"ఇదంతా ప్రేమ కాదా? నాకు ప్రేమను ప్రదర్శించడం రాదు దీపా. నలుగురిలో నువ్వు నాతో ప్రేమగా ఉన్నా భరించడమూ కష్టంగానే ఉంటది. అందుకే ఇతర్ల ముందు నీతో మాట్లాడనిది, నువ్వు మాట్లాడితే చిరాకు పడేది." దీప చేతిని తన చేతిలోకి తీసుకుని దీప మొఖంలోకి చూస్తూ ఉండిపోయాడు.

తనకున్న కొన్ని బలహీనతలను జయించలేనితనం, దానివల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులు... నువ్వు కాకపోతే ఇంకెవరు అర్థం చేసుకుంటారు అనే పెయిన్. అనిల్ మాట్లాడే ప్రతి మాటను శ్రద్ధగా విన్నది.

"అంతెందుకు నువ్వు నా గురించి ప్రతీది పట్టించుకోవడం కూడా నాకు ఇబ్బందిగా ఉంది. అది నీకూ మంచిది కాదు. ఎప్పుడు ఎవరికి ఏమవుతుందో తెలియదు. ఏదైనా జరిగితే ఎట్లా తట్టుకుంటావు. ఇవన్నీ నీకు తెలియవని కాదు..." అని, ఆగి దీప మొఖంలోకి చూశాడు.

"వింటున్నావా?" అన్నాడు.

"వింటున్నా." అని మళ్లీ తనే,

"ఎప్పుడో ఏమో అవుతదని, ఉన్నంతకాలమూ మనసును కష్టపెట్టుకుంటూ ఉంటామా?" ఎందుకో దీపకు దుఃఖం తన్నుకొచ్చింది. తమాయించుకుంది.

"అవుననుకో" అన్నాడు.

కొంతసేపు ఇద్దరు మౌనంగా ఉన్నారు.

"నిజం చెప్పనా? ఇన్ని రోజులు నువ్వు మాట్లాడకపోతే నన్ను వదిలేస్తావేమో అని ఎంత భయపడ్డానో తెలుసా" అని నవ్వాడు.

ఇప్పుడు మనసు విప్పి మాట్లాడుతున్న మనిషి ఇంతకాలం తనను ఎందుకు ఇబ్బంది పెట్టినట్టు? ఇదే విషయం మొదట్లో చెప్పొచ్చు కదా. ఒకవేళ మొదట్లోనే చెప్పినా ఇప్పుడు అర్థం చేసుకున్నట్టు చేసుకునేది కాదేమో. సందర్భం రాని సమయంలో చెప్పితే బహుశా అర్థం అవ్వాల్సినంత అర్థం కాదేమో. దీప ఆలోచిస్తోంది.

ఒకవైపు అనిల్ అర్థమవుతున్నా... మనసు మళ్లీ 'బుద్ధిలేదు' మాట దగ్గరకు వచ్చి ఆగిపోతోంది. నోటికి ఎంత మాటొస్తే అంత మాట ఎట్లా అంటాడు? అనిల్‌ను ఈ మధ్యనే రాష్ట్ర నాయకత్వంలోకి తీసుకున్నారు. తనలోనే ఇట్లాంటి భావజాలం ఉంటే, బయటివాళ్ల సంగతేంది? నేనైతే ఆయన్ని అట్లా అనగలనా? అదే విషయం అనిల్‌తో అన్నది.

"నీకు తెలియదు, నేను అప్పుడు ఎంత టెన్షన్‌లో ఉన్నానో"

"మాట మార్చకు. ఎంత టెన్షన్‌లో ఉన్నా నేనైతే అట్లా అనను - ఓ 'భార్య'గా" భార్య అనే పదాన్ని ఒత్తిపలుకుతూ అన్నది.

"అదేదో నాకు చెప్తే నేను సహకరించనా, నేనూ పార్టీ సభ్యురాలినే కదా" మళ్లీ తనే అంది.

"చెప్పాల్సింది. టెన్షన్‌లో ఉన్నానని చెప్పానుగా. కానీ నిన్ను అట్లా అనకుండా ఉండాల్సింది. 'పెళ్లాం' అంటే ఏ మూలనో ఉన్న చులకన భావమే అట్లా అనేలా చేసింది కావచ్చు. ప్రశాంతంగా ఉన్నప్పుడు కంట్రోల్‌లో ఉంటాం. కోపం వచ్చినప్పుడే కదా మన 'ఒరిజినాలిటీ' బయటపడ్తది. ఇది నేను సవరించుకోవాల్సిందే." అని, మళ్లీ తనే కొనసాగించాడు.

"చిన్నప్పటి నుంచి చాలా మందిని గమనించేవాణ్ణి. భార్య మెతగ్గా ఉంటే భర్త ఆడించడం, భర్త మెతగ్గా ఉంటే భార్య పెత్తనం చెలాయించడం... ఒకరి మీద ఒకరు పైచేయి సాధించాలనుకోవడం.. ఒకరిని మరొకరు అణచాలని చూడటం. భార్యాభర్తల సంబంధం ఇల్లనే చిన్న రాజ్యంలో అధికార పీఠం కోసం జరిగే యుద్ధంలా అనిపించేది. నేను అట్లా ఉండొద్దని అనుకునేవాణ్ణి." ఆలోచిస్తూ ఆగిపోయాడు.

"అందుకేనేమో నేను నిన్ను ఆక్రమించేస్తున్నానని అనుకునేవాడివి కదా! ఏమో కొన్నిసార్లు నీ మాటలు చూస్తే నాకు అట్లా అనిపించేది. నీ చుట్టూ కొన్ని గిరులు గీసుకుని ఉంటావని, కొందరిని కొన్ని గీతల అవతలే ఉంచేస్తావని, నన్ను ఇంకొన్ని గీతలు దాటనిచ్చి నీ దగ్గరికి రానిచ్చినప్పటికీ ఇంకా కొన్ని గీతలు ఇవతలే ఉంచావని..." మాట పూర్తి చేయకుండా అనిల్ ముఖంలోకి చూసింది దీప.

నవ్వి, "అవును. బాగానే గుర్తుపట్టావు. నిన్ను ఒక గీత అవతల ఉంచాను. ఆ ఒక్క గీత దాటి నిన్ను లోనికి రానిచ్చానంటే నేనంటూ ఏమీ మిగలను. మొదలయ్యేది ప్రేమ పేరుతోనే. క్రమేణా 'నేను చెప్పినట్టల్లా అవతలి వ్యక్తి వినాలి' అనే వరకు వెళ్తుంది. భార్య అయినా, భర్త అయినా ఎవరైనా కావచ్చు. కాబట్టి కొన్ని గిరులు ఉండాల్సిందే." ప్రైవసీ ఉండటం ప్రతి ఒక్కరికీ అవసరం, నీకు కూడా అనే స్వరం అనిల్ గొంతులో స్థిరంగా వినిపించింది.

ఆ గీత కూడా దాటనిస్తే బహుశా నేను కూడా అనిల్‌ను ఆక్రమించడానికి ప్రయత్నిస్తానా? ఇన్ని చెప్తున్నాడు అనిల్ నన్ను అజమాయిషీ చేయాలని చూడనేలేదా? ఏమోలే. అనవసరంగా ఎక్కువగా ఆలోచిస్తున్నట్టు ఉన్నాను.

పార్టీలోకి వచ్చి మూడు సంవత్సరాలు కూడా కాలేదు. బాగా చదువుతుంది. అర్థం చేసుకుంటుంది. కష్టపడుతుంది. కనిపించని తెగువ, ధైర్యం ఉన్నాయి. ఎవరూ చేయలేరేమో అనుకున్న పనులను చాలా ఈజీగా చేసుకుని వస్తుందని తనకు దీప మీద మరింత అభిమానం. విప్లవకారుల్లో పరిమితులు దాటిన ప్రేమ ఏవిధంగా చూసినా అనర్థమే. 'తామిద్దరే' అనే స్పృహ వస్తే విప్లవోద్యమాన్ని వీడటానికి కూడా వెనుకాడకపోవచ్చు. లేదా సహచరున్ని వదిలి

వేరే ప్రాంతానికి వెళ్లలేని స్థితి రావచ్చు. పార్టీలో భార్యాభర్తలిద్దరు ఒకే దగ్గర ఉండటం అనేది అసాధ్యం. దీప 'భార్య' చట్రంలో ఒదిగిపోతోందేమో అనేదే తన భయం. కాదులే. నిజంగా 'భార్య'లా ఉంటే ఇప్పుడు ఇంత పట్టుదలతో ఉండేదే కాదు. తనే దీప వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోలేకపోయాడు.

అనిల్, దీప కొద్దిసేపు ఎవరి ఆలోచనల్లో వాళ్లు ఉండిపోయారు. దీపనే తేరుకుని, "ఇంతకీ ఏం జరిగింది ఆ రోజు" అడిగింది.

"నేను అపాయింట్‌మెంట్‌కు వెళ్లాను. ఆరోజు జానకి భర్త కలవాల్సి ఉండె. కానీ ఆయన జానకిని తీసుకొచ్చి నాకు అప్పజెప్పాడు. నిజానికి జానకిని వేరేవాళ్ల దగ్గర ఉంచి, ఆరోగ్యం చూపించాలనుకున్నారట. అవతలివాళ్లు అపాయింట్‌మెంట్‌కు రాలేదు. అరెస్టయ్యారని తర్వాత తెలిసిందనుకో. అదీ సంగతి" నవ్వుతూ అనిల్.

* * *

ఆ తర్వాత కొద్ది కాలానికే ఇద్దరూ కలిసి అడవికి వచ్చారు. వచ్చిన రెండు నెలలకే వేర్వేరు ప్రాంతాలకు కేటాయించడంతో విడిపోయారు.

ఓసారి క్యాంపులో ఓ మహిళా కామ్రేడ్ దీపతో "అనిల్ దాదా నీతో మాట్లాడ్తాడా?" అని అడిగింది.

ఆ కామ్రేడ్ ఎందుకలా అడిగిందో అర్థమై నవ్వి "మాట్లాడ్తాడు" అంది దీప.

దళం దగ్గరికి వచ్చిన రోజు అలసటో, లేక లేట్ నైట్ వరకు మీటింగ్ జరుగుతదని తెలిసి, రాత్రికి 'కలవడం' కుదరదనుకుంటేనో... దీప అన్నం తిని ప్లేట్ కడిగే సమయంలో వచ్చి, తనూ ప్లేట్ కడుక్కుంటూ దీప ప్లేట్‌పై నీళ్లు పోసేవాడు. లేదా ఏ కూర వేసుకోవడానికి దీప వెళ్తుంటేనో ఎదురొచ్చి ఓ నవ్వు నవ్వేవాడు.

దీపకు పరిస్థితి అర్థమయ్యేది.

అసలు అడవికి వచ్చిన మొదట్లో 'సైడ్'కు వెళ్తామని చెప్పడానికి ఎంత ఇబ్బంది పడేవాడో. దళంలో ఉన్నా, క్యాంపులో ఉన్నా సహచరులు రాత్రి పూట కొద్ది దూరం వెళ్లి పడుకుంటారు. దానినే 'సైడ్'కు వెళ్లడం అంటారు. అయితే ఏ వైపు ఏ జంట వెళ్తుందో క్యాంపు బాధ్యులకు చెప్తారు. క్యాంపుల్లో చాలాసార్లు బాధ్యులే ఎటువైపు ఏ జంట వెళ్లాలో చెప్తారు. ఈ విషయాన్ని సెంట్రీకి తప్పకుండా చెప్పి ఉంచాలి. సెంట్రీ దిగిన వాళ్లు సెంట్రీ ఎక్కిన వారికి ఈ విషయం చెప్తారు. ఎందుకంటే కొన్నిసార్లు 'సైడ్'కు వెళ్లిన జంటలో ఎవరైనా లేచినా, దగ్గినా, తుమ్మినా పోలీసులు వచ్చారేమో అని పొరపాటు పడే అవకాశం ఉంది. ఉత్తర తెలంగాణలో తెల్లవారు జామున 'సైడ్'కు వెళ్లిన జంట తిరిగి క్యాంపులోకి వస్తున్న సమయంలో పోలీసులేననుకుని సెంట్రీ కాల్పులు జరిపితే మహిళా కామ్రేడ్ చనిపోయింది. అందుకని తప్పకుండా ఈ జాగ్రత్తలు తీసుకుంటారు.

దీప దగ్గరికి వచ్చి 'నువ్వెళ్లి చెప్పు' అనేవాడు.

"ఆడవాళ్లు 'సైడ్'కు వెళ్తున్నామని చెప్పడం లేదు. పోనీ నేనే కమాండర్‌నైతే వెళ్లి నా బాధ్యుడికి చెప్పేదాన్ని. నువ్వే వెళ్లి చెప్పు" అనేది దీప.

"నువ్వు ఎప్పుడు కమాండర్ అవుతవో, నాకెప్పుడు ఈ బాధ తప్పుతదో" అనేవాడు.

కలిసిన ప్రతీసారీ ఈ ఇబ్బంది అనిల్‌కి ఉండేది. ఆయన ఇబ్బందిని కనిపెట్టిన ఒకరిద్దరు క్యాంపు బాధ్యులు ఇంకా ఇబ్బంది కూడా పెట్టేవారు. అందుకు కారణం లేకపోలేదు. ముఖ్యంగా నాయకులను నిర్మొహమాటంగా విమర్శించే మనస్తత్వం అనిల్‌ది. క్యాడర్ తప్పులు చేస్తే క్షమించవచ్చు. కానీ నాయకులు చేస్తే సహించేవాడు కాదు. అది పార్టీకి చాలా హానీ తలపెడుతుందని అనిల్ బలమైన అభిప్రాయం. పార్టీలో ఉదారవాదం శత్రువు కంటే ఎక్కువ నష్టం చేస్తుందని దృఢంగా నమ్ముతాడు. ఒకరి తప్పులను ఇంకొకరు కాపాడటం, సరైన విమర్శ చేయకపోవడం అన్నిస్థాయిల సమావేశాల్లోనూ ఏదో ఓమేర కొనసాగుతుంటాయి. ఈ పద్ధతి నాయకత్వంలో ఉండటం అనిల్ దృష్టిలో క్షమించరానిది.

ఉన్న ఆ 20, 30 రోజులన్నా అనిల్‌తో గడపాలని దీప తపన. తను చదివిన సాహిత్యం అనిల్‌కు చెప్తా ఉండేది. అనిల్ కూడా తను చదివిన కథల మంచి చెడులను దీపతో మాట్లాడేవాడు. ఫలానా కథలో భార్యాభర్తల సమస్యకు పరిష్కారం అమెరికాలో పరిష్కారం చూపారు. కానీ నువ్వు అట్లాంటి కథ రాస్తే ఇండియాలోనే ముగింపు చూపాలి అనేవాడు. వస్తువు పాతదాన్నే ఎన్నుకోవాల్సి వచ్చినప్పుడు కొత్త ముగింపునో, కొత్త శైలినో ఎన్నుకోవాలి అనేవాడు. ఎవరూ ఎన్నుకోని వస్తువుని ఎన్నుకున్నప్పుడే కథ నిలుస్తుందనేవాడు. శిల్పం గురించి అవసరం లేదంటారు కానీ, చెప్పే పద్ధతి బాగుండాలి... ఇట్లా మాట్లాడుకుంటూ తెల్లవారు జామున ఎప్పుడో నిద్రపోయేవాళ్లు.

ఉదయం రోల్‌కాల్, ఎక్సర్‌సైజ్, టిఫిన్, లంచ్, సాయంత్రం టీ, రాత్రి డిన్నర్... క్యాంపులో ప్రతీది టైమ్ ప్రకారం జరుగుతుంది. రాత్రి 9 గంటలకు భోజనాలయ్యాక 'సైడ్'కు వెళ్తే ఒంటి గంట, రెండు గంటలు అయినా దీప మాట్లాడ్తూనే ఉండేది. 'పండుకో. రేపు మీటింగులో నాకు నిద్రొస్తది.' అనేవాడు. 'అబ్బ ఈ ఒక్క విషయమే అంటూ' దీప చెప్తూనే ఉండేది. ఇంతలో గాఢ నిద్రపోయిన అనిల్ శ్వాస దీపకు గట్టిగా తగిలేది. దీప కూడా నిద్రపోయేది. అనిల్ దగ్గర ఉంటే, దీప తల్లికోడి చుట్టూ తిరిగే పిల్లకోడే.

* * *

రేపటితో రాష్ట్ర కమిటీ సమావేశం అయిపోతుంది. మహా అయితే ఇంకో రెండు మూడు రోజులుంటారేమో. ఈసారి పది నెలల తర్వాత దీప, అనిల్ కలుసుకున్నారు. రోజు రోజుకు నిర్బంధం కూడా పెరుగుతోంది. ఈసారి కలిసినప్పుడు ఉన్న పరిస్థితులు మళ్లీసారికి ఉండటం లేదు.

రాత్రిపూట ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ ఉండిపోయాడు. "ఏంటీ విషయం" అడిగింది.

"ఏం లేదు" అన్నాడు.

"చెప్పకూడనిది అయితే వద్దులే. కానీ విషయం చెప్తే.. నేను కూడా నీలాగా పన్ను మీద వేలు పెట్టి ఆలోచిస్తాను. అట్లా ఇద్దరం

కలిసి ఆలోచిస్తే పరిష్కారం దొరికుద్ది కదా?'' నవ్వుతూ అన్నది దీప.

లేచి కిట్‌లోంచి దుప్పటి తీస్తూ "మాటలు నేర్చావు'' అని నవ్వాడు.

"సహవాస దోషం. ఇంతకీ ఏంటి విషయం'' మళ్లీ అడిగింది.

"దీర్ఘకాలిక ప్రజాయుద్ధం అంటే వందల యేండ్లు చేసేది అని ఓ నాయకుడి అవగాహన''

"అవునా? అట్లా ఎట్లా అన్నాడు.''

"అయితే, ఏంటో నువ్వు చెప్పు''

"ఏమి నాకూ తెలియదని డౌటా''

"తెలిస్తే చెప్పు గద''

నాయకులకే తెలియకపోతే క్యాడర్ పరిస్థితి ఏంటి? తెలియదనిది ఆ ఒక్క నాయకుడికేనా? ఇంకెంత మంది ఉన్నారో? ఒక్క నాయకుడికి అట్లాంటి అవగాహన ఉన్నా ఆ మేరకు ఆ ప్రాంతంలో నష్టమే.

"ఏంటి చెప్పవు'' రెట్టించాడు అనిల్.

"ఈ టెస్టింగులేంది అసలు''

ఇంతకీ దీపకు తెలుసునా? తెలియకపోతే తనదే తప్పవుతుంది. దీప పూర్తి కాలం పార్టీ జీవితం తనతోనే మొదలైంది.

"గ్రామాల నుంచి పట్టణాలకు పార్టీ వ్యాపించడం'' దీప.

"ఫర్వాలేదే'' నవ్వుతూ అనిల్.

"ఇన్నేండ్లయింది పార్టీలోకి వచ్చి. ఆ మాత్రం తెలియదా?'' దీప ఉడుక్కుంది.

"అది కాదులే కానీ'' అని, అనిలే మళ్లీ మాట్లాడటం మొదలుపెట్టాడు

"ఒక మనిషి జీవిత కాలంలో విప్లవ విజయాన్ని చూడాలి. ఇట్లాంటి రాష్ట్రకమిటీ నాయకులు క్యాడర్‌కు ఎటువంటి గైడెన్సు ఇస్తారు? పార్టీ, ప్రజలు ఎంత నష్టపోతారు. ఆలోచిస్తే నిద్ర పట్టడం లేదు.

"శత్రువు ఊహించని విధంగా పార్టీ ముందుకు సాగాలి. కానీ మనం ఏ స్టెప్పు తర్వాత ఏ స్టెప్పు తీసుకుంటామో ఇంటలిజెన్సీవాళ్లకు పక్కాగా తెలుసు. మనను ఎట్లా దెబ్బతీయొచ్చో కూడా తెలుసు.

"పార్టీలో కొత్త ఆలోచన ఎవరూ చేసినా అడ్డుకునేవాళ్లు ఎక్కువ. మెజార్టీకి మైనార్టీకి కట్టుబడి ఉండటమే కేంద్రీకృత ప్రజాస్వామ్యం కదా. దానికి కట్టుబడి పని చేయడమే ప్రస్తుతం మనం చేయగల్గింది. నాయకత్వంలోకి కొత్త నీరు ఎప్పుడు వస్తదో. కొత్త ఆలోచన ఎప్పుడైనా తీవ్రమైన ప్రతిఘటననే ఎదుర్కొంటది.'' ప్రశ్నలు, జవాబులు తనే చెప్పుకుంటున్నట్టుగా పైకే మాట్లాడాడు అనిల్. తర్వాత దీర్ఘంగా ఆలోచిస్తూ ఉండిపోయాడు.

'ఎన్నడూ లేంది అనిల్ ఇంత సీరియస్‌గా ఆలోచిస్తున్నాడేంటో. మీటింగ్‌లో బహుశ తీవ్రమైన చర్చ జరిగి ఉంటుంది.' అనుకుంది దీప.

నిజానికి ఓ విషయం చెప్దామని దీప ఉత్సాహంగా ఉండె. ఈ మధ్య జరిగిన జిల్లా కమిటీ సమావేశం సమయంలో బయటి నుంచి ఐదుగురు కాలేజీ అమ్మాయిలు వచ్చారు. ఆ అమ్మాయిలు క్యాంపులో పది రోజులు ఉన్నారు. ఎవరెవరు సహచరులో వారికి అర్థం కాలేదు. అసలు సహచరులు ఎట్లా ఉంటారో తెలుసుకోవాలనే ఉత్సాహం. ఇక్కడ వీళ్లను చూస్తుంటే తాము విన్నది నిజం కాదని అనిపిస్తోంది. అదీకాక దళం ప్రజలను ఎట్లా కలుస్తుంది? దళ జీవితం ఎట్లా ఉంటుంది? ప్రజలు వీళ్లతో ఎట్లా ఉంటారు? బయట ఏవేవో పుకార్లు. ఎన్నో విషయాలు అడిగి తెలుసుకోవాలనుంది. కానీ వెనకాముందు అవుతున్నారు. చివరి రోజు సాయంత్రం టీ తాగిన తర్వాత దీప పిలిచి దగ్గర కూచోబెట్టుకుని మాట్లాడింది.

కొద్దిసేపటికి ఫ్రీ అయ్యారు.

"అక్కా, ఒకటి అడగొచ్చా?'' బక్కపల్చగా ఉన్న నీరజ అడిగింది.

"ఏ డౌటున్నా అడగండి. మొహమాట పడకండి'' దీప భరోసా ఇచ్చింది.

"భార్యాభర్తలు ఎట్లా కలిసి ఉంటారు?''

"అంటే?'' దీప

"ఏం లేదు. నక్సలైట్లు ఆడామగా అందరూ కలిసి ఉంటా...రనీ...'' అడగడానికి సంకోచిస్తూ ఆగిపోయింది మరో అమ్మాయి మాధవి.

"మీ డౌటేందో నా కర్థమైంది. బయట కొందరు అట్లా తమ అక్కసు వెళ్లగక్కుతారు. చావుకు కూడా సిద్ధపడి వచ్చినవాళ్లం. విచ్చలవిడి సంబంధాల కోసమైతే బయటే ఉండొచ్చుగా. చావును పక్కన పెడితే, ఇన్ని కష్టాలు ఎందుకుపడాలి? నిజంగానే అటువంటి సంబంధాలు పార్టీలో ఉంటే అందులో పడి కొట్టుకుపోతారుతప్ప విలువల కోసం, ప్రజల తరపున నిలబడి పోరాడలేరు. ఇంతటి నిర్బంధాన్ని తట్టుకోలేరు. దోపిడీ పీడనల అంతం ఒక్కటే కాదు, పురుషుడికి మల్లే స్త్రీకి స్వేచ్ఛా సమానత్వం ఉండాలని కోరుతున్నామంటే అర్థం... అనైతిక సంబంధాల విషయంలో కాదు. దంపతీ వివాహం ఉన్నతమైందని పార్టీ నమ్ముతుంది, అమలుచేస్తుంది. ఊహల్లో ప్రేమతో కాదు, నిజమైన 'ప్రేమ'తో సహచరులు కలిసి ఉంటారు.'' వద్దనుకున్నా ఆవేశంతో చెప్పుకుపోయింది దీప.

అమ్మాయిలు వింటూ గమ్మున ఉండిపోయారు.

దీప సర్దుకుని, "ఇన్ని రోజులుగా చూస్తున్నారు కదా. ఎవరన్నా అసభ్యంగా గానీ, అతిగా గానీ ప్రవర్తించడం చూశారా?''

లేదని తలలు ఊపారు. "ఎంత క్రమశిక్షణో. అసలు ఎంత అభిమానంగా ఉంటున్నారో. అదే మాకు చాలా ఆశ్చర్యంగా ఉందక్కా. బయటైతే ఎవరిని ఎవరూ పట్టించుకోరు. హాయ్ అంటే హాయ్ అంతే. మాకు కొత్త ప్రపంచంలోకి వచ్చినట్టుగా ఉంది.'' అంది ఇంకో అమ్మాయి వనజ.

సీరియస్‌నెస్ నుంచి బయటపడేసినట్టు కూడా ఉంటది కదా అనుకుని బయటి నుంచి వచ్చిన అమ్మాయిలు అడిగిన విషయాన్ని చెప్దామని అనిల్ మీద చెయ్యి వేసింది. దీప చేతిని నిమురుతూ అట్లాగే ఆలోచనల్లో ఉన్నాడు. ఇక అనిల్‌ను కదిలించాలనిపించలేదు.

దీప దుప్పటిని నిండా కప్పుకుంది. ఆలోచిస్తూ ఉన్న అనిల్‌కు తెల్లవారుజామున నిద్ర పట్టింది.

తెల్లవారి పొద్దుటే రోల్‌కాల్‌లో... ఈ రోజుతో మీటింగ్ అయిపోయితుందని, రాత్రి అన్నం తినగానే మకాం మారుస్తున్నట్టు చెప్పారు.

మధ్యాహ్నం లంచ్ కాగానే డిస్పర్స్ అయ్యేవాళ్లు వాళ్ల బత్యాన్ని మూటలు గట్టుకున్నారు. మబ్బులను చూసి రాత్రికి పెద్ద వాన వస్తదని కొందరు కామ్రేడ్స్ చెప్పారు. చెప్పడమే కాదు, కిచెన్‌కి టెంట్ కూడా వేశారు. అయితే పొద్దున పావుతక్కువ ఏడు గంటలకు రేడియో వార్తల్లో వాయుగుండం ఏర్పడిందని, వర్షం వచ్చే సూచనలు ఉన్నాయని చెప్పారు. రేడియో వార్తలు నిజమై సాయంత్రానికి కుండపోతగా వాన. ఈ రోజుకు ఇక్కడే పడుకుని పొద్దుటే క్యాంపు ఖాళీ చేయాలని రాత్రి భోజనాల సమయంలో ప్రకటించారు.

వర్షాకాలంలో ప్రతి ఒక్కరి దగ్గర అదనపు జిల్లీ ఉంటుంది. దాన్నే వర్షం వచ్చినప్పుడు కప్పుకుని నడుస్తారు. అవసరమైతే టెంట్‌గా కూడా కట్టుకుంటారు. వర్షాకాలంలో క్యాంపులో ఉంటే ఫర్వాలేదు కానీ, దళంతో ఉంటే కష్టం. ఏ పూటకు ఆ పూట వేరే గ్రామానికి వెళ్తారు.

వర్షంలో టెంట్ కట్టడం నిజంగా ఓ కళే. మబ్బు పట్టి ఉన్న ఆ చిమ్మచీకట్లో నాలుగువైపులా తాడు కట్టడానికి చెట్లు ఉన్న జాగాను చూసుకోవాలి. వెంటనే ఏ చెట్టు కొమ్మ మీదనో, రాయి మీదనో కిట్లు, తుపాకులు పెట్టి, వాటి మీద జిల్లి కప్పేసి గబగబా రెండు చెట్ల మధ్య తాడు కట్టాలి. తాడు మీద మరో జిల్లీని వేసి, దానికి నాలుగు వైపులా తాళ్లు కట్టి, చెట్ల కొమ్మలకు ముడేయాలి. ఆ తర్వాత కూచోవడానికి మాత్రమే వీలుండే టెంటు లోపలికి నీళ్లు రాకుండా చుట్టూ తవ్వి, కట్టపొయ్యాలి. ఇక కింద ఇంకో జిల్లీ పరచాలి. అప్పుడు పడుకోవడానికి వీలవుతది. ఈ తతంగమంతా అనిల్‌కు చేతకాదు.

ఉద్యమం గురించి అంత సీరియస్‌గా ఆలోచించే అనిల్ కొన్నిటిని అసలు అంతగా పట్టించుకోడు.

అడవికి వచ్చి ఎనిమిదేండ్లయినా ఇప్పటికీ వానొచ్చినప్పుడు తడవకుండా పాలిథిన్ (జిల్లి) కప్పుకొని నడవడం రాదు. తన ఏకే 47ను, తలను మాత్రం తడవకుండా కాపాడుకుంటాడు. కిట్టు, బట్టలు అన్నీ తడిసిపోతాయి.

జిల్లి మూలలకు దారాన్ని ఎట్లా ముడివేయాలో దీప ఎన్నిసార్లు చెప్పినా గుర్తుండదు. "పోనీ ఇవి కడతాను. నువ్వు మట్టితొవ్వుపో" అంటే టెంటు లోపలికి వెళ్లి సగం వరకు కూడా మట్టి తవ్వలేకపోతాడు. ఆడవాళ్ల చేతులు తామరతూడులని కవులన్నారు కానీ, కాయకష్టం చేయని మగవాళ్ల చేతులు కూడా తామరతూడులే. అనిల్ చేతులు, కాళ్లు అంత సున్నితం.

రాత్రి అయినా నిలకడగా వాన కురుస్తూనే ఉంది. సాయంత్రం వచ్చిన వానా, చుట్టమూ పోరంటారు కదా.

రాత్రి భోజనాలైనాక దీప తన మకాం దగ్గరికి వెళ్తుంటే అనిల్ గబాగబా వచ్చి "రేపు నేను వెళ్లిపోతున్నా" అన్నాడు.

"ఎల్లుండి పోతానన్నావు కదా"

"అవును, కానీ మధ్యలో ఆగాల్సిన పనిబడింది. అందుకని ఒక రోజు ముందే వెళ్తున్నాం."

"అవునా?" అని, "మరీ..." దీప అంటుండగానే...

"నీ దగ్గర కప్పుకునే జిల్లీ ఉంది కదా" అడిగాడు.

"ఉంది"

"సర్దుకో." అని వెళ్లిపోయాడు.

ఇద్దరూ కిట్లు వేసుకుని 'సైడ్'కు వచ్చారు. టార్చి వేసుకుని టెంటు కట్టడానికి అనువైన స్థలాన్ని దీప వెతికింది. చెరో చెట్టుకు తాడు కట్టారు. అనిల్ యథాప్రకారం టెంటు కట్టలేకపోయాడు.

దీప జిల్లీ మూలలు కడుతూ "టెంటు లోపల చుట్టూ తవ్వి కట్ట పొయ్యిపో" అంది. అదీ చేయలేకపోయాడు. మీటింగ్‌లో తీవ్రంగా చర్చలు జరిగాయి. నిజానికి అనిల్‌కు చాలా అలసటగా ఉంది. ఇంత వానలో 'సైడ్'కు రావాలని లేదు.

"నేను తవ్వుతాను. నువ్వెళ్లి కిట్లు లోపలికి తీసుకురా" అని పంపించి దీప తవ్వింది. దాని ఫలితమే ఈ చిరాకు.

మిగిలిపోయిన వంట సరుకులను డంప్ చేయడానికి చాలా మంది కామ్రేడ్స్ వెళ్లారు. దీంతో రెండు సెంట్రీలు చేయడమే కాక, వంటలో కూడా సాయం వెళ్లింది. దాంతో దీపకూ చాలా నీరసంగా ఉంది. రాత్రికి కూడా ఇక్కడే ఉంటామని తెలిస్తే, దీప సాయంత్రమే టెంటు కట్టి ఉంచేది.

అయినా ఈ మధ్య తనే అనిల్ మీద అరవడం ఎక్కువైంది. అనిల్‌కు కట్టడం రాదని తెలిసి కూడా ఎందుకు అసహనం చూపిస్తున్నా అని మనసులో బాధపడింది. దీప కావాలని అనలేదని అనిల్‌కు కూడా తెలుసు. అయినా వెంటనే మాట్లాడలేక పోయాడు.

ఒకరికొకరు ఎంత అర్థమైనా కొన్నిసార్లు కొన్నిమాటలు ఇబ్బందిగానే ఉంటాయి. కాకపోతే ఆ ఇబ్బంది దీప, అనిల్‌ల మధ్య కొద్దిసేపే. పొరపాటును గుర్తించడం, క్షమాపణలు చెప్పుకోవడం.. లేదా క్షమాపణలు చెప్పుకోకున్నా లోపల బాధపడతున్న విషయం ఇద్దరికీ అర్థమవడం... ఇదొక చక్రం.

కొద్దిసేపు చూసి, అటుతిరిగి పడుకున్న అనిల్ మీద చెయ్యేసి "సారీ" అంది దీప.

"కడవంత గుమ్మడికాయ కత్తిపీటకు లోకువంటే ఇదే" అన్నాడు నవ్వుతూ.

"పితృస్వామ్యం నశించాలి" దీప కూడా నవ్వుతూనే అంది.

విరసం కరపత్రాలను, స్టేట్‌మెంట్లను, అరుణతార పత్రికలను, విరసం ప్రచురణలను **www. virasam. org, www. virasam. in** వెబ్‌సైట్‌లో చూడవచ్చు. సాఫ్ట్‌కాపీలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
అలాగే వివిధ సాహిత్య పత్రికల బ్లాగులు, సైట్‌ల లింకులను కూడా చూడవచ్చు.

# దేవరగద్దె

**నల్లూరి కాంతి**

పొద్దుటి పూటే ఎండ చిటపటలాడించేస్తోంది. పొద్దుటిపూటే అయినా మిట్టమధ్యాహ్నంలా ఉక్కపోస్తూ చిరాకెక్కిస్తోంది. రోజూ ఆ సమయానికి పొలాల్లో ఉండాల్సిన ఊరు దేవరగద్దె ముందు గుమిగూడి కుతకుతలాడిపోతుంది. బళ్ళో ఉండాల్సిన పిల్లలు సైతం బిక్కుమంటూ పెద్దోళ్ళ సందిట గుగ్గిళ్ళులా ఉడికిపోతున్నారు. మేతకు వెళ్ళాల్సిన గొడ్లు దాట్లకాడే అసహనంగా పెనుగులాడుతున్నాయి. గద్దె ముందు గుమిగూడిన మగాళ్ళు నోట్లోని బీడీలు చెమ్మగిల్లి ఆరిపోతుండటంతో చిరాగ్గా తుపుక్కున ఉమ్మేస్తున్నారు. ఆడోళ్ళ జుట్టు రేగిపోయి, బొట్లు చెరిగిపోయి చెమటతో కలిసి ముక్కులు మీదుగా కారిపోతుంటే పైట చెంగులతో తుడుచుకుంటున్నారు. గద్దెమీద వాలిచెట్టు మీద ఎప్పుడూ గోలగోలగా ఎగిరే కాకులు సైతం నిశబ్దమై పోయాయి. అంతా నిశబ్దమైంది. ఎడతెగని ఉక్కబోత లోన... బయట. అక్కడున్న అందరిలో ఓ సుళ్ళు తిరుగుతున్న సముద్రం... ఏ క్షణాన్నైనా ఉప్పెనై విరుచుకుపడుతుందా అనే నిశ్శబ్దం!

"ఏంది మామా! అంతా మెదలకుండా వున్నారేంది" మాధవుడు చిరాగ్గా నిశబ్దాన్ని బద్దలుకొట్టాడు.

"ఏందిరా మాట్లాడేది? యిట్టాంటి పంచాయితి ఇంతకు ముందల జరగలేదాయే" ఎటు మాట్లాడితే ఎటు వస్తుందోనని, ముఖ్యంగా కోపంగా ఊగిపోతున్న ఆడోళ్ళ భావాలు ఎట్లా ఉన్నాయో పరిశీలిస్తూ తన రాజకీయాన్ని ప్రదర్శించాడు బ్రహ్మయ్య, బ్రహ్మయ్య ఆ ఊరంతటికీ లౌక్యం తెల్సిన పెద్ద మనిషి. కర్ర విరక్కుండా పాము చావకుండా తీర్పు చెప్పడంలో నేర్పరి. ఊరి సమస్య ఏదైనా ఊళ్ళో పెద్దరికాన్ని నిలుపుకుంటూ వస్తున్నాడు. ఏ గొడవైనా చిటికెలో తెగ్గొట్టే బ్రహ్మయ్యకు కూడా ఇవ్వాల్టి పంచాయితీ గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టుగానే ఉండి మాట పెగల్టం లేదు. ఏదేమైనా లౌక్యంగా సమస్యను పరిష్కరించి తన పెద్దరికాన్ని నిలుపుకోవడం ఎలా అని నిన్నట్నించి గుంజాటన పడుతూనే ఉన్నాడు. గొడ్ల సమస్యో, పొలం గట్ల సమస్యో, చెరువు నీళ్ళ సమస్యో, పంపకాలో, అంపకాల సమస్యో అయితే తేల్చేయడం చిటికెలో పని. కానీ ఇది ఊళ్ళో ఎన్నడూ జరగంది. ఏం మాట్లాడితే ఏమవుతుందోననే బెరుకు బ్రహ్మయ్యలో తొలిసారిగా చోటు చేసుకున్న గొడవది.

తిరుపతయ్య, నారాయణ అన్నదమ్ములు. తిరుపతయ్య భార్య తిరుపతమ్మ వాళ్ళకు ఒక్కతే ఆడపిల్ల. పిల్ల చిన్నప్పుడే తిరుపతయ్య మధ్యరాత్రిలో పొలానికి నీళ్ళు కట్టడానికి పోయి పాముకరిచి చచ్చిపోయాడు. తిరుపతయ్యది కష్టపడి పనిచేసే మనస్తత్వం. తన భార్యా, పిల్ల కష్టపడకుండా సుఖంగా ఉండాలని రేయింబవళ్ళు గొడ్డుచాకిరి చేసేవాడు. భార్య వారించినా తిరుపతయ్య రెక్కలు ముక్కలు చేసుకుంటూనే ఉండేవాడు. తిరుపతమ్మ కూడా భర్తకు తోడై కష్టంలో పాలుపంచుకునేది. ఒక్క రోజు కూడా పాలు మారకుండా పొలం పనుల నుంచి కూలిపనుల దాకా కాయకష్టం చేస్తూనే ఉండేవాళ్ళు. ఊరు కూడా వారిద్దరినీ చూసి మెచ్చుకునేది. తిరుపతయ్య పాముకాటుకు చచ్చిపోవడంతో తిరుపతమ్మ కుంగిపోయింది. ఒకపక్క పసిపిల్ల, అటు పుట్టిల్లు, ఇటు అత్తిల్లు అంతం మాత్రమే. ఊరివాళ్ళ ఓదార్పులు, మాట సాయంతో కుప్పకూలిన తిరుపతమ్మ కోలుకొని లేచి నిలబడింది. ఉన్న ఎకరం భూమిలో ఒక పక్క వ్యవసాయం చేస్తూనే, కూలీనాలీ చేసుకుంటూ కూతురికి తండ్రిలేని లోటు రాకుండా తిరుపతమ్మ సంసారాన్ని ఒబ్బిడిగా లాక్కొస్తోంది. ఏ మచ్చా లేకుండా ఊరంతా మెచ్చుకొనేలా నిలిచింది. తిరుపతమ్మ కూతురు సుశీలకు ఇప్పుడు తొమ్మిదేళ్ళు. కూతుర్ని బాగా చదివించాలనేదే తిరుపతమ్మకున్న ఏకైక కోరిక. తిరుపతయ్య, నారాయణలు రెండు భాగాలుగా పంచుకున్న ఇంటిలోనే ఓ వాటాలో తిరుపతమ్మ కూతురు సుశీల ఎన్ని ఇబ్బందులు సబ్బందులున్నా బయటకు పొక్కకుండా కాలం గడుపుతున్నారు. ప్రతి ఒక్కరినీ వరుసలతో పిలుస్తూ ప్రతి పన్లోను ఓ చెయ్యేసే తిరుపతమ్మంటే ఊరందరికీ అభిమానమే.

తిరుపతయ్య తమ్ముడు నారాయణది తొలి నుండి కష్టపడే తత్వం కాదు. అన్నలాగా వ్యవసాయం మీద ఆధారపడకుండా బర్రెగొడ్ల దళారీగా చేస్తూ కొద్దో గొప్పో వెనకేసుకున్నాడు. తన వాటాకి వచ్చిన ఎకరం పొలానికి మరో నాలుగెకరాలు జత చేశాడు. చేసేది దళారి పని కావడంతో ఊళ్ళో నారాయణ మీద ఎవరికీ పెద్దగా గౌరవం లేదు. ఏం మాట్లాడినా "పోరా నీవూ, నీ దళారీ మాటలు" అని ఎగతాళి చేసేవాళ్ళు. చేసేది దళారీ పని కావడంతో నాలుగు ఊళ్ళు తిరగడం ఎవరి దగ్గర మాటలు వాళ్ళకి చెప్పటం అలవాటైపోయిన నారాయణకి ఊళ్ళో కూడా గౌరవం పెంచుకోవాలనే భావం పెరగసాగింది. డబ్బుంటే నలుగురూ గౌరవిస్తారనే దాంతో సంపాదనపైనే దృష్టి పెట్టాడు. దానికి తోడు గత రెండు మూడేళ్ళుగా ఊరిలో చాటుమాటుగా పారుతున్న బెల్టు షాపుల మద్యానికి నారాయణ అలవాటుపడ్డాడు. ఎక్కడా కలవని వాళ్ళు తాగే దగ్గర కలిసే సరికి, తన చుట్టూ నలుగురు గుమిగూడే సరికి తానూ ఊళ్ళో పెద్ద మనిషిలాగానే నారాయణ అనుకుంటుండే వాడు. నారాయణ చేతిలో నాలుగు డబ్బులాడుతుండటంతో తాగే అలవాటున్న వాళ్ళంతా నారాయణ పంచన చేరుతుండేవాళ్ళు.

సంతలో బర్రెగొడ్ల బేరం బాగా సాగడంతో మిట్టమధ్యాహ్నం బాగా తాగి ఇంటికొచ్చాడు. ఇంట్లో ఎవరూ లేరు. అందరూ పొలాల

మీదో, గొడ్లు తోలుకొనో, కూలిపనులకో పోవడంతో ఊరంతా కూడా పెద్దగా మనుషుల జాడలేదు. తూలుకుంటూ వచ్చిన నారాయణ పంచలో నిలబెట్టి ఉన్న మంచాన్ని వాల్చుకొని, భుజం మీద తుండుగుడ్డతో ముఖం తుడుచుకొని, జేబులోంచి సిగరెట్టు తీసి అంటించుకున్నాడు. ఇంతలో తిరుపతమ్మ కూతురు సుశీల ఒగర్చుకుంటూ వచ్చింది. సుశీలను చూసిన నారాయణ "బడికి పోలేదా'' అని అడిగాడు. ముఖానికి పట్టిన చెమటను గౌనుతో తుడుచుకొని ఇంటిముందు కొట్టంలో కట్టేసిన దూడపిల్లకు నీళ్ళు పెట్టి, మేత వేసిపోదామని టీచరుని అడిగి వచ్చినట్లు బాబాయికి చెప్పి, దూడకు నీళ్ళుపెట్టి, రాత్రి వాళ్ళమ్మ తెచ్చిన జొన్న దంట్లను తెచ్చి దూడకు వేసింది. తొట్టి దగ్గరకు వెళ్ళి కాళ్ళు చేతులు కడుక్కొని బడికి బయల్దేరింది. పంచలో మంచం మీద కూర్చొని సిగిరెట్ కాలుస్తోన్న నారాయణ సుశీలను పిలిచి "అమ్మీ లోనికిపోయి మంచినీళ్ళు ఇచ్చిపోయే'' అనడంతో వెనక్కి వచ్చి మంచినీళ్ళు తీసుకొచ్చేందుకు లోపలికి పోయిన సుశీలను గట్టిగా పట్టుకొని లోపలున్న మంచం మీద పడేశాడు. బాబాయి ఏం చేస్తున్నాడో అర్థం కాక బిత్తరపోయిన సుశీల బిర్రబిగుసుకు పోయింది. నారాయణ వెంటనే మీద పడటంతో బాబాయి తనను చంపేస్తున్నాడనుకొని భయంతో ఏడుస్తూ పెద్దగా కేక పెట్టింది. కదలకుండా పట్టుకున్న నారాయణ సుశీల నోట్లో పంచెకుక్కాడు. బాబాయి చేస్తున్న అఘాయిత్యానికి గింజుకొని గింజుకొని భయంతో, బాధతో సుశీల సొమ్మసిల్లి పోయింది. తాగిన మైకం పూర్తిగా తలకెక్కడంతో ఆ మంచం మీదే పక్కకు వాలి నారాయణ నిద్రలోకి జారిపోయాడు. కొద్ది సేపటికి తెలివొచ్చిన సుశీల జరిగింది. అర్థం చేసుకొనే ప్రయత్నం చేస్తూ, భయంతో ఏడుస్తూ, కదల్లేక లేచి నడవలేక పాకుకుంటూ వాళ్ళ ఇంటి పంచలోకి వచ్చి మంచం మీద వాలి ఏడ్చి ఏడ్చి మగతలోకి జారిపోయింది.

పొద్దుకూకుతూ ఉండగా నెత్తిమీద పచ్చిగడ్డి మోపు పెట్టుకొని, బర్రెగొడ్లను తోలుకొని పొలం నుంచి తిరుపతమ్మ ఇంటికొచ్చింది. రోజూ తానింటికొచ్చేసరికి తనకు చేతనైన పనంతా చేసి, చుట్టుపక్కల పిల్లలను చేర్చి ఆడుకుంటూనో, చదువుకుంటూనో చెంగుచెంగుమని చలాకీగా ఉండే పిల్ల పడుకొని ఉండడం చూసి గబగబా గొడ్లను కట్టేసి ఒక్క దూకున పిల్ల పడుకొన్న మంచం వద్దకు చేరుకొని "ఏందమ్మా పడుకున్నావు?'' అంటూ బిడ్డ ఒంటిమీద చేయివేసి చూసింది. పిల్ల ఒళ్ళు జ్వరంతో మండి పోతోంది. పిల్ల గజగజ వణికిపోతోంది. తల్లిస్పర్శతో ఉలిక్కిపడి కళ్ళు తెరిచిన సుశీల భయంతో తల్లిని వాటేసుకొని భయంతో పెద్ద పెట్టున ఏడవడం ప్రారంభించింది. జ్వరం రావడం వల్ల దడుచుకొని ఏడుస్తుందనుకున్న తిరుపతమ్మ పిల్లను మరింత దగ్గరకు తీసుకొని గుండెలకదుముకొని "తగ్గిపోతుందమ్మా, నేనొచ్చాను కదా, ఊరుకో'' అంటూ సముదాయించసాగింది. తల్లిని మరింత గట్టిగా వాటేసుకుంటూ సుశీల మరింత బిగ్గరగా ఏడ్వసాగింది.

"ఏంటే తిరుపతి, పిల్ల అలా ఏడుస్తుంది?'' అంటూ తిరుపతమ్మతో పాటే పొలం నుంచి వచ్చిన పక్కింటి మణెమ్మ దగ్గరకొచ్చి గోడమీద లైటు స్విచ్ నొక్కింది.

"జ్వరం ఒళ్ళు కాలిపోతుంది మణక్క'' అంటూ పిల్లను ఎలా సముదాయించాలో తెలియక గాబరా గాబరా అవుతున్న తిరుపతమ్మ చెప్పింది. లైటు వెలుతుర్లో బట్టల కంటిన రక్తాన్ని చూసి మణమ్మ ''జ్వరం కాదే తిరుపతమ్మా పిల్ల పెద్దమనిషైనట్లుంది'' అంది. కొద్దిగా గాబరా తగ్గిన తిరుపతమ్మ "పెద్దమనిషవ్వడానికి అదెంత పిల్ల'' అంటూ కూతురు వీపుమీద చేయివేసి నిమురుతూ కూర్చుంది. అనుమానం వచ్చిన మణమ్మ మంచం మీద కూర్చొని సుశీలను పట్టుకొని "ఏమైందమ్మా'' అంటూ అనునయంగా అడిగింది. ఏడుపు ఆడకుండనే బెక్కుతూ సుశీల జరిగిన విషయాన్ని చెప్పింది. విషయం విన్న తిరుపతమ్మ, మణమ్మలిద్దరూ దిమ్మెరపోయారు. విషయం అర్థమై తిరుపతమ్మ బిడ్డని గట్టిగా పట్టుకొని ఒక్కపెట్టున ఏడవసాగింది. తిరుపతమ్మ ఏడుపు చూసి మణమ్మలోనూ శోకం కట్టలు తెంచుకుంది.

వాళ్ళ ముగ్గురి ఏడుపులు విన్న చుట్టుపక్కల వాళ్ళు, అప్పుడే పొలాల నుంచి వస్తున్న వాళ్ళు ''ఏమైంది, ఏమైందంటూ'' తిరుపతమ్మ ఇంటికేసి రాసాగారు. అక్కడ సగం ఊరు పోగైపోయింది. తిరుపతమ్మ ఏడుస్తూనే "వీడి జిమ్మడ, వీడికేం పోయేకాలం, వీడిని నరికిపోగులెట్టా, అన్న కూతురే, వాయివరుస ల్లేకుండా వీడికి పోగాలం దాపురించిందేమోనో'' అంటూ గుండెలవిసేలా శోకాలు తీయడం ప్రారంభించింది. విన్నవాళ్ళకు సరిగా విషయం అర్థం కాలేదు. ఏడవడం ఆపిన మణమ్మ అందరికీ విషయం చెప్పింది. జరిగిన విషయం తెల్సుకున్న ఆడ, మగ కూడా నారాయణను తిట్టడం ప్రారంభించారు. ఆడవాళ్ళు తిరుపతమ్మ తిట్లతో గొంతు కలిపారు. "అన్న కూతురు కూతురవుతుందనే గేనం లేకుండా... వీడికి పాడికట్టా... నోరు వాయిలేని పసిపిల్లని పాడు చేసేందుకు వాడికి చేతులెట్టా వచ్చాయి... వాడి చేతులిరిగిపోను... వాణ్ణి తీసుకెళ్ళి ఊరికుత్తరాన దొర్లించా'' అంటూ తిట్ల ప్రవాహం సాగిపోతుంది. గట్టు తెగిన చెరువులా గుండెలు పగిలేలా రోదిస్తున్న తిరుపతమ్మను సముదాయించడానికి ఎవరికీ నోటమాట రావడం లేదు. కాళ్ళూ చేతులాడటం లేదు. అక్కడ గుమిగూడిన ఆడవాళ్ళంతా తల్లీకూతుళ్ళిద్దరితో కలిసి ఏడుస్తుండడంతో శవం లేచిన ఇల్లులాగా తయారైంది.

మంచం మీదే కూర్చొని ఉన్న మణమ్మ ''మొగుడు పోయినప్పుడు కూడా ఇంతగా కుమిలిపోలేదు. ఒకదాని తర్వాత ఒకటి నిన్ను వెంటాడుతున్నాయే'' అంటూ తిరుపతమ్మ తలమీద చేయి వేసి తడుముతూ "కొంచెం ధైర్యం తెచ్చుకోమ్మా! పిల్లని చూడు మరింత బిత్తరపోతుంది'' అంటూ తిరుపతమ్మను సముదాయించే ప్రయత్నం చేసింది. దాంతో తిరుపతమ్మ దుఃఖం మరింత పెరిగింది. గుండెలు బాదుకుంటూ "అక్కా నా బిడ్డని చూడవే ఎట్లా అయిందో, తోటకూర కాడలాగా ఎట్టా వాడిపోయిందో, ఇక దీని బతుకెట్టానే అంటూ బావురుమంది.

దావానలంలా జరిగిన విషయం ఊరంతా తెలిసిపోయింది. ఊరంతా అక్కడ చేరింది. కోపంతో నారాయణ ఇంటి మీద పడ్డారు. నారాయణ ఉంటేగా! ఆ సాయంత్రమే మత్తు దిగి జరిగింది అర్థమై

మెల్లగా ఇంట్లోంచి జారుకున్నాడు. ఆవేశంగా ఉన్న జనానికి నారాయణ దొరికుంటే ఏం జరిగుండేదో గాని అక్కడ పోగైన జనం నారాయణను తిడుతుండటంతో అక్కడంతా గోలగోలగా తయారైంది. కొంతమంది యువకులు నారాయణను వెదకడానికి పసికర్రలు పట్టుకొని బయల్దేరారు. ఏం చేద్దాం, ఇలాంటి దారుణం ఇంతకు ముందెప్పుడూ ఊళ్ళో జరగలేదు. చేలగట్ల మీద చేతులు పట్టుకోవడం లాంటి ఒకట్రెండు ఘటనలు జరిగున్నా వాళ్ళంతా గుమిగూడి చర్చిస్తున్నారు. ఊళ్ళో ఇంకెవరూ ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడకుండా శిక్షించాలనే చర్చ జోరందుకుంది. ఈలోపు ఎవరో కేసు పెట్టాలన్నారు. అది గుంపంతా పాకిపోయింది. అవును పంచాయతీలు, గించాయితీలు కాదు. కేసు పెట్టి జైలుకి పంపాల్సిందేనంటూ చర్చ మొదలైంది. పోలీసు కేసు అనగానే గొడవని ఎలా సద్దుమణిగేలా చూడాలా అని చూస్తున్న బ్రహ్మయ్యలాంటి పెద్ద మనుషులకు తేలు కుట్టినట్లయింది. పోలీస్ కేసు దాకా పోతే విషయం పెద్దదయిపోతుంది. దానికన్నా ముఖ్యంగా ఊళ్ళోని తమ పెద్దరికాలు పోతాయి.

దీంతో ముందుకొచ్చిన బ్రహ్మయ్య "మేం చెప్పేది కొద్దిగా వినండిరా! ఇప్పుడు పొద్దుపోయింది. కేసు సంగతి రేపు చూసుకుందాం. ముందు వాళ్ళిద్దరికి ఇంత కూడు పెట్టండి. ఎప్పుడు తిన్నారో ఏమిటో?" అన్నాడు. మాకు కూడు వద్దు కుమ్ములూ వద్దంటూ తిరుపతమ్మ బోరుమంది. ఆమెకి ఏమి చేయాలో పాలుబోవడం లేదు. బుర్రలో ఏ ఆలోచనా లేదు. శవంలాగా వేలాడిపోతున్న కూతుర్ని చైతన్యం లేనిదానిలా దగ్గరకు తీసుకొని కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది. అక్కడున్న ఆడాళ్ళు కూడా "ఇప్పుడు కూళ్ళేంతింటారులే. కూళ్ళు తినేటట్టుందా పరిస్థితి?" అంటూ గయమన్నారు. చేసేదేంలేక బ్రహ్మయ్య మిగితా పెద్ద మనుషులతో ఆ మాటా ఈ మాటా చెబుతూ దూకుతున్న యువకులకు నచ్చజెబుతూ ఏ విషయం పొద్దున్నే మాట్లాడుకుందాం అని అక్కడ్నించి అందర్నీ బయల్దేరదీశాడు. మెల్లగా ఒక్కొక్కరే తమ ఇళ్ళ మొఖాలు పట్టారు. చాలా మంది ఆడవాళ్ళు మాత్రం తిరుపతమ్మ ఇంటి దగ్గరే ఉండిపోయారు. సుశీలకు జ్వరం తగ్గిపోవడంతో ఊళ్ళో ఉన్న కాంపౌండర్‌ని పిలిచారు. కాంపౌండర్ రెండు బిళ్ళలు వేసి సుశీలకు సెలైన్ కట్టాడు. పక్కింటి మణమ్మ అన్నం తెచ్చి తినమని బలవంత పెట్టినా తిరుపతమ్మ ఎంగిలి పడలేదు. నారాయణ భార్య సుబ్బులు కూడా ఉలుకు పలుకు లేకుండా చుట్టుపక్కల ఆడాళ్ళతో పాటే అక్కడే కూర్చుని ఉంది. అక్కడ చేరిన వారంతా తన మొగుడ్ని తిడుతుంటే వాళ్ళతో కలిసి తిట్టలేక, ఊరుకోలేక ఉన్న పళంగా చచ్చిపోతే బాగుండన్నట్టుగా కదలక మెదలక అలాగే కూర్చుండిపోయింది.

ఆ రాత్రి ఊరు సద్దుమణిగే సరికి అర్ధరాత్రి దాటిపోయింది.

ఊరు సద్దుమణిగేదాకా చిల్లతోపులో తలదాచుకున్న నారాయణ తన తాగుబోతు సావాసగాణ్ణి పట్టుకొని బ్రహ్మయ్యకు కబురు చేశాడు. టార్చిలైటు చేతపట్టుకొని బ్రహ్మయ్య వెనకాముందూ చూసుకుంటూ చిల్లతోపు దగ్గరున్న నారాయణ దగ్గరకొచ్చారు. బ్రహ్మయ్యను చూడగానే నారాయణ ఒక్కసారిగా బ్రహ్మయ్య కాళ్ళు పట్టుకున్నాడు. "ఒదిన కేసు పెడుతుంది, శిక్షపడి నేను జైలుకు పోతాను నా పిల్లలు అనాధలైపోతారు, నువ్వే కాపాడాలన్నా!" అంటూ బావురుమన్నాడు. "ఈ పనెట్టా చేశావురా గాడిదకొడకా!" అంటూ బ్రహ్మయ్య నారాయణను చెడామడా తిట్టాడు. కొట్టడానికి చేయెత్తాడు. ఉదయం గొడ్ల బేరానికి సంబంధించిన డబ్బంతా నారాయణ బొడ్లోనే ఉంది. అదంతా తీసి బ్రహ్మయ్య కాళ్ళ దగ్గర పెట్టాడు. లేచిన బ్రహ్మయ్య చెయ్యి వాలిపోయింది.

"ఆ పిల్లను ఆసుపత్రికి తీసుకుపోండి, ఆ ఖర్చంతా నేనే పెట్టుకుంటాను. ఆ పిల్లను నేనే చదివించి, పెళ్ళి బాధ్యతంతా నేనే చూస్తాను. ఎలాగైనా నువ్వే గట్టెక్కించాలన్నా" అంటూ నారాయణ మరోసారి బ్రహ్మయ్య కాళ్ళు గట్టిగా పట్టుకున్నాడు. ఆలోచించిన బ్రహ్మయ్య తనను పిలుచుకొచ్చిన మనిషిని ఊళ్ళోని మరో నలుగురు పెద్ద మనుషుల్ని గుట్టుచప్పుడు కాకుండా పిలుచుకు రమ్మని పంపించాడు. ఆ నలుగురు పెద్ద మనుషులు చిల్లతోపులోకి రాగానే నారాయణను చూసి ఆవేశపడ్డారు. వారిలో ఒకాయన పళ్ళు కొరుకుతూ నారాయణ దవడమీద లాగిపెట్టి కొట్టాడు. బ్రహ్మయ్య వారిని వారించాడు. "కేసు పెడితే ఊరు పరువు పోతుంది. విషయం పేపర్లకెక్కిద్ది. మన ఊరు పేరు చేబితే మన మొఖాన ఊస్తారు. ఈ గాడిదకొడుకు పిల్ల చదువు, పెళ్ళి బాధ్యతలన్నీ చూస్తానంటున్నాడు. జరిగిందేదో జరిగిపోయింది. విషయాన్ని ఊరు దాటకుండా చూద్దాం" అని బ్రహ్మయ్య పెద్ద మనుషులతో చర్చించాడు. నారాయణిచ్చిన డబ్బులు కొద్దిగా ఆ పెద్ద మనుషులకి కూడా పంచాడు బ్రహ్మయ్య. చేతిలో డబ్బులు పడగానే అప్పటి దాకా జరిగిన ఘటన కన్నా ఊరి పరువే ముఖ్యంగా కనిపించింది. రేపేం చేయాలనే విషయంపై చర్చించుకొని అందరూ చిల్లతోపు నుంచి చల్లగా ఊరు చేరుకున్నారు.

తెల్లారింది.

ఊరంత శవం లేచిన తీరుగా ఉంది.

ఎవరూ ఏ పనిలోకి వంగలేదు, ఆకలేస్తున్నా పిల్లలు సైతం కిక్కురుమనడం లేదు. విషయం వారికి పూర్తిగా అర్థం కాకపోయినా ఏదో జరగరాని అనర్థం జరిగిందనేది అర్థమైంది. రోజూ బడికి వెళ్ళమని తరిమే తల్లిదండ్రులు ఆ ఊసే ఎత్తకపోవడంతో వారిని మరింత బెంగకు గురి చేసింది. బ్రహ్మయ్య తదితర పెద్దమనుషులు పంచాయితీకి ఎక్కువ మంది రాకుండా చూసి రెండు కుటుంబాల మధ్యే విషయం పరిష్కరించేస్తే సులభంగా ఉంటుందని, కాబట్టి ఊళ్ళోని జనం సాధ్యమైనంత తక్కువ మంది వచ్చేలా చూడాలని, ఏ కులం పెద్ద మనిషి ఆ కులం తరఫున జనాన్ని కట్టడి చేయాలనుకున్నారు.

కానీ పంచాయతీ ఉందో, లేదో కూడా తెలియదు. తెల్లారింది మొదలు చెరువు కట్టకు వెళ్ళిన వాళ్ళు, చేలకు నీళ్ళు కట్టొచ్చిన వాళ్ళు, నోట్లో పందుం పుల్లలతో సహా ఇళ్ళకి కూడా వెళ్ళకుండా దేవరగద్దెకు చేరుకోవడం మొదలు పెట్టారు. ఒక్కరొక్కరుగా ఊరంతా అక్కడికి చేరింది. ఆడవాళ్ళు చీపుర్లు పట్టి వాకిళ్ళు చిమ్మలేదు. చంటిబిడ్డ తల్లులు పిల్లల్ని చంకనేసుకొని మరి గద్దె

వద్దకు చేరుకున్నారు. లేవలేని ముసలమ్మలు సైతం పిల్లల చేతి ఆసరాతో లేచి వచ్చి ఏ గోడకో చేరబడ్డారు. కబుర్లూ, కాకరకాయల్లాంటివేమీ లేకుండానే ఊరంతా పంచాయితీ కోసం గుమిగూడటంతో ఏదో విపరీతం తప్పదని పెద్ద మనుషుల గుండెల్లో రైళ్ళు పడ్డాయి. ఊళ్ళోని జనమంతా చేరడంతో ఒక రకమైన ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది.

దేవరగద్దె. రావి, వేప చెట్లు పెనవేసుకొని ఊరి మధ్య ఏపుగా పెరిగిన మానుల చుట్టూ రాతితో కట్టిన గద్దె. ప్రతి యేట పూజలు, పునస్కారాలతో పాటు ఊళ్ళో ఏ చిన్న గొడవొచ్చినా, ఏ నిర్ణయం చేయాలన్నా ఆ గద్దే ఏళ్ళ తరబడి సాక్షిగా నిలబడతుంది. చెట్ల మొదట్లో దేవరదో, దేవతదో ఆనవాలు తెలియని పాత రాతి విగ్రహం దేవరగద్దె వద్ద జరిగే తీర్పులకు, నిర్ణయాలకు శిథిలమైనట్లు కనిపిస్తుంది.

"వాడికేం పోయేకాలమొచ్చిందో" అని ఒకరంటే.

"నేను పుట్టి బుద్దెరిగి అరవై యేళ్ళుగా ఇట్టాంటి దెప్పుడూ జరగడం వినలేదని" మరో ముసలాయన కేకరించి ఊశాడు.

"ఈ మధ్య టీవీలొచ్చిన తర్వాత అక్కడక్కడ జరుగుతున్నాయి కానీ మరీ అన్న కూతుర్ని చెరచడం మాత్రం ఎక్కడా చూడలేదు. ఎప్పుడూ చదవలేదు" మీడియా నాలెడ్జి ఉన్న యువకుడు చెప్పాడు.

రకరకాల వ్యాఖ్యానాలు, ఆగ్రహాలు చెలరేగుతున్నాయి.

పొద్దుటెండ ప్రతి ఒక్కరి ఒంటిని చిటపటలాడిస్తుండటంతో ప్రతీ ఒక్కరిలోనూ చిరాకు, కోపం చోటు చేసుకుంటున్నాయి. తెల్లారకముందే జంగిలికి గొడ్లను తోలుకెళ్ళే వీరిగాడు తొలిసారిగా గొడ్లను తోలుకెక్కనని హఠం వేసుకొని గద్దెమీదే అంటుకు పోయినట్టు కూర్చున్నాడు. నిన్న జరిగింది విన్నకాడి నుంచి కోపంతో వాడికి ఒళ్ళు గుగ్గిలం అయిపోతుంది. తలెత్తి ఒక్కమాటకి సమాధానం చెప్పడం చేతకాదనుకొనే వీరిగాడు పట్టరాని ఆవేశంతో చేతిలోని గొడ్లని ఆదలించే కర్రతో నేలని కొడుతూ చప్పుడు చేస్తుండటంతో ఆ ఘటన ఊరిజనాలకు ఎంత ఆగ్రహాన్ని తెప్పించిందో చెప్పకుండానే అర్థమైపోతుంది. ఎండ చిటపటలాడి పోతోంది. పెద్ద మనుషులింకా రాలేదు. కోపంతో ఉన్న యువకులు ఇప్పటికే ఐదుసార్లు కబురు చెప్పొచ్చారు. తాము అనుకున్నది బెడిసికొట్టడం ఊరంతా ఒక చోటకి చేరి ఆగ్రహంతో ఊగిపోతుండటంతో బ్రహ్మయ్య తదితర పెద్ద మనుషులకు చెమటలు పడుతున్నాయి. ఆవేశాన్ని చల్లబర్చి పంచాయతీని ఒక కొలిక్కి తేవడం ఇక కత్తిమీద సామేనని అర్థమైపోయింది. ఒకటికి నాలుగు సార్లు పిలుపులు రావడంతో ఇక తప్పదని పైపంచలన్నీ దులుపుకుంటూ గద్దె వద్దకు చేరుకున్నారు. అప్పటికే పిల్లా పీచుతో సహా ఊరంతా అక్కడే చేరి గోలగోలగా ఉంది.

"కొండయ్య వచ్చాడా?" అని నాగయ్య, "బ్రహ్మయ్య రాలేదా" అంటూ వెంకటరెడ్డి, "శేషయ్యని రమ్మన్నానే" అంటూ కొండయ్య ఇలా అందరూ గద్దె దగ్గరకు చేరుకున్నారు.

అప్పటికే ఓ పక్కగా మొఖాలు పీక్కుపోయి జుట్టు, బొట్లు చెదిరిపోయిన ఆడవాళ్ళంతా తిరుపతమ్మ, సుశీలలతో సహా కూర్చుని ఉన్నారు. "ఎట్టున్నారు? ఏమైనా తిన్నారా" అంటూ పెద్దమనుషులు వాళ్ళని పలకరించి తమలో తామే లోకాభిరామాయణంగా ఏదో మాట్లాడుకోవడం ప్రారంభించారు.

"ఏంది మామా అందరూ పెళ్ళికొచ్చినట్లు కూర్చొని కబుర్లాడుతున్నారు. అసలు విషయానికి రండి" అంటూ మాధవుడు అరిచినట్లు మాట్లాడటంతో ఒక్కసారిగా అక్కడంతా నిశ్శబ్దమైపోయింది. జనం తాలూకు ఆగ్రహం, అసహనమంతా మాధవుడి గొంతులో ప్రతిధ్వనించింది.

"ఏందిరా మాట్టాడేది? ఇట్టాంటి పంచాయతీ ఇంతకు ముందలెప్పుడూ జరగలేదాయే" ఎటు మాట్లాడితే ఎట్టా వస్తుందోనన్నట్లు, ముఖ్యంగా ఆడవాళ్ళ భావాలు ఎలా ఉన్నాయో పరిశీలిస్తూ తన రాజకీయాన్ని చూపించాడు బ్రహ్మయ్య.

"నాగాయన్నా నువ్వు పెద్దోడివి, పైగా ఇద్దరికీ అయినోడివి నువ్వే ఏదోకటి చెప్పే" కొండయ్య నాగయ్య మీదకు తోసే ప్రయత్నం చేశాడు.

"నేగాదు గానీ బ్రహ్మయ్య నువ్వే మాట్లాడు" అంటూ నాగయ్య తప్పుకున్నాడు.

ఎలా మొదలు పెట్టాలి, విషయం బయటకు వెళ్ళకుండా ఎలా సద్దుమణిగేలా చేయాలా అని రాత్రి నుంచి రిహార్సిల్ చేసుకొని వచ్చిన బ్రహ్మయ్యకు అక్కడి సన్నివేశం ముఖ్యంగా కుతకుత ఉడికిపోతున్న జనాన్ని చూస్తే పరిస్థితి చేయిదాటిపోయేలా ఉందని కిందా మీద పడుతున్నాడు. ముఖ్యంగా ఆడవాళ్ళు తాను చెప్పేదానికి ఒప్పుకుంటారా? తిరుపతమ్మ ఎంత వరకు ఒప్పుకుంటుందాని అక్కడున్న వాళ్ళందరిని, ముఖ్యంగా ఊగిపోతున్న యువకుల్ని జాగ్రత్తగా గమనిస్తూ వెంకటరెడ్డి, శేషయ్యల వైపు చూశాడు. మొదలుపెట్టి బ్రహ్మయ్యన్న ఏం కాదులే అన్నట్లు వాళ్ళిద్దరూ బరోసాగా చూశాడు.

ఇక తప్పదన్నట్లుగా కొంచెం గొంతు సవరించుకొని "తిరుపతమ్మా కొంచెం నెమ్మదించు, మేం చెప్పేది జాగ్రత్తగా విను ఆలోచించు. మీకు జరిగిన అన్యాయం మామూలుది కాదు. ఎవరు వచ్చి తీర్చేది కాదు. మనందరం తలదించుకునేది. ఊరే తలెత్తుకోలేని పరిస్థితి" అందరినీ ఒప్పించే విధంగా తన మాటలున్నాయో లేదో అని పెద్ద మనుషుల వేపు ఒకసారి పరిశీలనగా చూసి మళ్ళీ నెమ్మదిగా మాట్లాడటం మొదలు పెట్టాడు బ్రహ్మయ్య.

బ్రహ్మయ్య ఏం చెబుతాడోనని దుఃఖాన్ని ఉగ్గబట్టుకొని జాగ్రత్తగా వింటోంది తిరుపతమ్మ. అక్కడ గుమిగూడిన ఊరు కూడ నిశ్శబ్దంగా ఆలకిస్తోంది. జనమంతా నిశ్శబ్దంగా ఉండటంతో అక్కడ పరిస్థితి అనుకూలంగానే ఉందని భావించిన బ్రహ్మయ్య "నీ మరిది ఎప్పుడూ చేయని పనిచేశాడు. వాడికి ఏ పెద్దమ్మ నెత్తికెక్కిందో గానీ ఇంతవరకు ఏ ఆడాళ్ళనీ ఒక మాటన్నట్టు మనం ఎప్పుడూ వినలేదు. నీకు తెల్సు వాడంత చెడ్డోడు కాదు. ఏదో మహమ్మరి పూని వాడా పని చేశాడు" బ్రహ్మయ్య నచ్చజెబుతున్నట్లు

నెమ్మదిగా మాట్లాడుతున్నాడు.

"వాడు చేసింది చెడ్డపనే. మనందరం ఆ విషయాన్ని ఒప్పుకుంటున్నాం. వాడు చేసిన పనికి ప్రాయశ్చిత్తంగా సుశీలను వాడే పెళ్ళి చేసుకుంటాడంట" మాట సగంలో మింగేస్తూ బ్రహ్మయ్య నసిగినట్లు చెప్పాడు.

అప్పటిదాకా మౌనంగా కూర్చొన్న ఆడోళ్ళంతా బ్రహ్మయ్య మాటలకు ఒక్కసారిగా గయ్‌మని లేచారు. మగాళ్ళు సైతం తుపుక్కున ఊసి తలోమాట లంకించుకున్నారు, కూర్చొన్న ఆడోళ్ళు లేచి నిలబడి రేగిఉన్న జుట్లను కొప్పుగా చుట్టుకుంటూ

"వాయి వరస ఏమన్నా ఉందా?"

"ఆ పిల్ల ఎంత? వాడెంత?"

"ఇప్పుడు చేసిందే సిగ్గుమాలిన పని, దానికి తోడు ఇంకొక నీతిమాలిన పనా"

అరుపులు, కేకలతో వాతావరణమంతా గోలగోలగా మారిపోయింది.

"ఆగండ్రా! ముందు నేను చెప్పేది పూర్తిగా వినండి" అంటూ బ్రహ్మయ్య గట్టిగా అరవడంతో మళ్ళీ నిశ్శబ్దం ఏర్పడింది.

"అలా కాకుంటే నీ కూతుర్ని బాగా చదివించడంతో పాటు, నీకూ, నీ కూతురికి నచ్చిన సంబంధం తెచ్చి చేసి కట్నం ఖర్చులు, బాధ్యతంతా వాడే భరిస్తానంటున్నాడు" ఇది తమ కందరికి నచ్చిన విషయమన్నట్లుగా పెద్ద మనుషుల వైపు, తిరుపతమ్మ వైపు మార్చి మార్చి చూశాడు. తిరుపతమ్మ మౌనంగానే ఉండిపోయింది.

"అతను పెళ్ళి చేయవద్దు, పెటాకులూ చేయవద్దు ఇప్పుడు చేసింది చాలు" తన్నుకొస్తున్న కోపాన్ని, దుఃఖాన్ని ఆపుకుంటూ సాధ్యమైనంత నెమ్మదిగా గట్టిగా తిరుపతమ్మకు వకాల్తా పుచ్చుకున్నట్లుగా మణమ్మ చెప్పింది. అక్కడున్న ఆడవాళ్ళు కూడా తమ అభిప్రాయం కూడా అదే అన్నట్లుగా తిరుపతమ్మ, మణమ్మ భుజాలమీద, వీపుల మీద చేతులేశారు.

తాము చెప్పిందానికి తిరుపతమ్మ అంగీకరిస్తుందనుకున్న పెద్దలు ఆడవాళ్ళ నుంచి ఆ మాట రావడంతో తిరిగి సందిగ్ధంలో పడ్డారు. తిరుపతమ్మని, ఊరిని ఎలా ఒప్పించాలా అనే ఆలోచన చేస్తున్నారు ఎవరికి వారే.

"అది కాదే తిరుపతి ఇప్పుడేం చేద్దామంటావ్" నాగయ్య చుట్టరికం కొద్ది తిరుపతమ్మని ఒప్పించాలన్నట్టుగా.

"ఏంది మామా! దాన్నడుగుతారు. ఏం చేయాలో మీకు తెలియదా? ఇసుంటుది ఎన్నడన్నా జరిగిందా?" మళ్ళీ మణమ్మ బదులు పలికింది. తిరుపతమ్మ కన్నీరింకిపోయి స్థాణువులా కూర్చుండిపోయింది. పంచాయతీ తంతు పట్టని దానిలా బిగుసుకుపోయి కూతుర్ని మరింత పొదుపుకుని కూర్చొంది.

పెద్ద మనుషుల మాటలతో మౌనంగా ఉన్న జనంలో మెల్లగా చర్చ మొదలైంది. కొందరు పెద్ద మనుషులు చెప్పింది బాగానే ఉందంటే మరికొందరు బాగాలేదంటూ తమ వ్యాఖ్యానాల్ని ప్రారంభించారు. అయితే ఏది సరైందనే నిర్ణయానికి మాత్రం జనం రాలేకపోతున్నారు. అప్పటి దాకా ఆగ్రహంగా ఉన్న యువకుల్లో కూడా విచికిత్స మొదలైంది.

"అసలు నీవేమనుకుంటున్నావో చెప్పు? ఏం చేస్తే బాగుంటుందనుకుంటున్నావో చెప్పు అప్ప?" తిరుపతమ్మను అడిగాడు కొండయ్య.

"ఇంతూరుంది. ఇందరు పెద్దోళ్ళున్నారు. అందరూ కల్సి ఆ తల్లీబిడ్డకు అన్యాయం చేస్తారా?" ఒక నిమిషం మౌనంగా ఉండి అందరివైపు చూస్తూ "అడిపై కేసు పెట్టాల్సిందే, వాడికి శిక్ష పడాల్సిందే" మణమ్మ గట్టిగా చెప్పింది. తిరుపతమ్మ మాత్రం ఉలుకూ పలుకూ లేకుండా అలాగే కట్రాటలాగే ఏ మాత్రం చలనం లేకుండా ఉంది. "నువ్వూరుకోవే... కేసు పెడితే పోలీసుల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరగడం తప్ప న్యాయం జరిగిద్దా? పోయిన పరువు తిరిగొస్తుందా? జరిగిన అఘాయిత్యం చెరిగిపోద్దా? డాక్టర్లు, పరీక్షలు ఆ ఖర్చులు, ఈ ఖర్చులు అంటూ ఉన్న నాలుగు రాళ్ళూ ఊడగొడతారు. దీనివల్ల ఏమైనా ఉపయోగం ఉంటుందా? నువ్వు ఒక్కసారి ఆలోచించు తిరుపతి!" తిరుపతమ్మ నుంచి సమాధానం ఆశిస్తూ బ్రహ్మయ్య చెప్పాడు. బ్రహ్మయ్య మాటలు ఒప్పించేట్టూ, భయపెట్టేట్టు ఉన్నాయి.

"అయితే మీరు చెప్పేది ఏంది మామా? ఇవన్నీ ఉంటాయని తప్పు చేసిన వాడ్ని వదిలేద్దామా" అక్కడ జరుగుతున్న తతంగాన్నంతా చూస్తున్న భారతమ్మ లేచి ప్రశ్నించింది. భారతమ్మ వెంకటరెడ్డి కూతురు. ఆ ఊరి బడిలోనే టీచర్‌గా పనిచేస్తోంది.

భారతమ్మ అడిగిన దానికి ఏం చెబుతారన్నట్లు అందరూ పెద్ద మనుషులు వైపు చూశారు.

"ఎందుకు వదిలేస్తున్నామే భారతి. పెళ్ళి, కట్నం, చదువు, ఖర్చు అన్నీ వాడిమీదే వేస్తున్నాం గదా. అదీ చాలకపోతే ఒక ఎకరం పొలం అమ్మి పిల్ల పేరు మీద ఇప్పుడే రాయిద్దాం. దానికన్నా పెద్ద శిక్ష ఏముంటుంది? వాడు జైలుకి పోతే వీళ్ళకు ఒరిగేదేముంటుంది" చెప్పాడు శేషయ్య దీనికి మించిన న్యాయం ఇంకేమీ లేదన్నట్లు.

"ఇంత జరిగాక దాన్ని పెళ్ళెవరు చేసుకుంటారు పెద్దయ్యా? అయినా ఇప్పుడే పెళ్ళి చేస్తారా. అది పసిగుడ్డు పెళ్ళికి ఐదారేళ్ళు పట్టొచ్చు. అప్పటికి రాజెవరో, రెడ్డెవడో" మీరు చెప్పేది బాగా లేదన్నట్లుగా చెప్పాడు యువకుల్లోంచి ముందుకొచ్చిన గోవిందు.

"ఆనాటికేదో గంతకు తగ్గ బొంత దొరక్కపోదు. పెళ్ళీ, భూములతో న్యాయం జరుగుతుందా. అయినా అప్పటికి నేనేం చేయలేను నా పరిస్థితేం బాగాలేదు అని నారాయణంటే మీ పెద్ద మనుష్యులు ఏమైనా చేయగలరా? గాలిలో దీపం పెట్టి దేవుడా అన్నట్టుంది గానీ న్యాయం చేస్తున్నట్లు లేదు. ఇప్పుడు చేసిన నేరానికి ఎప్పుడో శిక్ష అనడం న్యాయంగా లేదు" ఖండితంగా చెప్పింది భారతి.

భారతి, గోవిందుల మాటలతో చాలా మంది మొఖాలలో ఆనందం కనిపించింది. "ఆ శిక్ష ఏదో ఇప్పుడే పడాలి. ఎప్పుడో జరిగిద్ది అనడం నక్కబోయిన తరువాత బొక్క కొట్టుకున్నట్టుగా ఉందిరా" అంది సీతమ్మ పిన్ని.

తిరుపతమ్మ మాత్రం ఏ చలనం లేకుండా జరిగే దానికి ప్రేక్షకురాలిగా అలానే కూర్చొని ఉంది.

"అరే ఈ ఆడోళ్ళకి ఎంతసేపు శిక్ష, శిక్ష, శిక్ష తప్ప మరొక ఆలోచన లేదు. అది ఏదో ఈళ్ళే ఏసేట్లున్నారు" కొంచెం కోపంగా కసరడంతో అందరూ ఒక్కసారిగా మౌనంగా ఉండిపోయారు. యువకులు మాత్రం కుతకుతలాడిపోతున్నారు. పెద్ద మనుషులకు నారాయణ ఏదో మేపాడన్న గుసగుసలు వారిలో బయల్దేరాయి. దీంతో పరిస్థితి పక్కదారి పడుతుందని భావించిన బ్రహ్మయ్య కొంచెం తగ్గి "కేసు కోర్టుకు వెళితే బోనులో నిలబెట్టి లాయర్లు ఎన్ని ప్రశ్నలు వేస్తారో తెల్సా? ఇప్పుడు జరిగిన దానికన్నా అప్పుడు జరిగే అవమానమే ఎక్కువ. పైగా కేసంటే గొడవంతా పేపర్లలో వస్తుంది. దాంతో మనూరోళ్ళంటేనే ఎక్కడికెళ్ళినా మొఖాన తుపుక్కున ఊస్తారు" ఆఖరి అస్త్రాన్ని మెల్లగా వదిలాడు.

"అది కాదే తిరుపతి నువ్వన్నట్లు కేసు పెడదాం, శిక్ష పడిద్ది. వాడు జైలుకు పోతాడు. ఆడి పెళ్ళాం రోగిష్టి సుబ్బి, ఆడి నలుగురు పిల్లల్ని ఎలా బతికిస్తాదే! బతకలేక వాళ్ళు నుయ్యో గొయ్యో చూసుకుంటే... ఆ పాపం నీకెందుకే? వాడు జైలుకి పోయినా ఒరిగేదేం లేదుకదా, వాడి పెళ్ళాం పిల్లల ముఖం చూసి కొంచెం పెద్ద మనస్సేసుకొని వాడిస్తానంటున్న భూమి తీసుకొని వదిలేయవే" ఒప్పించే ధోరణిలో చెప్పాడు నాగయ్య.

ముందు పెళ్ళి బాధ్యత అన్నారు, ఆ తర్వాత భూమన్నారు, ఇప్పుడేమో ఆడి పెళ్ళాం పిల్లల్ని చూపి తిరుపతమ్మ మనస్సు మెత్తబడేట్లు చేయాలనుకుంటున్నారు. రేపు ఇంకేవడైనా ఇలాంటి అఘాయిత్యమే చేస్తే ఇంతేనా... ఆడవాళ్ళలో గుసగుసలు మొదలయ్యాయి. జనంలో కూడా రెండు రకాల వాదనలు పై చర్చ జరుగుతోంది. ఇవన్నీ చలనం లేకుండా కూర్చొన్న తిరుపతమ్మ చెవిన పడుతూనే ఉన్నాయి.

తిరుగులేని అస్త్రం మౌనంగా కూర్చొన్న తిరుపతమ్మ తన ఒడిలోని సుశీలను పక్కనున్న మణమ్మకిచ్చి లేచి నిలబడి తన జుట్టు ముడేసుకొని ముందుకొచ్చి

"ఛీ! మీ పంచాయితీ మీద చాడుబొయ్య, ఇదో పంచాయితీ. దీనిని నేను కట్టుబడి ఉండాలా? ఈ తీర్పు చెప్పే వాళ్ళంతా పెద్ద మనుషులా? వాడిచ్చిన మందు తాగి డబ్బు తిని పంచాయితీ చేస్తున్నారా? రాత్రి నుంచి చూస్తున్నా రేపు మీ పిల్లలకు జరిగినా ఇలాగే తీర్పు చెబుతారా? ఇవాళ నా పిల్లకైంది. రేపు మీ పిల్లలకు కాదా? ఎల్లుండి ఇంకొకరి పిల్లకైద్ది".

హఠాత్తుగా తిరుపతమ్మ తూటాలుగా మాటలు పేల్చడంతో పంచాయితీ పెద్దలు అలా చూస్తుండి పోయారు. కొండయ్య తేరుకొని "ఏంది తిరుపాలు అలా విరుసుకు పడుతున్నావు. మేం చెప్పేది కొంచెం వినవే" నెమ్మదిగా అన్నాడు.

"ఏంది వినేది నిన్నటి నుండి వింటూనే ఉన్నా" నిప్పులు చెలరేగుతున్న సురీడ్లా ఉందామె. "ఎంతసేపు వాడు, వాడి పిల్లలు భవిష్యత్ జూస్తున్నారు తప్పా చెయ్యరాని నేరం జేసినోడికి శిక్ష పడాలని పంచాయతి ఆలోచించటం లేదు". వస్తున్న ఉక్రోషాన్ని, దుఃఖాన్ని, కోపాన్ని దిగమింగుకుంటూ బాధగా అరిచింది. కళ్ళు తుడుచుకుంటూ మౌనంగా తలలూపారు ఆడాళ్ళంతా.

"నువ్వన్నది నిజమే తిరుపాలు. వాడు చెయ్యరాని నేరం జేసినాడు. మేం కాదనటం లేదు. తిరుపతయ్య పొయ్యిన కాణ్నుంచి నువ్వు, నీ పిల్ల బ్రతకటానికి నువెన్ని కష్టాలు పడుతున్నావో నీకు తెలియదా? మాకు తెలియదా? వాడు జైలుకి పోతే? వాడి పెళ్ళాం, పిల్లలు గురించి కొద్దిగా ఆలోచించవే. కొంచం మనస్సు జేసుకోవే" తిరుపతమ్మకు నచ్చజెప్పే ధోరణిలో అన్నాడు నాగయ్య.

"రాత్రి నుంచి ఆలోచిస్తున్న, రాత్రి నుండి మనస్సు జేసుకుంటున్నా. చేయరాని నేరం చేసిన వాడికి శిక్షపడాలని ఒక్కడైనా చెబుతాడేమోనని చూస్తున్నా, ఎంతసేపూ వాణ్ని వెనకేసుకు రావడమో తప్ప, నా కూతుర్ని వాడు చదివించి పెళ్ళి చేసేదేంటి? వాడి భూమి నా కూతురికిచ్చేదేంది? నా రెక్కలున్నాయి. ఏం ఫర్వాలేదు. ఇక సుబ్బులు, పిల్లలు ఎలా బతుకుతారో అనేకదా మీ జాలి. వాళ్ళని నేనే బతికిస్తా కూలో నాలో చేసి, నా పిల్లతో పాటు వాళ్ళనీ నేనే సాకుతా! మీరూ... మీ పంచాయితీ" తుపుక్కున కాండ్రించి ఊసింది తిరుపతమ్మ.

తిరుపతమ్మ అలా నిప్పులు చెరగడం చూసి అందరూ మాన్పడిపోయారు. ఆడవాళ్ళు ఊరిజనం మొఖాల్లో ఆశ్చర్యం, ఆనందం కనబడింది.

"నాగయ్య మామా ఇంకెందుకు లెగండి పోదాం ఇది తేలే పంచాయితీలా లేదు. మన ఊరి పరువు పోకుండా మనం ఆలోచిస్తుంటే మనల్నే ఏలెత్తి చూపుతోంది" అంటూ బ్రహ్మయ్య లేచి పైపంచ దులుపుకొని భుజాన వేసుకున్నాడు. బ్రహ్మయ్యతో పాటు పెద్ద మనుషులు మొఖాలన్నీ మాడిపోయాయి.

తిరుపతమ్మ విసురుగా మణమ్మ చేతిలోని బిడ్డను తీసుకొని భుజానేసుకుంది. మిగతా ఆడవాళ్ళు కూడా లేచి నిలబడ్డారు.

వెంకటరెడ్డి, బ్రహ్మయ్య చెయ్యిపట్టి లాగుతూ "కూర్చో బ్రహ్మన్న. ఒదిన బాధలో ఉంది. వినట్లేదని మనమూ పోతే ఎట్లా. అర్థమయ్యేట్లు కొంచెం నెమ్మదిగా చెబుదాం. ఊరి పరువు పోతుందని నచ్చ జెబుదాం" అన్నాడు.

"ఇంకేంటి పంచాయితీ... ఇంకేం ఊరి పరువు?" యువకుల్లోంచి ఎవరో తీవ్రంగా గర్జించారు.

నిప్పులు చెరుగుతున్న తిరుపతమ్మ పోలీస్‌స్టేషన్ ఉన్న ఊరిబాట పట్టింది. యువకులు, ఆడవాళ్ళు పిల్లలు సైతం ఆమెను అనుసరించారు. నారాయణ పెళ్ళాం సుబ్బులు కూడా తిరుపతమ్మని అనుసరించింది. గుంపులో ఎవరంటించారో కానీ ఊరి చివర బెల్టు షాపు పాకకు నిప్పంటుకుంది. మంటలు ఉవ్వెత్తున లేచాయి. ఆ మంటల్లోంచి దారిన బారులు తీరి నడిచిపోతున్న జనం గద్దె మీద నిలబడి చూస్తోన్న పెద్దలకు కనిపించారు. అప్పటిదాకా చేతిలో కర్రతో గద్దెమీదే కూర్చొని కదలకుండా మెదలకుండా కూర్చున్న గొడ్ల వీరిగాడు లేచి నిలబడి ఒక్కసారిగా చేతిలో కర్రతో గద్దెమీద దేవర విగ్రహంపై గట్టిగా కొట్టాడు. విగ్రహంతో పాటు వీరిగాడి చేతిలోని కర్రగూడా పీలికలుగా చిట్లిపోయింది. అప్పటిదాకా చెట్టుమీద మౌనంగా ఉన్న కాకులన్నీ పెద్దగా అరుస్తూ గుంపుగా ఎగిరేయి.

# సన్ స్ట్రోక్!

## బమ్మిడి జగదీశ్వరరావు

ఎండలు యెక్కువయ్యాయి. ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఆకులు రాలిపోతున్నాయి. పిట్టలు రాలిపోతున్నాయి. పిట్టల్లా జనమూ రాలిపోతున్నారు. వడదెబ్బ వడుపుగా దెబ్బ కొడుతోంది. వందల్లో ప్రాణాలు వడగాల్పుల్లో కలిసిపోతున్నాయి. పిల్లా పిచ్చుకా తేడా లేదు. ముసలీ ముతకా కానే కాదు. పడుచూ వయసూ లేనే లేదు!

నిజమే! సూర్యుడు మండుచున్న వాయుగోళమే!

ప్రాణనష్టం అంతకంతకూ పెరుగుతుంటే ప్రభుత్వం కేబినేట్ సమావేశం ఏర్పాటు చేస్తూ మంత్రుల్నీ ఎం.పి., ఎం.ఎల్.ఎ.లనీ అధికారుల్నీ అందర్నీ హాజరుకమ్మంది.. అయ్యారు!

ఎజెండాలో వొకే వొక్క అంశముంది. అది 'సన్ స్ట్రోక్'!

ముఖ్యమంత్రి అధ్యక్షత వహిస్తూ సన్ స్ట్రోక్ పట్ల కేర్‌గా కేర్ ఫుల్‌గా ఉండాలన్నారు! 'మీ సన్ కయితే మీ సీయమ్ము సీటు గ్యారంటీ.. మరి మా సన్ లకి?' అని లోలోపల అణుచుకున్నారు. గొణుక్కున్నారు. నిట్టూర్చారు. వినయంగా చూసారు. అక్కడ చేరిన ప్రతినిధులు!

'సన్ స్ట్రోక్' అని అనగానే అందరూ తమ తమ సన్స్ ని తలచుకున్నారు. పైకి మాత్రం ఎవరి సన్ను? వారి సన్నా? వీరి సన్నా? ఎవరెవరి సన్ను? అంటూ తమ తమ సన్ ల మీదికి మళ్ళారు! చర్చా మళ్ళింది!

"మావాడు పెళ్ళయిన అమ్మాయిని రోడ్డు మీద వేధించాడట.. పెళ్ళికాని అమ్మాయిని వేధిస్తే తప్పులేదా? చెయ్యి పట్టి లాగితే ఏదో రేప్ చేసేసినట్టు మీడియా నానా యాగీ చేసింది.. రాష్ట్రం కోసం ఇంత కష్టపడుతున్నాం.. మా పిల్లలకి ఆమాత్రం ప్రివిలేజి లేదా?.. ఆ?.. పైగా పోలీసులు.. అరెస్టులు.. కేసులు.. కోర్టులు.. సిచ్యువేషన్ వెరీ బ్యాడ్..!"

"ఆమధ్యన మావాడు ఎయిర్ పోర్టు ఉద్యోగిని కొట్టాడని కూడా కేసు.. లేనిపోని న్యూసెన్సు.. పేరుకే నేను రాష్ట్రానికి మానవ వనరుల మంత్రిత్వ శాఖకి మంత్రిని! వొక్క మానవ వనరుని మా వాడు ముచ్చటపడి వాడుకుంటే.. ప్రభుత్వ ఉద్యోగి మీద చెయ్యి చేసుకోవడం నేరమట.. ఘోరమట.. ప్రభుత్వం మనది కాని ప్రభుత్వ ఉద్యోగి మాత్రం మనోడు కాడు.. వాటీజ్ దిస్ నాన్సెన్సు?"

"అయ్యో మావాడు కారు రేసింగ్ చేశాట్ట.. మంత్రి.. అందునా కేంద్రమంత్రి పిల్లలు కారు నడపకూడదటండీ.. మనం ప్రభుత్వం నడపడం లేదూ.. వాళ్ళు కారు నడిపితే తప్పా..? ప్రభుత్వాన్ని వేగంగా నడిపితే అభివృద్ధి! మరి అంతే వేగంగా మావాడు కారు నడిపితే అరాచకం! అంతకు మించి నేరం..!"

"టూమచ్ కాకపోతే రాజధాని కోసం స్వచ్ఛందంగానే రైతులు భూములు యిస్తున్నారని చెప్పి మనం భూములు లాక్కోడంలేదా? రైతులు వాళ్ళకి వాళ్ళుగా ఇస్తారా? నయానో భయానో తీసుకున్నట్టే భూములు మావాడూ కొన్నాడూ తీసుకొన్నాడూ.. నమ్మాడూ.. అమ్మాడూ.. అది రియలెస్టేటట.. రాజధాని నిర్మాణం రియలెస్టేట్ కాదా? మా పిల్లలైనందుకు రియలెస్టేట్ కూడా చెయ్యకూడదంటే ఎట్టా..?"

"మన ప్రభుత్వమే మద్యం అమ్మితే తప్పుల్యా.. మన ప్రభుత్వమే మద్యం మీద ఆధారపడితే తప్పుల్యా.. మన ప్రభుత్వమే మద్యం కొనుగోల్లకీ అమ్మకాలకీ అబ్కారీ శాఖ పెడితే తప్పుల్యా.. నడిపితే తప్పుల్యా.. మావాడు తాగితే తప్పు.. ఊగితే తప్పు.. ప్రభుత్వంలో ఉన్నందుకు సిగ్గుపడుతున్నాను..!"

"మావాడు గిరిజన భూములు లాక్కున్నాడని గొడవ.. యాం..? మన ప్రభుత్వం పరాయోడు ఎవడో ముక్కూ మొగమూ తెలియనోడు దేశ దేశాల దాటి ఏడు సముద్రాలు దాటి వస్తే.. వాడికి 'తప్పుకో తలకెత్తుకో'మని.. మనీ రాయితీ ఇచ్చి పర్యావరణం అనుమతులిచ్చి.. ప్రజానీకం అడుగుతోందని పోలీసుల్ని దించి కాల్చి చంపి.. ఎక్సుగ్రేషియా లిచ్చి.. అన్ని అండ దండలూ వాళ్ళ మెళ్ళో ఏసినారే.. మరి పార్టీ కోసం పగలూ రాత్రీ పని చేసిన నాయకులూ వాళ్ళ పిల్లలూ వీపీలు.. వాళ్ళేమో వీఐపీలు.."

"రోడ్డు మీద సైడ్ ఇవ్వకుండా వోవరు టేక్ చేస్తే మావాడు చేసిన వాణ్ణి పట్టుకు తన్నాడు! ఏం మన పోలీసులయితే తన్నరూ? ముద్దెట్టుకుంటారు? మావాడు దేశ పౌరుడిగా బాధ్యత వహించాడని అనుకోవచ్చుగా? గర్ల్ ఫ్రెండ్ ముందు హీరోయిజం ప్రదర్శించడానికి మావాడు కొట్టాడట! విలనిజం తప్పవుద్ది గాని హీరోయిజం ఎట్ట తప్పవుద్దో తెలడంలా? మావాడు నిజంగానే హీరో! డూప్ తో చేస్తే డూప్ అంటారు! డూప్లికేట్ అంటారు! వొరిజినల్ గా ఫైట్ చేస్తే మెచ్చుకోకుండా అట్ట కొట్టాడని.. ఇట్ట కొట్టాడని.. ఏడుపులు.."

"అయ్యో మామూలు ఇసుక అమ్మితే లేదు, సిలికాన్ ఇసుక అమ్ముకుంటే కూడా తప్పే! లోకంలో యెవడు చేసినా యాపారం! మావాడు చేస్తే యవ్వారం! మా పిల్లలు ఏది చేసినా దందా.. దౌర్జన్యం.."

"మనం పెద్దలం.. అనుభవం ఉన్న వాళ్ళం.. మనకి టైం ఉండదు.. ప్రజలకి అందుబాటులో మన పిల్లలు ఉండి చూసుకుంటే.. ఇలా కాదు అలా అంటే.. సెటిల్మెంట్లు చేస్తున్నాడని ప్రచారం చేస్తున్నారు.. తంతే తప్ప మన మాట ఎవడూ వినడు! అందుకని తంతే అదీ తప్పే.."

"సెలబ్రిటీల పిల్లలు పిల్లలు కారా? వాళ్లకి చిన్న చిన్న సరదాలూ సరసాలూ ఉండవా? ముద్దు ముద్దు కోరికలు ఉండవా? మనకిచ్చే ప్రోటోకాల్ మన పిల్లలకి ఇవ్వాలి.. అప్పుడే జనాల్లోకి వెళతారు!

# అమరుల స్థూపాలు - విప్లవ సంస్కృతి

*భూసారం*

అమరుల విగ్రహాలు, స్థూపాలు విప్లవ వీరుల త్యాగాలకు, అమరత్వానికి చిహ్నాలు. జన హృదయాల్లో వారి త్యాగాలు సదా గుర్తుండటానికి, వారి విప్లవ ఆశయాలను మరువకుండా నిలబెట్టుకుని వర్తమాన, భవిష్యత్ విప్లవాచరణకు స్ఫూర్తి నిస్తాయనే ఆలోచనల ప్రేరణతో మనం అమరుల స్థూపాలను నిర్మించుకుంటున్నాం.

నిజానికి వ్యక్తుల విగ్రహాలు, స్థూపాలు, స్థూప నిర్మాణాలు ఫ్యూడల్, బూర్జువా సంస్కృతి కొనసాగింపుగా విప్లవ సంస్కృతిలోనికి వచ్చి చేరిన పరాయి సంస్కృతే గాని ప్రత్యేకమైన విప్లవ సంస్కృతి కాదు. రాచరిక, భూస్వామ్య, బూర్జువా వ్యవస్థలు తమ వ్యవస్థ నాయకులకు ప్రజల్లో ప్రాచుర్యం కలుగచేయడానికి, ఆ వ్యవస్థను శ్లాఘనీయంగా పైకెత్తి స్థిరపరచే ప్రక్రియలో విగ్రహ, స్థూప నిర్మాణ సంస్కృతిని పెంచి పోషిస్తూ వచ్చాయి.

ఈ వ్యవస్థలపై పోరాడే విప్లవ శ్రామిక శక్తులు తమ నాయకులకు, పోరాట యోధులకు, ఈ వ్యవస్థలను రద్దు చేసే పోరాటంలో త్యాగాలు చేసి, నేలకొరిగిన వీరులకు బూర్జువా స్థూపాలకు పోటీగా, శ్రామిక శ్రేణులు కూడా తమ వర్గ చిహ్నాలుగా విగ్రహాలు, స్థూపాలు నిర్మించుకోవడం బూర్జువా ఆనవాయితీకి కొనసాగింపేనని చెప్పాలి.

స్థూపాలకు కూడా వర్గ స్వభావముంటుంది. ఈ నిర్మాణాలు వర్గ పోరాటంలో భాగం. ఐతే అటు బూర్జువాలకు గాని, ఇటు విప్లవకారులకు గాని ఈ స్థూప నిర్మాణాల వ్యవహారంలో 'సెంటిమెంట్'అనేది ఒక కామన్ ఫ్యాక్టర్‌గా స్థిరపడింది. అంటే.. బూర్జువాలకు బూర్జువా సెంటిమెంట్ ఉన్నట్లే, విప్లవకారులకు కూడా విప్లవ సెంటిమెంట్ ఉంటున్నది.

బూర్జువాల సెంటిమెంట్ గబ్బుగా, జబ్బుగా, ప్రమాదకరంగా, ప్రజా వ్యతిరేకంగా మారడాన్ని విప్లవకారులు వ్యతిరేకిస్తారు, ఖండిస్తారు, అడ్డుకుంటారు. అంతేగాక, తమ విప్లవ కార్యాచరణలో ముందంజ వేసినప్పుడు బూర్జువా విగ్రహ, స్థూప సంస్కృతిని, బూర్జువా చిహ్నాలను కూల దోసి, విప్లవ చిహ్నాలను నిర్మించుకోవడమన్నది శ్రామిక వర్గ పోరాట సంస్కృతీ నిర్మాణంలో భాగమై కొనసాగుతూ వస్తున్నది. అయితే.. ఇది నిజమైన శ్రామిక వర్గ విప్లవ సంస్కృతేనా?

శ్రామిక వర్గ చిహ్నాలను కూలగొట్టే పనిని బూర్జువాలు, బూర్జువా రాజ్యం కూడా చేస్తుంది. అంటే ఈ స్థూపాలు కట్టడం, కూలగొట్టడం అనేది వర్గ యుద్ధంలో, ప్రజా యుద్ధంలో భాగమే అని చెప్పాలి. ఇది గత, వర్తమానాల్లో మనం చూస్తూ వస్తున్నాం. శ్రామిక రాజ్యంలోనే శ్రామిక ద్రోహులు.. గోర్బచేవ్లు, ఎల్సిన్లు పుట్టుకొచ్చి సోవియెట్ రష్యాలో లెనిన్ స్టాలిన్‌ల విగ్రహాలను, విప్లవ విజయ చిహ్నాలను ఖండ ఖండాలుగా చేసి కూల్చడం మనం మరిచిపోలేం. తెలుగు నేలపై ఇంద్రవెల్లి నుండి తెలంగాణ అంతటా వందలాది విప్లవ స్థూపాలను బూర్జువా రాజ్యం కసితో కూలగొట్టడం మన మదిలో మెదులుతూనే ఉంటుంది. నక్సల్బరీ విప్లవ పవనం ఉవ్వెత్తున ఎగసిపడుతున్న దశలో, కలకత్తా నగరంలో యువకులు 1969-70 కాలంలో విప్లవ కార్యాచరణలో భాగంగా ప్రముఖ బూర్జువా నాయకుల విగ్రహాలను కూలగొట్టడం మనకి తెలుసు.

బూర్జువా నిర్మిత నగరాల నిండా అన్ని రహదార్ల కూడళ్ళలోనూ బూర్జువా వర్గ ప్రముఖుల విగ్రహాలే ఉంటాయ్. వీరంతా పేరుమోసిన శ్రామిక వర్గ ద్రోహులే అన్నది కాదనలేని వాస్తవం. ఒకటి అరా మినహాయింపులు ఉండొచ్చు కాని.. పబ్లిక్ పార్కులు, క్రీడా మైదానాలు, రవాణా సౌకర్యాల నిర్మాణాలు, రహదార్లు, వీధుల పేర్లు అన్నీ కూడా దోపిడీ పీడక అగ్రవర్ణ పెద్దలవే అయి ఉంటాయి.

బూర్జువా స్వాతంత్రం వచ్చిన తొలినాళ్ళలో గాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్ ల చిత్ర పటాలు, విగ్రహాలు ఇంటా, బయటా, ప్రభుత్వ ఆఫీసుల్లో, రహదారుల కూడళ్లలో దేశమంతా వెలిశాయి. రాను రాను ప్రాంతీయతా భావజాలం పెరిగి ఆయా ప్రాంత, స్థానిక నాయకుల విగ్రహాలు జాతీయ నాయకుల స్థానాలను ఆక్రమించు కున్నాయి. బూర్జువా పార్లమెంటరీ ఓట్ల రాజకీయాలు గుండాలకు, సారా కాంట్రాక్టర్లకు, హంతకులకు నిలయమై ఇటువంటి వారి విగ్రహాలు ఆ యా ప్రాంతాల్లో కుక్కగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. దళిత చైతన్యం ఉద్యమ రూపం దాల్చి డాక్టర్. బాబాసాహెబ్

---

మన పార్టీకి రేపు కేడరవుతారు! కార్యకర్తల్ని చూసుకుంటున్నాం.. కన్న బిడ్డల్ని చూసుకోలేక పోతున్నాం! కన్న బిడ్డల్ని చూసుకోకపోతే.. రేపు ప్రజల్ని ఏమి చూస్తామని యెవరన్నా అంటే.. ఏమి చెప్పాలి?''

"సన్ స్ కు అత్యంత ప్రాధాన్యతనివ్వాలి! అర్జెంటుగా అన్ని కేసుల్ని ఉపసంహరించుకోవాలి!''

ముఖ్యమంత్రిగారు మారు మాట్లాడలేదు! పార్టీ పెద్దలందరూ తన తర్వాత చిన బాబే ముఖ్యమంత్రి అని ముక్త కంఠంతో వొకటికి పది సార్లు మీడియాల ముందు ప్రవచించడం గుర్తుకు వచ్చింది! పిల్లలైనా ప్రభుత్వమైనా తప్పటడుగులో తప్పటడుగులో వేస్తారు.. వారికి ఆ హక్కుంది అని చెప్పి సమావేశాన్ని ముగించారు!

అసలు సన్ కూడా అవాక్కయాడు! మరింత ఎర్రగా గుర్రుగా ఎండగా మండగా చూసాడు! నలభై అయిదు డిగ్రీలను దాటాడు!

పిచ్చి జనం పనీ పాటా లేనట్టు పిట్టల్లా రాలుతూనే ఉన్నారు!



# రారాసి (రామారావు సింగంపల్లి)

(15-01-1952)-(01-04-2016)

*సింగంపల్లి అశోక్‌కుమార్*

విప్లవ రాశి
అతిచైతన్య సాహిత్యరాసి
సామ్యవాద సమర పిపాసి
ఎగరేసిన ఎర్రని జెండా
శ్రీశ్రీ ప్రేమికుడు రారాసి

- మహాప్రస్థాన పుత్రుడు

'నీ జైళ్ల చట్టాల దమనకాండ కుట్రరా / హింసతో నిజాన్ని బంధించాలన్న

నీ తాబేరుతనం కుట్రరా / నిర్మల కంఠాల్ని శిక్షిస్తోన్న నీ దళారీతనం కుట్రరా /

నా సోదరులకు అగ్గి సోకడం కుట్ర కాదురా / సత్యం మంట కుట్ర కాదురా /

దేశభక్తి కుట్ర కాదురా / విప్లవం కుట్ర కాదురా...కాదు'- అంటూ

**1974** మే 18-21ల మధ్య విప్లవ రచయితల( త్రిపురనేని, వరవరరావు, ఎం.టి.ఖాన్, ఎం.రంగనాథం)పై కుట్రకేసు బనాయించి జరిపిన అరెస్టులకు నిరసనగా కాకినాడ విరసం యూనిట్ సంధించిన శతఘ్ని 'కుట్ర... కుట్ర... కుట్ర' బులెటిన్‌లో ఎలుగెత్తి విరుచుకు పడిన రారాసి విప్లవ రచయిత, విరసం రచయిత, కవి, నిబద్ధ కార్యకర్త.

తూర్పు గోదావరి జిల్లాలో గుర్రపుజట్కా వృత్తి కార్మికుడైన పైడయ్య, రాజమ్మ దంపతుల ఆరుగురు సంతానం(నలుగురు మగ, ఇద్దరు ఆడ)లో చివరి వాడైన రామారావు తన రెండో సోదరుడు కార్పెంట్ వర్క్సు శ్రామికుడు, కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఎం) సభ్యుడు అయిన సింగంపల్లి చంద్రరావువద్ద సొంత కొడుకులా పెరిగాడు.

ఎలిమెంటరీ విద్య అనంతరం, హైస్కూలు విద్య సగంలో విరమించాడు. ఆ తరువాత మెట్రిక్యులేషన్ పూర్తి చేయలేక పోయాడు. అసలు బడి చదువులకే దూరమయ్యాడు. కారణం- 1.కేరమ్స్, 2.కేరమ్స్, 3. కేరమ్స్. కేరమ్స్ ఆట అతన్ని నిలువెల్లా ఆవహించింది. కాయిన్ బోర్డుపై ఏ ప్లేసులో ఉన్నా పాకెట్ చేయడం అతని ప్రతిభ. అతని పాకెటింగ్ చూడడానికి జనం గుమిగూడేవారు. అతని పాకెటింగ్‌పై బెట్టింగులు కట్టేవారు. ఆ బెట్టింగుల కోసం, పగలంతా ఆడించేవారు. పగలే కాకుండా రాత్రిని ఫ్లడ్‌లైట్లతో

*(మిగతా 39వ పేజీలో.. )*

అంబేద్కర్ విగ్రహాలు దళిత చైతన్య చిహ్నాలుగా దేశమంతా వెలిసాయి, వెలుస్తున్నాయ్.

ఇండియాలో ఒకప్పటి కమ్యూనిస్ట్ కంచుకోటలుగా పేరు గాంచిన అనేకానేక గ్రామాల్లో, పట్టణాల్లో, నగరాల్లో వేలాదిగా అమరుల స్థూపాలు, ఎర్ర జండా దిమ్మలు, అరుణ పతాకలు మనకు ఇప్పటికీ కనిపిస్తూ ఉంటాయి. నక్సల్బరీ విప్లవ వెల్లువ అనంతరం వెలసిన అమర వీరుల స్థూపాలు కూడా తక్కువేమీ కాదు. అయితే.. విప్లవ కార్యాచరణ, వర్గ పోరాటం డొల్లబారిపోయి విప్లవ స్థూపాలు కేవలం సెంటిమెంటుకు చిహ్నాలుగా మిగిలిపోయి నప్పుడు వాటికి ఏమి విలువ ఉంటుంది? వీరుల త్యాగాలను, మరణాలను అపహాశ్యం పాలు చెయ్యడం తప్పు..

ఇప్పటి ప్రజా యుద్ధ సందర్భంలో, అమర వీరులకు పెద్ద పెద్ద స్థూపాలు కడితేనే విప్లవ స్ఫూర్తి ఉన్నట్లు కాదు. యుద్ధం చిక్కనౌతున్న తరుణంలో స్థూప నిర్మాణాలు కష్ట సాధ్యమైన పని. చాలా ఖర్చుతో కూడుకున్న పని. అమరులౌతున్న వారందరికీ సమాన స్థాయిలో స్థూపాలు నిర్మించడం సాధ్యమా? అది సాధ్యమయ్యే పనికాదు. అటువంటప్పుడు కొందరికి పెద్ద పెద్ద స్థూపాలు నిర్మించడం, మరి కొందరికి అసలు ఏ స్థూపాలు నిర్మించ లేక పోవడం అనే సమస్యలు తలెత్తి అమరుల కుటుంబాల మధ్య మనస్పర్థలకు, గుండె కోతలకు దారితీస్తాయి. ఇటువంటి వాతావరణం విప్లవ స్పృహను, స్ఫూర్తిని, చైతన్యాన్ని దెబ్బతీసి అమరుల ఆశయాలను, త్యాగాలను కించబరిచే స్థాయికి దిగజారే ప్రమాదం ఏర్పడుతుంది. ఇది విప్లవోద్యమానికి హానికరం.

అడివే ఆదర్శమై, పోరాటమే జీవనమై, జనతన రాజ్యనిర్మాణమే గురిగా సాగుతున్న ప్రస్తుత పోరాట దశలో అమరులకు స్థూప నిర్మాణాలు ఆదర్శ మనుకోవడం సరైన ఆలోచన కాదు. అను నిత్యం అటవీ పోరాట ప్రాంతాల్లో ఎందరో ఆదివాసులు, మైదాన ప్రాంతాల నుండి అక్కడ జరుగుతున్న ప్రజా యుద్ధంలో భాగస్వాములై, అందులో మమేకమైన వారు అమరులౌతున్నారు. వీరి త్యాగాలను ఎత్తిపట్టడమంటే వారి ఆదర్శాలను ప్రచారం చేసి ప్రజలను యుద్ధ ఆచరణకు నడిపించడమే. వారి అందరి త్యాగాలకు చిహ్నాలు ఓ చెట్టో, ఓ పుట్టో, ఓ రాయో రప్పో, ఓ ఎర్రజండో, ఏదైనా కావచ్చు. దానిని మనం గుర్తించి గుండెలకు హత్తు కోవడంలోనే విప్లవ స్ఫూర్తి, సంస్కృతి ఇమిడి ఉంటుందని గ్రహించాలి. ఈ తరుణంలో స్థూప నిర్మాణ సెంటిమెంట్లు పట్టుకుని వేలాడ్డం బూర్జువా సంస్కృతే అవుతుంది. దీని నుండి విప్లవ శక్తులు, శ్రేణులు బయటపడాలి. విప్లవ ఆచరణను ఎత్తి పట్టడమే విప్లవకారుల త్యాగాలకు నిజమైన నివాళి తప్ప వేరే ఏదీ కాదని గుర్తించాలి.

# ఉద్యమ స్ఫూర్తి అనసూయమ్మ

డాక్టర్ నళిని

రెండు మూడు నెలలుగా తరచు విజయవాడ వెళ్ళవలసి రావడంతో అనసూమయ్మని చాలాసార్లు కలుసుకునే అవకాశం కలిగింది. యాభై మూడేళ్ల క్రితం ఖాజీపేటలో నాకు మొదటిసారిగా పరిచయమైనపుడు ఎంత ఆప్యాయంగా ఉండేదో, ఇప్పుడూ అంతే ప్రేమగా ఉంది. చిన్న పిల్లగా ఎప్పుడో నాకు కొసరి కొసరి తినిపించినట్టే ఇప్పటికీ తన చేత్తో నాకూ, నా కొడుక్కీ తినిపించి తృప్తి పడుతుంటే నా కళ్ళు చెమ్మగిల్లాయి. రెండు, మూడు సార్లు కాళ్ళు విరిగి, ఉబ్బసంతో ఆయాసపడుతూ, గుండెదడ, చేతుల వణుకుతో బాధపడుతూ, ఇద్దరు సహాయకుల ఆసరాతో కాలం వెళ్ళబుచ్చుతూ కూడా దేశకాల పరిస్థితుల పట్ల ఎప్పటి ఆసక్తి కనబరచడం ఆమె అనుభవం ఆమెకి నేర్పిన దృష్టి కోణమేమో కానీ అనారోగ్యం వల్ల ఒకోసారి డీలా పడిపోతుంటే, ఆమెని ఉత్సాహపరచడం కోసం తన ఉద్యమ జీవితం గురించి చెప్పమని ఒత్తిడి చేసాను. అలా రెండు రోజులు మూడేసి గంటల పాటు మాట్లాడుతూ ఎంతో ఆనందపడిపోయింది. మళ్ళీ మళ్ళీ నన్ను పిలిచి, “ఇది చెప్పానా? అది చెప్పానా?” అంటూ మరికొన్ని విషయాలు కొసరి వినిపించింది- తను తినిపించే గోరు ముద్దల లాగా!

అనసూయమ్మ పుట్టింది కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా మేడూరులో. (అది ఇప్పుడు పైడిముక్కల మండలంలో ఉంది). పుట్టిన తేది 1930 అక్టోబర్ 21. ముగ్గురు అక్కలు, ఇద్దరు అన్నల తర్వాత ఆఖరి ముద్దుల పాపగా పుట్టింది. చిన్న అన్న ఎలమంచి రామకృష్ణారావుతో ఆమెకి ఎక్కువ అనుబంధం. ఆయన కాకినాడ ఇంజనీరింగ్ కాలేజీలో స్టూడెంట్ ఫెడరేషన్ (ఎస్.ఎఫ్) లో చురుకైన కార్యకర్త, తెగువ గల మనిషి. ఆయన మా నాన్నకి రాజకీయాలు నేర్పిన మంచి స్నేహితుడు. అలా మా నాన్న కూడా అనసూయమ్మకి ప్రేమపాత్రుడైన అన్నయ్యే. ఆ అన్నయ్య పోలికలు నాలో ఉన్నందుకు నన్ను కూడా ప్రేమించేది.

అనసూయమ్మ నాలుగో బాబాయి ఎలమంచి వెంకట కృష్ణయ్య వల్ల ఆమెకి రాజకీయాలతో పరిచయం ఏర్పడింది. ఆయన కాంగ్రెస్ కార్యకర్త. తొమ్మిదో ఏట నించి ఆమెని మీటింగులకి తీసుకువెళ్ళడం వల్ల ఆమెకి జాతీయోద్యమం పట్ల అభిమానం పెరిగింది. చరిత్ర అంటే ఆమెకి చాలా ఆసక్తి. నెహ్రూ అంటే ఆకర్షణ. ఆమె మేనత్త భర్త జాతీయోద్యమంలో జైలు పాలై, జైల్లోనే మరణించారు.

ఆమె పద్నాలుగో ఏట కమ్యూనిస్టు రాజకీయలు ఊళ్ళోకి ప్రవేశించాయి. అక్కినేని రామలింగేశ్వరరావు, ఆయన భార్య లక్ష్మీకాంతమ్మ, మానికొండ సూర్యావతి మేడూరు వస్తూ పోతూ ఉండేవారు. వాళ్ళ నేతృత్వంలో అనసూయమ్మ, ఆమె పిన్ని కూతురు పాప కలిసి వాడకట్టు తిరిగి, పోషక విలువల్ని కాపాడే విధంగా ఎలా వంట చేయాలో, పిల్లల్ని ఎలా పెంచాలో శాస్త్రీయంగా వివరించేవారు. అనసూయమ్మ ఉపన్యాసం ఇస్తే, పాప పాటలు పాడేది. ఇంట్లో తమ వంతుకి వచ్చే గుడ్లు, పాలు అమ్ముకుని, వాళ్ళు 'ప్రజాశక్తి' వారపత్రిక కొని, చదివి, ఆ వార్తల్ని ప్రచారం చేస్తూ ఉపన్యాసాలు ఇచ్చేవారు.

అప్పట్లో నాలుగు ఫిర్కాలు కలిస్తే ఒక తాలూకా అనేవారు. అలా, కపిలేశ్వరపురం ఫిర్కాకి హరిశ్చంద్రరాజు అనే హోమియో డాక్టరు కార్యకర్తగా పనిచేసేవారు. ఆయన ఆధ్వర్యంలో నలుగురైదుగురు మహిళలతో ఒక దళం పనిచేసేది. అందులో రాజుగారి భార్య లక్ష్మీకాంతమ్మ, చిట్టెమ్మ వగైరాలు ఉండేవారు. హోమియో మందులు ఇస్తూ, ఆరోగ్య సూత్రాలు వివరిస్తూ ఈ దళం మహిళల్ని ఆకర్షించేది. మూఢాచారాల వల్ల జరిగే నష్టాన్ని వివరిస్తూ, కుటుంబ సమస్యలపై సలహాలిస్తూ వీరు ప్రజలకి దగ్గరయ్యారు. “మా ఇళ్ళలో మీరు తింటారా?” అంటూనే ప్రజలు వీరికి అన్నీ పెట్టి ఆప్యాయంగా తినిపించేవారు. దురదృష్టవశాత్తు రాజుగారి భార్య కలరాతో చనిపోయింది.

ఆ రోజుల్లో మామిళ్ళపల్లి మునసబు కామ్రేడ్ సత్యప్రసాద్‌కి మంచి పేరు ఉండేది. ఆయన తన పిన్నమ్మకి దత్తుడు. ఆయన రైతు సంఘం ఆర్గనైజరుగా చాలా కార్యక్రమాలు చేపట్టేవారు. మురుగు కాల్వలు మరమ్మత్తు చేయించారు. పార్టీ ఏర్పరచిన కోఆపరేటివ్ స్టోర్సు ద్వారా రైతులకి కావలసిన ఎరువులు, బండి పట్టాలు, పలుగులు, పారలు, నిత్యావసర వస్తువులు, వగైరాలన్నీ తక్కువ ధరకి ఇప్పించేవారు. దక్షిణ కాశీగా పిలిచే ఐలూరులో మహా శివరాత్రి తిరణాలలో సాధారణంగా జరిగే దొమ్మీలని, దొంగతనాలని ఈయన పంపిన పార్టీ వలంటీర్లు చాకచక్యంగా నివారించగలిగారు. అలా పార్టీపేరు ప్రతిష్టలని ఇనుమడింపజేస్తూ, ఆయన పార్టీని ప్రజలకి చేరువ చేయగలిగాడు. ఒకరోజు ఆయన అనసూయమ్మ ఇంటిముందు నుంచి వెళ్తున్నాడు. “హిందూ ముస్లిం ఏక్‌హై” అంటూ వేసిన ముగ్గుల్ని చూసి, అవి ఎవరు వేసారో కనుక్కున్నారు. ఆ ఇంట్లో ఇద్దరు అక్కాచెల్లెళ్ళు ఉంటారని, ఒకరు మధ్యతరగతి అని, మరొకరు ధనవంతులని తెలుసుకున్నారు. మధ్యతరగతికి చెందిన అనసూయమ్మని పెళ్ళి చేసుకుంటానంటూ ఆయన వర్తమానం పంపారు. ఆయన ఆమె కంటే ఏడేళ్ళు పెద్దవాడు. మొదట్లో అనసూయమ్మ తండ్రికి ఈ సంబంధం నచ్చకపోయినా, పార్టీ ప్రమేయంతో వాళ్ళ పెళ్ళి జరిగింది. అయితే, అతని తల్లిదండ్రులకి ఈ పెళ్ళి ఇష్టంలేదు. మేనకోడలిని పెళ్ళి చేసుకొమ్మని వాళ్ళు ఆయన్ని వత్తిడి చేసారు. అందుకని ఆయన

తన మేనకోడలి పెళ్ళికి అవసరమైన కట్నం సమకూర్చి, ఆమెకి అలా సాయం చేసి, అప్పుడు అనసూయమ్మని పెళ్ళి చేసుకున్నారు. 1945 డిసెంబర్ 9న వారి పెళ్ళి ఎలమంచి వెంకటకృష్ణయ్య బాబాయిగారి హోటల్లో జరిగింది. ఆ దండల పెళ్ళికి రెండువేల మంది అతిథులు వచ్చారు. అన్ని కులాలతో బంతి భోజనం చేశారు.

వీళ్ళ పెళ్లి నాటికి ప్రకాశం ఆర్డినెన్స్ అమల్లోకి వచ్చింది. పార్టీ తరఫున యుద్ధ నిధిని సేకరించినందుకు సత్యప్రసాద్ గారి మునసబు గిరీ పోయింది. ఆయనకి దక్కిన అరవై ఎకరాల భూమిని ఆయన తన ఇద్దరు అన్నదమ్ములకి, ఇద్దరు అక్కచెల్లెళ్ళకి పంచేసారు. ఈ పెళ్ళిని మొదట వ్యతిరేకించిన అత్తమామలు తర్వాత మాత్రం అనసూయమ్మని బాగా చూసుకునేవారు.

అప్పట్లో ఆరునెలలు ఆక్సిలరీ సెల్‌లో పనిచేస్తేనే పార్టీ కార్డు రూపంలో పార్టీ సభ్యత్వం ఇచ్చేవారు. పెళ్లినాటికి సత్యప్రసాద్ పార్టీ కార్యకర్తగా గ్రామ కమిటీల నిర్వహణ బాధ్యతలని చేపట్టి, రైతు సంఘం ఆర్గనైజరుగా పనిచేసేవారు.

సత్యప్రసాద్ కుటుంబమంతా పార్టీ కుటుంబమే. అత్తయ్య శిక్షణలో అనసూయమ్మ పోలీసుల్ని ఎదుర్కోవడం, రహస్యంగా ఉత్తరాలు చేరవేయడం వంటి ఉద్యమ కార్యకలాపాల్లో తర్ఫీదు పొందింది. పెళ్ళయిన పది నెలలకి జోని పుట్టింది. ఆమె కడుపులో ఉండగా, ఎనిమిదవ నెలలో కొట్నిస్ సినిమా చూస్తుండగా అనసూయమ్మకి మొదటిసారిగా ఫిట్స్ వచ్చాయి. జోని 1946 అక్టోబరు 2న పుట్టింది. కాన్పు తర్వాత అనసూయమ్మకి ఫిట్స్ తగ్గాయి.

దీని తర్వాత అనసూయమ్మ రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనసాగింది. మామిళ్ళపల్లిలో తల్లి, అత్త, ఆడబిడ్డల సహాయంతో ఆమె ఈ కార్యకలాపాలు చేపట్టింది. 1948 ఏప్రిల్ 8న భరద్వాజ్ పుట్టాడు. ఆ సంవత్సరమే కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించారు. అదే సంవత్సరం పార్టీ సాయుధ పోరాటం పై తీర్మానం చేసింది. తెలుగునాట జమీందారీ వ్యతిరేక పోరాటం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం విజృంభించాయి. ప్రభుత్వం నిర్బంధంగా ధాన్యాన్ని సేకరించింది. దీనికి వ్యతిరేకంగా రైతాంగ ఉద్యమం వెల్లువెత్తింది. చీపుళ్ళు, కారం పొట్లాలు, గాజు పెంకులతో మహిళలు కూడా ఈ ప్రభుత్వ వ్యతిరేక పోరాటంలో విరివిగా పాల్గొన్నారు. సత్యప్రసాద్, చింతపల్లి పాపారావులు ఈ రైతాంగ ఉద్యమానికి నాయకత్వం వహించారు. అరెస్టులు, కేసులు కూడా కొనసాగాయి. మొదటి ముగ్గురు ముద్దాయిలు మహిళలే. కాశీ అన్నపూర్ణ, వెంకట రత్నమ్మ, అనసూయమ్మల మీద కేసు పెట్టారు. ఆజాద్ (రాజ్‌కుమార్) తండ్రి నూజివీడులో హోటల్ నడిపేవారు. ఆయన వీళ్ళని బండిలో కోర్టుకి తీసుకెళ్ళేవారు. అనసూయమ్మ పదినెలల గర్భిణి కావడంతో తర్వాత కేసు కొట్టేసారు. ఆ కేసు కొట్టివేసినా గాని, ఆమె ఆంధ్ర మహాసభ పోరాటంలో చురుగ్గా పాల్గొనడం వల్ల, భరద్వాజ్ పదహారు రోజుల పిల్లవాడుగా ఉండగా అనసూయమ్మని అచ్చమాంబ హాస్పటల్లో అరెస్టు చేసారు. పోలీసులు బాబుని విసిరేస్తే, తోటి కామ్రేడ్లు అతన్ని కాపాడి, అమ్మమ్మ దగ్గరకి చేర్చారు. ఎనిమిది రోజుల నిర్బంధం తర్వాత అనసూయమ్మపై ఖూనీ కేసు మోపారు. తర్వాత ఆమె కంకిపాడు బస్సు నుంచి దూకి తప్పించుకుంది.

అనసూయమ్మ 1948 నుంచి 1952 చివరివరకూ అజ్ఞాత జీవితం గడిపారు. ముందు సత్యప్రసాద్ యు.జి.కి వెళ్ళగా, పిల్లలు ఇద్దరినీ తల్లికి అప్పగించి, అనసూయమ్మ కూడా ఆయన్ని చేరుకుంది. అయితే, 1950 ఆగస్టు 5న సత్యప్రసాద్ ఎన్‌కౌంటర్‌లో అమరులయ్యారు. ఆయన ఒక డెన్‌లో ఉండగా, నమ్మక ద్రోహం వల్ల కర్నూలు జిల్లా పాణ్యంలో అరెస్టయ్యారు. మేడూరులో ఎన్‌కౌంటర్ జరిగింది. సహచరుడిని కోల్పోయిన విషాదాన్ని అధిగమిస్తూ, ఆయన స్ఫూర్తితో అనసూయమ్మ 1952 వరకూ అజ్ఞాతంగానే పని చేసింది. అజ్ఞాతం నించి బయటికి వచ్చాక ఆమె కపిలేశ్వరపురం పిర్కా మామిళ్ళపల్లి ప్రాంతంలో పార్టీ ఆర్గనైజరుగా పనిచేసింది. 1953లో బట్లపెనమర్రు జిల్లా పార్టీ మహాసభలో పాల్గొంది. ఆ కాలంలో పల్లెల్లో విరివిగా రాజకీయాలు ప్రచారం చేసింది. 1955 ఎన్నికల్లో పార్టీ నిర్ణయం మేరకు ఆమె ఉయ్యూరులో కాకాని వెంకటరత్నానికి వ్యతిరేకంగా నిలబడి 500 ఓట్ల తేడాతో ఓడిపోయింది.

దళ జీవితంలో అనసూయమ్మకి అనేక అనుభవాలు ఎదురయ్యాయి. అప్పట్లో వెలువోలులో జరిగిన యాక్షన్ ఒక గుణపాఠంగా మిగిలింది. ఈ యాక్షన్‌లో అనసూయమ్మ అన్న రామకృష్ణారావు కూడా పాల్గొన్నాడు. బసవయ్యకి వ్యతిరేకంగా వంద మందితో జరిగిన ఈ యాక్షన్ విఫలమయింది. ఆ తర్వాత కూడా కొన్ని యాక్షన్స్ విఫలమయ్యాయి. అప్పుడు పార్టీ ఈ వైఫల్యాలకి కారణాలని బేరీజు వేసుకుంది. అంత పెద్ద దళాలు పని చేయడం ఆచరణ యోగ్యం కాదని రుజువయింది.

ఆ తర్వాత కొండపల్లి సీతారామయ్య నాయకత్వాన చిన్న దళాలు ఏర్పడ్డాయి. దళ కమాండర్ కాట్రగడ్డ చినవెంకటరాయుడు అనసూయమ్మకి తుపాకి పట్టడం నేర్పాడు. అప్పట్లో, ఆమె కొరియర్‌తో వెళ్ళి, చాకచక్యంగా రెక్కీ నిర్వహించేది. అవసరమైతే బ్రిడ్జీలు పేల్చి, శత్రువుని అడ్డుకోగల స్థైర్యాన్ని ఆమె సంపాదించింది. ఈ చిన్న దళాలు ఒకేరోజు ఆరు ఊళ్లలో యాక్షన్స్ చేసిన సందర్భాలున్నాయి. రెండు ఊళ్ళలో పోలీసుల తుపాకులు లాక్కుని, రెండు ఊళ్ళలో మనీ యాక్షన్ చేసి, రెండు ఊళ్ళలో విద్రోహులను చంపటం కూడా జరిగింది. ఆ కాలంలో అనసూయమ్మకి ఎదురైన రకరకాల అనుభవాలు ఆసక్తిదాయకంగా ఉంటాయి. ఒకసారి వంతెన దగ్గర కాపలా కాస్తుండగా, ఈత రాకపోతే కష్టమంటూ కమాండర్ ఆమెని కాలువలోకి తోసాడు. అలా బలవంతంగా ఈత నేర్పే ప్రయత్నం చేయడం అమానుషమని తర్వాత కె.ఎస్. ఆయన్ని మందలించారు.

ఆ కాలంలో, అసలు మహిళలు దళాల్లో ఉండాలా లేదా అనేది ప్రశ్నగా ఉండేది. వాళ్ళు గబగబ కదల్లేరనీ, శారీరక తేడాల వల్ల ఆ జీవితం వారికి కష్టమని, ఇతర కారణాల వల్ల కూడా వాళ్ళు ప్రతిబంధకం అవుతారనే సందేహం కొందరికి ఉండేది. కానీ అనసూయమ్మ ఆ అనుమానాలని పటాపంచలు చేస్తూ దళాల్లో చురుకైన పాత్ర వహించింది. కుందేరులో స్పిన్నింగ్ మిల్లుమీద దాడిచేసి తూటాలు స్వాధీనం చేసుకున్న ఘటనలో, బాసుముత్యాల పాలెంలో అగ్రహారం మీద దాడి చేసి బంగారాన్ని స్వాధీనం చేసుకున్న ఘటనలో అనసూయమ్మ చురుగ్గా పాల్గొంది. ఒకసారి కొల్లిపరలో పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నంతో ఆమె

గడ్డి వాములో దాక్కుంది. ఆమె అక్కడినుంచి చాకచక్యంగా తప్పించుకుంది కానీ మగ కొరియర్ దొరికిపోయాడు. ఈ సంఘటనని అందరూ విడ్డూరంగా చెప్పుకునేవారు. స్త్రీలు వెనకబడి లేరని అనసూయమ్మ నిరూపించింది. అయితే ఆ కొరియర్ తర్వాత ఎలమంచిలి చినబసవయ్యని పట్టించాడు. పోలీసులు ఆయన గోళ్ళలో సూదులు గుచ్చి, రకరకాల చిత్రహింసలు పెట్టి చంపేసారు.

అప్పట్లో అందరు దళ సభ్యుల లాగానే అనసూయమ్మ కూడా ఖాకీ నిక్కరు ధరించి, భుజాన కిట్టుని తగిలించుకునేది. ఆ కిట్టులో బట్టలు, తూటాలు ఉండేవి. వాళ్ళ చేతుల్లో తుపాకులు మాత్రం సరైనవి ఉండేవి కావు. అందుకే "నాది పిచ్చి తుపాకీ" అని ఆమె నవ్వింది. జనం ప్రేమతో పెట్టే తిండే వారి ఆహారం. రోజుల తరబడి రహస్యంగా పల్లెల్లో ఉండిపోయినపుడు మాత్రం, దొడ్డి చట్టెల్లోనే కానిచ్చేవారు. ఒకసారి మూడురోజుల పాటు తిండి లేక, ఆకలి బాధ తీర్చుకోవడం కోసం నిమ్మరసం పిండుకుని తాగితే, నాలుక పగిలిపోయి ఆమె నానా అవస్థలు పడవలసి వచ్చింది. లంకల్లో ఉన్నప్పుడు మాత్రం ఊళ్ళ నించి అన్నం వచ్చేది. ఒక్కోసారి గడ్డు పరిస్థితుల్లో గుంటూరు వెళ్లి షెల్టర్ పొందవలసి వచ్చేది.

చైతన్యవంతులున్న ఊళ్ళో ప్రజలు పార్టీని ఎలా కాపాడుకుంటారో, చైతన్యం లేని చోట్ల కార్యకర్తలు ఎలా కష్టాలపాలవుతారో ఆమె సోదాహరణగా చక్కగా వివరించింది. చాగంటిపాడు పార్టీ బలం అంతగా లేని ఊరు. అక్కడ దళాల్లో స్త్రీలని చూసి, వాళ్ళని వేశ్యలనుకుని ఒకసారి నిర్బంధించారు. అయితే, పెనమకూరు అనే గ్రామం రాజకీయ చైతన్యం గల గ్రామం. అక్కడ పోలీసులు ఎదురైనా గాని వారి ముందు నించే ఒక డెన్ నించి దళ సభ్యులు తప్పించుకున్నారు. ముస్లిం మహిళల్లాగా ముసుగులేసుకుని తప్పించుకోవడానికి ఆ గ్రామ ప్రజలు వారికి ఎంతో సాయం చేసారు.

ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాల్లో అనసూయమ్మ పెళ్ళికి ముందు వలంటీర్. పెళ్ళి తర్వాత పార్టీ కార్యకర్త, సెల్ సెక్రటరీ, ఏరియా ఆర్గనైజర్. 1953-54 లో మహిళా సంఘం ఆర్గనైజర్. 55 ఎన్నికల్లో కాకానిపై ఓటమి.

1956లో సి.పి.ఐ, సి.పి.ఎం. చీలిపోయిన సందర్భంలో అనసూయమ్మ సి.పి.ఎం. వైపు మొగ్గు చూపింది. కానీ రెండేళ్ళ పాటు రాజకీయాల్లో చురుకైన పాత్ర వహించలేకపోయింది. తర్వాత కె.ఎస్. కోటేశ్వరమ్మతో విడిపోయాక, అనసూయమ్మకి దగ్గరయ్యారు. వారు పార్టీ ఆమోదంతో 1958 నించి భార్యాభర్తలుగా కలిసి ఉన్నారు. అలా 1960-62 మధ్య వాళ్ళు ఇద్దరూ మాకు ఖాజీపేటలో పరిచయం. వారి అనుబంధం గురించి కె.ఎస్. ఇంటర్వ్యూల్లో చూడవచ్చు.

కె.ఎస్. పెళ్ళి చేసుకోకూడదనుకుంటూ పార్టీలోకి వచ్చారు. కానీ ఒక రోజు చండ్ర రాజేశ్వరరావు ఆయన్ని ఒక ధైర్యం గల పని చేయగలవా అని సవాల్ విసిరాడు. విడో మ్యారేజి ఆదర్శవంతమైన పని అని, అది నువ్వు చెయ్యాలని పార్టీ అభిప్రాయపడుతోందని ఆయన చెప్పారు. "అయితే పార్టీ ఏకగ్రీవంగా తీర్మానిస్తే దానికి నేను కట్టుబడి ఉంటాను" అని కె.ఎస్. బదులిచ్చాడు. అలా ఆయన కోటేశ్వరమ్మని పెళ్ళి చేసుకున్నాడు. అయితే తర్వాత వారి మధ్య విభేదాలు పొడచూపాక, ఆమె సి.పి.ఐ. వైపే ఉండిపోయాక సుందరయ్య జోక్యం చేసుకుని వారికి విడాకులు ఇప్పించాడు. కె.యస్. మాటల్లో చూస్తే, "ఇదీ నా మొదటి పెళ్ళి. తర్వాత ఇరవై ఏళ్ళకు విడాకులు తీసుకున్నాం. తర్వాత అనసూయమ్మ నా జీవితంలోకి వచ్చింది. 1948 తెలంగాణ పోరాటంలో అమరుడైన కామ్రేడ్ భార్య ఆమె. ఆమె సాహచర్యం నాకు ఇప్పటికీ విలువైనదిగా అనుకుంటాను" (కె.ఎస్. తో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ - నవంబర్ 8, 1992).

అనసూయమ్మ కె.ఎస్.తో గడిపిన ఆనందదాయకమైన కాలం మా కళ్ళకు కట్టినట్టు గుర్తుంది. ఖాజీపేటలో మామిడితోట మధ్యలో కారవాన్ లాంటి ఒక చిన్న ఇంట్లో వాళ్ళు తమ నలుగురు పిల్లలతో కాపురం ఉండేవారు. కరుణక్క, చందు, జోనక్క, భరద్వాజ కలిసి అక్కడే చదువుకున్నారు. జోనక్క మా ఫాతిమా స్కూల్లోనే చదివేది. కరుణక్క మెడిసిన్‌లో చేరాక రెండో సంవత్సరంలో రమేష్‌బాబుతో పెళ్ళి జరిగింది కూడా అదే ఇంట్లో. విశాలమైన తోటలో ఆడుకుంటూ మధ్య మధ్యలో అనసూయమ్మ పెట్టే చిరుతిళ్ళు తినడం ఆనాడు మాకు ఒక వేడుక.

తర్వాత ఎం.ఎల్. పార్టీ ఆవిర్భావంతో అనసూయమ్మ మళ్ళీ చురుకైన రాజకీయ జీవితం ఆరంభమయింది. అందరికీ అమ్మగా తలలో నాలుకలా మెలగడమే కాక, యువతరంతో సమానంగా పనిచేస్తూ, నిక్కచ్చిగా వ్యవహరిస్తూ, తనదైన శైలిలో కార్యకలాపాల్లో పాల్గొంటూ అందరికీ ప్రీతిపాత్రురాలయింది. 80వ దశకంలో లీగల్ అవకాశాలు ఉన్న సమయంలో రైతుకూలీ సంఘంలో ముఖ్యమైన భూమిక వహించింది. ఉయ్యూరు నియోజకవర్గం, పైడిముక్కల మండలం, ముదినాపురం అగ్రహారంలోని ఐలూరు, గురివిందపల్లి గ్రామాల్లో లంక భూములు ఉంటాయి. రైతులు వాటిని కౌలుకి తీసుకుని పుచ్చకాయలు పండించేవారు. ఆ ప్రాంతంలో మొదటిసారిగా అనసూయమ్మ ఎం.ఎల్. రాజకీయాలని పరిచయం చేసింది. "వేలూనమంటే కాలుపెట్టాను" అంటూ ఆ రోజుల గురించి గర్వంగా చెప్పింది. అక్కడ రైతుకూలీ కమిటీలు పెట్టి, రైతుకూలీ సంఘాన్ని బలోపేతం చేయడంలో గంజి రామారావు గారితో కలిసి ఆమె ఎంతో కృషి చేసింది. అక్కడ, నాగేశ్వరరావు అనే పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు కడియాల వెంకటేశ్వరరావుతో కలిసి వీరికి అడ్డు తగిలేవాడు. అయినా సరే, ఆమె పట్టుదలగా బంజరు భూమి పోరాటాన్ని చేపట్టింది. 470 ఎకరాల్లో ఎర్రజెండాలు పాతి, ప్రజలు ఆ భూమిని సాగు చేసుకునేలా అనసూయమ్మ పోరాటాన్ని ఉధృతం చేసింది. ఆ ఉమ్మడి సాగుబడిలో వచ్చిన డబ్బుని రైతులందరికీ పంచి, మిగిలిన డబ్బుని ఇతర కార్యకలాపాల కోసం పోరాట కమిటీకి అప్పగించింది. ఒక స్త్రీ బంజరు భూమి పోరాటాన్ని పర్యవేక్షించడం ఆనాడు అందరినీ విశేషంగా ఆకర్షించింది. క్రమంగా నిర్బంధం పెరుగుతున్న నేపథ్యంలో ఉయ్యూరులో రైతుకూలీ మహాసభను నిర్వహించడమే కాక, అమరుడు జనార్దన్ స్మారక స్థూపాన్ని కూడా ఉయ్యూరులో కట్టించిన ఘనత అనసూయమ్మదే.

1984 నించి అనసూయమ్మ కృష్ణా జిల్లా రైతుకూలీ సంఘం అధ్యక్షురాలిగా చురుగ్గా పనిచేసింది. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, తూర్పు, పశ్చిమ గోదావరి జోనల్ కమిటీ ప్రెసిడెంట్‌గా కూడా ఆమెని

ఎన్నుకున్నారు. 1984లో రాజమండ్రిలో జరిగిన రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభలు చరిత్రని సృష్టించాయి. ప్రజల పట్టుదలకి, నిర్బంధానికి కూడా అవి మరపురాని ఉదాహరణలుగా మిగిలాయి. ఆ సందర్భంగా అనసూయమ్మ మీద కుట్ర కేసు బనాయించారు. సభలకి అనుమతిని నిరాకరిస్తూ, పోలీసులు అనసూయమ్మని అరెస్టు చేసి ఎనిమిది రోజులు నిర్బంధించారు. పదహారు మంది ఆర్.ఎస్.యు., ఆర్.వై.ఎల్. కార్యకర్తల మధ్య ఆ నిర్బంధ కాలం ఆమెకి గొప్ప అనుభూతిని మిగిల్చింది. అక్కడ వేటపాలెం వెంకాయమ్మతో కలిసి ఆమె జైలు కమిటీని ఏర్పరచింది. ఆమెతో పాటు అరెస్టయిన వారందరికీ ఆదర్శంగా నిలిచింది.

ఉమ్మడి పార్టీలో గన్నవరం ఆర్గనైజరు ఇచ్చే రిపోర్టులన్నీ తప్పుల తడకలుగా ఉండేవని ఆమె వాపోతూ ఎం.ఎల్. పార్టీలో ఆమె ఎంతో తృప్తిని పొందానంది. కార్యాచరణలో పటుత్వం, దృఢ దీక్ష ఎం.ఎల్. పార్టీలో ఉంటాయని ఆమె నమ్మింది. అలా ఆమె పీపుల్స్‌వార్ పార్టీలో కొనసాగింది.

తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి, కమ్యూనిస్టు రాజకీయాల పట్ల నిబద్ధత, దళ జీవితానుభవం, వ్యక్తిగత జీవితంలో ఒడిదుడుకులు, ప్రజల పట్ల అపారమైన నమ్మకం, అనసూయమ్మకి నిండుతనాన్ని చేకూర్చాయి. ఆమె లోతుని పెంచాయి. చివరివరకూ విప్లవాన్ని కాంక్షిస్తూ, విప్లవం కోసం పాటుపడేవారిని ప్రేమిస్తూ, ఆమె అందరికీ ఒక ఉత్తేజంగా నిలిచింది. ఆమె చొరవ, పట్టుదల, విప్లవ దీక్ష, నిబద్ధత, మనుషుల పట్ల ప్రేమ అందరికీ ఆదర్శం. 2015 నవంబర్ 5న అనసూయమ్మ విప్లవాన్ని కాంక్షిస్తూ, శ్వాసిస్తూ కన్నుమూసింది. ఆమెకి విప్లవ జేజేలు!

**(2015 ఆగస్టులో అనసూయమ్మ స్వయంగా చెప్పిన జీవిత విశేషాల ఆధారంగా..)**

---

*(35వ పేజీ తరువాత.. )*

పగలుచేసి ఆడించేవారు. జరుగుతున్న తన తరగతి గది లోంచి పిలుచుకు వచ్చి మరీ ఆడించే వారు. అంతే చదువు ఆగిపోయింది.

అమాయకంగా, అల్లరిగా, ఏ ధ్యేయం లేకుండా తిరుగుతున్న రోజుల్లో ఒక మిత్రుడు ఇచ్చిన 'మహాప్రస్థానం' పారాయణంతో అతనిలో తుప్పు తగలడి, నిప్పు రగిలింది. 'ఒక కుర్రాడన్నవాడు మహాకవి శ్రీశ్రీ మహాప్రస్థానాన్ని చదివాడంటే వాడెప్పుడూ, నిత్యచైతన్య యువ్వనుడే. శ్రీశ్రీని తాగిన తరువాత శ్రీశ్రీచెప్పిన మరో ప్రపంచం గురించితప్ప ఆలోచించడానికి ఈ భూమ్మీద మరేమీ మిగిలుండదు.' అని చెప్పే రారాసియే అందుకు ఒక నిలువెత్తు నిదర్శనం.

ఇంట రాంబాబుగా, బయట రామారావుగా, మొదట సిరాగా, తరువాత రచయిత రారాసిగా, వృత్తిలో రైల్వే రామారావుగా పిలవబడిన అతని పూర్తి పేరు సింగంపల్లి రామారావు. కవిత్వానికి శ్రీశ్రీ కారం చుట్టి కత్తుల్లాంటి కవితల్ని రాశాడు. కొరడాల్లాంటి విమర్శలు రాశాడు. కాపీ రచనలతో మహారచయితలుగా పేట్రేగిపోతున్న కొందరు భావదరిద్రుల్ని, సాహితీ చోరుల్ని ఏరి, ఏరి పత్రికల్లో ఎండగట్టాడు.

కాకినాడలో అప్పటికి వన్‌వే ట్రాఫిక్ లేదు. కవిత్వం రోడ్ మీద మాదే వన్‌వే ట్రాఫిక్. పగళ్లూ, రాత్రుళ్లూ రోడ్లనిండా తూర్పును పిండి ఎర్రగీతలు గీస్తూ రేగి పోయాం. సిద్ధాంతం పదునుపెట్టిన అక్షరాలు కూరిన బాంబులు పేల్చి వేదికలన్నీ దద్దరిల్ల చేశాం. ఆ రోజుల్లో కాకినాడలో మాదొక విప్లవకవుల బృందం' అంటూ తన 'మెరుపుపువ్వు' కావ్యంలో అద్దేపల్లి రామమోహనరావు అభివర్ణించిన కాకినాడ విప్లవకవుల బృందంలోనూ, క్రాంతి రచయితల సంఘంలోనూ, ఆ తరువాత 1973లో ప్రారంభమైన కాకినాడ విరసం యూనిట్‌లోనూ క్రియాశీల సభ్యుడు. విరసం ఆవిర్భవించిన తొలిరోజుల్లో ఇద్దరు రచయితలు కలిస్తే నువ్వు అరసమా? విరసమా? అనేది పలకరింపుగా ఉండేది. ఆ రోజుల్లో నాది 'సారసం' (సాయుధ రచయితల సంఘం) అని చెప్పుకున్న అతి చైతన్యవాది.

నిత్యవిప్లవ చైతన్యంతో కవన రంగం లోనూ(విరసం), కార్య రంగంలోనూ(ఎం.ఎల్.పార్టీ) విప్లవ సాహిత్యాన్నీ, సిద్ధాంతాన్నీ ప్రచారంచేస్తూ పనిచేసిన రారాసి ఎమర్జెన్సీకాలంలో అరెస్టయ్యాడు. పోలీసు చిత్రహింసలతో అతని ఆరోగ్యం ఛిన్నాభిన్నమైంది. విరిగిన కాలికి స్టీల్ రాడ్ సంధానంతో, ప్రకోపించిన స్పాండిలైటిస్‌తో బాహ్యంగా అతని నడక కుంటిదైనా, అతని నడత మాత్రం గురి తప్పలేదు.

పెళ్లి తరువాత ఇద్దరు పిల్లలతో(అబ్బాయి చైతన్య, అమ్మాయి వాసవి) బతుకు తెరువు కోసం రాజమండ్రి వలస వెళ్లిన రారాసి చిన్నచిన్న సంపాదనలతో జీవిక సాగిస్తూ అనంతరం పద్మావతి ట్రావెల్స్ పేరున రైల్వే అండ్ ఫ్లైట్ టికెట్స్ ట్రావెల్ ఏజెన్సీ ప్రారంభించి అదే ఉపాధిగా చివరి వరకు జీవించారు. ఆ వృత్తిపరంగా రైల్వే రామారావుగా పిలవబడ్డాడు.

'ప్రపంచ / కమ్యూనిస్టు చరిత్రలో/ గోర్కీ 'అమ్మ' స్థానం - తెలుగునాట/ కమ్యూనిస్టు చరిత్రలో / శ్రీశ్రీ 'మహాప్రస్థానం' అని నిర్వచించే రారాసి, ఆ మహాప్రస్థాన మహాకవి శ్రీశ్రీతో పెద్దాపురంలో జరిపిన బహిరంగసభ ఓ అపురూపం.

తూర్పు గోదావరి జిల్లా పౌరహక్కులసభ కోసం రాజమండ్రి వచ్చిన శ్రీశ్రీ, అలసటతో పెద్దాపురం రాలేనంటే-'శ్రీశ్రీ వస్తున్నారని ఊరుకు మాటిచ్చాను.మీరు రాకుండా ఊరుకి మొహం చూపించలేను. మీరు సభకు వచ్చి తీరాలి, లేకుంటే నన్ను శాశ్వతంగా మీతో మద్రాసుకు తీసుకు పొండి' అంటూ శ్రీశ్రీతో మాట్లాడి, పోట్లాడి పెద్దాపురం తీసుకురాగా, క్రాంతి రచయితల సంఘం నిర్వహణలో 20-08-1973న గొప్ప బహిరంగసభ జరిగింది.

'రచయితగానూ, ఎక్కువ నిర్బంధాలు, చిత్రహింసలు అనుభవించినవాడిగానూ, విరసంలో ప్రముఖ వ్యక్తిగానూ కాకినాడ నుంచి పేర్కొనదగినవాడు రారాసి' అంటూ ప్రముఖ విప్లవకవి వరవరరావు ప్రశంసలందుకున్న రారాసి, 1952 జనవరి15వ తేదీన తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురం గ్రామంలో జన్మించాడు. 2016 ఏప్రిల్ 1వ తేదీ రాత్రి 11.30 గంటలకు, స్టీలు రాడ్ విరిగిన కాలికి చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు.

# పినాకపాణిపై అర్థరహితమైన ఆరోపణలు

డాక్టర్ శ్రీనివాస్

ఆంధ్రజ్యోతి దినపత్రికలో రంగనాయకమ్మ గారి "విప్లవం పరువు పోగొట్టేశారు" వ్యాసంపై ఆసక్తికరమైన చర్చ జరిగింది. ఆ వ్యాసంలో ఆమె విరసం ఆవిర్భావం, శ్రీశ్రీ పాత్ర, వ్యక్తి పూజ మొదలగు అంశాలను చర్చించి పినాకపాణి 'కామెంట్స్' వ్యాసంలో వెలిబుచ్చిన అభిప్రాయాలను విమర్శించింది. తొలుత పినాకపాణి వ్యాసం 'కొ.కు. తాత్విక వ్యాసాలు' పుస్తకానికి వెనుక మాటగా వెలువడింది. ఇటీవల వచ్చిన ఆ పుస్తకం మలి ముద్రణలో కూడా అది ఉంది. ఈ చర్చలో సత్యనారాయణరావు, రాజు, చిన్నయ్య, రాజేంద్రబాబు, పినాకపాణి కూతుళ్లు తదితర రచయితలు పాల్గొన్నారు. పినాకపాణి వ్యాసాన్ని ఆంధ్రజ్యోతిలో ప్రచురిస్తే రంగనాయకమ్మ గారు చేసిన అన్యాయమైన ఆరోపణ ఏమిటో పాఠకులే గ్రహిస్తారని చెప్పిన వరవరరావు వ్యాసంతో చర్చ ముగిసిందని సంపాదకులు ప్రకటించారు. ఆంధ్రజ్యోతిలో చర్చ ముగిసినా అరుణతారలో చర్చ కొనసాగటం చాలా అవసరం.

ఆమె ఆ వ్యాసంలో పినాకపాణి అభిప్రాయాన్ని విమర్శిస్తూ ఇలా అన్నారు. "విరసం ఏనాడో (2002లో) ప్రచురించిన "కొడవటిగంటి కుటుంబరావు తాత్విక వ్యాసాలు" అనే పుస్తకంలో పినాకపాణి అనే ఒక విప్లవ కవి రాసిన వ్యాసం ఉంది. అందులో మార్క్స్ ప్రతిపాదించిన అదనపు విలువ కూడా హైపోతిసిస్ కింద నేను పరిగణిస్తాను (పేజీ 239) అన్న మాటల్ని ఆనాటి నించి ఈ నాటికీ ప్రచారంలో ఉంచారు. మార్క్స్ అదనపు విలువ సిద్ధాంతం ఒక ప్రతిపాదనే, ఒక ఊహే అని ఈ విప్లవ సంఘం చెపుతోంది. ఈ విప్లవ సంఘం మార్క్సిజానికి చేసిన ద్రోహం కన్నా, శ్రామిక వర్గానికి చేసిన ద్రోహం కన్నా ఇంకా పెద్ద ద్రోహం ఇంకే విప్లవానికన్నా చేయగలదా? అదనపు విలువని కేవలం ప్రతిపాదనగా ఎంచే సంఘం విప్లవ సంఘం అవగలదా?" (ఆంధ్రజ్యోతి, వివిధ 2015 ఆగస్టు 10)

రంగనాయకమ్మ లేవనెత్తిన ప్రశ్నల్ని అర్థం చేసుకోవాలంటే, మార్క్స్ తాత్విక భావాలు, ఆర్థిక సిద్ధాంతాలు ఎలా అభివృద్ధి చెందాయి? హైపోతిసిస్ అంటే ఏమిటి? సరైన భావాలు ఎలా ఏర్పడుతాయి? సిద్ధాంతానికీ, ఆచరణకూ మధ్య ఉన్న సంబంధం ఏమిటి? పినాకపాణి తన "కామెంట్స్" వ్యాసంలో వెలిబుచ్చిన అభిప్రాయాల్ని రంగనాయకమ్మ గారు ఎలా వ్యాఖ్యానిస్తున్నారు? వంటి అంశాలను సమగ్రంగా విశ్లేషించాలి.

అసలైన రుజువు లేకపోయినప్పటికీ, కొన్ని వాస్తవాల పరంపరపై ఆధారపడి మనం ఒక వస్తువు ఉనికినిగానీ, ఒక దృగ్విషయం సంభవించడానికి గల కారణాన్నిగానీ, దాని సంబంధాన్ని గానీ నిర్ధారిస్తూ చేసే సమాలోచననే హైపోతిసిస్ (ప్రతిపాదన) అంటారు. నిర్దిష్ట దృగ్విషయాలకి ముందుగాని వాటితోపాటు గానీ సంభవించే పరిస్థితులలో అత్యధికం ముందే తెలిసినవి అయినా, ఆ విషయాల మధ్య సంబంధాలు, వాటికి గల కారణాలు అస్పష్టంగా వుంటే సైన్సులో హైపోతిసిస్ అవసరం ఏర్పడుతుంది. వర్తమానానికి సంబంధించిన ప్రత్యేక లక్షణాల నించి గత కాలపు చిత్రాన్ని పునరుద్ధరించటానికి కూడా హైపోతిసిస్ ఉపయోగపడుతుంది. అలానే గతం, వర్తమాన కాలాల బలం మీద ఆధారపడి ఒక దృగ్విషయానికి సంబంధించిన భవిష్యత్ అభివృద్ధిని నిర్ధారించాలంటే కూడా హైపోతిసిస్ అవసరం. కానీ కచ్చితంగా తెలిసిన వాస్తవాలపై ఆధారపడి ప్రతిపాదన చేయడం మొదటి అడుగు మాత్రమే. బహుశా జరుగవచ్చునని భావించటం వల్ల హైపోతిసిస్‌కి నిరూపణ, రుజువులు అవసరమవుతాయి. నిరూపణ అయ్యాక హైపోతిసిస్ ఒక శాస్త్రీయ సిద్ధాంతమవుతుంది. కానీ నిరూపించబడకపోతే దాన్ని సవరించటమో లేదా తోసిపుచ్చటమో జరుగుతుంది. ఆధునిక పాజిటివిస్టులు (అనుభవైక విషయాలను మాత్రమే పరిశీలించాలి తప్ప హేతుబద్ధమైన చింతన అవసరం లేదని చెప్పే రూఢివాదం), ఎంపిరిసిస్టులు (ఇంద్రియానుభూతుల పరిశీలనకే పరిమితం కావాలని చెప్పే అనుభవవాదం), అలాంటివారే మరికొందరు - విజ్ఞానశాస్త్రం వాస్తవాలను రికార్డు చేయాలి లేదా రిజిస్టరు చేయాలి తప్ప భౌతిక ప్రపంచాన్ని నడిపించే నియమాలపై హైపోతిసిస్‌లను రూపొందించరాదనీ విశ్వసించారు. హైపోతిసిస్‌కు ఎలాంటి ప్రాముఖ్యత లేదనీ, అప్పటి పని జరగటానికి ఉపయోగపడే పాత్రకు మించిన పాత్ర దానికి లేదనీ వారు భావించారు. కానీ హైపోతిసిస్‌లు శాస్త్రీయంగా నిరూపించబడిన సిద్ధాంతాలుగా పెంపొందిన ఉదాహరణలు వీరి అభిప్రాయాలకు విరుద్ధంగా నిలిచాయి. హైపోతిసిస్ ఎప్పుడూ నిర్దిష్టమైన వాస్తవిక సమాచారంపై ఆధారపడి ఉంటుంది గనుక దాన్ని ఎప్పుడయినా సిద్ధాంతంగా అభివృద్ధి చేయగలం.[1]

మార్క్సిస్టు మహోపాధ్యాయుడు ఎంగెల్స్ తన 'డైలెక్టిక్స్ ఆఫ్ నేచర్' గ్రంథంలో హైపోతిసిస్ గురించి ఇలా వివరించారు: "ప్రకృతి శాస్త్రానికి సంబంధించిన అభివృద్ధి రూపమే - ఆ శాస్త్రం ఆలోచనలు పెంపొందిన మేరకు - హైపోతిసిస్ అవుతుంది.... ప్రకృతి శాస్త్రవేత్తలలో తార్కికపరమైన, గతితార్కికపరమైన అవగాహన లేకపోవడం వల్ల ఒకదాని వెంట ఒకటి పరంపరగా వచ్చే వారి అనేక ప్రతిపాదనల్ని చూస్తే, వస్తువుల సారాంశాన్ని మనం తెలుసుకోలేమనే అభిప్రాయం సులభంగా ఏర్పడుతుంది. (హ్యాలెర్ అండ్ గోథె). ప్రకృతి శాస్త్రాలకే ఇది ప్రత్యేకమైనది కాదు. ఎందుకంటే మానవుని జ్ఞానం అంతా సాఫీగా గాక చిక్కులతోకూడిన సంక్లిష్టమైన క్రమంగా

అభివృద్ధి చెందింది. తత్వశాస్త్రంతో సహా చారిత్రక శాస్త్రాలలో కూడా సిద్ధాంతాలు ఒకదాని స్థానంలో మరొకటి ముందుకు వచ్చినప్పటికీ దీనినించి ఏ ఒక్కరూ సాంప్రదాయక తర్కం అర్థరహితమైనదనీ నిర్ధారించలేరు." (The form of development of natural science, in so far as it thinks, is the *hypothesis*..... The number and succession of hypotheses supplanting one another given the lack of logical and dialectical education among natural scientists - easily gives rise to the idea that we can not know the essence of thing (Haller and Goethe). This is not peculiar to natural science since all human knowledge develops in a much twisted curve and in the historical sciences also, including philosophy, theories displace one another, from which, however, nobody conclude that formal logic, for instance, is nonsense.) (From Engels, Dialectics of nature, FLPH, Moscow, page no 319)

మార్క్స్ ఆలోచనలు కూడా ఒక సరళరేఖలో కాకుండా, ఒడిదుడుకుల మార్గంలోనే అభివృద్ధిచెందాయి. కార్మిక వర్గ ఉద్యమ నేతగా ఆయన పీడిత ప్రజానీకంతో మమేకమయ్యారు. వారి పోరాటాలలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. ఆ పోరాటాల నించి నేర్చుకున్న పాఠాలతో కార్మిక వర్గ విప్లవ సిద్ధాంతాన్ని సుసంపన్నం చేశారు.

పినాకపాణి గారు మార్క్స్ అదనపు విలువను హైపోతిసిస్‌గా మాత్రమే పరిగణిస్తున్నారనీ, దాన్ని సిద్ధాంతంగా గుర్తించటం లేదనీ రంగనాయకమ్మ విమర్శించారు. అదనపు విలువ మొదట పేర్కొనబడినపుడు అది ప్రతిపాదన అవునా? కాదా? అదనపు విలువ గానీ, దానిని పరిశోధించడానికి మార్క్స్ అనుసరించిన మార్గదర్శక సూత్రంగానీ ప్రతిపాదనలవునో కాదో తెలుసుకోవడానికి ఆయన ఆలోచనలలో వచ్చిన అభివృద్ధి క్రమాన్నీ, భావ పరిణతినీ మొదట అవగాహన చేసుకోవాలి.

## చారిత్రక భౌతికవాదం : అదనపు విలువ

జర్మనీ తదితర యూరప్ దేశాల్లో ప్రముఖ సంఘటనలు సంభవించనున్న చారిత్రక దశలో మార్క్స్ శాస్త్రీయ భావాలు, రాజకీయ అభిప్రాయాలు రూపుదిద్దుకున్నాయి. మార్క్స్‌కి హెగెల్ రచనలతో పరిచయం తన విద్యార్థి దశ నుంచే ఉంది. ఆయన వామపక్ష హెగెలియన్లతో సంబంధాల్లో ఉన్నాడు. ఆయన రాసిన **1841** నాటి డెసర్టేషన్ చూస్తే ఆనాటికి ఆయన తన భావవాద దృక్పథానికి కట్టుబడి ఉన్నప్పటికీ, హెగెల్‌కి చెందిన భిన్నమైన తత్వశాస్త్రం నించి నాస్తికపరమైన, విప్లవాత్మకమైన నిర్ధారణలకి రాగలిగాడు. ఆయన ఏప్రిల్ **1842**లో 'రైనిషెసైటుంగ్' పత్రికలో ఉద్యోగిగా చేరాడు. అదే సంవత్సరం అక్టోబర్‌లో సంపాదకునిగా ఎదిగాడు. ప్రగతిశీల భావాలను వ్యాపింపచేయడంలోనూ, రాజకీయ అభివృద్ధి నిరోధకత్వానికీ, అజ్ఞాన అంధకారపు మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా జరిపే పోరాటంలోనూ, 'రైనిషెసైటుంగ్' పత్రిక మార్క్స్‌కి ఒక వేదికగా ఉపయోగపడింది. మార్క్స్ సారథ్యంలో ఆ పత్రికకి ఉన్న విప్లవ ప్రజాస్వామిక ధోరణి మరింత ప్రస్ఫుటమైంది. నిజమైన ప్రజాస్వామిక వాది అయిన మార్క్స్ వరసగా రాసిన వ్యాసాల్లో ప్రజల ఆర్థిక ప్రయోజనాలను ఎత్తిచూపాడు. జర్మనీలో నిరుపేదల దయనీయ పరిస్థితులే గాక, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో జరుగుతున్న సంఘటనలు కూడా ఆర్థిక సాంఘిక సమస్యలపై ఆయనలో అత్యంత ఆసక్తిని ప్రేరేపించాయి.

**1831, 1834**లలో జరిగిన లేయన్ కార్మికుల తిరుగుబాటు **1830** దశకం చివర బ్రిటన్‌లో కార్మిక వర్గ విప్లవోద్యమ ప్రభంజనం రాజకీయ స్వభావాన్ని సంతరించుకుని **1842**లో పతాక స్థాయికి చేరుకోవడం, కార్మికుల ఇతర అనేక పోరాటాలు - ఇవన్నీ ఎంతో గొప్ప ప్రాముఖ్యతని సంతరించుకున్నాయి. అప్పటినించి పెట్టుబడిదారీ వర్గానికి, కార్మిక వర్గానికి మధ్య జరుగుతున్న వర్గ పోరాటం అత్యంత అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రధాన అంశమై పోయింది. కార్మికవర్గం అనే కొత్త వర్గం రంగం మీదకి రావడంతో మార్క్స్ నూతన సామాజిక ఆర్థిక సమస్యలను మరింత లోతుగా పరిశీలించసాగాడు. ఆ విధంగా ఆయనకి బ్రిటన్, యూరప్‌లలో వెలువడుతున్న సోషలిస్టు సాహిత్యం పట్ల అమితమైన ఆసక్తి పెరిగింది.

'రైనిషెసైటుంగ్'లో పని, జీవితంతో ప్రత్యక్ష సంబంధం, జర్మనీలో ప్రజానీకం సాగిస్తున్న విశాల పోరాటం ఇతర దేశాల్లో జరుగుతున్న కార్మిక వర్గ ఉద్యమంతో పరిచయం - యువ మార్క్స్‌పై తీవ్రమైన ప్రభావాన్ని కలిగించాయి. మార్క్స్ ఆలోచనల్లో వచ్చిన అభివృద్ధి క్రమం గురించి కామ్రేడ్ లెనిన్ ఇలా వివరించారు: "ఇక్కడ మార్క్స్ భావవాదం నించి భౌతిక వాదం వైపు, విప్లవ ప్రజాస్వామ్యం నించి కమ్యూనిజం వైపు పరిణామం చెందడం గమనించగలం." (వి.ఐ. లెనిన్ రచనలు, నాల్గవ రష్యన్ కూర్పు, సంపుటి **21**, పేజీ **63**)

"ప్రపంచ నాగరికత అభివృద్ధి ప్రధాన పథం నించి విడివడి మార్క్సిజం ఏర్పడలేదనీ" లెనిన్ ఉద్ఘాటించారు. గతకాలపు సామాజిక చింతనలో జరిగిన అభివృద్ధి మార్క్సిజం రూపొందటాన్ని ఎంతో ప్రభావితం చేసింది. జర్మన్ సాంప్రదాయక తత్వశాస్త్రం, ఇంగ్లిష్ సాంప్రదాయక రాజకీయ అర్థశాస్త్రం, ఫ్రెంచ్ ఊహాజనిత సోషలిజం - ఈ మూడింటి విజయాలను క్రోడీకరించి, విమర్శనాయుతంగా పరిశీలించిన మార్క్స్, ఎంగెల్స్‌లు ఒక సమగ్రమైన విప్లవ సిద్ధాంతాన్ని ఆవిష్కరించారు. వాళ్లు ఆ సిద్ధాంతాన్ని అభివృద్ధి పరచడానికి పలు దశాబ్దాలు కృషిచేశారు. కానీ దానికి సంబంధించిన ప్రాథమిక కృషి **1840** దశకంలోనే జరిగింది. వారు గతితార్కిక, చారిత్రక భౌతికవాద మౌలిక సూత్రాల గురించీ, కార్మికవర్గం నిర్వహించే చారిత్రక పాత్ర గురించీ, పెట్టుబడి విధానం నించి సోషలిజానికి అనివార్యంగా జరిగే పరివర్తన గురించీ వివరించారు. 'ది హోలీ ఫ్యామిలీ' (**1845**), 'జర్మన్ ఐడియాలజీ' (**1846**) 'పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ' (**1847**), 'కమ్యూనిస్టు ప్రణాళిక'

(1848) వంటి ప్రముఖ గ్రంథాలు ఈ కాలంలోనే వెలువడ్డాయి.

1840 దశకంలో వచ్చిన మార్క్స్, ఎంగెల్స్ గ్రంథాలు రాజకీయ అర్థశాస్త్రంలో కూడా విప్లవాన్ని తీసుకువచ్చాయి. బూర్జువా చరిత్రకారుల రచనల్లో ఉండే స్వీయవాదాన్నీ, వ్యక్తి పూజనూ, జడాత్మక వాదాన్నీ ఎండగట్టడం ద్వారా మార్క్స్, ఎంగెల్స్‌లు మొదటిసారిగా చరిత్ర రచనను శాస్త్రీయ పునాదిపై నిలిపారు. చరిత్ర పట్ల భౌతికవాద అవగాహనలో ఆర్థిక అంశం, అంటే ప్రజలు తమ జీవితాన్ని తీర్చిదిద్దుకున్న విధానం కీలకమైనది. వారు పెట్టుబడిదారీ సమాజ చలనానికి సంబంధించిన ఆర్థిక సూత్రాన్ని వివరించి పెట్టుబడిదారీ విధానం పతనం అనివార్యమనీ అది కమ్యూనిస్టు సమాజ స్థాపనకు దారితీస్తుందని చాటి చెప్పారు. 1840 దశకం రెండవ భాగంలో "వేతన శ్రమ, పెట్టుబడి" శీర్షికతో వచ్చిన మార్క్స్ సంపాదకీయ వ్యాసాల సంపుటిలో అదనపు విలువకు సంబంధించిన ప్రధానమైన ప్రాథమిక ప్రతిపాదనలన్నీ ఉన్నాయి. ఇంకా అందులో మార్క్సిస్టు రాజకీయ అర్థశాస్త్రానికి సంబంధించిన పలు ప్రాథమిక సూత్రాలు కూడా పొందుపరచబడ్డాయి. ఆ తర్వాత కాలంలో మార్క్స్ వాటిని లోతుగా పరిశీలించడం ద్వారా పెట్టుబడిదారీ విధానంలో జరిగే దోపిడీ క్రమాన్ని కనుక్కోగలిగారు.

మార్క్స్ రాసిన "వేతన శ్రమ పెట్టుబడి" గ్రంథాన్ని పరిచయం చేస్తూ ఎంగెల్స్ ఇలా అన్నారు. "నలభైలలో మార్క్స్ ఇంకా అర్థశాస్త్ర పరిశీలన ముగించలేదు. యాభైల అంతంలో మాత్రమే ఇది జరిగింది. అందువలన 'అర్థశాస్త్ర విమర్శనాత్మక విశ్లేషణకి చేర్పు' (1859) మొదటి భాగానికి ముందు వెలువడిన ఆయన రచనలు 1859 తర్వాత రచించిన వాటితో కొన్ని విషయాలు విభేదిస్తాయి. వాటిలో కొన్ని వ్యక్తీకరణలు, కొన్ని మొత్తం వాక్యాలకు వాక్యాలూ ఎలాంటివి ఉన్నాయంటే, తదనంతర రచనల దృష్ట్యా చూస్తే అవి సముచితం కానివిగానూ, తప్పుగా కూడానూ కనిపిస్తాయి. సాధారణ పాఠకులకు ఉద్దేశింపబడిన మామూలు కూర్పులలో, ఈ తొలికాలపు దృక్పథానికి కూడా రచయిత మేధోపరమైన అభివృద్ధిలో భాగంగా దాని స్థానం దానికి ఉందనీ, ఈ పూర్వ రచనల మార్పులేని పునర్ముద్రణ పొందడానికి రచయితలకూ, పాఠకులకూ ఉభయులకూ నిర్వివాదమైన హక్కు ఉందనేది స్పష్టం. వాటిలో ఒక్క మాటైనా మార్చాలని నేను కలలో కూడా అనుకొని ఉండను.

కొత్త కూర్పు దాదాపు సంపూర్ణంగా కార్మికులలో ప్రచారం కోసం ఉద్దేశింపబడినపుడు, అది మరొక విషయం. అలాంటి సందర్భాలలో మార్క్స్ నిశ్చయంగా 1849 నాటి పాత రచనను తన కొత్త దృక్పథానికి అనుగుణంగా మార్చేవాడు. అన్ని ముఖ్య విషయాలలోనూ ఈ లక్ష్యం సాధించేటందుకు అవసరమైన కొద్ది మార్పులూ, చేర్పులూ ఈ కూర్పు కోసం చేయడానికి పూనుకోవడంలో నేను ఆయన ఎలా చేసి ఉండేవాడో అలాగే చేస్తున్నాననీ గట్టిగా అనుకుంటున్నాను. కనుక నేను పాఠకునికి ముందే చెప్తున్నాను. ఇది 1849లో మార్క్స్ రాసిన విధంగా ఉన్న కరపత్రం కాదు. ఇది 1891లో ఆయన ఎలా రాసి ఉండేవాడో దాదాపు అలా ఉన్న పుస్తకం. అంతేగాక, అసలు పాఠం ఎన్నో ప్రతులలో పంపకమైంది గనుక, నేను దానిని మళ్లీ మార్పులేని కూర్పుగా ఆ తర్వాత సంపూర్ణ రచనల సంపుటంలో పునర్ముద్రించగలిగే దాకా ఇది సరిపోతుంది.

నా మార్పులన్నీ ఒక్క విషయానికి సంబంధించినవి. అసలు పాఠం ప్రకారం కార్మికుడు వేతనం కోసం తన శ్రమను పెట్టుబడిదారునికి అమ్ముతాడు. ప్రస్తుత పాఠం ప్రకారం కార్మికుడు తన శ్రమశక్తిని అమ్ముతాడు. ఈ మార్పుకు నేను వివరణ ఇవ్వవలసి ఉంది. ఇది కేవలం మాటల గారడీ కాదనీ, మొత్తం అర్థశాస్త్రంలోని అత్యంత ముఖ్యమైన విషయాలలో ఒకటనీ కార్మికులు గ్రహించేటందుకు నేను వాళ్లకు వివరణ ఇవ్వవలసి ఉంది... తాను తన కార్మికుల శ్రమను కొంటున్నాననీ, డబ్బు చెల్లిస్తున్నాననీ అనుకునే పారిశ్రామికుని ఆనాటి అవగాహనను పారిశ్రామిక ఆచరణ నుండి సాంప్రదాయిక అర్థశాస్త్రం స్వీకరించింది. పారిశ్రామికుని వ్యాపార అవసరాలకూ, పద్దులు రాసుకోవడానికీ, ధరల లెక్కగట్టడానికి ఈ అవగాహన ఒకింత సరిపోయింది. కానీ ఇది అర్థశాస్త్రానికి సామాన్యంగా అన్వయింపబడినప్పుడు, అక్కడ నిజంగా ఆశ్చర్యకరమైన తప్పులనూ, గందరగోళాన్ని కలిగించింది" (మార్క్స్ - 'వేతనశ్రమ పెట్టుబడి' ప్రగతి ప్రచురణాలయం, మాస్కో, పేజీలు 4, 5)

ఆర్థిక సంక్షోభం, ప్రధాన రాజకీయ సంఘటనల తీవ్రత వంటి అంశాల కారణంగా మార్క్స్ ఆ తర్వాత కాలంలో "రాజకీయ అర్థశాస్త్రంపై మరింత కేంద్రీకరించారు. "రాజకీయ అర్థశాస్త్ర విమర్శనాత్మ విశ్లేషణ మౌలిక లక్షణాలు" (Grundrisse derk ritik der politischen okonomic) పేరుతో ఒక వివరణాత్మక గ్రంథాన్ని రాశారు. అయితే అది 1939 వరకు అచ్చుకాకపోవడం వల్ల వెలుగుచూడలేదు. ఈ రాతప్రతిలో మార్క్స్ మొదటిసారిగా అదనపు విలువ సిద్ధాంతాన్ని స్థూలంగా వివరించారు. మార్క్స్ చేసిన ఈ మహత్తర పరిశోధన గురించి ఎంగెల్స్ ఇలా అన్నారు. "మార్క్స్ స్వయంగా 50వ దశకంలో అదనపు విలువ సిద్ధాంతాన్ని రూపొందించారు. కానీ తన నిర్ధారణలు సవ్యమైనవేననీ తను పూర్తిగా నిశ్చయించుకునేంత వరకు వాటిలో ఏ ఒక్క దానినీ ప్రచురించడానికి నిరాకరిస్తూ మొండిగా వ్యవహరించాడు". (Marx worked out his theory of surplus value in the 50's all by himself and was adamant in refusing to publish anything about it until he was absolutely sure of his conclusions - From Karl Marx, short biography by E. stepanova, FLPH, Moscow 1960, page 81) ముద్రణ కోసం తన రచనని తయారు చేసే సమయంలో మార్క్స్ తన రాతప్రతి మొత్తాన్ని తిరగ రాశారు. ఫలితంగా ద్రవ్యం గరించిన బోధనతో సహా విలువ సిద్ధాంతం ప్రధాన అంశాలను క్రమబద్ధంగా వివరించిన "రాజకీయ అర్థశాస్త్రం విమర్శనాత్మక విశ్లేషణకి చేర్పు" (A contribution to the critique of political economy) పుస్తకం మొదటి కూర్పు జూన్ 1859లో వెలువడింది. ఈ ప్రచురణకి మార్క్స్ రాసిన పీఠికలో చారిత్రక భౌతికవాదానికి సంబంధించిన అద్భుతమైన సూత్రీకరణలు ఉన్నాయి.

మార్క్స్ 1861లో తన ఆర్థిక పరిశోధనను మళ్లీ మొదలు పెట్టినప్పుడు ఆయన తన రచనల్ని తిరగరాసి, దాన్ని తన "రాజకీయ అర్థశాస్త్ర విమర్శనాత్మక విశ్లేషణకి చేర్పు" పుస్తకానికి కొనగింపుగా గాక వేరే పుస్తకంగా ప్రచురించాలనుకున్నారు. ఆయన 1862లో తన రాబోయే రచన శీర్షిక 'క్యాపిటల్' అని ఉంటుందనీ, దాని ఉప శీర్షిక "రాజకీయ అర్థశాస్త్ర విమర్శనాత్మక విశ్లేషణకు చేర్పు" అని ఉంటుందనీ చెప్పారు. 'క్యాపిటల్' మొదటి సంపుటి 1867లో ప్రచురించబడింది. మార్క్స్ మరణానంతరం రెండవ సంపుటి 1885 లోనూ, మూడవ సంపుటి 1894లోనూ, ప్రచురితమయ్యాయి. మార్క్స్ గొప్ప కృషి, పరిశోధన నాల్గవ సంపుటితో సమాప్తమయ్యేది. ఈ నాల్గవ సంపుటంలో మార్క్స్, రాజకీయ అర్థశాస్త్రానికి కేంద్రంగా ఉన్న అదనపు విలువ సిద్ధాంతాన్ని విశ్లేషించడం మీద కేంద్రీకరించారు. మార్క్స్ మరణించాక ఎంగెల్స్ దీన్ని ఎడిట్ చేసి, ఈ రాతప్రతిని వేరే పుస్తకంగా అచ్చువేయాలనుకున్నారు. అదే 'క్యాపిటల్' నాల్గవ సంపుటి అయేది. అది అప్పుడు వెలువడలేదు. ఎంగెల్స్ మరణానంతరం మాత్రమే అదనపు విలువ సిద్ధాంతంగా ప్రచురితమైంది.[2]

మార్క్స్ ఆర్థిక సిద్ధాంతం రాజకీయ అర్థశాస్త్రంలో ఒక మౌలికమైన మలుపు, ఒక నిజమైనవిప్లవం. మానవ సమాజంలో జీవనానికి ఉపయోగించే భౌతిక సాధనాల ఉత్పత్తి పంపిణీల నియమాలకు సంబంధించిన శాస్త్రమే రాజకీయ అర్థశాస్త్రం. ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థల అభివృద్ధి, అంటే సమాజ ఆర్థికాభివృద్ధి మొత్తం సామాజికాభివృద్ధికి పునాదిగా ఉంటుంది. ఈ చారిత్రక భౌతికవాద దృక్పథంతో మార్క్స్ పెట్టుబడిదారీ సమాజ అభివృద్ధి నియమాలను పరిశోధించాడు. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను అవగాహన చేసుకోవడానికి అదనపు విలువ ఉత్పత్తి కీలకమైన అంశమని కనుగొన్నాడు.

**ఇదీ మార్క్స్ చరిత్ర పట్ల భౌతికవాద దృక్పథం వెలుగులో అదనపు విలువ సిద్ధాంతాన్ని అభివృద్ధి పరిచిన క్రమం. ఇది దేనిని తెలియ జేస్తుంది?** మార్క్స్ తన భావాల్ని తొలుత ప్రకటించిన తరువాత వాటిని శాస్త్రీయంగా నిరూపించడానికి లోతైన అధ్యయనం, పరిశోధనలను కొనసాగించడాన్ని గానీ, తన తొలి రచనల్లో దొర్లిన తప్పులను ఆ తర్వాత సవరించడాన్ని గానీ పరిశీలిస్తే అదనపు విలువ సిద్ధాంతం మొదట వివరించబడిపుడు ప్రతిపాదన రూపంలోనే ఉందనేది స్పష్టమవుతుంది. ఇదే విషయాన్ని మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ స్పష్టంగా తన సుప్రసిద్ధ, "ప్రజా స్నేహితులెలాంటి వారు? సోషల్ డెమోక్రాట్లతో వారు ఎలా పోరాడుతున్నారు" గ్రంథంలో ఇలా వివరించారు:

"సాంఘిక ఆర్థిక వ్యవస్థల అభివృద్ధి ఒక సహజమైన చారిత్రక క్రమం అనేది మార్క్స్ భావన. సామాజిక శాస్త్రం బిరుదు అర్హతను ప్రకటించించుకునే బాల్యారిష్టపు నైతికత ప్రాతిపదికను ఇది గట్టి దెబ్బ తీసింది. మార్క్స్ ఈ మౌలికమైన భావనకి ఎలా రాగలిగాడు? సకల సామాజిక సంబంధాల నించి సాంఘిక జీవన ఆర్థిక రంగాన్నీ, ఉత్పత్తి సంబంధాలనూ వేరు చేసి ఇతర సకల సంబంధాలను నిశ్చయించే వాటిని మౌలికమైనవిగానూ, ప్రాథమికమైనవిగానూ ఎంచడం ద్వారా ఈ అభిప్రాయానికి రాగలిగారు. మార్క్స్ స్వయంగా ఈ విషయంపై చేసిన సహేతుకమైన నిర్ధారణని ఇలా వివరించారు.

'....పరిశోధన ద్వారా నేను ఏర్పరుచుకున్న సాధారణ అభిప్రాయం ఏదైతే తర్వాత నా అధ్యయనానికి మార్గదర్శక సూత్రంగా పని చేసిందో ఆ ఫలితాన్ని క్లుప్తంగా ఇలా సూత్రీకరించవచ్చు. తమ జీవనానికి సంబంధించిన సామాజిక ఉత్పత్తిలో మానవులు తమ ఇష్టానికి సంబంధం లేనటువంటి, అత్యంతావశ్యకమైనటువంటి నిశ్చిత సంబంధాలలోకి ప్రవేశిస్తారు. ఈ ఉత్పత్తి సంబంధాలు భౌతిక ఉత్పత్తి శక్తుల అభివృద్ధిలోని ఒక నిర్ణీత దశకు అనుగుణ్యంగా ఉంటాయి. ఈ ఉత్పత్తి సంబంధాల మొత్తం, సమాజ ఆర్థిక నిర్మాణపు నిజమైన పునాదిగా ఏర్పడుతుంది. ఈ పునాది మీద రాజకీయ, శాసన నిర్మాణ కట్టడాలు నిర్మింపబడతాయి. వీటికి అనుగుణ్యంగా సామాజిక చైతన్యపు నిశ్చిత రూపాలు ఏర్పడతాయి. భౌతిక జీవితంలోని ఉత్పత్తి విధానమే సాధారణంగా సామాజిక, రాజకీయ, మేధోపరమైన జీవిత క్రమాన్ని నిర్ణయిస్తుంది. మానవుల ఉనికిని నిశ్చయించేది వారి చైతన్యం కాదు. తద్విరుద్ధంగా సామాజిక ఉనికియే వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది. సమాజంలోని భౌతిక ఉత్పాదక శక్తులు తమ అభివృద్ధికి సంబంధించిన ఒకానొక దశలో అమలులో ఉన్న ఉత్పత్తి సంబంధాలతో ఘర్షణ పడతాయి. దీనినే న్యాయశాస్త్ర పరిభాషలో చెప్పాలంటే, ఇంతకు ముందు పని చేస్తున్న ఆస్తి సంబంధాలతోనే ఘర్షణపడతాయి. ఉత్పాదకశక్తులను అభివృద్ధి చేసే రూపాల నుండి ఈ సంబంధాలు వాటి సంకెళ్లుగా మారుతాయి. అప్పుడు సామాజిక విప్లవ దశ ప్రారంభమవుతుంది. ఆర్థిక పునాది మార్పుతో విస్తృతమైన యావత్తు ఉపరితల నిర్మాణమూ, త్వరగానో, నెమ్మదిగానో ఏదో విధంగా రూపాంతరం చెందుతుంది...[3]

సామాజిక శాస్త్రంలో భౌతిక వాదం అనే భావన అపూర్వమైనది. సహజంగానే అది అప్పుడు ఒక ప్రతిపాదనగానే ఉంది. కానీ అది మొదటిసారిగా చారిత్రక సామాజిక సమస్యలను అవగాహన చేసుకోవడానికి కచ్చితమైన శాస్త్రీయ వైఖరికి వీలు కల్పించింది. (This idea of materialism in sociology was in itself a stroke of genius. Naturally, for the time being it was only a hypothesis, but one which for the first time created the possibility of a strictly scientific approach to historical and social problems.) అప్పటి వరకు, అతి సామాన్యమైన ప్రధాన సంబంధాల్నీ, ఉదాహరణకి ఉత్పత్తి సంబంధాల్ని ఎలా అవగాహన చేసుకోవాలో తెలియక, సామాజిక వేత్తలు, రాజకీయ శాసనపరమైన నిర్మాణాలను ప్రత్యక్షంగా పరిశోధించి అధ్యయనం చేయసాగారు. అప్పుడు ఆయా దశల్లో మానవాళి ప్రత్యేక ఆలోచన నించి ఈ నిర్మాణాలు ఉద్భవిస్తాయనే యథార్థం ఎదురుకాగా వారు తడబడిపోయారు. వాళ్లు అక్కడ ఆగిపోయారు. మనుషులు సామాజిక సంబంధాలను చైతన్యయుతంగా ఏర్పరచుకుంటా రనిపిస్తుంది.. కానీ ఈ నిర్ధారణ - అన్ని చారిత్రక పరిశీలనలకి పూర్తిగా విరుద్ధమైనది... అప్పుడు

40 దశకంలో ఈ ప్రతిపాదన చేసిన మార్క్స్ వాస్తవిక జీవితాన్ని అధ్యయనం చేయనారంభించారు. ఆయన సాంఘిక ఆర్థిక నిర్మాణాలలో ఒకటైన సరుకు ఆర్థిక విధానాన్ని పరిశోధనకు తీసుకున్నారు. విస్తృతమైన సమాచారం ఆధారంగా (దీని కోసం ఆయన ఇరవై ఐదు సంవత్సరాలు అధ్యయనం చేశారు) ఆయన ఈ వ్యవస్థ నిర్వహణ తీరును, అభివృద్ధిని నిర్దేశించే నియమాలను కూలంకషంగా విశ్లేషించారు. ఈ విశ్లేషణ ప్రజల మధ్య ఉండే ఉత్పత్తి సంబంధాలకి ప్రత్యేకించి పరిమితమైంది. వీటిని వివరించడం కోసం ఈ ఉత్పత్తి సంబంధాల పరిధి బయట ఉండే పరిణామాల మీద ఆధారపడ లేదు. మార్క్స్ తన విశ్లేషణ ద్వారా సాంఘిక ఆర్థిక విధానంలో సరుకుల వ్యవస్థ ఎలా అభివృద్ధి చెందిందో, అది పరస్పర విరుద్ధమైన బూర్జువాజీ, కార్మిక వర్గాలను సృష్టించి పెట్టుబడిదారీ వ్యవస్థగా ఎలా మార్పు చెందిందో, సామాజిక శ్రమ ఉత్పాదకతను అభివృద్ధిపరచడం ద్వారా ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ పునాదికే రాజీలేని వైరుధ్యంగా మారే అంశాన్ని అది ఎలా ప్రవేశపెట్టిందో అవగతం చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఇదే 'క్యాపిటల్' గ్రంథానికి సంబంధించిన స్థూల స్వరూపం. అయితే అసలు విషయం ఏమిటంటే మార్క్స్ ఈ స్థూల స్వరూపంతో సంతృప్తిపడలేదు. ఆయన మాములుగా పిలవబడే ఆర్థిక సిద్ధాంతం ఒక్కదానితోనే సంతృప్తిపడలేదు. ఆయన ఒక నిర్దిష్ట సమాజ నిర్మాణాన్నీ అభివృద్ధినీ ఈ ఉత్పత్తి సంబంధాల ద్వారా మాత్రమే వివరించినపుడు ఆయన ప్రతి చోటా నిరంతరాయంగా ఆ ఉత్పత్తి సంబంధాలకు అనుగుణంగా ఉండే ఉపరితలాన్ని నిశితంగా పరిశీలించి ఆ స్థూల స్వరూపానికి జవ సత్వాలు జోడించేవాడు...... ఇప్పుడు 'క్యాపిటల్' గ్రంథం వెలుబడినాక చరిత్ర గురించిన భౌతికవాద దృక్పథం ఇక మీదట ప్రతిపాదన కాదు. అది శాస్త్రీయంగా నిరూపించబడిన ప్రతిపాదన అవుతుంది". (Now-since the appearence of capital - the materialist conception of history is no longer a hypothesis, but a scientifically proven proposition) - (From V.I. Lenin, What the "Friends of the People" are and How they fight the Social - democrats, FLP, Peking, Pages 11-15)

సామాజికాభివృద్ధికి సంబంధించిన సాధారణ నియమాలను తెలియజేసే శాస్త్రీయ దృక్పథమే చరిత్ర గురించిన భౌతికవాద దృక్పథం. చారిత్రక భౌతికవాదం సామాజిక శాస్త్రాలన్నింటికీ ప్రాతిపదిక. ఈ దృక్పథంతోనే కారల్ మార్క్స్ రాజకీయ ఆర్థిక, సామాజిక జీవన రంగాల్ని పరిశోధించి అదనపు విలువ సిద్ధాంతాన్ని రూపొందించారు. చరిత్ర గురించిన భౌతికవాద దృక్పథం మొదట ప్రతిపాదనగానే ఉన్నా 'క్యాపిటల్' గ్రంథం ద్వారా అది శాస్త్రీయంగా నిరూపించబడిందనీ కామ్రేడ్ లెనిన్ పై మాటల్లో స్పష్టంగా చెప్పారు. ఇదే విషయాన్ని పినాక పాణి గారు తన 'కామెంట్స్' వ్యాసంలో కొకు బుద్ధికొలత సిద్ధాంతంలోని అశాస్త్రీయతను బహిర్గతపరిచినపుడు చెపుతూ ఇలా అన్నారు.

"అంటే ఇది సిద్ధాంతం కాదు. కేవలం ఒక ప్రతిపాదన మాత్రమే (hypothesis). దీనికి రుజువు చేయడానికీ, చేయలేకపోవడానికీ మనకేమీ ఆధారాలు లేవు. సైంటిఫిక్ సిద్ధాంతాలకి కూడా హైపోతిసిస్‌లు ఉంటాయి. ఉదా: ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతంలో ఉన్న హైపోతిసిస్: కాంతివేగం ఏ frame of reference[4]లో అయినా ఒకటి. అలాగే మార్క్స్ ప్రతిపాదించిన అదనపు విలువ కూడా హైపోతిసిస్ కిందే నేను పరిగణిస్తాను. ఈ ప్రతిపాదనల మీద ఆధారపడిన సిద్ధాంతాలను వాస్తవ జగత్తులోని పరిణామాల్ని వేరే ఏ ఇతర సిద్ధాంతాల కంటే కూడా సరిగ్గా వివరిస్తే ఆ సిద్ధాంతాలు ప్రతిపాదనలు రుజువయినట్లు (చాలా వరకు) అనుకోవాలి. బుద్ధికొలత ప్రతిపాదనగా ఉన్న సిద్ధాంతం ఏమీ లేదు. అది దేనినీ రుజువు చేయడం లేదు. శాస్త్రీయ సిద్ధాంతాలు, వాటి సూత్రాల ప్రకారం ఏ పరిణామాలు సంభవిస్తాయో ముందే ఊహించి చెబుతాయి. వాటిని తర్వాత వాస్తవంలో వెరిఫై చేసుకుని, వాటిని అంగీకరించటమో, అంగీకరించకపోవడమో నిర్ణయించుకుంటాం." (కామెంట్స్ వ్యాసం నించి)

పినాకపాణిగారు ఈ మాటల్లో అదనపు విలువ సిద్ధాంతాన్ని శాస్త్రీయ సిద్ధాంతానికి ఒక ఉదాహరణగా స్పష్టంగానే పేర్కొన్నారు. కానీ ఆయన అదనపు విలువని ఒక హైపోతిసిస్ గానే పరిగణిస్తున్నారు తప్ప సిద్ధాంతంగా భావించటం లేదనేది రంగనాయకమ్మగారి విమర్శ. చర్చలో భాగంగా రంగనాయకమ్మ గారు "నా ప్రశ్నలు మళ్లీ అవే" వ్యాసంలో ఇలా అన్నారు: "మార్క్స్ చెప్పిన అదనపు విలువ అనేది సిద్ధాంతం కాకపోతే, శ్రమ దోపిడీయే లేదు. అది నిజం కాదు అనే అర్థానికి రావాలి. మీ పుస్తకంలో ఈనాటికీ ప్రచారం చేస్తూ ఉన్నది అదే కాబట్టి ఇక మీ విప్లవ సంఘాన్ని కట్టిపెట్టండి." (ఆంధ్రజ్యోతి 2 నవంబర్ 2015). ఇంకా ఆమె "విమర్శ దాడి అవుతుందా" అనే వ్యాసంలో ఇలా అన్నారు: "అదనపు విలువని సిద్ధాంతం కాదని చెప్పడం ద్వారా శ్రమ దోపిడీ జరగడం లేదని తేల్చిన వ్యాసం ఎంత పెద్ద నేరమో, అది మొత్తం ప్రపంచ కార్మిక వర్గానికి ఎంత పెద్ద ద్రోహమో పట్టించుకోని కుమార్తెలు నాన్నగారి రక్షణకు దిగారు". (ఆంధ్రజ్యోతి 23 నవంబర్ 2015)

## తప్పుడు వ్యాఖ్యానాలు : నిరాధారమైన విమర్శలు

రంగనాయకమ్మగారి విమర్శ పూర్తిగా నిరాధారమైనది. అన్యాయమైనది. ఇది పినాకపాణి గారి అభిప్రాయాన్ని ఘోరంగా వక్రీకరించడం తప్ప మరేమీ కాదు. పినాకపాణి అదనపు విలువను ఒక హైపోతిసిస్ గానూ, ఒక సిద్ధాంతంగానూ భావించటం మాత్రమే గాక అది శాస్త్రీయ సిద్ధాంతంగా కూడా పెంపొందిందని చెప్పారు. సుప్రసిద్ధమైన ఐన్‌స్టైన్ థియరీలోని కాంతి వేగానికి సంబంధించిన హైపోతిసిస్ ఆచరణలో రుజువయిన శాస్త్రీయ సిద్ధాంతంగా ప్రపంచానికంతటికీ తెలుసు. అలాంటిదే అదనపు విలువ సిద్ధాంతమని చెప్పటం ద్వారా పినాకపాణి దానిని శాస్త్రీయ సిద్ధాంతంగానే భావించారనీ స్పష్టమవుతుంది. కొకు బుద్ధికొలత ప్రతిపాదనను వ్యాఖ్యానించడానికి పినాకపాణిగారు ఐన్‌స్టైన్, మార్క్స్ భావాలను ఎందుకు ప్రస్తావించారో, అలాంటి ప్రస్తావన అవసరం

ఉందని ఆయన ఎందుకు అభిప్రాయపడ్డారో రంగనాయకమ్మ అవగతం చేసుకోలేదు. పినాకపాణి అదనపు విలువని కేవలం హైపోతిసిస్‌గానే భావించి ఉంటే శాస్త్రీయ సిద్ధాంతాలకు కూడా హైపోతిసిస్‌లు ఉంటాయనీ అలాంటి శాస్త్రీయ సిద్ధాంతానికి ఉదాహరణగా అదనపు విలువని ఎలా చూపగలిగారు? 'హైపోతిసిస్' 'శాస్త్రీయ సిద్ధాంతం', ఈ రెండింటిని విడివిడి అంశాలుగా ఆయన పరిగణించారా? లేక ఒకే అంశంగా భావించారా? నిరూపించని భావాన్ని హైపోతిసిస్ గానూ, నిరూపించబడిన హైపోతిసిస్‌ను శాస్త్రీయ సిద్ధాంతంగానూ మనం పరిగణిస్తున్న విషయం వాస్తవం కాదా? రుజువు చేయడానికీ, చేయలేకపోవడానికీ ఎలాంటి ఆధారాలు లేని బుద్ధి కొలతకు భిన్నంగా శాస్త్రీయ సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చి ఆ రెండింటిని పోల్చి చూపుతూ వాటి మధ్య ఉన్న విభేదాలను వివరించడం దేనిని తెలియజేస్తుంది? కొ.కు. బుద్ధికొలత ఆధారంగా ఎటువంటి సిద్ధాంతం లేదనీ అందుకు భిన్నంగా మార్క్స్ అదనపు విలువ మీద ఆధారపడిన సిద్ధాంతం ఉందనీ ఆయన వివరించాల్సిన అవసరం ఏమిటి? బుద్ధికొలత ప్రతిపాదన ఊహించి చెప్పే పరిణామాలు ఏవీ లేవు కాబట్టి వాటిని ఎవరు అంచనా వేయలేరనీ అందుకు భిన్నంగా అదనపు విలువ లాంటి శాస్త్రీయ సిద్ధాంతాలు ఏ పరిణామాలు సంభవిస్తాయో ముందే ఊహించి చెపుతాయి కనుక వాటిని నిరూపించగలమనీ చెప్పడంలో తప్పేమిటి? కొకు బుద్ధికొలత ప్రతిపాదనను సమీక్షించడానికీ ప్రధానంగా ఉద్దేశించబడిన వ్యాసంలో అదనపు విలువ ఎలా రుజువయిందో వివరాలన్నీ రాయాలనుకోవడం ఎంతవరకు సమంజసం? ఇది పాఠకుల దృష్టిని అసలు విషయం నుంచి పక్కదారి పట్టించటం కాదా? వ్యాసం పరిమితులను దృష్టిలో పెట్టుకోకుండా విమర్శలకు దిగటాన్ని ఎలా సమర్థించుకోగలరు? వీటన్నిటికీ జవాబు చెప్పాల్సిన బాధ్యత రంగనాయకమ్మగారిపై ఉంది. ఏది ఏమైనా చర్చల క్రమంలో పినాకపాణి వ్యాసంలోని ముఖ్యమైన మాటల అర్థాన్నే మార్చి రచయితకు లేని ఉద్దేశాలను అపాదించే తప్పుడు పద్ధతినే రంగనాయకమ్మ గారు ఆశ్రయించారు.

సామాజిక శాస్త్ర రంగాలలో హైపోతిసిస్‌ల గురించి చర్చ జరుగుతున్న ప్రస్తుత నేపథ్యంలో సరైన భావాలు ఎక్కడి నించి వస్తాయో వివరించిన మావో కింది మాటల్ని మరోమారు అధ్యయనం చేయడం అవసరం. ఆయన ఇలా అన్నారు:

"సమాజంలోని మానవులు, ఒక నిర్దిష్ట భౌతిక క్రమాన్ని (అది ప్రకృతికి సంబంధించినదైనా, సమాజానికి సంబంధించినదైనా) మార్చే ఆచరణకు నడుంబిగిస్తే, దాని అభివృద్ధి తాలూకు ఒకానొక దశలో, వారు వారి మనసుల్లో ఆ భౌతిక క్రమం ప్రతిబింబించిన ఫలితంగానూ, తమ స్వీయాత్మక కృషి ఫలితంగానూ, తమ జ్ఞానాన్ని అనుభూతి నుండి హేతుబద్ధతకు పురోగమింపచేసుకోగలరు. ఆ భౌతిక క్రమ నియమాలకు సాధారణంగా అనుగుణ్యంగా ఉండే భావాలను, సిద్ధాంతాలను పథకాలు లేదా కార్యక్రమాలను సృష్టించుకోగలరు. అప్పుడు వారు అదే భౌతిక క్రమంలోని ఆచరణకు, ఈ భావాలను, సిద్ధాంతాలను, పథకాలు లేదా కార్యక్రమాలను అన్వయిస్తారు. వారు అనుకున్న లక్ష్యాలను సాధించగల్గితే, అంటే అదే ఆచరణ క్రమంలో, ఇంతకు ముందు రూపొందించుకున్న భావాలు, సిద్ధాంతాలు పథకాలు లేక కార్యక్రమాలను వాస్తవంలోకి అనువదించగలిగితే లేదా మొత్తం మీదనైనా అనువదించగల్గితే అప్పుడు ఈ ప్రత్యేక క్రమానికి సంబంధినంత వరకూ, జ్ఞానపు గమనం పరిపూర్తి అయిందని భావించవచ్చు. ప్రకృతిని మార్చే క్రమంలో ఉదాహరణలుగా, ఒక ఇంజనీరింగ్ ప్రణాళికను పూర్తి చేయడమో, ఒక శాస్త్రీయ ప్రతిపాదనను (scientific hypothesis) రుజువు చేయడమో, ఒక పరికరాన్ని తయారు చేయడమో లేదా ఒక వంటను వండించడమో తీసుకోవచ్చు, లేదా సమాజాన్ని మార్చే క్రమంలోనైతే ఒక సమ్మె తాలూకు విజయమో, యుద్ధంలో విజయమో లేదా ఒక విద్యా ప్రణాళికను పూర్తి చేయడమో తీసుకోవచ్చు. వీటన్నిటినీ ఒకరి మనస్సులో గల లక్ష్యాలను సాధించడంగా పరిగణించవచ్చు. కానీ సాధారణంగా చెప్పాలంటే ప్రకృతిని మార్చే ఆచరణలోనే కానివ్వండి, లేదా సమాజాన్ని మార్చే ఆచరణలోనే కానివ్వండి, మానవుడు తొలుత ఏర్పరచుకునే భావాలు, సిద్ధాంతాలు పథకాలు లేదా కార్యక్రమాలను ఎటువంటి మార్పులు లేకుండా సాధించడం అసాధ్యమే. ఇది ఎందుచేతనంటే, వాస్తవాన్ని మార్చడంలో నిమగ్నమైనవారు, సాధరణంగా అనేక పరిమితులకు లోనై ఉంటారు. అప్పటికి నెలకొని ఉన్న శాస్త్రీయ, సాంకేతిక పరిస్థితుల వల్లనేగాక, ఆ భౌతిక క్రమపు అభివృద్ధి, ఆ క్రమం ఎంత మేరకు వ్యక్తమవుతుందో (భౌతిక క్రమం తాలూకు అంశాలు, సారాంశమూ, ఇంకా సంపూర్ణంగా వెల్లడి కాలేదు) ఆ స్థాయిల వల్ల కూడా పరిమితులకు లోనవుతారు". (కామ్రేడ్ మావో సేటుంగ్, 'ఆచరణ' గ్రంథం నించి)

మావో వివరించిన మార్క్సిస్టు జ్ఞాన సిద్ధాంతం కోణం నించి గానీ, ఇతర ఏ కోణం నించి గానీ చూసినా రంగనాయకమ్మ గారి అభిప్రాయం సమర్థనీయం కాదు. విరసం నాయకులు పాణి తీసుకున్న వైఖరి కూడా గందరగోళంగా ఉంది ఆయన "ఇలా మాట్లాడుకోక తప్పదు" వ్యాసంలో పినాకపాణి మాటల్ని ఉటంకిస్తూ అందులో అదనపు విలువ సిద్ధాంతం నిరూపణ అయిందనే స్పిరిట్ ఉందనీ అన్నారు. నిజానికి కామెంట్స్ వ్యాసంలో అలాంటి స్పిరిట్ ఉండటం కాదు, అదనపు విలువ సిద్ధాంతం మొదట ప్రతిపాదనే అయినా శాస్త్రీయంగా రుజువైన సిద్ధాంతంగా ఆమోదించబడిందనీ స్పష్టంగానే ఉంది. ఆయన ఒక వంక పినాకపాణి అభిప్రాయాలను సమర్థిస్తూనే వేరొకవంక "దాన్ని ప్రతిపాదనే అని పినాకపాణి అంటే మార్క్సిజానికి, విరసానికి వచ్చే నష్టం ఏమీ లేదు. ఆ వైపు నించి మళ్ళీ పరీక్షకు పెడితే మార్క్స్ థీరి మరోసారి నిరూపించబడుతుంది. పినాకపాణి గారు హైపోతిసిస్ దగ్గరే ఆగిపోయారు.... ఆ లెక్క ప్రకారం అదనపు విలువ సిద్ధాంతం విషయంలో పినాకపాణి గారి అభిప్రాయంతో విభేదించగలం" అంటూ పరస్పర విరుద్ధమైన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. మార్క్సిజాన్ని ఇప్పటికే రుజువయిన కార్మిక వర్గ విప్లవ సిద్ధాంతంగా ఎలుగెత్తి చాటడానికి బదులు ఇలాంటి గందరగోళ వైఖరి తీసుకోవడం రంగనాయకమ్మ వాదనలకు బలం చేకూర్చడమే అవుతుంది.

# 'నవీన బూర్జువా సోషలిస్టు ధోరణుల'పై ఒక విమర్శ

వై.వి.ఆర్.

'బూర్జువా సోషలిజం' పై మార్క్స్, ఎంగెల్స్‌లు కమ్యూనిస్టు ప్రణాళికలో చాలానే రాశారు. అది నేటికీ వర్తిస్తుంది. అయితే, నాటికి మించిన మేధోకుతర్కంతో బూర్జువా సోషలిస్టులు నేడు కమ్యూనిజంపై దాడి చేస్తున్నారు. వారి పోకడలు నూతన రివిజనిస్టు రకానివే అయినా, వారు వారి భావనల్నిః కమ్యూనిజానికి అసలైన దారివేస్తున్నామంటూ, మార్క్స్, ఎంగెల్స్‌లలోని లోపాలు, ఖాళీలు సరిదిద్దుతున్నామంటూ-సాగిస్తున్నారు.

నేడు అలాంటి అనేక భావనల్ని కలగలిపి విస్తృత గ్రంథాలు వస్తున్నాయి. అలాంటి వాటిలో ఇటీవలి కాలంలో వచ్చినదేః'లెనిన్ అంతిమ పోరాటం' పుస్తకం. ఫ్రెంచిలో రచయితఃమోషే లెవిన్, రచనా విషయం యొక్క కాలం: 1920-25, రచనాకాలం: 1968; తెలుగు అనువాదం: రావెల సాంబశివరావు, 2014, సమీక్ష ప్రచురణలు, విజయవాడ.

ఇటువంటి అనేక ఇతర పుస్తకాలను చదివినా, వాటినిండా బూర్జువా సోషలిస్టు ధోరణులే అధికం కాబట్టి, ఈ పుస్తకంపై నేను రాసిన విమర్శ అలాంటి ఇతర పుస్తకాలన్నింటిపై విమర్శగా పనికొస్తుందని, ఈ పుస్తకాన్నే విమర్శకు ఎంచుకున్నాను. గ్రంథ రచయిత మోషే లెవిన్ ప్రధాన ఉద్దేశ్యం- 'స్టాలిన్' లెనిన్‌కీ, కమ్యూనిజానికీ ద్రోహం చేశాడనే దానిపై సాగినా; అతను లెనిన్‌ని పాక్షికంగానూ, స్టాలిన్‌ని పూర్తిగానూ తూర్పారపట్టాడు. అయితే, తెలుగు ప్రచురణకర్తలు మాత్రం, 'ముందుమాట'లో మరింత ముందుకెళ్ళి, దీర్ఘమైన, ఊగిసలాట ధోరణితో మార్క్సిజం, లెనినిజం, మార్క్స్, లెనిన్‌లపై ఆరోపణలు చేశారు. అందుకని నేను కూడా, ప్రచురణకర్తల 'ముందుమాట'లోని మార్క్సిజం, లెనినిజం, మొదలైన వాటిలోని బూర్జువా సోషలిస్టు ధోరణులపై మాత్రమే విమర్శ రాశాను. శ్రామికులు ఈ భువిపై తమ సౌఖ్యాల్ని సాధ్యమైనంత తొందరగా పొందాల్సిన ఆవశ్యకత ఉందనే బాధ్యతాయుతమైన ఆర్తితో ఈ రచనకు పూనుకున్నాను. ఈ రచనలో చాలా భాగం మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, ఇతర కమ్యూనిస్టుల వ్యాఖ్యల్ని సందర్భానికి అనుగుణంగా రాశాను.

## ప్రచురణకర్తలపై నా అభిప్రాయం

ప్రచురణకర్తలు ముందుమాటలో తమ అభిప్రాయాలను సూటిగా, నిజాయితీగా వ్యక్తం చేయలేదనిపిస్తుంది. వారు సమకాలీన సమాజంలోని బూర్జువా అభిప్రాయ వ్యక్తీకరణ ధోరణిలో (అంటే, లోపాయకారీగా), ఇంకా సరిగా చెప్పాలంటే, 'లోపాయికారీ రివిజనిస్టు' పంథాలో వ్యక్తపరిచారు. నిజానికి, వారు అసంఖ్యాక ఆరోపణలు ఏకవాక్యంలో చేసి, చేతులు దులుపుకున్నారు. అసలుకి, అలాంటి విధానంలో నిజాయితీ లోపించే ప్రమాదం ఎక్కువ. వారు రూఢివాద ధోరణి (పాజిటివిజమ్)ని కల్గివున్నారనిపిస్తుంది. అందుకని, విజయాలను కాక, పొరపాట్లనే ఎక్కువగా చూసే 'రూఢివాదం' గురించి మనం తప్పక తెల్సుకోవాలి.

**హెచ్. లెవీ ఇలా అంటారు** (జె. డి. బెర్నాల్ రాసిన 'చరిత్రలో సైన్స్' పుస్తకం నుండి, అనువాదం–పొట్లూరి వెంకటేశ్వరరావు)

"ప్రపంచం యొక్క మార్పు పాదార్థికమే. అయినప్పటికీ కూడా ఆ మార్పు యాంత్రికమైనది కాదు. పదార్థానికి యాంత్రికవాద సిద్ధాంతం అన్వయించడం అంటే, ప్రకృతి సమస్యలను జల్లెడల్లో పోసి, బెజ్జాలనుండి జారిపోయిన వాటిని చూడకుండా, మిగిలిన వాటివంక నిశితంగా చూసినట్లుగా ఉంది. (సామాజిక విషయాల్లో రూఢివాదులు, అనుభవవాదులు చేసేది అదే, వెతికేది దానికే-వై.వి.ఆర్.). ఆచరింపబడని ప్రకృతి సమస్యలు అచరణలో కాళ్ళకు చుట్టుకుంటాయి. తప్పని పరిస్థితిలో మానవుడు - ఆలోచించక, అధ్యయనం చేయక, విశ్లేషణ చేయక తప్పదు."

---

పినాకపాణి గారు విరసం వ్యవస్థాపక సభ్యులు. నిర్మాణపరంగా ఆయన విరసం సభ్యుడు కానప్పటికీ, మార్క్సిజంపై అచంచలమైన విశ్వాసంతో విప్లవ సానుభూతిపరుడిగా తుదిశ్వాస వరకు చిత్తశుద్ధితో కృషి చేసిన విప్లవ రచయిత. ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలపై వ్యక్తిగత విమర్శకు తావులేకుండా నిర్మాణాత్మకమైన చర్చకొనసాగాలి. సిద్ధాంత రాజకీయ రంగాలలో చర్చల ద్వారా వాద ప్రతివాదనల ద్వారా మన అవగాహనను మరో మెట్టుపైకి తీసుకుపోగలం. పీడిత ప్రజల సేవకు అంకితమైన విరసం మీద రంగనాయకమ్మగారి అన్యాయమైన ఆరోపణల్ని యావత్తు తెలుగు సాహిత్యలోకం ఖండించి తీరుతుంది.

**వివరణలు**

1. హైపోథిసిస్ నిర్వచనం, విశదీకరణలకు ఆధారం : ప్రొగ్రెసివ్ పబ్లిషర్స్, మాస్కోవారు ప్రచురించిన 'డిక్షనరీ ఆఫ్ ఫిలాసఫీ' గ్రంథం.
2. మార్క్స్ జీవితం, కృషికి సంబంధించిన వివరాలకు ఆధారం : ఇ.స్టెపనోవా రచించిన "కారల్‌మార్క్స్ షార్ట్ బయోగ్రఫీ" పుస్తకం.
3. మార్క్స్ తన 'క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ' గ్రంథానికి రాసిన పీఠికలోనివి ఈ వాక్యాలు.
4. కొకు 'తాత్విక వ్యాసాలు'లో, 'అరుణతార'లో, 'ఆంధ్రజ్యోతి'లో కూడా defence అని తప్పుగా అచ్చయింది. దానిని reference గా చదువుకోవాలి.

**రూఢివాద ఆద్యుడైన ఆగస్ట్ కామ్టే అభిప్రాయాన్ని కమ్యూనిస్టులు ఏనాడో ఈ కింది విధంగా ఖండించారు**

"ఒక శాస్త్రీయ సామాజిక శాస్త్రాన్ని స్థాపించాలని, ఏర్పర్చాలని 'ఆగస్ట్ కామ్టే' తలపోశాడు. ఇది తప్పు అవగాహన. మార్క్సిజాన్ని, దాని ఆచరణను పాజిటివిస్టులు (రూఢివాదులు) ఒక పెద్ద 'సామాజిక ఇంజనీరింగ్' అనే ప్రాజెక్టు (బృహత్కార్యం) లాగా అనుకొని ప్రచారం చేశారు. ఇలా స్టాలిన్ కాలంలో జరిగిందని వారి అభిప్రాయం. (కానీ, స్టాలిన్ విషయంలో ఇది వాస్తవం కాదు-వై. వి. ఆర్. ). ఆగస్ట్ కామ్టే యొక్క పై అభిప్రాయాన్ని 'ఫ్రాంక్‌ఫర్ట్ చింతనాపీఠం' వారు తీవ్రంగా ఆక్షేపిస్తారు. ఎందుకంటే - "ఒక అసలైన సామాజిక విముక్తి సిద్ధాంతం అనేది-ఆత్మవిమర్శ గలది, 'తన కార్యాలను తరచి చూసుకోగలది' మాత్రమేకాక, కేవల అనుభవాత్మకమైన సత్యాల నిర్ధారణకు అది విధేయంగా కట్టుబడి ఉండక, వర్తమానస్థితికి మించి/దాటి ఉండే అంతర్గతశక్తుల ఎడల సజీవ చైతన్యాన్ని కల్గి ఉంటుంది" కనుక.

'ఏ డిక్షనరీ ఆఫ్ మార్క్సిస్ట్ థాట్' గ్రంథం నుండి అనువాదం: వై.వి.ఆర్. (అలాంటి అసలైన విముక్తి సిద్ధాంతంగానే మార్క్సిజం-లెనినిజం ఉండినాయి, ఉంటాయి - వై.వి.ఆర్.).

రూఢివాదులు 'కేవల పరిశీలకులు'గా, 'ఇతరులు శ్రమకోర్చి తెచ్చే సత్యాల'ను (సామాజికమైనవి కూడా) గుర్తించే వారుగా, చాటేవారుగా మాత్రమే ఉంటారుగానీ, వారు సామాజిక ఉద్యమ/విప్లవకారులుగా ఉండలేరు, వారికి త్యాగబుద్ధి ఉండదు. కమ్యూనిస్టులు-కేవలం పరిశీలకులుగా ఉండరు, ఆచరణాత్మక విప్లవకారులుగా ఉంటారు.

## 1. రివిజనిజం

రివిజనిస్టులు పూర్తి సోషలిస్టులు కాకున్నా, వారి అభిప్రాయాలను కూడా పరిగణించాలని ప్రచురణకర్తలు అన్నారు (లెనిన్ అంతిమ పోరాటం పేజీ-35) కాబట్టి, రివిజనిజం అంటే లోతుగా చూసి, అప్పుడు ప్రచురణకర్తల అభిప్రాయాలు ఎంత తప్పో, విప్లవానికి ఎంత ప్రమాదకరమో చూద్దాం.

1. నిర్వచనం: మార్క్సిజం, లెనినిజానికి విరుద్ధమైన ఒక సైద్ధాంతిక, రాజకీయ ధోరణినే 'రివిజనిజం' అంటారు. కార్మికవర్గ ఉద్యమంలో, మార్క్సిస్టు సిద్ధాంతాన్ని 'విమర్శించే', 'సవరించే', 'పునఃపరిశీలించే', 'అభివృద్ధి చేసే' ముసుగులో రివిజనిజం ఉంటుంది. ఇది ఒక తరహా 'అవకాశవాదం'.
2. రివిజనిజానికి కారణాలు: సామ్రాజ్యవాదపు ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితుల కారణంగా రివిజనిజం ఉత్పన్నమవుతుంది. పాలక బూర్జువా పార్టీలు అనుసరించే ఉదారవాద పద్ధతులు, సంస్కరణల విధానాల మూలంగానూ రివిజనిజం ఇతోధికంగా బలం పుంజుకుంటుంది. కమ్యూనిస్టు ఉద్యమంలో ఊగిసలాడుతూ, సైద్ధాంతికంగా బలహీనంగా ఉన్నవాళ్ళు బూర్జువా భావజాలపు తాకిడిని తట్టుకోలేరు. తత్పర్యవసానంగా, వాళ్ళు రివిజనిజం వైఖరులకు దిగజారుతారు.
3. రివిజనిస్టు ఆద్యులు, ముఖ్యులు: రివిజనిజానికి ప్రధాన ప్రతిపాదకుడు బెర్న్‌స్టీన్. 1914 వరకూ అసాధారణ ప్రతిభతో కాట్స్కీ, రివిజనిజాన్ని ఎదుర్కొన్నా, తర్వాత 'సామ్రాజ్యవాదం' గురించి తప్పుడు అంచనా వేయటంతో, లెనిన్‌చే తీవ్రంగా విమర్శించబడ్డాడు.
4. రివిజనిస్టుల ఆక్షేపణలు: గతితార్కిక అభివృద్ధికి సంబంధించిన విప్లవాత్మక స్థానంలో పరిణామభావాన్ని ప్రవేశపెట్టాలని వాళ్ళు సూచించారు. మార్క్స్ అర్థశాస్త్రంలో కొన్ని సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. బూర్జువా ప్రజాస్వామ్యమూ, సార్వజనిక ఓటుహక్కూ-వర్గపోరాట ఆవశ్యకతను తొలగిస్తుందన్నారు. క్రమంగా సోషలిస్టు దశలోనికే, పెట్టుబడిదారీ వ్యవస్థ పరివర్తన చెందుతున్నారు. సోషలిస్టు విప్లవాన్నీ, శ్రామికవర్గ నియంతృత్వాన్నీ వీరు నిరాకరించారు.
5. భావాలు, వక్రీకరణలు: తగినంత ప్రయోజనం ఉంటుందనుకుంటే, ఎలాంటి కార్యాచరణనైనా, ఎలాంటి సిద్ధాంతంలోకైనా ఇరికించి చెప్పగలిగే మానవ మేధోసామర్థ్యాన్ని తరచూ తక్కువ అంచనా వేస్తుంటారు. ఉదాహరణకు-(1) రష్యన్ చట్టబద్ధ మార్క్సిస్టులు, 'ఉదారవాద పెట్టుబడిదారీ విధానపు చారిత్రక అభివృద్ధిలో (అది ఇప్పుడేనని వీరి భావం) ఒక ప్రగతిశీల దశ ఉండేది' అన్న మార్క్స్ వాదనని వాడుకుని, మార్క్సిజాన్ని బూర్జువా ఉదారవాదంగా మార్చేశారు. (2) బారికేడ్స్ పోరాటంపై ఎంగెల్స్ ఇచ్చిన అనుభవాలను తప్పుగా చిత్రించి, బెర్న్‌స్టీన్ అపవ్యాఖ్యానాలు చేశాడు. బారికేడు పోరాటానికున్న ఆటంకాలను గూర్చి ఒకానొక సందర్భంలో చెప్పిన దానిని ఆధారం చేసుకుని, సందర్భం నుంచి విడదీసి, అసలు విప్లవ ఘటనలే వీలులేదని ఎంగెల్స్ అభిప్రాయమైనట్లు చిత్రించడానికి ప్రయత్నించాడు. ఇలా, ఒక సిద్ధాంతాన్ని పెద్దగా మార్చకుండానే, ఆచరణలో సరిగ్గా దానికి వ్యతిరేకంగా మార్చడమనే ఈ ఉదాహరణలు, భావనల శుద్ధ చరిత్ర కావాలనుకునే ఉత్సాహపరులకి కనువిప్పు కావాలి. (మోషే లెవిన్, లెనిన్ అంతిమ పోరాటం తెలుగు ప్రచురణ కర్తలు ఇలాంటి భావ వక్రీకరణలకు పాల్పడ్డారని ఆ పుస్తకం చదివితే మనం సులభంగా గుర్తించవచ్చు- వై.వి.ఆర్.)
6. రెండవ ప్రపంచ యుద్ధానంతరం రివిజనిజం: 1945 తర్వాత, 'రివిజనిజం' అనేమాట తిట్టుపదం అయ్యింది. ఇతర కమ్యూనిస్టు పార్టీల కార్యక్రమాల్ని విమర్శించటానికి కొన్ని కమ్యూనిస్టు పార్టీలు ఈ మాటను వాడాయి. అలాగే, తమ విధానాల్నీ, కార్యక్రమాల్నీ, సూత్రీకరణలనూ విమర్శించే వాళ్ళను దుమ్మెత్తి పోయడానికి ఆ కమ్యూనిస్టు పార్టీలు ఈ మాటని వాడాయి.
7. పార్లమెంటరీ విధానం, విప్లవంపై ప్రభావం: ప్రజాస్వామ్యంలో 'అధిక సంఖ్యాకవర్గ అభీష్టం' చెల్లుతుంది కాబట్టి, రాజ్యాంగ యంత్రాన్ని వర్గపాలనగా పరిగణించకూడదట, అభివృద్ధి నిరోధకులకు వ్యతిరేకంగా ప్రగతిశీలమైన, సామాజిక

సంస్కరణాత్మకమైన బూర్జువావర్గంతో మిత్రత్వ సంబంధాలను తిరస్కరించనూ కూడదట. రివిజనిస్టులు చెప్పే ఈ అభ్యంతరాలు 'లిబరల్ బూర్జువా' అభిప్రాయాలుగా ఏర్పడుతున్నాయన్న సంగతి నిర్వివాదమే.

8. బెర్న్‌స్టీన్ వాదన ఖండన: 'ఉద్యమమే సర్వమూ, అంతిమ లక్ష్యంలో ఏమీ లేదు' బెర్న్‌స్టీన్ ఈ ఊతపదమే 'రివిజనిజం సారాన్ని', సుదీర్ఘమైన వాదన కంటెనూ ఉత్తమంగా వ్యక్తం చేస్తుంది. (1) సందర్భానుసారంగా తన విధానాన్ని నిర్ణయించుకోవడమూ, దైనందిన ఘటనలకూ, చిల్లరమల్లర రాజకీయ మార్పులకూ అనుగుణ్యంగా సర్దుకుపోవడమూ; (2) శ్రామికవర్గ మౌలిక ప్రయోజనాలనూ, యావత్తు పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క, దాని పరిణామం యొక్క ప్రధాన లక్షణాలను మరచిపోవడమూ; (3) యథార్థమైనట్టీ లేక ఊహించబడినట్టీ లాభాలకోసం ఈ మౌలిక ప్రయోజనాలను బలిపెట్టడం. ఇదీ రివిజనిజం విధానం. ఈ విధానం అనంత రూప వైవిధ్యాన్ని ధరించవచ్చు.

9. రివిజనిజం మూలాలు: పెట్టుబడిదారీ విధాన సమాజంలో రివిజనిజం అనివార్యత ఎందులో ఉంది? జాతీయ ప్రత్యేకతలలోని భేదాలకంటెనూ ఇంకాలోతుగా ఇది ఎందుకు చొచ్చుకొని పోతూంది? ఎందుచేతనంటే-ప్రతి పెట్టుబడిదారీ దేశంలోనూ- శ్రామికవర్గం సరసనే, పెటీ-బూర్జువా వర్గపు విశాల స్తరాలు (వర్గాలు) ఎల్లప్పుడూ ఉంటాయి, సన్నకారు చేతిపని వ్యాపారాల యజమానులే ఈ స్తరాలవారు. స్వల్పస్థాయి ఉత్పత్తిలో నుంచే పెట్టుబడిదారీ విధానం ప్రభవించింది, నిరంతరం ప్రభవిస్తూనే ఉంటుంది కూడానూ. పెట్టుబడిదారీ విధానం వల్ల 'మధ్యమ స్తరాలు' (ఉదాహరణకు ఫ్యాక్టరీ అనుబంధాలు, గృహ పరిశ్రమ, చిన్న కార్ఖానాలు, వగైరాలు) పెద్దసంఖ్యలో సృష్టించబడుతున్నాయి. ఈ సన్నకారు ఉత్పత్తిదారులు కూడా అంత విధికృతంగానే శ్రామికవర్గ శ్రేణులలోనికి తిరిగి నెట్టివేయబడుతున్నారు. విశాలమైన కార్మికుల పార్టీలలో పెటీబూర్జువా ప్రపంచ దృక్పథం పదేపదే పైకి తోసుకు వస్తూండడం కేవలం ప్రకృతి సిద్ధమే.

శ్రామికవర్గ విప్లవపు హఠాత్తు మార్పువరకూ ఇది ఇలాగే ఎల్లప్పుడూ ఉండడమూ, ఉండి తీరడమూ కేవలం ప్రకృతి సిద్ధమే. ఎందువల్లనంటేఃఅలాంటి విప్లవాన్ని సాధించగల్గే ముందు ప్రజలలో అత్యధిక సంఖ్యాకవర్గం 'సంపూర్ణంగా' శ్రామిక వర్గీయమవడం ఆవశ్యకమని అనుకోవడం ప్రమాద భరితమైన పొరపాటే అవుతుంది కనుక."

'లెనిన్ అంతిమ పోరాటం' పుస్తక ప్రచురణకర్తలు చెప్పిన "మెజారిటీ ప్రజల ఆమోదం విప్లవానికి లభించాలి" (పేజీ-18, 19) అన్న తప్పు భావనకి ఇది వర్తిస్తుంది. -వై.వి.ఆర్.). కాబట్టి, మార్క్సిజానికీ, మార్క్స్ సైద్ధాంతిక వివాదాలకూ, వాటి దిద్దుబాట్లకూ నడుమ జరిగే (రివిజనిస్టుల చర్యలచే) సంఘర్షణలు-అనన్య సామాన్యమైన అధికస్థాయిలో కార్మికవర్గం తప్పకుండా అనుభవించాల్సే ఉంటుంది." లెనిన్ ('ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం' పుస్తకంలో).

ఈ విధంగా-బెర్న్‌స్టీన్, కాట్స్కీ, తదితర రివిజనిస్టుల మార్క్సిస్టు వ్యతిరేక విప్లవ ప్రతీఘాత పంథాలను లెనిన్ ఎడతెగకుండా ఎదుర్కొని, మార్క్సిజం యొక్క విప్లవసారాన్ని పరిరక్షించి, కార్మికవర్గ ఉద్యమపు విప్లవకర విభాగాన్ని పరిపుష్టం చేశాడు.

**2. విప్లవం, విప్లవ చైతన్యం:**

జర్మన్ ఐడియాలజీలో మార్క్స్ 'విప్లవం'పై ఇలా అన్నాడు- "పరిస్థితులను మార్చడం, మానవ కార్యాచరణను మార్చడం లేదా మానవుడే స్వయంగా మార్పు చెందడం ఏకకాలంలో జరగడాన్ని విప్లవాత్మక ఆచరణగా మాత్రమే అర్థం చేసుకోగలం, హేతుబద్ధంగా ఆమోదించగలం." మార్క్స్ 'విప్లవ కార్యాచరణ' (రివల్యూషనరీ ప్రాక్సిస్) ను పైవిధంగా చెబితే, లెనిన్ అంతిమ పోరాటం పుస్తక ప్రచురణకర్తలు మాత్రం దీనికి విరుద్ధంగా భాష్యం చెప్పారు. "ప్రజామోదం మెజారిటీపరంగా లభించిన తర్వాతే, సమాజ మార్పు చాలా జరిగి, సంస్కృతి పెరిగి, ప్రజలు విప్లవానికి సన్నద్ధమయ్యే స్థితిని చూసి, అప్పుడు విప్లవం చెయ్యాలి" అన్న అర్థంలో వాడారు. (పేజీ-19). ఈ విషయంలో వారిది పూర్తిగా తప్పు అవగాహన.

అలానే, మార్క్స్, ఎంగెల్స్‌లు కూడా 'ఇచ్ఛావాద ధోరణి' (Voluntarism) కల్గివున్నారనే ప్రచురణకర్తల ఆరోపణ (పేజీ-14) అవాస్తవం. మార్క్స్ తన 'ఆర్థిక, తాత్విక రాతప్రతులు' (ఇపిఎమ్), 1844 లో ఇలా అంటాడు.

"మానవుని 'జ్ఞానం' తన పక్కనున్న మానవుని'జ్ఞానేంద్రియ జ్ఞాన స్వభావం' నుండి వచ్చింది. నాలోని విశిష్టమైన అంతర్గతశక్తుల కార్యకలాప 'విస్ఫోటనమే', నాలోని 'ఉద్వేగం' (పాషన్). అదే నా అస్తిత్వం యొక్క కార్యకలాపమవుతుంది."

కాబట్టి, అలాంటి విశిష్టశక్తులు గల అసంఖ్యాక మానవులు సహకారం, సమిష్టితత్వం, సమిష్టి పోరాటాల ద్వారానే-తమ చైతన్యాన్నీ, విప్లవ చైతన్యాన్నీ వృద్ధి చేసుకుంటారు గానీ; ప్రచురణ కర్తలు చెప్పినట్లు, మార్క్స్ సొంతమేధతో, 'ఇచ్ఛావాదం'తో చేసే బోధతో మాత్రం కాదు. పారిస్ కమ్యూన్ వైఫల్యాలపై మార్క్స్ తీసిన పాఠాలలో ఈ విషయంపై మనకు వాస్తవం తెలుస్తుంది. జాకోబియన్, ప్రౌధాన్‌ల పంథాలు భయంకరమైన రీతిలో అసంపూర్ణంగా ఉన్నాయని మార్క్స్ గ్రహించి ఇలా అంటాడు.

"1. బ్లాంకిస్టులు (జాకోబియన్‌లు) వాదించినట్లు నిర్ణయాత్మకమైన రాజకీయ కార్యాచరణ తప్పకుండా ఉండాలి. కానీ అది సమీకృత ప్రజాకార్యకలాపాలపై ఆధారపడి ఉండాలి. అంతేకానీ, చిన్న సంఘాల వీరోచిత చర్యలపై కాదు.

2. ప్రౌధాన్‌లు వాదించినట్లు, ఉత్పత్తిని ఆర్థికంగా ప్రక్షాళన చేయాలి. కానీ అది, రాజకీయ విప్లవం లేకుండా సాధ్యపడదు."

మార్క్స్, ఎంగెల్స్‌లనూ, మార్క్సిజాన్నీ, ప్రకృతి-సామాజిక

శాస్త్రాల్నీ, విప్లవాన్నీ, చైతన్యాన్నీ లోతుగా, కూలంకషంగా చదివిన లెనిన్, విప్లవాన్ని తీసుకురావడంలో పొరబడలేదు, ఒక దుందుడుకు ముతాచర్యగా, కేవల రాజకీయపరంగానైతే విప్లవాన్ని తేలేదు.

కాబట్టి, దశాబ్దాల జార్ చక్రవర్తుల హింస నుండి, రష్యన్ ప్రజలు లేవదీసిన తిరుగుబాట్లు, జయాపజయాల నుండి పాఠాలు తీస్తూ, వారిని ఆర్గనైజ్ చెయ్యటంలో మార్క్సిస్టు సిద్ధాంత, ఆచరణను అన్వయించి, బలహీనమైన పెట్టుబడిదారీ లింకును ఛేదించి, విప్లవాన్ని తెచ్చాడు లెనిన్.

అక్టోబర్ విప్లవంపై లెనిన్:

"నాటి విప్లవానికి ప్రజలు పూర్తి సంసిద్ధులుగా లేకున్నా తేవటం అవశ్యకం. ఎందుకంటే, ప్రపంచ/సామ్రాజ్యవాద యుద్ధాన్ని శ్రామిక విప్లవంగా మార్చే అవకాశం వచ్చింది. ఇది ఊరకే రాదు. ప్రజలు కూడా యుద్ధాన్ని గెలవటంతో సంసిద్ధంగానే ఉన్నారు. పూర్తి సన్నద్ధంగా ఉండగానే విప్లవం తేవాలి అనటం విప్లవ/చారిత్రక ద్రోహమే. లోపాల్ని విప్లవానంతర కాలంలో సరిదిద్దుకుందాం." అలానే, విప్లవంపై మార్క్స్ దృష్టి ఇలా ఉంది...

"ఏవో ఆర్థికశక్తుల సంఘర్షణలకు యాంత్రిక ఫలితంగా ఉంటుందని మాత్రమేనైతే తాను విప్లవం గురించి ఎన్నడూ ఊహించలేదనీ; (కాగా), విప్లవం-మానవుల ప్రయత్నం ద్వారా కూడా సాధింపబడాల్సిన పరిణామం" అని స్పష్టం చేయడానికి మార్క్స్ ఎంతో శ్రమిస్తాడు.

1850 సెప్టెంబరు ప్రసంగంలో మార్క్స్ ఇలా అంటాడుః "అధికారం సాధించుకొనేందుకు తగ్గ అర్హత మీరు సంపాదించు కొనేట్లు పరిస్థితుల్ని మార్చటానికిగాను, మీరు ఒక 15-20 లేక 50 ఏళ్ళ అంతర్యుద్ధాన్ని అయినా భరించాల్సి ఉంటుంది".

బెర్నాల్ వ్యాఖ్యలు:

'సమాజాన్ని ప్రయోగశాలలో పరిశీలించలేం' అన్న జె. డి. బెర్నాల్ వ్యాఖ్యల్ని చూస్తే, మనకు సామాజిక చలనం, విప్లవాసన్నత ఎంత సంక్లిష్టమైన, తెల్సుకోలేని, ముందుగానే ఊహించలేని విషయాలో తెలుస్తుంది. ఆయన ఇలా అంటాడు-

"సమాజంలో మారే స్వభావం సహజంగా ఉన్నది. ఆ మార్పులు వేగవంతమైనవి. మారిపోయే సమాజాన్ని విశ్లేషించి, ముందుగానే చెప్పగల సామర్థ్యం సామాజిక విజ్ఞానశాస్త్రాలకు లేదు. 1929లో మహా ఆర్థికమాంద్యం దీనికి ఉదాహరణ. వర్గాలుగా విడిపోయిన సమాజంలో నిజమైన, నిష్పాక్షికమైన సామాజిక శాస్త్రాన్ని బలపడనీయడం జరగదు, జరగలేదు. శాస్త్రీయ విజ్ఞానం ఖచ్చితమైన దానితో (గణితంతో) ప్రారంభమై, సామాజిక విజ్ఞానశాస్త్రంతో చివరెల్లుతుంది. ఈ రకమైన ఏర్పాటు సమాజంలో మానవుడి సంబంధాన్ని తప్పుదారి పట్టిస్తుంది." 'చరిత్రలో సైన్స్'-అనువాదం పొట్లూరి వెంకటేశ్వరరావు.

విప్లవాసన్నతపై లెనిన్:

"అవును, విప్లవాసన్నతను నిర్ణయించడంలో, విప్లవ విజయంకోసం ఆశలు పెట్టుకోవటంలో మార్క్స్, ఎంగెల్స్‌లు తరచూ తప్పులు చేశారనుకుందాం. కానీ, దైనందిన సమస్యల, అల్ప విషయాల స్థాయికి అతీతంగా, యావత్ ప్రపంచ శ్రామికవర్గాన్నీ నిర్నిద్ర మొనరించి, కదిల్చిన విప్లవ చింతన గల ఆ మహానుభావుల తప్పిదాలు విప్లవపోరాటం యొక్క నిరర్థకం గురించి; ఆడిపాడి గెంతులు వేసే అధికార, మితవాదుల నీచబుద్ధికన్నాఃఎంతో న్యాయసమ్మతములై, చారిత్రకంగా మిక్కిలి విలువగలవియై, వేయిరెట్ల కృతజ్ఞతకు పాత్రమై అలరారగలవు."

## 3. మార్క్సిజం

మార్క్సిజంపై ప్రచురణకర్తలు చాలా ఎక్కువగానే దాడి చేశారు. అలానే పరస్పర విరుద్ధమైన వ్యాఖ్యల్ని చేశారు. ఒకచోట, అన్ని రకాల మార్క్సిజాలనూ కలపాలన్నారు (పేజీ-37). మరోచోట, మార్క్సిజం మౌలికవాదం కమ్యూనిజానికి నియమంగా ఉండరాదన్నారు (పేజీ-39). కానీ, మార్క్సిజం యొక్క ఔన్నత్యం మానవజాతికే మార్గదర్శకం. అందుకే, వాటిని చూద్దాం.

మార్క్సిజం మానవ సంస్కృతిని నిర్మించే చక్కని మానవీయ, విప్లవ నిర్మాణక్రియ వంటిది. దాని ద్వారా మాత్రమే మనం సోషలిజంలోకీ, కమ్యూనిజంలోకీ ప్రవేశించగలం.

- మార్క్సిజం సకల సామాజిక రుగ్మతలను దాచుకోకుండా, నిస్సిగ్గుగా విమర్శిస్తుంది.
- మార్క్సిజం అతి సాధారణ మానవుడి యుగయుగాల సామాజిక అధఃస్థితి నుండి, అతనిని ఈనాడు వర్తమానంలో ఉన్న, భవిష్యత్తులో ఉండబోయే 'కమ్యూనిస్టు మానవుడి' భౌతిక, సాంస్కృతిక, మేధోస్థాయికి తీసుకురావడానికి కావాల్సిన భౌతిక, సాంస్కృతిక పరిస్థితులు అతిసాధారణంగా జరిగేట్లు, వ్యవస్థకు పునాదులు ఏర్పరుస్తుంది." వై. వి. ఆర్.
- మార్క్స్ తన ఆర్థశాస్త్ర విమర్శ రాత ప్రతులు 1844లో ఇలా అంటాడు.

"కమ్యూనిస్టు కార్మికులు ఒకచోట చేరితే చేయాల్సిన పని ప్రచారం, బోధన. అదే సందర్భంగా, ఒక కొత్త అవసరం వారిమీద పడింది. అది-'సామాజిక' అవసరం. అది-'దారి' దొరికిన 'సామాజిక' లక్ష్యం. ప్రజల మధ్య సంబంధాలు, ఇక ఏమాత్రం తినడం, తాగడం కాదు.

చర్చ, సంఘం, స్నేహం-సమాజమే లక్ష్యంగా గల సంఘం, స్నేహం, చర్చ-అవే ఇక చాలు మనకు. సౌభ్రాతృత్వం అనేది డొల్లమాటకాదు. శ్రమలో అరిగిపోయిన మానవరూపంలో మనిషి యొక్క మానవవీయత (నొబిలిటీ/ ఉన్నతత్వం) మిలమిల మెరుస్తుంది."

"పరాయీకరింపబడిన మానవశ్రమను మానవులు, కమ్యూనిస్టు ఆచరణ (పోరాటం, ప్రచారం) ద్వారానే తిరిగిపొంది, స్వేచ్ఛాజీవులు, మానవీయ మానవులు అవుతారు."

మార్క్స్ దృష్టిలో కమ్యూనిజం:

"Communism is for us not a state of affairs which is to be established, an ideal to which reality(will)have to adjust itself. We call communism the real movement which abolishes the present state of things. The condition of this movement result from the now existing premise."

ఆర్థికరంగ ప్రాముఖ్యత:ఎంగెల్స్ ఇలా అంటాడు: "ఆర్థిక రంగం నుండి ఎంత ఎక్కువ దూరంగా ఉంటూ, ఏదో గాలిలో సిద్ధాంతాలతో ఆలోచన సాగిస్తుంటామో, యాదృచ్ఛిక ఘటనల తీవ్రత అంత ఎక్కువగానూ, చరిత్ర గమన సరళి అంత వంకరటింకరగానూ కన్పిస్తుంది. కొన్ని గ్రూపుల మాదిరి ఇలాంటి వాటిని ఒక 'యాక్సిస్'గా గీస్తే, అలాగే ఆర్థిక పురోగమనాన్ని కూడా గీస్తే, దాదాపు రెండూ సమాంతరంగానే ఉంటాయి. ఎంత ఎక్కువ కాలాన్ని దృష్టిలో ఉంచుకుని చూస్తే, అంత మరింత వాస్తవంగా అది మనకు తెలుస్తుంది."

"ఊహాత్మక పునాదిగల అన్ని మనోవిజ్ఞాన శాస్త్రాలను మార్క్సిజం సవాలు చేస్తుంది. మానవుని గురించిన భావనను-శాస్త్రీయ పటుత్వంతోనూ, అదే సమయంలో, మానవతా- వాద ప్రాధాన్యత తోనూ ఇవ్వగలిగేది మార్క్సిజం మాత్రమే."

-లూసియాన్ సేవ్-మానవ స్వభావం-లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్, గుంటూరు.

**రాల్ఫ్ ఫాక్స్** తన 'నవల-ప్రజలు' అన్న పుస్తకంలో ఇలా అంటాడు: "మార్క్సిజం ఆధునిక రచయితకు ఫాషన్ పరేడ్‌లో వేసుకునే డ్రస్సు వంటిది కాదు. అది అతని ప్రాపంచిక దృక్పథం. వాస్తవికతకు గీటురాయి. అది అతని 'ప్రగాఢ జ్ఞానాన్ని' క్రమశిక్షణలో ఉంచుకోవటానికీ, తగిన రూపం లోనికి మలుచుకోవటానికీ దోహదం చేస్తుంది. వాస్తవిక ప్రపంచాన్ని చూడటానికీ, అర్థం చేసుకోవటానికీ 'మార్క్సిజం' అనేది రచయిత దృష్టికోణంగా ఉండాలి". అంటే," మార్క్సిజం ఒక 'మతం'గా సరిపోదు" అన్నాడు.

**లెనిన్** 'దోచుకో లేదా దోచుకోబడు'అన్న కుళ్ళుతూన్న స్థితిలో ఉన్న నేటి సమాజాన్ని మార్చడానికి సమిష్టికృషితో చేసే విప్లవమే, మార్క్సిజమే పరిష్కారం అన్నాడు లెనిన్. ఇంకా ఇలా అన్నాడు:

- "చైతన్యయుతమయిన క్రమశిక్షణా, ప్రజల మధ్య కొత్త తరహా సంబంధాలూ-వాటంతటవి పుట్టుకురావు. నూతన సమాజం కోసం సాగే కృషిలోనూ, పోరాటంలోనూ అవి రూపొందుతాయి.
- శ్రామిక ప్రజల ఉమ్మడి ఆశయాన్ని తన వ్యక్తిగత ఆశయంగా చేసుకున్నప్పుడు, ఎవరి అంతరంగిక జీవితమైనా సరే, మరింత పరిపుష్టి పొందుతుంది. సమిష్టి సంస్థలోనే వ్యక్తి శీలం వికసిస్తుందన్న విశ్వాసం మీద కమ్యూనిజం ఆధారపడి ఉంది. ఒక సమిష్టి సంస్థతో, ఒక ఉమ్మడి ఆశయంతో ముడి పెట్టుకున్న జీవితం. స్పష్టమైన, ప్రగాఢమైన హృదయాను భూతులను కలిగిస్తుంది. సంకుచితమైన కుటుంబ జీవితానికి మాత్రమే పరిమితమయ్యే పెటీ బూర్జువా జీవితంలో ఇది అసంభవం.
- నూతన సమిష్టి జీవిత పరిస్థితుల్లో, వ్యక్తిలో కొత్త గుణాలు కూడా పుట్టుకొస్తాయి. అవి ఏమిటంటే: తక్కిన వారితో సహకరించగల సామర్థ్యమూ, సహకరించాలనే వాంఛ, ఇతరుల పట్ల విశ్వాసమూ, పరస్పర సహకారానికి సంసిద్ధత."

- లెనిన్-'విద్య'పై పుస్తకంలో, పిడిఎస్‌యు ప్రచురణ.

మనిషి తను చెయ్యదల్చుకున్న దాన్ని ఏకాకిగా చెయ్యలేడు. విడి వ్యక్తిగా అతను స్వేచ్ఛాయుతుడు కాడు. తోటివాళ్ళతో చెయ్యీ చెయ్యీ కలపడం ద్వారానే స్వేచ్ఛాయుతుడు అవుతాడు."

- 'మానవ స్వభావం' పుస్తకం నుండి-లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్, గుంటూరు.

ఇటువంటి మహోన్నత భావనలు, భావ సంస్కృతి, ప్రాకృతిక, సామాజిక, మానవీయ దృష్టి కల్గిన 'మార్క్సిజం' కాక, ఇతర ఇజాలను 'కమ్యూనిజానికి' నియమంగా ఉంచాలని చూసే లెనిన్ అంతిమ పోరాటం పుస్తక ప్రచురణకర్తలు ఊహల్లోనూ, విమర్శల్లోనూ విహరిస్తున్నారన్నట్టే.

## 4. సోషలిజం

లెనిన్ సోషలిస్టు స్థాపనలో, నిర్మాణంలో బూర్జువా మేధావులను జాగ్రత్తగానే (వారు కార్మికవర్గ నియంతృత్వానికి లోబడినంత వరకూ) కల్పుకునే కృషిని ఓర్పుగా, నేర్పుగా చేశాడు, అందరూ అలా చేయాల్సిన సామాజిక అవసరాన్ని నొక్కి చెప్పాడు. అయితే, ఆ పేరుతో బూర్జువీకరణ చేయలేదు. కార్మిక, కర్షక ఐక్యతకు కూడా ఎంతో విలువిచ్చాడు. 'శ్రామికవర్గ నియంతృత్వం' అనే భావనే అసలైన మార్క్సిస్టు లక్షణమన్నాడు. వర్గాలను సరిగా గుర్తించాడు. కార్మికవర్గ మెజారిటీ అనేది దాని సంఖ్యలో కాక, అది ప్రాతినిధ్యం వహించే మొత్తం 'శ్రామికవర్గం'లో ఉంటుంది. కాబట్టి, కార్మికవర్గమే అలా సమాజంలోని మెజారిటీ ప్రజల భావనల్ని ప్రతిఫలిస్తుందన్నాడు (కర్షకులను ఐక్యంగా కల్పుకునే).

సోషలిజంలో ఇంకా అనేక విషయాలు ఆచరణలో చాలాకాలం ప్రపంచానికి స్ఫూర్తివంతంగానే పనిచేశాయి. ఆ రకంగా, లెనినిజం, బోల్షివిజాలను కూడా విప్లవ ప్రతీకలుగా చూడడం సరైనదే. సరైనది కాదన్న(పేజీ-12) ప్రచురణకర్తల భావనే తప్పు.

## 5. సామాజికీకరణ, విప్లవీకరణ

ప్రచురణకర్తలు-మధ్య తరగతిని రాడికలైజ్ చెయ్యాలనడం; అన్ని సామాజిక ఉద్యమాలను కలుపుకుపోవాలని ఎక్కువగా నొక్కిచెప్పే పద్ధతి; బూర్జువా ప్రజాస్వామ్యం కూడా ఉండాలి; తదితర వ్యాఖ్యలు చేశారు (పేజీ- 43). వీటికీ, (అంటే-సామాజికీకరణకూ), విప్లవానికీ పోలికే లేదు. విప్లవం అంటే-సంస్కరణ కాదు, సమూల మార్పు.

లెనిన్

"బూర్జువా ప్రజాస్వామ్యం సరే గానీ, 'ఆ ప్రజాస్వామ్యం ఏ వర్గానికి, ఏ వర్గ ప్రయోజనానికి' అని మనం వెంటనే అడుగుతాం.

కేవలం కార్మికవర్గమే, బూర్జువా ప్రజాస్వామ్యంలోని కుళ్ళును కడిగి, శ్రామికవర్గ నియంతృత్వాన్ని స్థాపించగలదు. బూర్జువా ప్రజాస్వామ్యానికీ, శ్రామికవర్గ ప్రజాస్వామ్యానికీ అసలు పొసగదు."

కార్మికవర్గ నియంతృత్వంలో పెట్టుబడిదారులకు అన్ని హక్కులూ కల్గించాలనే కాట్స్కీ సిద్ధాంతాన్ని ఖండిస్తూ, మొదటి ఇంటర్నేషనల్‌లో ఆమోదం పొందిన లెనిన్ థీసెస్‌లో లెనిన్ ఇలా అంటాడు...

"పార్లమెంటులో పాల్గొనడానికి బూర్జువాలకు స్వేచ్ఛ కావాలనేది ఈ డిమాండ్లలో ఒక భాగం. కార్మికవర్గ నియంతృత్వం పెట్టుబడిదారీ వర్గాలకు ఇలాంటి హక్కును వాగ్దానం చేయటం వర్గ చైతన్యం కల్గిన కార్మికుడెవ్వడూ చెయ్యకూడని పని. 1649లో ఇంగ్లండులో గానీ, 1793లో ఫ్రాన్స్‌లో గానీః విప్లవ బూర్జువావర్గం, తమ ప్రభుత్వాన్ని ప్రతిఘటించి కూలదోయడానికి విదేశీ సైన్యాల సహకారం తీసుకున్న 'భూస్వామ్య, రాచరిక శక్తులకు' ఇలాంటి స్వేచ్ఛను కల్గించలేదు. కానీ, ఈనాటి బూర్జువా వర్గం, కార్మిక నియంతృత్వాన్ని ఒకవైపు ప్రతిఘటించుతూనే, మరొకవైపు సభా, వాక్ స్వాతంత్ర్యం కోసం కోరటం అపహాస్యమయిన విషయం."

- 'ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం' పుస్తకం నుండి.

**మార్క్స్** కూడా, కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికలో పెటీ బూర్జువా, బూర్జువా సోషలిజాలపై నిశిత విమర్శ చేశాడు.

**సామాజికీకరణ** అంటే-చాలా సుదీర్ఘమైన, బాధాకరమైన, దరిద్రంతో శ్రామికులు అల్లాడిపోయే ప్రక్రియ. తరాలకు తరాలు బానిస జీవితాలనూ, యాంత్రిక జీవితాలనూ ఈడ్చుకుంటూ గడుపుతాయి. ఈ జీవితాలలోని దరిద్రం గురించి పుస్తకాలలో, కావ్యాలలో, కవితలలో బాగానే వర్ణిస్తారు. కానీ, "నిజ జీవితంలో 'దారిద్ర్యం' భరింపశక్యం కానిది" అన్నాడు ఒక మహానుభావుడు. ఆ స్థితి అనుభవించిన వారికే తెలుస్తుంది-జీవితంలోని నరక యాతన. ఆ యాతనను ప్రత్యక్షంగా అనుభవించిన నేను అందుకే ఇలా ఎలుగెత్తి చాటుతున్నానుః

"విప్లవం అంటే: అభివృద్ధితో, ప్రజాచైతన్యంతో ముడిపడి, శ్రామిక దరిద్రం నిర్మూలింపబడే దిశగా, వర్గపోరాటం ద్వారా దోపిడీరహిత సమాజంకోసం జరిగే ఒక చారిత్రక అనివార్య గెంతు. "విప్లవాసన్నత రాలేదు, రాలేదు" అని వేచిచూసే, సామాజికీకరణ సాగాలని చెప్పే 'రివిజనిస్టు, బూర్జువా' ప్రేలాపనలు ఎలాంటివి అంటే, అవి-కార్మికుల్ని, "ఇంకా కొన్ని వేల ఏళ్ళ దోపిడీని సహించండి" అని లోపాయికారిగా చెప్పడంతో సమానం. అలా చెప్పే హక్కు, లెనిన్ అంతిమ పోరాటం ప్రచురణలో (విప్లవాల, సంస్కరణల సృజనాత్మక కలయిక నూతన సమాజ నిర్మాణానికి అనువైన పద్ధతి. -పేజీ-39) లాంటి కుహనా/ లోపభూయిష్ట విప్లవకారులకూ/సంక్షేమవాదులకూ లేదు.

## 6. ఆర్థిక విషయాలు, సంక్షోభాలు

ప్రచురణకర్తలు తమ ముందుమాటలో ఆర్థిక విషయాలు, అందునా, శ్రమ, శ్రమదోపిడీ, అదనపువిలువ, పెట్టుబడి, ఫైనాన్స్ పెట్టుబడి లాంటి ముఖ్య అంశాలను తడమలేదు. అంటే, మొత్తం ముందుమాట 90 శాతం రాజకీయపరంగానే సాగింది, పార్టీ, అధికారం, రాజ్యం కేంద్రంగానే సాగింది. అందుకే లెనిన్, స్టాలిన్‌లపై వారిది పాక్షిక విశ్లేషణ. అందుకని, లెనినిజాన్ని చూద్దాం.

**లెనినిజం అంటే-** "శ్రామిక(కార్మిక+కర్షక) వర్గ పోరాటం; పెట్టుబడిదారీ ఆర్థిక విధానాన్ని ఖచ్చితంగా విశ్లేషించే పద్ధతి; కార్మికవర్గ నియంతృత్వాన్నీ, కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్నీ ఉన్నత శిఖరాలకు చేర్చినదీ; సోషలిస్టు భావన, సంస్కృతులను ప్రపంచానికి పరిచయం చేసినది."

కానీ, ప్రచురణకర్తలు లెనినిజం తప్పు అన్నారు (పేజీ-12). లెనిన్, స్టాలిన్ కాలాలలో జరిగిన సోషలిస్టు చర్యలన్నీ చాలావరకూ సజావుగానే జరిగాయని నా అభిప్రాయం. అయితే, మొట్టమొదటి సోషలిస్టు దేశం కనుక, స్వదేశంలోనేకాక, ప్రపంచంలోని అన్ని పెట్టుబడిదారీ దేశాలవారి కుట్రలకూ, రివిజనిస్టు ధోరణులకూ ఆనాటి రష్యా తీవ్రాతి తీవ్రంగా గురయ్యింది. ఇది అనివార్యం. దాన్ని ఎదుర్కొనే క్రమంలో లెనిన్, స్టాలిన్‌లు సరిగానే వ్యవహరించారు. అలా కాదన్న వారు-స్టాలిన్‌ని లక్ష్యంగా చేసుకుని సాగదీతతో, కుట్రతో అల్లే కథనాల, పరిశోధనల, వగైరాల రివిజనిస్టు చర్యల సమర్థకులే/ప్రచారకులే. దీనిపై ఇంతకంటే ఎక్కువగా స్పందించటం ఈ వ్యాస లక్ష్యాన్ని చెడగొడుతుంది కాబట్టి, ఈ విషయంలో తోలేటి జగన్మోహనరావు గారు ఇటీవలే రాసిన "లెనిన్ అంతిమ పోరాటం- మా సమాధానం" పుస్తకం చూడగలరు.

**లెనిన్ 'సామ్రాజ్యవాదం'** పుస్తకంలో ఇలా అంటాడు-"ఫైనాన్స్ పెట్టుబడివల్ల వడ్డీజీవులు (రెంటీయర్స్) అనే ఒకవర్గం లేదాసాంఘిక పొర అసాధారణంగా పెరిగింది. అనగా, 'కూపన్లు చింపి' బతికేవాళ్ళు, ఏపనీ చేయకుండా సోమరితనం వృత్తిగా గలవాళ్ళు. సామ్రాజ్యవాదపు అత్యంత ముఖ్యమైన ఆర్థిక ఆధారాల్లో ఒకటైన 'పెట్టుబడి ఎగుమతి' -'వడ్డీజీవుల'ను ఉత్పత్తినుండి అంతకంతకూ పూర్తిగా వేరుపరచి, అనేక ఇతరదేశాల శ్రమనూ, వలసల శ్రమనూ దోపిడీచేసి బతికే పరభాగ్యోపజీవిగా దేశాన్ని తయారు చేస్తుంది...."

ఇదీ సామ్రాజ్యవాద సారం, సామ్రాజ్యవాదపు పరాన్నభుక్కుతత్వం. "ఫైనాన్స్ పెట్టుబడి ఎద్దు చర్మాన్ని రెండుసార్లు ఒలుస్తుంది. దీనికి ఉదాహరణ-జర్మనీ ఫైనాన్స్ పెట్టుబడి, రుమేనియా రైల్వేలలో పెట్టి, ఆ కాంట్రాక్టుల ద్వారా వచ్చే తరువాతి దశ లాభాల్ని కూడా (కంట్రాక్టర్ల నుండి కమిషన్లు, వగైరాల ద్వారా) తానే సొంతం చేసుకోవడం."

దీనికి మన కాలంలోని ఒక చిన్న ఉదాహరణ సరిపోలుతుంది. అదేమిటంటే- ఒక చిన్న, మధ్యతరహా పట్టణంలోని ప్రధానవీధిలోని రకరకాల దుకాణాలవారు, అంతవరకూ సాంప్రదాయకంగా చేస్తూవచ్చే(రొటీన్) వ్యాపారాలవల్ల, దానిలో ఇతరులతో పోటీ వల్ల, కాలక్రమంలో వారికి వచ్చే లాభాలు తగ్గుతూండటంతో, వారి వీధిలోనే ఎక్కువ లాభాలు పొందే వారిని అనుసరిస్తారు. అందులో ఒక రకం-'టూ వీలర్ ఫైనాన్స్'. ఇందులో ఒక సెకండ్‌హాండ్ ద్విచక్ర వాహనాన్ని తక్కువకు (ఉదాహరణకు రూ. 10,000/- లకు) కొంటారు. దానిపై రూ. 2,000/- లాభం కలుపుకుని, రూ. 12,000/

-లకు అమ్మే ఉద్దేశ్యంతోనే దాన్ని, ఒకేసారి డబ్బిచ్చి కొనలేని వారికి వాయిదాల పద్ధతిలో కట్టే విధంగా, వడ్డీ (సుమారు, రూ. 2,000/-) కలిపి అమ్ముతారు. అలా, రూ. 12,000/- వడ్డీ రూ. 2,000/- రూ. 14,000/-, వాయిదాల సొమ్ము మొత్తం తీసుకున్న తర్వాత పొందుతారు. అంటే, రూ. 10,000/-లకు కొన్న వాహనాన్ని, ఆ ఫైనాన్సియర్ రూ. 4, 000/- లాభానికి అమ్ముకుంటాడు. ఇక్కడకూడా, ఎద్దు చర్మాన్ని రెండుసార్లు ఒలిచినట్లు, లాభం రూపంలో డబ్బును రెండుసార్లు పొందుతారు. తర్వాత, దీనికంటే మరింత లాభం వచ్చే 'రెడీమేడ్ దుస్తుల' వ్యాపారంలోకి అలాంటి వీధుల్లోని చాలా వ్యాపారులు మారిపోతూండడాన్ని నేడు మనం చూడొచ్చు.

కాట్స్కీ చెప్పిన 'అధి సామ్రాజ్యవాదపు' (అల్ట్రా ఇంపీరియలిజం) అసలు రూపం-వర్తమాన తీవ్ర వైరుధ్యాల నుండీ, తీవ్ర సమస్యల నుండీ ప్రజల దృష్టిని పక్కకు లాగి, భవిష్యత్ కాలపు ఆశలతో ప్రజలను ఓదార్చే అత్యంత ప్రగతి వ్యతిరేక పద్ధతిద్వారా ప్రజలను మోసగించటం. సామ్రాజ్యవాదపు కూటములు అంటే-అనివార్యంగా యుద్ధాల మధ్యకాలంలోని 'యుద్ధవిరమణ ఒప్పందం' తప్ప మరేమీ కాదు.

ఈ రకంగా చేసిన లెనిన్ విశ్లేషణ కాట్స్కీ విశ్లేషణను, అతని బూర్జువా భావనను తిప్పికొట్టింది. అది ఏరకంగానంటే కాట్స్కీ, లెనిన్ల కాలపు సామ్రాజ్యవాదంలో కొన్ని పెట్టుబడిదారీ దేశాలు చాలా వలసలకై పోట్లాడుకున్నాయి. కాట్స్కీ ప్రకారం-అలాంటి యుద్ధాలు ఆ దేశాలు తర్వాతికాలాల్లో చేసుకోవు; దానికి, అవి చేసుకునే యుద్ధ ఒడంబడికలు, ఫైనాన్స్ కాపిటల్ విధానమే దారి చూపిస్తాయి. ఆ రకంగా కాట్స్కీ-సామ్రాజ్యవాదంలోని రెండవ పార్శ్వమైన 'యుద్ధాన్ని' ప్రముఖంగా చూపిస్తూ, భవిష్యత్ పెట్టుబడిదారీ సమాజంలో శాంతి దిశగా పెట్టుబడి చలనం ఉంటుందన్నాడు. ఆ రకంగా, ఆయన కాలంలో ప్రస్ఫుటంగా కన్పించిన 'యుద్ధాల యెడ' అంధ భావాన్ని ప్రదర్శించాడు. 'సామ్రాజ్యవాదం' సారం - కాట్స్కీకి భిన్నంగా, లెనిన్ ప్రకారం, 'సామ్రాజ్యవాదం' సారం గురించి మనం ఇలా చెప్పవచ్చు...

"సామ్రాజ్యవాదం అన్నా, ఫైనాన్స్ కాపిటల్ అన్నా ఒకటే. అయితే, తన సమీపకాలపు యుద్ధమేఘాలపట్ల లెనిన్ సర్వదా (ఆ మాటకొస్తే, యుద్ధాలకు సంబంధించి ఆయన జోస్యం 1950 వరకూ నిజమైంది) జాగరూకుడై, సరైన విశ్లేషణ చేశాడు.

అయితే, 'యుద్ధం' అనేది, లెనిన్కి సంబంధించి, సామ్రాజ్య వాదంలోని రెండవ పార్శ్వం లేదా అది 'సామ్రాజ్యవాదపు బూచి'. అసలుకు, 'సామ్రాజ్యవాదం' ముఖ్యలక్షణం-ఫైనాన్స్ కాపిటల్ చేసే నగ్న దోపిడీ, పరాన్నభుక్కుతత్వం, 'సామ్రాజ్యవాదం' అంటేనే-'సోమరి జనసమూహ ఉత్పాదక యంత్రం'. పెట్టుబడిపై ఇదే రకమైన అభిప్రాయాన్ని మనకు మార్క్స్ 'కాపిటల్'లో అందిస్తాడు. దీన్ని చూడ నిరాకరించిన కాట్స్కీ పైన అందుకే లెనిన్కి అంత విరక్తి (కాట్స్కీ విప్లవద్రోహం సంగతి అటుంచితే). -అయితే, స్టాలిన్ తర్వాత కాలంనుండి ప్రపంచ యుద్ధాలైతే సమసిపోయాయి కానీ, లెనిన్ యుద్ధాల మధ్యనే గడిపాడు, స్టాలిన్ యుద్ధవీరుడిగా నిలిచాడు. లేకపోతే, సోవియట్ యూనియన్ ముక్కలు చెక్కలై ఈసరికి 90 ఏళ్ళు అయ్యేవే.

-ఇక, కాట్స్కీ ప్రకారం - 'పెట్టుబడిదారీ విధానం శాంతియుతంగా దాని అగ్రదేశాల ఒడంబడికలలో కొనసాగుతుంది' అంటే అర్థం మనకు అవగతమైనా, దీన్ని నిశితంగా పరిశీలిస్తే, లెనిన్ విశ్లేషణే సరైనదని తెలుతుంది. ఎలాగంటే-నేడు పెట్టుబడిదారీ దేశాలు కూటములుగా (నాటో, వగైరా కూటములు) ఏర్పడి, పేద, ఎదురు తిరిగిన దేశాల పైకి మూకుమ్మడిగా దాడి చేసే అవకాశమే హెచ్చు. ఈ యుద్ధ విహ్వలతవల్ల, కాట్స్కీ కాలంనాటి యుద్ధ విహ్వలతకంటే పరమ దయనీయంగా-యుద్ధబూచికి, ఆర్థిక ఆంక్షలకి జంకి, యుద్ధంలో ఓడుతున్న, దోపిడీ చేయబడుతున్న దేశాలకు ఏమాత్రం సాయం చేయని ఇతర దేశాల దౌర్భాగ్యపు విధానాలు, పిరికితనం తోడయి ఆ పేద దేశ ప్రజ హీనస్థితికి దిగజార్చబడుతుంది. (నేటి ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్ మొన్నటి ఉత్తరకొరియా, వియత్నాం యుద్ధాలు-అందుకు సాక్ష్యాలు). కాబట్టి, లెనిన్ అంచనా నేటికీ సరైనదే.

**జె. డి. బెర్నాల్** పెట్టుబడిదారీ సమాజంలోని కుళ్ళుని ఇలా ప్రకటిస్తాడు (సోషల్ డెమోక్రసీపై వ్యాఖ్యలో). "కనిపించని క్రమమైన మార్పులు, ప్రజాస్వామిక పద్ధతులద్వారా వస్తాయని అంటారు వీరు. ఈ రకమైన దృక్పథం పెట్టుబడిదారులలోని కర్కశత్వాన్ని తక్కువగా అంచనా వేస్తుంది. అవసరమైతే అది, అతి దారుణమైన దమనకాండతో కార్మిక ఉద్యమాలను అణచివేస్తుంది...

పెట్టుబడిదారీ విధాన ప్రక్రియలో సామాజికశాస్త్రం అభివృద్ధి చెందింది. కార్మికుల పనిని వ్యవస్థీకృతం (రేషనలైజ్) చేయటమే దీని లక్ష్యం. మానవున్ని యాంత్రికంగా మార్చడమే దీని ఆశయం.

స్త్రీ పురుషులను యంత్రాల స్థాయికి దిగజారుస్తారు... ఆయుధాల ఉత్పత్తి ఎందుకు? మనుషుల్ని చంపడానికి కాదా? ఇది నిజంగానే కళంకిత ప్రపంచం."-('చరిత్రలో సైన్స్' నుండి).

**కారల్ మార్క్స్** 'పెట్టుబడి' గ్రంథంలో మార్క్స్ మనకు దాని 'వికృత విశ్వరూపం' చూపించాడు. ప్రొధాన్, లాసెల్ లాంటి బూర్జువా సమర్థకుల భావాల్నీ, వ్యాఖ్యల్నీ ఇలా నిశితంగా ఖండించాడు:

1) కుహనా సోషలిస్టులు 'పంపిణీ' సమస్యపైనే ఆధారపడతారు. సామాజిక విశ్లేషణకు ఉత్పత్తి రంగమే కీలకం. మనం అందుకనే, 'వినిమయ రంగాన్ని' కాక, 'ఉత్పత్తి రంగాన్నే' కీలకంగా తీసుకుని, దానిలో విప్లవాత్మక మార్పులు తేవాలి; అక్కడ జరుగుతున్న శ్రమదోపిడీ, అదనపువిలువ దోపిడీలపై ప్రశ్నించి, పోరాడి, గెలవాలి. 'శ్రమే' ప్రాథమికం, అవసరాలు కాదు.
2) మానవ దాస్యం అంతా ఉత్పత్తి చేసే క్రమంలోనే ఉంది.
3) పనిదినం పొడిగింపు లేదా శ్రమతీవ్రతపై పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థ ఆధారపడిఉంది.
4) 'వేతన వ్యవస్థ' ప్రతి ఒక సామాజిక వ్యవస్థనూ నియంత్రిస్తుంది. కాబట్టి, 'వేతన వ్యవస్థ రద్దు' అన్న లాసెల్ వ్యాఖ్య తప్పు. మనం 'వేతనశ్రమ వ్యవస్థ రద్దు' అనాలి. ('గోథా కార్యక్రమం'లో).

**ఫోరియర్** ఈ సందర్భంగా, ప్రఖ్యాత వ్యంగ్య రచయిత ఫోరియర్: "నాగరికత అనేది అనాగరిక దశలో వ్యాప్తిచెందిన ప్రతి అవినీతినీ- జటిలమైన, సందేహాస్పదమైన, స్పష్టమైన, బూటకమైన జీవన విధానంగా సులభ పద్ధతిలో పైకెత్తుతుందనీ; ఒక వైరుధ్యం తర్వాత మరొక వైరుధ్యాన్ని సృష్టించుకుంటూ, వాటినుంచి బయటపడలేకుండా, ఉక్కిరిబిక్కిరౌతూ ఉంటుంది" అని రుజువు చేశాడు.

## 7. వర్తమాన కర్తవ్యం

ఈ రకంగా, పెట్టుబడి కుళ్ళును మనం తెల్సుకున్నాక, ఇక మిగిలింది, లెనిన్ చెప్పినట్లు, పరభాగ్యోప దేశాల/ప్రజల జీవన విధానాలను, దోపిడీ తత్వాలను- శ్రామిక, పీడిత వర్గాలందరికీ అర్థమయ్యేలా నగ్నీకరించటం, ఈ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ఉమ్మడిగా పోరాడడమే.

-వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తుల మధ్య అసమతుల్యత ఫైనాన్స్ కాపిటల్ యొక్క విశ్వరూప ఫలితం.

-ఈ ఫైనాన్స్ కాపిటల్ ఎంత నీచానికైనా ఇంకా దిగజారుతుంది. ఉదాహరణకు, గర్భంలో పిండం నిర్ధారణ కాగానే, ఇది రంగంలోకి దిగి, 'భవిష్యత్తు నిధి' పేరిట పన్ను వేయటం, లేదా ఆ 'పుట్టబోయే శిశువు సాధించే విజయాలలోని ఆర్థిక పార్శ్వాన్నే' 'యూనిట్'గా చేసి, మార్కెట్‌లో పెట్టి, 'డెరివేటివ్స్'లో వలె, లాభాలు చేతులు మార్చుకునే నీచస్థాయికి దిగొచ్చు. అంటే, పెట్టుబడి తన పని తాను చేసుకుపోతుంది. కమ్యూనిస్టులు దానిపై ఐక్యపోరాటాల విప్లవం ద్వారా విజయం సాధించి, ప్రణాళీకృత, దోపిడీరహిత శ్రమాధారిత వ్యవస్థను నిర్మించి సాధించే పనిని వారు కనుక అలా చేయకపోతే; ఈ పెట్టుబడి అనేది తానే ఆ పనిని- దోపిడీ పద్ధతుల్ని సాగదీస్తూ, సామాజికీకరణ ద్వారా సమసమాజ నిర్మాణక్రమంలో ఉంటున్నట్లు ఇంకా వేల ఏండ్లు ప్రజల్ని మభ్యపెడుతుంది. కాబట్టి, కమ్యూనిస్టులు ఐక్యమయ్యే కాలం మించిపోతోంది; రండి ఐక్యమవుదాం, కానీ, బూర్జువా ప్రజాస్వామ్యాన్నీ, దాని ఎత్తు జిత్తులను ఓడిస్తూనే.

**ఐజాజ్ అహ్మద్ 2/3** ఏళ్ళ కింద విజయవాడలో వ్యక్తం చేసిన అభిప్రాయంలో ఇలా అన్నారు-"ఫైనాన్స్ కాపిటల్ లేదా పెట్టుబడిదారీ విధానం పీడిత ప్రజలు తనపై ఎదురుతిరిగే స్థాయికి దిగజారినప్పుడు, వారిని అలా కానీకుండా, తనకు గల అన్ని ప్రత్యామ్నాయాలనూ అమలుచేస్తూ, ముందుకుపోయే క్రమంలో ఉంటుంది. అలానే నేడు ఆ క్రమంలో- మధ్యతరగతి జీతాలను కత్తిరించి, వారికి ఉద్యోగ భద్రత లేకుండా యూరప్‌లోని గ్రీస్, అనేక దేశాల్లో చేస్తున్నది. 'సామాన్య ప్రజల కోసం, దేశం దివాళా తీయకుండా ఉండటం కోసం' అని సన్నాయినొక్కులు నొక్కుతూ చెబుతుంది. ఆ సంపదలోంచి కొంత కంటితుడుపుగా పేదలకు వేసి, అత్యధిక భాగం కార్పొరేట్లకు కట్టబెడుతుంది."

దీన్ని మార్చాలంటే, ఆయన చెప్పినట్లు, పోరాటాలే శరణ్యం.

## 8. ముగింపు

'లెనిన్ అంతిమ పోరాటం' పుస్తకంలో మోషే లెవిన్, ప్రచురణకర్తల ముందుమాట చూస్తే, వారు ట్రాట్స్కీయిజం, వగైరా దుందుడుకు వాదాల్నీ, రివిజనిస్టు పోకడల్నీ, రూఢివాద పోకడల్నీ అన్నీ కలిపి, 'సరికొత్త బూర్జువా సోషలిజం' నిర్మించాలని తలపోశారు. వర్తమాన విప్లవ నిశ్చల స్థితిని చూసి, ఇలా తిరోగమన, నిస్సార సిద్ధాంతకృషి చేయబూనటం ఆశావహ దృక్పథం కాదు. వర్తమాన పెట్టుబడిదారీ విధానాన్ని ఎదుర్కోడానికి, ప్రపంచ కమ్యూనిస్టుల ఐక్యత కోసం సాగే చర్యలు, సదస్సులు ముఖ్యం. మరీ ముఖ్యంగా, అంతర్జాతీయంగా పెట్టుబడిదారీ విధానం కొనసాగించే దోపిడీని, యుద్ధాన్ని, అందులో జరిగే విధ్వంసాన్నీ, మానవ హననాన్నీ, పర్యావరణ హానికారక చర్యల్నీ, దోపిడీదేశాల అన్నిదేశాలలోని పరభాగ్యోప మానవుల పరాన్న భుక్కుతత్వాన్నీ (ముఖ్యంగా, స్టాక్ మార్కెట్ మోసాన్నీ), మార్కెట్ భావజాలాన్నీ- ఎండగట్టాలి. ఆ క్రమంతో పాటే, సమాంతరంగా ఉద్యమ, విప్లవ నిర్మాణాన్నీ; సిద్ధాంతం, ఆచరణ - ఈ రెంటినీ కొనసాగించాలి. అంతేకానీ, స్టాలిన్‌ని లక్ష్యంగా చేసుకుని, ఆ ముసుగులో లెనిన్, మార్క్సులనూ ఎక్కువగా (రివిజనిస్టు పద్ధతిలో, 'నవీన బూర్జువా సోషలిస్టు'వేషంలో) తూర్పార పట్టడం తగని పని.

మార్క్స్ అన్నట్లు, "కార్మికుల జీవన స్థాయి పెరిగినా, వారి 'సామాజిక సంతృప్తి' పెట్టుబడిదారులతో పోల్చుకుంటే పడిపోయింది. మొత్తం సమాజాభివృద్ధితో పోల్చుకుంటే కానీ, ఈ విషయం స్పష్టం కాదు. మన కోరికలు, వాంఛలు, సుఖాలు-సమాజం నుండి ఉద్భవిస్తాయి. కనుక, వాటిని మనం సమాజం దృష్ట్యా చూడవలసి ఉంది. ఏవో అవసరాలను తీర్చే వస్తువుల దృష్ట్యా కాదు."

కాబట్టి, అలాంటి 'సామాజిక సంతృప్తి' అనేది అధో/సగటు కార్మికునికి దక్కేరోజు కోసం నిరంతరం భావజాల ప్రచారాన్నీ, వర్గపోరాట క్రమాన్నీ కొనసాగించటమే మార్గం.


అరుణతార చందాదారులకు విజ్ఞప్తి!

ఏ కారణం చేతనైనా మీకు అరుణతార అందకపోతే పిన్‌కోడ్‌తో సహా

మీ చిరునామాను మరోసారి **8500809250** మొబైల్ నంబర్‌కు మెసేజ్ పెట్టగలరు.

గమనిక : ఈ నెంబర్ కేవలం మెసేజ్‌ల కొరకు మాత్రమే! - సం.

# ‘చెదిరిన పిచ్చుక గూళ్ల’ను సవరించే ఉపాధ్యాయిని

మాతంగి

ఆర్ శశికళ విప్లవ రచయితల సంఘం సీనియర్ సభ్యురాలు. ఆమె కథకురాలిగా ఎంత కృషి చేశారో అంతకంటే ఎక్కువగా అనువాదంలో చేశారు. అదీ పౌర ప్రజాస్వామిక, విప్లవ, విప్లవ సాహిత్యోద్యోమాల అనువాద అవసరాలు తీర్చడమే బుద్ధిజీవిగా తన కర్తవ్యమనుకొని పని చేస్తున్నారు. ఈ అనువాద కళ కూడా ఆమె తన జీవితానుభవాలను, విషాద జీవితాలను, విధ్వంసాలను, ప్రజల అలుపెరుగని నిర్మాణ ప్రయత్నాలను కథలుగా రాయడానికి దోహదపడింది.

అంత వరకే కాదు. శశికళదే అయిన ప్రత్యేక ఉన్నది. ఆమె దేన్నయినా పిల్లల కోణంలో చూస్తారు. బాల్యపు మధురిమలోంచి, సృజనాత్మకతలోంచి, వ్యవస్థ వల్ల వీటన్నిటికీ దూరమైపోతున్న స్థితిలోంచి కథలు రాస్తారు. పిల్లల ఇతివృత్తమే గాక పిల్లల చూపు కూడా కథా రచయిత్రిగా ఆమె ప్రత్యేకత. ఇతరత్రా అదే ఆమెకు ఒక పరిమితి, విస్తృతి. ఉపాధ్యాయినిగా తాను నిర్మించుకున్న ఒక సున్నిత, మానవీయ ప్రపంచం నుంచి వచ్చిన కథలు కావడం వాటి విశిష్టత.




**చెదిరిన పిచ్చుక గూడు (కథలు)**
ఆర్. శశికళ
ప్రచురణ : విరసం అనంతపురం యూనిట్
ప్రచురణ : 2003, పేజీలు : 92

2003లో అప్పటి దాకా రాసిన 15 కథలతో చెదిరిన పిచ్చుక గూడు అనే సంపుటి తీసుకొని వచ్చారు. అవిగాక ఇప్పటి దాకా మరో పది కథలు రాసి ఉంటారు. చాలా వాటిల్లో పిల్లలు కనిపిస్తారు. ఈ మధ్య ఆమె రాసిన కథల్లో నేనూ మా లెక్కల సారు అనే కథ పిల్లల అంతరంగాన్ని, విద్యా వ్యవస్థ వైపు నుంచి గొప్పగా చిత్రించింది. సహజంగానే శశికళ కథల్లో అనంతపురం కనిపిస్తుంటుంది. ఒక్కో చోట లీలగా ఆ ప్రాంతపు నుడికారం వినిపిస్తూ ఉంటుంది. అనంతపురం కరువు, ప్రజా ఉద్యమాలు ఇతివృత్తంతో రాసిన కథల్లో మంచి స్థానీయ మాండలికం, జీవితం ఉంటుంది. అయితే శశికళ కథలంటే ఎక్కువగా పిల్లలు, విద్య విధానం అనే ఇమేజ్ ఉంటుంది. ఇది లోపం ఏమీ కాదు. ఆమె బలం. ఆ ఏరియా ఆమెకు బాగా దగ్గరిది. రచయిత్రిగానే కాక ఇతరత్రా కూడా ఆమెవి విద్యా రంగ ఆలోచనలే దీనికి కారణం.

కథ కుప్తంగా, సరళంగా చెప్పడం ఆమె ప్రత్యేకత. బహుశా ఉపాధ్యాయ వృత్తి ఆమె ఆలోచనాతలాన్ని ప్రభావితం చేసి ఉంటుందని ఈ కథా శిల్పంలోకి వెళితే తెలుస్తుంది. పిల్లలకు చెప్పినట్లు సరళంగా, తేలిగ్గా కథ రాసుకుంటూపోతారు. అందువల్ల ఏ ఇతివృత్తం తీసుకున్నా ఆమె కథల్లోని ఫోకస్ పాయింట్ కూడా చాలా సరళంగానే ఉంటుంది. ఒక బలమైన ఫీల్ కథలో ఉంటుంది. దాని ద్వారా విప్లవ రచయిత్రిగా ఆమె తన భావజాలాన్ని పాఠకులకు చేరవేస్తారు.

చెదిరిన పిచ్చుక గూడు సంపుటిలోని కథలుగాని, ఆ తర్వాత రాసిన కథల్లో గాని ఇది సాధారణ లక్షణం. విషాదం, విధ్వంసం, మనుషులకు అందాల్సిన ప్రేమ అందకపోవడం, పొందలేక పోవడం...వంటివి అన్ని రకాల ఇతివృత్తాల్లోంచి వ్యక్తమవుతుంటాయి.

బహుశా ఇవి చాలా మామూలు విషయాలుగా జీవితంలో ఉంటాయి. అంతే మామూలుగా శశికళ కథల్లోనూ ఉంటాయి. రాయలసీమలో ప్రగతిశీల భావజాలంతో సాహిత్య రంగంలో పని చేస్తున్న మహిళల సంఖ్య చాలా తక్కువే. అందునా శశికళ విప్లవం లక్ష్యంగా గల రచయిత్రి. ఈ ప్రత్యేక ఆవరణలోంచి ఆమె కథా సృజనను చూడాలి. కథలు ఇబ్బడిముబ్బడిగా రాయకపోయినా ఇతరేతర ప్రక్రియల్లో ఉద్యమ అవసరాల రీత్యా రాస్తూనే కథను వదిలిపెట్టకుండా రాస్తున్నారు. పిల్లల దృష్టి కోణంతోపాటు ఈ విషయాలనూ పరిగణనలోకి తీసుకొని శశికళ కథలను అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

ఈ సంపుటంలో అంతా ప్రశాంతం, ఆగ్రహం వంటి కథలు ఎలాగైతే వ్యవస్థ ప్రభావాన్ని, దాని పని తీరును నేరుగా చెబుతాయో... పిల్లల వైపు నుంచి రాసిన కథలు కూడా అలా బాల్యం, చదువు వైపు నుంచి వ్యవస్థ మీదికి ఫోకస్ అవుతాయి. ఉదాహరణకు ఎప్పుడో రాసిన చిన్నోడు కథ చదవండి. ఈ సంగతి తెలుస్తుంది. పిల్లలంటే అందరూ పిల్లలే. కానీ శశికళ కథల్లో చింపిరి జుట్టుతో ఉండే పిల్లలే కాస్త ఎక్కువగా కనిపిస్తారు. ఇదేం యాదృచ్ఛికం కాదు. అలాంటి బాల్యాన్ని కొంచెం శ్రద్ధగా పట్టించుకొని కథలు రాయాల్సిన అవసరం చెప్తాయి ఈ కథలు.

ఈ కథలు చదివితే వధ్యశిలగా మారిపోయిన విద్యావ్యవస్థ గురించి, చిదిమివేయబడుతున్న బాల్యం గురించి శశికళ ఇంకా చాలా కథలు రాసి ఉంటే బాగుండు కదా అనిపిస్తుంది. ఇప్పుడు ఎక్కువ మంది వ్యథపడుతున్న అంశం బాల్యం, చదువు. అయినా మిగతా సామాజిక అస్తిత్వ, దోపిడీ సంబంధ ఇతివృత్తాలు

# 'నల్లమల' ఉద్యమ ప్రస్థానం

బుర్ర తిరుపతి

'చూడు ఈ దట్టమైన అడవిలో కొండల నుండి నురుగ గక్కుతూ పారే ఈ చిన్న సెలయేరు పోను పోను వాగుగా మారుతుంది. వాగులన్నీ పోయి పెద్ద వాగుగా మారి దేవుని గుండాల కాడ కృష్ణా నదిలో కలుస్తాయి. అలా నీళ్ళు తాను ప్రవహించే చోటల్లా పచ్చదనం కల్పిస్తూ, చెరువులు కుంటలు నింపుతూ గూడెంలకు, గ్రామాలకు, పట్టణాలకు సాగునీరు, తాగునీరు అందిస్తూ దారి పొడగునా ప్రాణికోటికి జీవాధారంగా నిలిచి, అంతిమంగా సముద్రమైపోతుంది.....

అవును.......<br>
మన పోరాటం కూడా అంతేకాదా!'<br>
- మాధవ్.

ఇలా నల్లమలను, అశేష ప్రజానీకాన్ని, చెంచులను, దక్షిణ తెలంగాణను ఏకం చేసిన పోరాట యోధుడు, మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా అమరుడైన బుర్ర చిన్నన్న అలియాస్ మాధవ్, మల్లన్న పై 420 పేజీలతో ఆయన అమరత్వం పొందిన ఏడేళ్ళ తర్వాత "నల్లమల" నవల రూపుదిద్దుకొన్నది. పెద్దపల్లి డివిజన్ కాల్వ శ్రీరాంపూర్ మండలం మంగపేట గ్రామానికి చెందిన మాధవ్ ఆనాటి గూండాయిజాన్ని, దొరతనాన్ని ధిక్కరిస్తూ, లంపెన్ సెక్షన్‌లకు సింహస్వప్నంగా నిలిచి కామ్రేడ్ దగ్గు రాజలింగు, మల్లోజుల కోటేశ్వర్రావుల నేతృత్వంలో మావోయిస్టుగా మారి మంథని దళంలో పనిచేసి జగిత్యాల జైత్రయాత్ర తర్వాత ఉద్యమ అవసరాల రీత్యా దక్షిణ తెలంగాణ ప్రాంతంలోకి వెళ్ళాడు. మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలలో పనిచేస్తూనే నల్లమల కేంద్రంగా చెంచులకు డాక్టర్ మల్లన్నగా సేవలు అందిస్తూ ఉద్యమాన్ని ఉధృతం చేసాడు.

అలా మొదలైన ఉద్యమ జీవితం కామ్రేడ్ కిరణ్ అకాల మరణానంతరం నల్లమల ఉద్యమాన్ని పూర్తిగా తన భుజస్కంధాల పై మోపుకొని మైదాన ప్రాంతంలోకి విస్తరింపజేశాడు. శత్రువు ఎత్తుగడలను ఎదుర్కొంటూ మూడు దశాబ్దాలకు పైగా ఉద్యమాన్ని కొనసాగిస్తూ చెంచుల జీవితాన్ని వెలిగించాడు. శత్రువు విస్తృతమైన దాడికి పెద్దపెద్ద నాయత్వం నేలకొరిగి పోతూంటే పార్టీకి పెద్ద దిక్కుగా రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సంవత్సరం లోపే మార్కాపురం అడవుల్లో 23 జూన్ 2006న తన జీవిత సహచరి వసంత అలియాస్ శాంతక్క కళ్ళముందే ఎన్‌కౌంటర్లో నేలకొరిగిపోయారు.




నల్లమల<br>
పి. చంద్<br>
ప్రచురణ : విరసం, ప్రచురణ : 2015,<br>
పేజీలు : 419, వెల : రూ. 225/-

మూడు దశాబ్దాల పాటు మాధవ్‌తో పాటు ఉద్యమజీవితాన్ని గడిపి, రాష్ట్ర కేంద్ర స్థాయి నాయకత్వానికి డెన్ కీపర్‌గా వ్యవహరించిన శాంతక్క కోణంలో "నల్లమల" నవల పి.చంద్ రాశారు. విరసం ప్రచురణగా వచ్చిన ఈ నవల 40 ఏళ్ళ మావోయిస్టు ఉద్యమాన్ని, ముఖ్యంగా నల్లమల ఉద్యమ ప్రస్థానాన్ని రికార్డు చేసిన మొదటి నవలగా చెప్పుకోవచ్చును. దీనికి విరసం కార్యవర్గ సభ్యుడు పాణి రాసిన ముందుమాట గొప్ప ఆమోద పత్రం. ఆయన ఒక దగ్గర అంటాడు..... "నల్లమల సాధించిన ఈ అవగాహన, ఆచరణల వెనుక మొత్తంగా విప్లవోద్యమ నాయకత్వం ఉన్నప్పటికీ ప్రత్యేకంగా మాధవ్ పాత్ర గణనీయమైంది. ఆయన కరీంనగర్ జిల్లా నుంచి పాలమూరు వచ్చాక జీవితమంతా చెంచుల మధ్యనే

---

సాహిత్యంలోకి వచ్చినంతగా బాల్యం, చదువు రావడం లేదనిపిస్తోంది. ఈ లోటు తీర్చగలిగిన వారు కూడా తక్కువేనేమో. ఈ సంపుటం తర్వాత శశికళ రాసిన కొన్ని కథల్లో కూడా పైన చెప్పిన ఎరుక కనిపిస్తుంది. అలాంటప్పుడు ఈ విషయాలపై తనే ఎందుకు మరిన్ని కథలు రాయకూడదు? అని ఎవరికైనా ఆశ కలుగుతుంది.

సాహిత్య రచనలో ఏదో దశలో, ఏదో స్థాయిలో అనుకరణ ఉంటుంది. దాని మంచి చెడ్డల గురించి ఇప్పుడు చర్చించబోవడం లేదు. అయితే శశికళ కథలు చదివితే ఆమె తనకు ఎలా కథ చెప్పడం వస్తే అలా చెప్పారు. ఏది కథ అవుతుందనుకుంటే దాని మీద రాశారు. వీటన్నిటి అంతస్సూత్రంగా విప్లవ దృక్పథం సరేసరి. ఈ మాట ఎందుకంటే మారుతున్న పరిస్థితుల్లో సాహిత్యంలో ఏది ఎక్కువ గుర్తింపుకు నోచుకుంటే దాన్ని అందుకొని ఆ పద్ధతిలో కథ రాయడం అనే ధోరణి బైట బాగానే ఉంది. శశికళ ఇలాంటి వాటికి ఆమడ దూరంలో ఉన్నారు. అనువాదం కూడా అంతే. ఏది ఎక్కువ ప్రమోట్ అవుతుందని కాకుండా ఏది ఉద్యమానికి, తెలుగు కార్యకర్తలకు ఇప్పుడు అవసరం అనేదే ఆమెకు ముఖ్యం. అలా తన లక్ష్యం, తన ముద్ర మాత్రమే ఉండే కథలు ఆమె రాస్తున్నారు.. మన కోసం.

గడిపాడు. చెంచుల సంస్కృతి, ఆలోచనా రీతి, జీవన విధానం, సామాజిక మూలాలు, వాటిలో మార్పులు, వాటికి ఉన్న అవరోధాలు వగైరా మీద ఆయనకున్న అవగాహన అక్షరబద్ధమై ఉంటే... ఆంథ్రపాలజీ, సోషియాలజీల్లో ప్రామాణిక పరిశోధనా గ్రంథమై ఉండేది''అని.

అంతగా ఆయన చెంచులతో మమేకం అయిపోయాడని అర్థం. మాధవ్ రాష్ట్ర కార్యదర్శిగా ఎదిగే క్రమంలో ఆయన ఉన్న కమిటీల ఆధ్వర్యంలో జరిగిన అనేక పోరాటాలను, ఘటనలను, ఎదురైన నిర్బంధాలను, ఆయన సహచరిగా ఉద్యమ కార్యకర్తగా శాంత నవలలో వరుసపెట్టి చెప్పుకుంటూ పోతుంది. శ్రీశైలం ముంపు సమస్య- బాధితులకు న్యాయమైన పరిహారం, టైగర్ ప్రాజెక్టు, అటవీ రక్షణ, వలసలు, నీటి వాటా మొదలైన వాటిపై జరిగిన పోరాటాల ప్రస్తావన ఇందులో ఉంది. చెంచులు సేకరించుకొన్న అటవీ ఫలసాయానికి గిట్టుబాటు ధర ఇవ్వాలని ఎన్నో రకాల ఆందోళనలు జరిగాయి. వాటిని కూడా నవల ప్రస్తావిస్తుంది. నిర్బంధం, ప్రతిఘటనపై ఇక చాలా వివరంగా చందు రాశారు.

నల్లమల అంటే ప్రభుత్వంతో విప్లవకారులకు జరిగిన చర్చలు అందరికీ గుర్తుకు వస్తాయి. లేదా చర్చలంటే నల్లమల గుర్తుకు వస్తుంది. ఈ నవల చదువుతూ ఉంటే మాధవ్ లాంటి కామ్రేడ్స్ ఎందరో కనిపిస్తారు. మాధవ్ పోరాటపటిమను గుర్తు చేస్తుంది. ప్రకాశం, కర్నూలు, నల్గొండ, మహబూబ్‌నగర్, గుంటూర్ జిల్లాలు నల్లమలలో ఎలా మమేకమై ఉద్యమ క్షేత్రంగా విలసిల్లాయో తెలుపుతుంది.

మాధవ్ జీవిత చరిత్రను ఇతివృత్తంగా తీసుకొని "నల్లమల" నవల మలచిన పి.చంద్ విలక్షణమైన రచయిత. సింగరేణి గని జీవితంపై, భూనిర్వాసితులపై ఎన్నో కార్మిక కథలుగా మలచిన రచయిత గనుక మావోయిస్టు ఉద్యమాన్ని భుజానికెత్తుకొని ఈ నవల రాసాడు. ఈ రచయిత గతంలో శేషగిరి, మన బాలగోపాల్, కెవిఎల్.మహేంద్ర, నెత్తుటిధార, సింగరేణి కార్మిక కథలు, ఎన్నో వ్యాసాలు రాసాడు. తాజాగా ఒక సంవత్సర కాలం పాటు నిరంతర తపనతో 420 పేజీల "నల్లమల" నవల రాసాడు. దీనిని విరసం సాహిత్య పాఠశాలలో ఫిబ్రవరి 7, 2015న విజయనగరం జిల్లా బొబ్బిలిలో రాఘవాచారి ఆవిష్కరించి సమీక్షించారు. ఇది విప్లవాభిమానులు, సాహిత్య ప్రియులు, మాధవ్ అభిమానులు ప్రతి ఒక్కరూ చదువదగిన పుస్తకం.

---

(5వ పేజీ తరువాత.. )

చేశారు. కన్నయ్య చెప్పిన భారత్ లోపల ఆజాదీ కాదు, భారత్ నుండి ఆజాదీ. శ్రీనగర్ ఎన్.ఐ.టి.లో స్థానిక విద్యార్థులు సుమారు 150 మంది ఉంటే స్థానికేతరులు పదిరెట్లు ఎక్కువున్నారు. ఇది కూడా సంఘపరివార్‌కు కలిసొచ్చే అంశమే. ఆ రోజు ఘర్షణ ఎలాగో సర్దుమణిగింది. సంఘపరివార్‌కు అది ఇష్టం లేదు. పిడిపితో కలిసి అధికారం లోకి వచ్చాక అది మెల్లగా తన ఎజెండా అమలు చేయడం మొదలైంది. కాషాయ జండా పని కశ్మీర్‌లో జాతీయ జండా చేయగలదు కాబట్టి జెండా దేశభక్తిని బైటికి తీశారు. ఇక్కడొక విషయం గుర్తు చేయాలి. కశ్మీర్ లో కశ్మీర్ జాతీయ జెండా (నాగలి గుర్తుగల ఎర్ర జెండా) ఎగరేస్తారు. అటువంటి జాతి ప్రతిపత్తిని ఆర్టికల్ 370 గుర్తించింది. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల్లో ఇండియా జెండా కూడా కశ్మీర్ జండా పక్కన సమాన హోదాలో ఎగరేయాలని నిర్ణయించారు కానీ అది కశ్మీరీలకు ఆత్మగౌరవ సమస్య. అధికార భవనాలపై రెండు జెండాలు ఉండడం అక్కడ నియమం. బి.జె.పికి అక్కడ పవర్ రాగానే మూడు రంగుల జెండా తప్ప మరే జెండా ఎగరేయమని ప్రకటించింది. ప్రస్తుతం జెండా వివాదం కోర్టులో ఉంది.

ఇటువంటి సమస్యల కారణంగా ఏప్రిల్ 1న స్థానికేతర విద్యార్థులు భారతదేశ జెండా ఎగరేయబోతే పోలీసులు సర్ది చెప్పి వారించారు. శ్రీనగర్ ఎన్.ఐ.టిలో ఏప్రిల్ 1కి సర్దుమణిగిన వివాదాన్ని నాలుగు రోజుల తర్వాత మళ్ళీ పైకి లాగారు. జెండా, ప్లకార్డులు పట్టుకుని ర్యాలీగా కేంపస్ బైటికి వస్తున్న విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. జెండా లాక్కుని విపరీతంగా కొట్టారు. దేశవ్యాప్తంగా పోలీసు హింసకు వ్యతిరేకంగా నిరసనలు రావడం మంచిదే. అయితే ఇక్కడ వ్యతిరేకత పోలీసు చర్య కన్నా, కశ్మీరు పోలీసుల చర్య మీద వ్యక్తమైంది. నిజానికి కశ్మీరు పోలీసులు కశ్మీర్ ఉద్యమకారుల్ని హింసించడంలో, కాల్చి చంపడంలో కుఖ్యాతిగాంచారు. ఉదాహరణకు 2010లో కశ్మీర్ యువత ఆజాదీ కోసం వీధుల్లోకి వచ్చినప్పుడు వివిధ ప్రదర్శనల మీద జరిపిన కాల్పుల్లో 120 మంది యువకులు, ముఖ్యంగా టీనేజీ పిల్లలు చనిపోయారు. ఏ ఒక్క పోలీసు మీదా కేసు నమోదు కాలేదు. ఈ దుర్మార్గాన్ని మీడియా ఎత్తి చూపలేదు. ఇప్పుడు కశ్మీర్ విద్యార్థుల వైపు నుండి ఒక ప్రశ్న. దేశవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల్లో కాశ్మీరీ విద్యార్థుల మీద వివక్ష, వేధింపులు ఎవరూ గుర్తించరు కానీ ఇక్కడ స్థానికేతర విద్యార్థుల మీద పోలీసులు దాడి చేస్తే దేశవ్యాప్తంగా స్పందన రావడమే కాదు, స్వయంగా కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగి కశ్మీరు పోలీసుల దేశభక్తిని శంకించి (వారు చేసిన అకృత్యాల కారణంగా వారి మీద కశ్మీరీలకు సానుభూతి లేదు) విద్యార్థుల రక్షణ కోసం 600మంది సి.ఆర్.పి.ఎఫ్ బలగాలను దించారు. ఈ వివక్షను ఏమనాలి? మీకు కశ్మీర్ భూభాగం మాత్రమే కావాలి. కశ్మీర్ ప్రజలు కాదు.

ఇదెంత నిజమో రోజుల వ్యవధిలోనే హంద్వారాలో 5మంది పోలీసు కాల్పుల్లో చనిపోయినప్పుడు తాజాగా నిరూపణ అయింది. కశ్మీర్ లో ఆర్మీ ఒక అమ్మాయిని లైంగికంగా వేధిస్తే నిరసన తెలిపిన ప్రజల మీద కాల్పులు జరుపుతారు. పోలీసు కస్టడీలో బాధితురాలినే రోజుల తరబడి ఉంచుతారు. చివరికి నిరసనలకు కారణమని చెప్తున్న విషయం అబద్ధమని తేలుస్తారు. క్రికెట్ దేశభక్తిపాటి విలువ చేయవు మనుషుల ప్రాణాలు. చనిపోయిన అయిదుగురిలో ఒకరు అద్భుతమైన ప్రతిభ గల 19 ఏళ్ల యువ క్రికెట్ ఆటగాడన్న విషయం ఇక్కడ అప్రస్తుతం కాదేమో. అతని బెడ్ రూమ్ గోడల మీద సచిన్ టెండుల్కర్ సహా వివిధ దేశాల క్రికెటర్ల పోస్టర్లు. ఇదైనా మానవాళ్ళ దేశభక్తి సెంటిమెంటుకు నొప్పి తగిలే విషయం కాదా!

# మార్క్స్ పెట్టుబడి - రచనా క్రమం

ఫ్రాన్సిస్ వీన్

అనువాదం: ముక్తవరం పార్థసారథి

(8)

(గత సంచిక తరువాయి...)

"పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికులు పేదరికంలో కూరుకుపోక తప్పదు. వాళ్ళ దారిద్ర్యం రోజు రోజుకూ పెరుతుందే తప్ప తగ్గదు" అని స్పష్టం చేస్తాడు మార్క్స్. ఈ ప్రతిపాదన కొంత అనవసరమైన చర్చకు దారితీసింది. "కేవలం కార్మికుల వేతనాలు తగ్గించటం ద్వారా మాత్రమే పెట్టుబడిదారులు తమ లాభాలు పెంచుకుంటారు" అని దీని అర్థం అన్నారు పలువురు విమర్శకులు. కాని ఈనాడు (పశ్చిమదేశాలలో) కార్లలో షికార్లు చేస్తున్న కార్మికులు, ఇళ్ళలో మైక్రోవేవ్ ఓవెన్‌లలో వంటలు చేసుకుంటున్న వాళ్ళు నిరుపేదలని ఎవరనగలరు? ఆ రోజుల్లో లాగ ఈ నాడు కార్మికుల్లో పేదరికం లేదు గనక, మార్క్స్ వాదనలను పూర్తిగా తిరస్కరించ వచ్చు" అంటాడు పాల్ సామ్యుయెల్సన్. ఈయనగారి పుస్తకాలే బ్రిటన్, అమెరికాలలో (యూనివర్సిటీ) ఆర్థికశాస్త్ర విద్యార్థులకు పాఠ్యాంశాలుగా ఉన్నాయి గనక, ఇది నిజమే కాబోలు ననుకున్నారు అందరూ.

కాని సామ్యుయెల్సన్ వాదనలో పసలేదు. పెట్టుబడిలోని 25వ అధ్యాయాన్ని (The General Law of Capitalist Accumulation) ను ఆయన తప్పుగా అర్థం చేసుకున్నాడు. "దారిద్ర్యమనేది పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమంలో ఒక భాగం. పెట్టుబడిదారు పెట్టే చిల్లర ఖర్చు అది. అయితే అతడు ఆ ఖర్చు తన ఖాతాలో కాకుండా, కార్మికుల, పెటీ బూర్జువాల అకౌంట్‌లో వేస్తాడు." ఇక్కడ మరో విషయం స్పష్టం చెయ్యాలి. ఇక్కడ మార్క్స్ ఉద్దేశంలో కార్మికులు అంటే అందరూ కాదు. వాళ్ళలోని అతి తక్కువ స్థాయి (Lowest Sediment) వాళ్ళు మాత్రమే. నిరుద్యోగులు, అనారోగ్యంతో పని చెయ్యలేనివారు, అడుక్కునే దశలో ఉన్నవాళ్ళు. ఇలాంటి వాళ్ళు ఇప్పుడు మాత్రం లేరా? ఏ పేరుతో పిలిచినా (కొందరు వీళ్ళని అండర్‌క్లాస్ అంటారు) ఇలాంటి వాళ్ళున్నారనేది మాత్రం స్పష్టం. "మానవ సమాజంలో మానవుల్లా బతకలేని వాళ్ళు" - వేతనశ్రమ పరిణామమిది.



పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో కార్మికులకు వేతనాలు ఇవ్వరని మార్క్స్ ఎప్పుడూ చెప్పలేదు. పెట్టుబడిదారును పెరిగిన లాభాలతో పోలిస్తే, వేతనాలు తగ్గుతాయన్నదే ఆయన ఉద్దేశం. దీని గురించి పెద్దగా సందేహించనవసరం లేదు. ఒక ఫ్యాక్టరీలో 20% అదనపు విలువ పెరిగితే, యజమాని 20% జీతాలు పెంచడని మనకు తెలియదా? "పెట్టుబడి సంచయంలో, కార్మికుల జీతాలు ఎంత పెరిగినా, లాభాలతో పోల్చితే తక్కువే అన్నది మాత్రం స్పష్టం. అంటే కార్మికులు కార్లు కొన్నా, మైక్రోవేవ్ లలో వండుకున్నా, పెట్టుబడిదారు దయాదాక్షిణ్యాల మీద ఆధారపడక తప్పదు. ఇదే సందర్భంలో తను పేదరికానికిచ్చిన నిర్వచనాన్ని స్పష్టం చేస్తాడు మార్క్స్. అది, జీసస్ చెప్పిన డబ్బు లేకపోవటం వల్ల వచ్చిన పేదరికం కాదు. కార్మికుడు తన ఆత్మను అమ్ముకొని బతకడం అసలైన పేదరికం." "ప్రొమెతియస్‌ను కమ్మరి దేవుడు ఏ గొలుసులతో బంధించాడో అంతకన్నా బలమైన గొలుసులతో పెట్టుబడికి బంధించబడి ఉన్నాడు కార్మికుడు" కొందరి కోసం సంపద సృష్టించాలంటే మరి కొందరు పేదరికంలో మగ్గిపోక తప్పదు.

"పెట్టుబడిదారీ వ్యవస్థలో, ఉత్పత్తి పెంచడమంటే కార్మికుణ్ణి దోచుకోవటమనే అర్థం. మనిషి యంత్రంలా మారతాడు. (మనిషిలాగ బతకలేని మనిషి జంతువుకన్నా ఎక్కువేమీ కాదు) సంతోషంగా, ఉత్సాహంగా చెయ్యవలసిన శ్రమ, చిత్రహింసలా మారుతుంది. పనిచెయ్యటానికి అవసరమైన మేధోశక్తి, పరిజ్ఞానం, యంత్రంలోనే నిక్షిప్తమై ఉంది గనక, అతడు తన తెలివితేటలను ఉపయోగించ నవసరం లేదు. ఆ స్థితిలో అతడు తన పనితో సంబంధం కోల్పోయి పరాయీకరణ చెందుతాడు. తన పరిసరాలను, ఫ్యాక్టరీని అసహ్యించుకుంటాడు. "జీవితకాలం" పరులకోసం కూలీ చేసే సమయంగా మారిపోతుంది. పెట్టుబడి భూతం అతడి భార్యనూ, పిల్లల్ని కూడా వదిలిపెట్టదు. వాళ్ళను కూడా పీల్చి పిప్పి చేస్తుంది. ఒకవైపు సంపద పేరుకుపోతోందంటే అర్థం మరోవైపు కార్మికులు పేదరికంలో కూరుకుపోతున్నారని. బానిసత్వం, దారిద్ర్యం, మనుషుల్లా బతకలేనితనం నైతిక పతనం- సంపదను సృష్టించిన వర్గానికి దక్కిన ప్రతిఫలమిది"

1970 లలో యంత్రీకరణ పెరిగిన తర్వాత "ఇక కార్మికులకు తీరికే తీరిక. పనులన్నీ మెషీన్లే చేసేస్తాయి" అనే భావన పెరిగింది. అలా పెరిగిన తీరిక వేళల్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో చెప్పే పుస్తకాలు కూడా షాపుల్లో దర్శనమిచ్చాయి. కాలుమీద కాలు వేసుకుని కూర్చుంటే ఆరోగ్యం పాడవుతుంది. కనీసం శారీరక వ్యాయామమైనా చెయ్యాలి. కాని ఇవాళ ఆ పాత పుస్తకాలు ఎక్కడైనా దొరికితే చదివి చూడండి. అందులోని సలహాలు చదివితే మీరు పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వటం ఖాయం. ఇంగ్లండులో ఒక సగటు ఉద్యోగి 'వర్కింగ్ లైఫ్' 1981లో 69,000 గంటలైతే 2006లో అది 80,224 గంటలు. పని నుండి విముక్తి లభించలేదు సరికదా, బానిసత్వం మరింత పెరిగింది. శ్రమకూ, జీవితానికీ మధ్య సమతుల్యత సాధించటమెలా అని పుస్తకాలున్నాయా? అని అడుగుతున్నారిప్పుడు. మెలకువగా ఉంటే పని చెయ్యటం, లేదా అలసిసొలసి నిద్రపోవటం తప్ప జీవితానికి అర్థం లేకుండా పోతున్నది నేటి కార్మికులకు, ఉద్యోగులకు.

అయితే పెట్టుబడిదార్లు ఇలాంటి భావనలు కలిగిస్తారని ఆనాడే ఊహించాడు మార్క్స్. పెట్టుబడి 12వ అధ్యాయంలో సమకాలీన ఆర్థికశాస్త్రజ్ఞులు ప్రచారం చేస్తున్న అబద్ధాల గురించి ఇలా రాసాడు. "ఉత్పత్తిని పెంచి పనికాలాన్ని తగ్గించినందుకు కార్మికులు పెట్టుబడిదారు పట్ల కృతజ్ఞులుగా ఉండాలి. అని 2వ పేజీలో, ఆ కృతజ్ఞతను వ్యక్తపరచటానికి 10 బదులు 15 గంటలు పనిచేయాలని మరొక పేజీలో రాస్తున్నారు. 'పెట్టుబడిదారు ఒక సరుకును ఉత్పత్తి చేసే సమయాన్ని తగ్గిస్తాడు గాని, పని గంటల్ని తగ్గించరు'' అంటాడు మార్క్స్. తన ఉత్పాదన శక్తి పెరిగిన కార్మికుడు పదిరెట్లు ఎక్కువ సరుకుల్ని తయారు చేస్తాడు. ఒక్కొక్క సరుకు మీద ఉత్పత్తికి పదోవంతు సమయమే వెచ్చిస్తున్నాడిప్పుడు. కాని పదిగంటలకు బదులు పన్నెండు గంటలు పనిచేస్తున్నాడు. మొదట తయారు చేసిన 120 సరుకులకు బదులు ఇప్పుడు 1200 సరుకులు కూడా తయారు చేస్తున్నాడు. పనిగంటల్ని పెంచి, రోజుకు 1400 సరుకులు కూడా తయారు చెయ్యమని చెప్పవచ్చు. ఇలా చెయ్యటం వల్ల, కార్మికుడు తనకోసం అవసరమైన శ్రమకాలాన్ని తగ్గించుకుని, పెట్టుబడిదారు లాభాలకోసం మిగిలిన సమయమంతా శ్రమిస్తున్నాడు.

కాని ఇలా చెయ్యటం వల్ల మార్కెట్ సరుకులతో నిండి పోతుంది. జీతాలు పెరగలేదు గనక, వినియోగదారుల రూపంలో కార్మికులకు ఈ సరుకులను కొనుగోలు చేసే శక్తి ఉండదు. అప్పుడేం జరుగుతుంది మరి? 1848 నాటి కమ్యూనిస్ట్ మానిఫెస్టోలోనే దీన్ని గురించి ప్రస్తావించాడు మార్క్స్. ఇలాంటి సమయాల్లో వచ్చే ఆర్థిక/వ్యాపార సంక్షోభాలు బూర్జువా సమాజ మనుగడనే ప్రశ్నార్థకం చేస్తాయి. సంక్షోభం వచ్చినప్పుడు కొత్తగా తయారైన సరుకులే కాదు, మిగిలిఉన్న పాత సరుకుల్ని నాశనం చేస్తారు. ఈ సంక్షోభాల ఫలితమే సర్వేసర్వత్రా వ్యాపించే 'అధిక ఉత్పత్తి' అనబడే మహమ్మారి. బూర్జువా సమాజం తను సృష్టించిన సంపదను ఉపయోగించు కోలేదు. ఇలాంటి సందర్భాల్లో పెట్టుబడిదారుల ముందు రెండు మార్గాలుంటాయి. ఒకటి : అయిన ఉత్పత్తిని నాశనం చెయ్యడం రెండు: కొత్త మార్కెట్లను తమ అధీనంలో తెచ్చుకోవటం. లేదా అప్పటికే కొనసాగుతున్న దోపిడీని మరింత తీవ్రతరం చెయ్యటం. అయితే ఇలా చెయ్యటం వల్ల సంక్షోభం పరిష్కారం కాదు సరికదా మరింత తీవ్రతరమవుతుంది.

దీనికే బూమ్ అండ్ బస్ట్ - మార్కెట్లు పైకి లేవటం, పతనం కావటం అంటారు. ఇది తొలిసారి అనుభవంలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి దాకా ప్రభుత్వాలు దీన్ని అధిగమించటానికి ప్రయత్నిస్తూనే ఉన్నాయి. కాని మార్క్స్ ప్రకారం, పెట్టుబడిదారీ వ్యవస్థ ఉన్నంత వరకూ ఉత్థానపతనాల నుండి సమాజానికి విముక్తి లేదు. అధిక ఉత్పత్తి జరిగిందంటే ఇదీ ఉండక తప్పదు. "పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి చెలియలికట్ట పెట్టుబడే'' అంటాడు పెట్టుబడి మూడవభాగంలో. జన బాహుళ్యాన్ని పేదరికంలోకి నెట్టటమే పెట్టుబడికి లక్ష్యంగా ఉన్నంతవరకూ, నిరాటంకంగా అధిక ఉత్పత్తి జరుగుతూనే ఉంటుంది. ప్రజల పేదరికం, ఉత్పత్తులను వాడుకోలేని నిస్సహాయత ఒకవైపు, అధిక ఉత్పత్తి ఒకవైపూ సంక్షోభానికి దారితీస్తాయి.

అంటే తను తయారు చేసుకున్న ఆయుధాలే పెట్టుబడిదారీ విధానాన్ని తీవ్రంగా గాయపరుస్తాయి. 1848 నాటి తిరుగుబాట్ల తర్వాత, "(ఆర్థిక) సంక్షోభ ఫలితంగానే విప్లవం వస్తుంది'' అన్నాడు మార్క్స్. అప్పటి నుండీ ప్రళయం ఎప్పుడు వస్తుందా అని నిరీక్షించాడు. 1851 క్రిస్మస్ రోజుల్లో "అతి త్వరలో రాక తప్పదు'' అన్నాడు. "వాణిజ్య సంక్షోభం లేకుండా విప్లవం రాదు''. ప్రతిసారీ మార్కెట్లు పతనమవుతున్నాయని తెలిసినా, దివాళా తీసామని వార్త చదివినా ఆయన తెగ సంబర పడిపోయేవాడు. ఇక ఈసారి విప్లవం రాకుండా ఎవరూ ఆపలేరని జోస్యం చెప్పేవాడు. వాణిజ్య రంగం కుదేలైంది. "అన్ని రాకాల వ్యాపార లావాదేవీల్లోనూ ఇలాగే జరిగితే భూకంపం రాక తప్పదు'' అన్నాడు (1853). తన మిత్రుని అభిప్రాయాలతో పూర్తిగా ఏకీభవించాడు ఎంగెల్స్. "మార్కెట్లలో సరుకుల నిల్వలు పేరుకుపోయాయి. యూరోపులో పరిశ్రమలు కుప్పకూలాయి. ధనవంతులు లబోదిబో మంటున్నారు. బూర్జువా వర్గం దివాళా తీసింది. విశృంఖల జీవన విధానానికి వాళ్ళు చెల్లించిన ఖరీదు ఇది''. 1857-58లో మార్క్స్ నిర్విరామంగా సమాచారం సేకరించి తన నోట్‌బుక్స్‌లో భద్రపరచుకొన్నాడు. ఇదే మనకు తెలిసిన గ్రుండ్రిసె (Grundrisse) "మొదట ఒక స్కెచ్ గీసుకుంటాను. తరువాత పని ప్రారంభిస్తాను''. తన గతితార్కిక రచనా పద్ధతిని గురించి 'పెట్టుబడి' మొదటి సంపుటం, రెండవ ఎడిషన్‌కు రాసిన ముందుమాటలో ఇలా వివరించాడు. "పారిశ్రామిక వ్యవస్థలో క్రమం తప్పకుండా వస్తున్న సంక్షోభాలే పెట్టుబడిదారీ విధానంలోని వైరుధ్యాలను సూచిస్తున్నాయి. ఇలాంటి సంక్షోభం మరొకటి కనుచూపు మేరలో కనిపిస్తున్నది''.

కాని, ఈయన జోస్యం నిజం కాలేదు. "మన భావనలకే ప్రతిబింబం వాస్తవ ప్రపంచం'' అన్నాడు హెగెల్. "వాస్తవ ప్రపంచ ప్రతిబింబమే మన వ్యూహాలు, భావనలు'' అన్నాడు మార్క్స్. "గతితార్కిక (డయాలెక్టిక్స్) పద్ధతి మూల రూపం "హెగెల్ గతితార్కికత''. అయితే అందులోని మిస్టికల్ ధోరణిని నేను

నిరాకరించాను" అంటాడు. 1873లో రాసిన ముందుమాటలో అందరూ హెగెల్ చెప్పిందంతా నిజమని అంగీకరిస్తున్నప్పుడు, ముప్పై ఏళ్ళ క్రితమే నేను వ్యతిరేకించాను" అంటాడు.

పెట్టుబడిదారీ విధానం అంతం కాక తప్పదు. భూకంపం అనివార్యం. అంటే అర్థం అదేదో తక్షణమే జరిగిపోతుందని కాదు.

చారిత్రకంగా, ప్రాచీన కాలంలోని ఆస్తి, ఉత్పత్తి సంబంధాలు, భూస్వామ్య విధానాలు, కొన్ని శతాబ్దాల పాటో, సహస్రాబ్దాల పాటో కొనసాగాయి. అన్నింటినీ అధిగమించి వచ్చిన పెట్టుబడిదారీ విధానం, చాలా తెలివిగా, ప్రతి సంక్షోభం తర్వాత, చావు తప్పి, కన్ను లొట్టబోయినా ఇంకా కొనసాగుతూనే ఉంది. "ఈజిప్షియన్ పిరమిడ్‌ల కన్నా, రోమన్ నీటి కాలువల కన్నా, గోతిక్ కతీడ్రల్‌ల కన్నా అద్భుత సృష్టి పెట్టుబడిదారీ విధానం. ఇప్పటికీ మనకు తెలిసిన అద్భుతాలన్నింటికన్నా అద్భుతాలను సాధించింది పెట్టుబడిదారీ విధానం" అని కమ్యూనిస్టు మేనిఫెస్టోలో ఆనాడే రాసాడు. మరి అంతటి బలమైన, సమర్థవంతమైన వ్యవస్థ శతాబ్దమైనా గడవకుండానే అంతర్ధానమైపోతుందా!

ఆ విషయం ఆయన ఊహించి ఉండకపోవచ్చు. 'పెట్టుబడి' మొదటి భాగంలో పెట్టుబడిదారీ వ్యవస్థ పతనం అనివార్యమని ప్రకటించినా, రెండవ భాగంలో పలు వాదనలు, లెక్కలు వేసి సంక్షోభాలు లేని పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అసాధ్యమేమీ కాదంటాడు. (కనీసం సైద్ధాంతికంగా ఇలా జరిగే అవకాశం లేకపోలేదు అని అర్థం). 'మార్పులకు అవకాశం లేని ఇనప కచ్చడాల్లాంటి కొన్ని సూత్రీకరణలు చేసాడు మార్క్స్' అంటారు కొందరు. పెట్టుబడిదారీ వ్యవస్థ పతనాన్నీ, దోపిడీ లేని సమాజాన్నీ ఆయన అభిలషించిన మాట నిజమే. కమ్యూనిస్టు మేనిఫెస్టోలో ఇవి 'అనివార్యం' అని ప్రకటించాడు. కాని The Eighteenth Brumaire of Louis Bonaparte (1852) లో "ప్రజలు తమ చరిత్ర తామే నిర్మించుకుంటారు. కాని అది వాళ్ళ ఇష్ట ప్రకారం వాళ్ళు కోరుకున్నట్టుగా జరగదు (ఎందుకంటే) పరిస్థితులను వాళ్ళు తయారు చేసుకోలేరు. అవి వాళ్ళు అభిలషించినట్టుగా ఉండవలసిన అవసరం లేదు. గతానికి వారసత్వంగా వచ్చిన వర్తమానం ఎలాగుంటే అలాగే దాన్ని ఎదుర్కోక తప్పదు"

"పెట్టుబడిదారీ విధానానికి సంబంధించిన సహజ సూత్రాలు అనివార్యంగా అమలవుతాయి" అంటాడు. పెట్టుబడికి రాసిన తొలి ముందుమాటలో. మార్క్స్ 'లా' చదువుకున్నాడు. ఈ చిన్న విషయం ఆయనకు తెలియదని కాదు. దొంగతనం చెయ్యకూడదని చట్టమున్నంత మాత్రాన దొంగతనాలు ఆగవు. లాభాల శాతం క్రమంగా తగ్గుతుంది అని ఆయన చేసిన సూత్రీకరణకు ఈ ఉదాహరణ బాగా వర్తిస్తుంది.

ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందిన కొద్దీ లాభాలు తగ్గుతాయని మార్క్స్‌కు ముందున్న ఆర్థిక శాస్త్రవేత్తలు కూడా సూచించారు. పెట్టుబడి మూడవ సంపుటంలో "ఉత్పత్తిదారుల మధ్య పోటీ పెరిగి వాళ్ళు యంత్రీకరణ కంటే కాన్‌స్టాంట్ కేపిటల్ మీద పెట్టుబడి పెడతారు. వేతనాల మీద ఖర్చు తగ్గించుకుంటారు" అంటాడు. అంటే లాభాలు తగ్గటానికి ఇదీ కారణం అవును మరి. మార్పిడి విలువంటే మానవ శ్రమ అనుకొన్నప్పుడు లాభాలు తగ్గక తప్పదు.

ఇలా రాసినందుకు మార్క్స్‌ను విమర్శించారు. తనతో పలువురు విభేదిస్తారని కూడా ఆయన ఊహించే ఉంటాడు. అందువల్ల తరువాతి అధ్యాయంలో, వాస్తవంలో లాభాలు ఎందుకు తగ్గలేదో వివరించాడు. ఇందుకు ఒక ముఖ్య కారణం: విదేశీ మార్కెట్లు, విదేశీ వ్యాపారం, సరుకులను చవకగా ఉత్పత్తి చేసి ఎక్కువ ధరలకు అమ్మటం. ఇక 'ఇండస్ట్రియల్ రిజర్వ్ ఆర్మీ' ఉండనే ఉంది. ఉత్పత్తిలో ఎక్కువ భాగం యంత్రాలే చెయ్యటం వల్ల కార్మికుల జీతాలు తగ్గుతాయి. ఇవన్నీ కలిసి లాభాలు తగ్గుతాయన్న సహజ సూత్రం అమలు కాకుండా అడ్డుపడతాయి.

'అధిక ఉత్పత్తి'కి కూడా ఇలాంటి షరతులే వర్తిస్తాయి. మొదట ధరలు తగ్గుతాయి. 'పెట్టుబడి' లో కూడా తగ్గుదల కనిపిస్తుంది. కాని, ఇలా జరగటం వల్ల, లాభాల శాతం పెరిగి, వ్యాపారం అభివృద్ధి చెందుతుంది. 'పెట్టుబడి' మూడవ సంపుటంలో చెప్పినట్టుగా, తొలిదశలో ఉత్పత్తిలో కనిపించిన స్తబ్దతే తర్వాత ఉత్పత్తి పెరగడానికి కారణమవుతుంది. (పెట్టుబడి కున్న పరిమితుల్లో) ఈ మార్పులన్నీ చక్రభ్రమణం లా కనిపిస్తాయి. "పెట్టుబడిదారీ వ్యవస్థ ఉత్థానపతనాల (క్రైసిస్ అండ్ బూమ్స్) ద్వారా కొనసాగుతుంది- మనిషి ఉచ్ఛ్వాస నిశ్వాసలతో బతికినట్టుగా" అంటాడు లియోన్ ట్రాట్స్కీ.

పెట్టుబడిదారీ వ్యవస్థ ఏ విధంగా అంతరించి పోతుందో మార్క్స్ దాస్‌కాపిటల్ లో ఎక్కడా స్పష్టంగా చెప్పలేదు. కాకపోతే అంతరించక తప్పదని తన నమ్మకం అంటాడు. వాణిజ్యపరంగా కుదేలైనప్పుడల్లా పెట్టుబడి కొద్ది మంది చేతుల్లో కేంద్రీకరించ బడుతుంది. ఈ గుత్త పెట్టుబడిదారీ స్వభావం ఉత్పత్తి పెరగటానికి అడ్డుపడుతుంది. (సంకెళ్ళు వేస్తుంది) అంటే, పెట్టుబడిదారీ విధానం ఇక కొనసాగలేని దశ వస్తుంది. బూర్జువా వ్యవస్థ రక్షణ కవచం పగుళ్ళు బారుతుంది. దోపిడీదారులు దోచుకోబడతారు. ఈ నమ్మకంతో దాస్‌కాపిటల్ మొదటి భాగం ముగిస్తాడు మార్క్స్.

ఇది చదివి ప్రేరణ పొందని వాళ్ళు లేరు. కాని ఆ తర్వాత 'మోడర్న్ థియరీ ఆఫ్ కొలోనైజేషన్' పేరిట మరో అధ్యాయం చేర్చాడు. వేతన బానిసలందరికీ విముక్తి లభిస్తే ఏమవుతుందన్నది ఇందులోని సారాంశం. ఇంగ్లండు వంటి దేశాలలో పెట్టుబడిదారీ వ్యవస్థ అదేదో సహజ ఆర్థిక వ్యవస్థ అన్నంతగా అందరూ అంగీకరిస్తున్నారు. కాని వలస దేశాలలో అలా కాదు. అక్కడికి వెళ్ళిన పేద, కార్మికవర్గ వలసవాదులు, స్థానికుల శ్రమతో తాము డబ్బు చేసుకుంటున్నారే తప్ప పెట్టుబడిదారులకు సహాయపడటంలేదు.

1851లోనే ఎంగెల్స్ ఇలా రాసాడు. "ఇలాగే జరగాలి. ఆస్ట్రేలియాలో బంగారం నిల్వలున్నాయని తెలియటంతో ఇంగ్లండు నుండి దేశాంతర వాస శిక్ష కోసం అక్కడికి వెళ్ళిన హంతకులు, గజదొంగలు, రేపిస్టులు, జేబుదొంగలు ఏకమై అద్భుతాలు సృష్టిస్తున్నారు. తమకు శిక్షలు విధించిన ఇంగ్లిషు వాళ్ళను తన్ని తగలేస్తున్నారు"

చివరి అధ్యాయంలో, ఓ పిట్టకథ చెబుతాడు మార్క్స్.

# ఉదయభానుని చంపడానికి హిందూత్వ పన్నిన కుట్రను అడ్డుకుందాం!

దేశాలు స్వాతంత్ర్యాన్ని , జాతులు విముక్తిని, ప్రజలు విప్లవాన్ని కోరుకుంటున్న యుగం ఇది - మావో

నా తాత్వికత చాలా సరళమైనది

పరమ మూర్ఖమైన, అత్యంత మలినమైన వాదాలు రెండు- మతం - జాతీయవాదం!

యుగ యుగాల నుండి హింస రచనకు తిరుగులేని మార్గాలుగా రుజువైనవి!

నేను ఏవగించుకునే పెడ ధోరణులు-దురాశ-సంఘ బహిష్కారం, సామ్రాజ్యవాద-ఆధిపత్య వాద లక్షణాలు. నేను నా ప్రాణాలను అర్పించి అయినా చూడాలనుకున్నవి కారుణ్యం-చైతన్యం!

ఈ ప్రపంచంలో అత్యంత శక్తి వంతమైనవి ప్రేమ-ప్రకృతి - వేముల రోహిత్

రోహిత్ అత్యంత ఏవగించుకున్న సంఘ బహిష్కారం - సామ్రాజ్యవాదం... రోహిత్ ప్రాణాలు తీసాయి. ప్రాణాలు అర్పించి అయినా రోహిత్ చూడలనుకున్న కారుణ్యం దొరక లేదు... కనుచూపుమేర కనిపించలేదు. తను వెళ్ళి పోయిన లోకంలోని నక్షత్ర రజాన్ని భూలోకం మీద మరీ వెతికినా కారుణ్యం దొరక లేదు సరి కదా లాఠీలై పిడిగుద్దులై కాలి విద్యార్థి లోకం మీద క్రూరమైన దాడిగా కారుణ్య హీన క్రీడై, ఎచ్.సీ.యులో నిర్దాక్షిణ్యంగా సాగింది. విరసం సభ్యుడు, యునివర్శిటీ రీసెర్చ్ స్కాలర్, దళిత విద్యార్థి సంఘం నాయకుడు ఉదయభాను, టి.వి.వి. రాష్ట్ర కమిటి సభ్యుడు భాస్కర్, అక్షిత ఎస్ఎఫ్ఐ, కత్తి అనిల్ బిఎస్ఎఫ్-ఎచ్‌సియు లీడర్-సనాఫాతిమ, లైంగిక వేధింపుల వ్యతిరేక వేదిక, ఎచ్‌సియు, ప్రొఫెసర్ కెవై రత్నం, ప్రొఫెసర్ తథాగత్ లాంటి వాళ్ళ మీద క్రూరమైన లాఠీఛార్జి జరిగింది. ఉదయ్ భాను మీద దాదాపు థర్డ్ డిగ్రీ హింసాకాండ ప్రయోగం జరిగింది. చాలా మంది విద్యార్థుల్ని అరెస్టు చేసారు. చర్లపల్లి జైల్లో నిర్బంధించారు. పోలీసు వ్యానుల్లో నిర్భందించి చిత్రహింసలకు

## సభ

**సాయంత్రం 5:30 ని॥లకు 4.4.2016,**

---

అధ్యక్షత : **గీతాంజలి** – సిటీ యూనిట్ కన్వీనర్

వక్తలు : **డి. ఉదయ్‌భాను** – విరసం

**భాస్కర్** – టివివి స్టేట్ కమిటీ మెంబర్

**కత్తి అనిల్**-బిఎస్ఎఫ్, హెచ్‌సియు నాయకులు

**అక్షిత** (ఎస్ఎఫ్ఐ – సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్)

**సనా ఫాతిమా** (జెండర్ సెన్సిటైజేషన్ కమిటీ అగెనెస్ట్ సెక్సువల్ హరాస్‌మెంట్, ఎచ్‌సియు)

**ప్రొ. కె.వై. రత్నం** – ఎచ్‌సియు

**జి.కళ్యాణ రావు** – విరసం

**వరవరరావు** – విరసం

గురి చేసారు. ఉదయ్‌భానుని తీవ్రంగా హింసించాక విడిచిపెట్టి కొద్ది దూరం పోయాక ఒక పోలీస్ ఆఫీసర్ దగ్గరికి వచ్చి ఉదయ్‌భాను చెవిలో ఫాసిస్ట్‌రాజ్యం పంపించిన పోలీసులు "నిన్ను మీం చంపేస్తాం" అన్న రాజ్యహింసా మంత్రం చదివి వెళ్ళారు. రోహిత్ తన మరణానికి ముందు చూడాలనుకున్న చైతన్యం ప్రదర్శించినందుకు విద్యార్థి లోకానికి ఈ శిక్ష. ఈ క్రూరమైన ఫాసిస్టు దాడి. మరణం అంచుల దాకా వెళ్ళి వచ్చిన ఉదయ్‌భాను స్వదస్తూరిలో రాసిన వాంగ్మూలం చదివితే సామ్రాజ్యవాద మతతత్వ కేంద్ర రాష్ట్ర పాలక వర్గాలు ఎంత కుట్ర పూరితంగా రోహిత్ హంతకుడు వీసి అప్పారావుని రక్షించే

---

మిష్టర్ పీల్ అనబడే ఓ పెద్దమనిషి యాభైవేల డాలర్లు + మూడు వేల మంది కార్మికులను తీసుకొని పశ్చిమ ఆస్ట్రేలియాలోని స్వాన్ రివర్ ప్రాంతానికి చేరుకుంటాడు. అయితే ఆయన ఒక ముఖ్య విషయం విస్మరించాడు- కార్మికులను, ఉత్పత్తి సాధనాల నుండి దూరంగా ఉంచలేదు. అక్కడ కావలసినంత భూమి పడి ఉంది. సాగు చేసుకో గలిగిన వాడికి చేసుకోగలిగినంత. ఇంకెవరు తమ యజమాని మాట వింటారు! అతడి గురించి పట్టించుకుంటారు. "చివరికి మిష్టర్ పీల్ గారికి ఇంటిపనులు చేసిపెట్టేవాళ్ళు, వండి పెట్టేవాళ్ళు కూడా కరువయ్యారు" అంటూ ముగిస్తాడు.

వలసదేశాలలో ఎదురయ్యే సమస్యలకు అద్దం పట్టిందీ ఉదంతం. ఎడ్వర్డ్ గిబ్బన్ వేక్‌ఫీల్డ్ రాసిన పుస్తకంలో మార్క్స్ ఇది చదివాడు. "స్వాన్ రివర్ సెటిల్‌మెంట్‌లో సేద్యం చెయటానికి కూలీలు కరవై విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు, పశువులు పనికిరాకుండా పోయాయి. ఉత్తర అమెరికాలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది... అవకాశం దొరికినప్పుడల్లా, కూలీలు పని చెయ్యటానికి నిరాకరించి స్వంతంగా వ్యవసాయం చేసుకోవటానికే ఇష్టపడ్డారు. అందువల్ల బానిసల్లాగ పడివుండే కూలీలు మాత్రమే వలసదేశాల్లో ఉపయోగకరంగా ఉంటారు" అంటాడు వేక్‌ఫీల్డ్.

ప్రయత్నం చేశాయో స్పష్టంగా అర్థమవుతుంది.

## కా. ఉదయ్‌భాను వాంగ్మూలం

ఈ నెల 22వ తేదిన వి.సి. పొదిలె అప్పారావు ఛార్జి తీసుకున్నాడు. అదే రోజు యూనివర్సిటీలోని తన అనుచర గణం ఎవరెవరు ఏం చేయాలో అన్న కార్యక్రమాల్ని మెయిల్స్ ద్వారా రహస్యంగా పంపించాడు. తాను వి.సి. గెస్ట్‌హౌస్‌లో ఉన్న విషయాన్ని తెలుసుకుని విద్యార్థులు అక్కడికి వస్తారని ముందే ఊహించి తన మనుషులచేత వీడియోలు, ఫోటోలు తీయించే ఏర్పాటు చేసాడు. తర్వాత తాను అనుకున్నట్లే, విద్యార్థులు అక్కడికి రావడం ప్రొటెస్ట్ చేయడం జరిగింది.

అయితే వి.సి. ఏర్పాటు చేసిన కెమెరామెన్‌ల వీడియో ఫుటేజీలు, ఫోటోల్లో ఉద్యమకారుల నిరసన ప్రదర్శనలు, నినాదాలు మాత్రమే కనిపించాయి. కానీ ఆ రోజు నిజానికి తన మనుషులే అద్దాలు, టి.వి.లు పగల గొట్టడం మొదలు పెట్టారు. మొత్తానికి తన మనుషులు అందించిన వీడియోల, ఫోటోలే మీడియాలో విస్తృతంగా ప్రచారం పొందాయి. ఆ ప్రచారం సరిపోయిందనకున్న మరుక్షణమే పోలీసులు దాడి చేయడం మొదలు పెట్టి అమ్మాయిల జుట్టు పట్టి ఈడ్చికెళ్ళడం, కడుపులో తన్నడం, బూతులు మాట్లాడుతూ బట్టలు చింపడం, అబ్బాయిల మర్మాంగాల మీద తన్నడం చేసారు. సుమారు 100 మందికి పైగా విద్యార్థుల్ని ఎత్తుకు పోయారు. బిల్డింగ్‌లో నీళ్ళు తాగడానికి వెళ్ళి తిరిగి వస్తున్న నేను జరుగుతున్న దృశ్యాన్ని చూసి తప్పించుకోగలిగాను. మార్చి 22వ తేదీనే మధ్యాహ్నం నుండి మెస్‌లు బంద్ అయ్యాయి. 23వ తేదీ ఉదయం అరెస్ట్ కాగా మిగిలిన విద్యార్థులం షాపింగ్ కాంప్లెక్స్ చేరుకున్నాం. అప్పటికే యూనివర్సిటీ హాస్టల్స్‌లో కరెంట్, నీటి సరఫరా లేదు. నెట్ లేదు, ఎటిఎం లేదు. బయట క్యాంటీన్‌లో తిందామన్నా వాటినీ బందు చేయించారు. క్యాంపస్ బయటకు వెళ్దామంటే పోలీసులు గేట్లు మూసి, అక్కడే కాపలా కాసి పోనివ్వ లేదు. మధ్యాహ్నం దాటి పోయి 2:30 అవుతున్నది. ఇక తప్పదన్నట్లు కొద్ది మంది విద్యార్థులం కలిసి కట్టెలు, కూరగాయలు, బియ్యం, గిన్నెలు మొదలైనవి సమకూర్చుకుని వంట ప్రయత్నాన్ని మొదలుపెట్టాం. సరిగ్గా ఈ విషయమే వాళ్ళకు కంటగింపయ్యింది. మెస్సులు, క్యాంటీన్‌లు, నీటి సరఫరా బందుపెట్టి, క్యాంపెస్ బయటకు విద్యార్థులను పోనివ్వకుండా చేసి విద్యార్థుల్ని ఆకలితో మాడ్చాలన్నది వాళ్ళ వ్యూహం. ఆ వ్యూహం మా వంట ప్రయత్నంలో బయటపడింది. అందుకే పోలీసులు మేం వంట చేసుకున్న దగ్గరికి వచ్చి అక్కడున్న వాళ్ళను తోసేసి నన్ను కొట్టుకుంటూ తీసుకెళ్ళి, దగ్గర్లో ఉన్న పోలీసు మినీ బస్సులోకి తీసుకుపోయారు. అందర్ని కొట్టి తోసేసి నన్ను మాత్రమే తీసుకోపోవడంలోని ఉద్దేశ్యం అప్పుడే స్పష్టం కావడం మొదలైంది.

నన్ను బస్సులోకి తీసుకెళ్ళగానే తలుపుపెట్టి గడి వేసారు. అప్పటికే బస్సులో ఉన్న కొద్ది మంది పోలీసులు కిటికీలన్నీ మూసేసారు. నా అరుపులు బయటకు వినపడకుండా.. పోలీసులు వేసుకునే ప్రొటెక్షన్ నా నోటికి అడ్డం పెట్టారు. బస్సు సీట్ల మధ్య వెల్లకిల్లా పడుకోబెట్టి ఇద్దరు కాళ్ళు ఇద్దరు చేతులు లాగి పట్టుకున్నారు. లాల్ మథర్ అనే గచ్చిబౌలి క్రైం బ్రాంచ్ ఎస్సై, నా ఎదమీద, తొడల మీద ఎగిరి దుంకుతున్నాడు. దుంకుతూ "లంజాకొడుకా పోస్టుమార్టం కాడికి ఎందుకొచ్చినవ్‌రా, నీ కెంత గుద్ద బలుపురా" అని తిట్టాడు. కొంత సేపటి తర్వాత లేపి కూర్చోబెట్టి ఒకరు చేతుల్ని వెనక్కి విరిచి పట్టుకున్నారు. మరో ఇద్దరు తలను వెనకనుండి పట్టుకున్నారు. అదే లాల్ మథర్ ముఖం మీద, ఎడమచెవి, కన్ను మీద పిడి గుద్దులు కురిపిస్తూ "వీడు రోహిత్ వాళ్ళమ్మను ప్రొవోక్ చేసిండు. పోస్ట్‌మార్టమ్ రోజు వీడి వల్లనే ఆమె మాతో కొట్లాడింది. ఆమెను క్యాంపస్‌కు రప్పించింది వీడే లంజాకొడుకు" అని తిట్టాడు. ఆ సమయంలో "సార్ నాకు ఆపరేషన్ అయ్యింది సార్ విడిచిపెట్టండి సార్ మీ కాళ్ళు పట్టుకుంటా సార్" అని బతిమిలాడాను.

"ఎక్కడైందిరా ఆపరేషన్?" అనడగితే చూపించాను. మళ్ళీ అదే లాల్ మథర్ బూట కాలుతో ఆపరేషన్ అయిన ప్రాంతం మీద (పైల్స్ ఆపరేషన్ ప్రాంతం) విచక్షణా రహితంగా తొక్కాడు, తన్నాడు. తర్వాత బీర్జాల మీద (టెస్టికల్స్) తన్నాడు. తర్వాత చేతి వేళ్ళను బస్సు అంచుల మెట్ల మీద పెట్టి తన్ని బూటు కాళ్ళతో నలిపారు. మరొకరు పక్క నుండి ఎడమడొక్కలో అదేపనిగా తంతున్నారు. చివరకి, ఒక పోలీసు ఉన్నతాధికారి (బహుశా రమేష్ అనుకుంటా) వచ్చి వదిలేయండి అన్న తర్వాత డోర్ తెరిచి వదిలేసారు. తర్వాత ఇంకొక ఆఫీసర్ నా చెవి దగ్గరి కొచ్చి చిన్నగా "నిన్ను చంపేస్తాం" అని చెప్పి వెళ్ళాడు. ఈ దాడి జరుగుతున్న సమయంలో మా యూనివర్సిటీ సెక్యూరిటీ అధికారి టి.వి.రావు అక్కడికివచ్చి, కిటికీ తెరిపించుకుని, అందులోంచి లోపలికి తొంగిచూస్తూ పోలీసులతో "ఈ లంజాకొడుక్కి బాగా గుద్ద బలుపు సార్, తొక్కండి సార్ కొడుకుని" అన్నాడు. ఈ మొత్తం దాడిలో ఒక్క ఆపరేషన్ అయిన ప్రాంతంలో తప్ప మిగతా ఎక్కడా ఒక్క రక్తం చుక్క కారకుండా కొట్టారు. అన్ని మూగ దెబ్బలే.

తర్వాత ఒక ఐదు నిమిషాల వరకూ స్పృహ ఉంది. తర్వాత కళ్ళు తెరిచినపుడు హాస్పిటల్‌లో ఉన్నాను. నన్ను కొడుతున్నప్పుడు వాళ్లు మాట్లాడిన మాటల్లో నాకర్థమైన విషయాలు ఇవీ:

1. నేను రోహిత్ పోస్ట్‌మార్టం చేస్తున్నప్పుడు ఐ విట్నెస్‌గా ఉన్నాను.
2. "తాను చాలా కాలం క్రితమే హైదరాబాద్ వచ్చి స్థిరపడ్డాననీ, తన కొడుకు అంత్యక్రియలు హైద్రాబాద్ లోనే జరిపించుకుంటాననీ రోహిత్ తల్లి రాధిక అన్నారు. కానీ పోలీసులు డెడ్‌బాడీని బలవంతంగా గుంటూరు తరలించే ప్రయత్నం చేస్తే నేను ప్రశ్నించాను. ఆ సమయంలో అక్కడికి వెళ్లగలిగిన కేవలం ముగ్గురు విద్యార్థుల్లో శారీరకంగా బలంగా ఉన్నాను, పైగా నేనే మళ్ళీ మళ్ళీ ప్రశ్నిస్తూ ఉన్నాను.
3. ఏమైందో ఎట్లైందో నాకు తెలవదుకానీ, నాకీ రాజకీయాలతో సంబంధం లేదు. నా కొడుకు శవాన్ని నాకిస్తే వెళ్ళి పోతాను" అన్న రోహిత్ తల్లితో నేను చాలా సేపు మాట్లాడుతూ (పోస్ట్ మార్టం దగ్గర) ఇంతకు ముందు యూనివర్సిటీ యంత్రాంగం, అధ్యాపకుల దారుణమైన అణచివేతల వలన ఆత్మహత్యలు

చేసుకున్న విద్యార్థుల గురించి చెప్పాను. యూనివర్సిటీయే నీ కొడుకుని చంపిన ముద్దాయి అని అర్థం చేయించే ప్రయత్నం చేసాను.

4. మీటింగుల్లో రోహిత్ శవాన్ని 'కిడ్నాప్' చేసిన, బలవంతంగా దహన సంస్కారాలు చేసిన, విద్యార్థుల మీద విచక్షణా రహితంగా దాడులు చేసిన పోలీసుల హింస గురించి విపరీతంగా మాట్లాడాను.
5. ఉద్యమం జరుగుతున్నప్పుడు డప్పు గొడతూ పాటలు పాడాను.
6. నేనింకా బతికే ఉన్నాను.

ఈ విషయాలు మాత్రం గుర్తించగలిగా. ఇవే గుర్తున్నాయి ఇప్పటికీ, ఇంకా ఏవేవో అన్నారు. వాళ్ళు సుమారు 24 నిమిషాలు చావు రుచి చూపించారు. 2009 నుండి ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వాణ్ణి. తెలంగాణోద్యమం మీదనే కవితా సంకలనం జంగ్ (యుద్ధం) ప్రచురించాను. ఎం.ఫిల్ తెలంగాణ ఉద్యమం మీదనే చేసాను. పిహెచ్‌డి తెలంగాణ కవిత్వం మీదనే చేస్తున్నాను. ఇవన్నీ తెలంగాణ సకల జనుల విముక్తి కోసం, రాజ్యహింస లేని తెలంగాణ కోసమే. కానీ పెనంలోంచి పొయ్యిలో పడ్డ తెలంగాణ సొంత పాలకుల చేతిలో నెత్తురోడుతున్నది. ఏ తెలంగాణ కోసం నేను - నా అవగాహనను ఆచరణగా మార్చానో ఆ తెలంగాణ ఇప్పుడు పోలీసు తెలంగాణగా మారింది. పైన బిజెపి కింద తెలంగాణ మధ్యలో తెలంగాణ ప్రజలు క్రష్ అవుతున్నారు.

- ఉదయ్ భాను 26.3.2016

ఆర్ఎస్ఎస్ సైద్ధాంతిక పునాది జర్మన్ నాజీయిజం నించే స్వీకరించింది. సావర్కార్ నించి మోడీ - కేసిఆర్, చంద్రబాబు దాకా కొనసాగుతున్నది. విద్యార్థులపై రాజ్యహింస ఒక్క అబ్బాయిలపైనే కాదు కొనసాగుతున్నది. విద్యార్థినిల బట్టలు చించారు. జుట్టు పట్టుకుని ఈడ్చారు. ప్రాస్టిట్యూట్స్‌లాగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. ఎక్కడబడితే అక్కడ వాళ్ళ శరీరాల మీద చేతులు వేసారు. ఆఖరికి లొంగకపోతే రేప్ చేస్తామన్నారు. ఇంత లైంగిక హింస కొనసాగింది ఎచ్‌సియులో ! ఒక్కో విద్యార్థి చుట్టూ 10 మంది పోలీసులు, సివిల్ డ్రెస్‌లో లాల్ మథార్ లాంటి క్రైమ్ బ్రాంచ్ వాళ్ళు చేరి మూకుమ్మడిగా దాడులు చేస్తూ విచక్షణ రహితంగా కొట్టారు. కట్టి అనిల్ (బిఎస్ఎఫ్- హెచ్‌సియు లీడర్) చెయ్యి విరగొట్టారు. అతను ఏ పని చేస్కోలేకుండా ఉన్నాడు. విద్యార్థులకు యూనివర్సిటీ ఒక జైలుగా మారిపోయింది. జైలు యూనివర్సిటీగా మారిపోయింది.

హైదరాబాద్‌కి కన్హయ్య రాకకంటే రెండు రోజుల ముందు వి.సి. అప్పారావును ఎచ్‌సియులోకి ఎబివిపి విద్యార్థులతో చర్చలకు రావడం వెనకాల చాలా వ్యూహాత్మకమైన కుట్ర దాగి ఉంది. ఎచ్‌సియులో కన్హయ్యని రానియ్యకుండా చేయడం కోసం ఎచ్‌సియులో అప్పారావు విధ్వంసం చేయ దలిచాడు. ఉద్రేకాన్ని సృష్టించ దలిచాడు. సిగ్గులేని ప్రభుత్వం అతని మీద ఎలాగూ (రోహిత్ వేముల ఆత్మహత్యకు ప్రత్యక్ష కారణం అయినా కానీ) అతని పై ఎస్సీ / ఎస్టీ కేసు నమోదు చెయ్యలేదు. అరెస్టు చేయలేదు. పైగా నాయని నిస్సిగ్గుగా అసెంబ్లీలో వీసి అప్పారావు ప్రాణ భయంతో దాక్కున్నాడని విద్యార్థుల మీదకే ఆరోపణ చేస్తాడు. కన్హయ్య వచ్చింతర్వాత ఎచ్‌సియు విద్యార్థుల మీద ఈ దమనకాండ - అరెస్టులు - అక్రమ కేసులు సరే, దీనికంటే ముందు - రోహిత్ మరణం కంటే ముందు నుంచే యూనివర్సిటీ దళిత విద్యార్థులపై ఈ అగ్రకుల హిందూ బ్రాహ్మణీయ ఆధిపత్య సంస్కృతి చేస్తున్న దాడులు అణచివేతలు, చదువు విడిచిపెట్టి పారిపోయేలా చేసే వివక్షల వెనకాల, ఆత్మహత్యలు చేసుకునే దాకా వేధించి వెంటాడం వెనకాల ఒక్క హిందూత్వ మనువాదమే బుసలు కొట్టినా జెఎన్‌యూలో దేశద్రోహం, దేశభక్తి జాతీయ వాదం, టెర్రరిజమ్‌గా బయటపెట్టాలని ఇవన్నీ ముసుగులే! ఈ ముసుగుల్ని తొలిగిస్తే ఖచ్చితంగా హిందూత్వ శక్తుల హిడెన్ ఎజెండా కనిపిస్తుంది. విద్యారంగంతోపాటు సమాజంలోని అన్ని రంగాలనూ కాషాయి కరించడం/ ప్రైవేటీకరించడం... రాజకీయాధికార కోసం మనుషులను కులాలుగా, మతాలుగా, విడదీసే పోలరైజేషన్ ప్రక్రియ ఒక్కటైతే, ఆర్థిక కారణాలు కూడ స్పష్టంగా కనపడుతాయి. ఒక్క యూనివర్సిటీ విద్యార్థుల మీదే కాదు ముస్లిం మైనార్టీలు, దళితులు, ఆదివాసీలు, రైతులు, కార్మికుల మీద హిందూత్వ భావజాల పాలకవర్గాల దాడుల వెనకాల, అమలు పరిచే అభివృద్ధి నమూనాల వెనకాల సామ్రాజ్యవాద దేశాల వనరుల దోపిడీ పథకాలున్నాయి. దీనిలో పాలకవర్గాల ప్రయోజనాలున్నాయి. విద్యార్థుల పోరాటాల కారణం విద్యారంగాన్ని ప్రైవేటీకరించడమే! విద్యను ప్రైవేటీకరించడంలో భాగంగా భారత ప్రభుత్వం రెండేళ్ళ క్రితమే ప్రపంచ బ్యాంకుతో ఒప్పందం చేస్కుంది. దీని ప్రకారం విశ్వవిద్యాలయాలకు కేటాయించిన బడ్జెట్ తగ్గించేసారు. దళిత విద్యార్థులకు యూనివర్సిటీ గ్రాంట్స్ ఆపేశారు. (రోహిత్ రెండున్నర సంవత్సరాల కాలం పాటు ఒక జత బట్టలు చెప్పులతో, ఆకలితో గడిపాడు ఈ కారణంగానే)

ఇదంతా ప్రభుత్వం విద్యాసంస్థలను మూసివేసి, బలహీనం చేసి, ప్రైవేటు, విదేశీ విద్యా సంస్థలను అభివృద్ధి చేసే దిశలో భాగంగా జరుగుతున్నది. చాలా విద్యాలయాల్లో దళిత విద్యార్థులకు యుజిసి గ్రాంట్స్ నిలిపివేసారు. దేశ వ్యాప్తంగా విద్యార్థుల నిరశనలు వెల్లువెత్తుతున్నాయి. డబ్ల్యూటిఓ వంటి సంస్థలు భారత దేశ విధి విధానాలు నిర్దేశిస్తున్నాయి. ప్రభుత్వం దీనికి వ్యతిరేకంగా వచ్చే ప్రతిఘటనను అణిచివేయాలనుకొంటుంది. అణిచివేయడానికి దానికో సాకు కావాలి. అది విద్యార్థుల మీద దేశ ద్రోహం ముద్రలు వేసి పాకిస్థాన్, ముస్లిం అనుకూలరని ముద్ర వేస్తే చాలు.

ఇదంతా సామ్రాజ్యవాద దేశాలు భారత దేశంలాంటి బీద దేశాలలోని మతాన్ని హిందూత్వాన్ని ఉపయోగించుకుంటూ వనరుల దోపిడీకోసం చేసే మంద్రస్థాయి యుద్ధంలో భాగంగా అర్థం చేసుకోవాలి. ఇది అంతర్జాతీయ మార్కెట్ చేస్తున్న యుద్ధ వ్యూహం. ప్రజా ఉద్యమాల్ని అణిచివేసే ప్రతిఘాతుక యుద్ధం ఈ మంద్రస్థాయి యుద్ధం. ఎల్.ఐ.సీలో ఇంటెన్సిటీ కాన్‌ఫ్లిక్ట్ చాలా మెల్లగా ప్రజల ఆలోచనల్లో ప్రవేశ పెడ్తుంది. ప్రజల ఆర్థిక, మత సంబంధ, విద్యా, భావజాల, సాంస్కృతికరంగాల్లో వ్యూహాత్మకంగా

ప్రవేశించి ప్రజలను ఒక భ్రమాన్విత ఇమాజినరీ వరల్డ్ లోకి తీసుకెళ్లి, మతం, కులం మత్తులో అబద్ధపు ప్రపంచంలోకి లాక్కెళ్లి తమ కార్పోరేట్ బహుళజాతి ప్రయోజనాలను నెరవేర్చే రాజకీయ పార్టీలకు సహాయం చేస్తాయి. తమ దోపిడీని కొనసాగిస్తాయి. హిందుత్వ శక్తులు తమ రాజకీయార్థిక ప్రయోజనాల కోసం సామ్రాజ్యవాదులకు రెడ్ కార్పెట్ పరుస్తాయి. బిజెపి సంఘ్ పరివార్ దేశభక్తి జాతీయ వాదం, సాంస్కృతిక పరిరక్షణ ఇవన్నీ ఉపరితలాంశాలు. పునాదిలో మనం ఈ ఆర్థిక కోణాన్ని అర్థం చేసుకోవాల్సి ఉంది.

ఒక్క విద్యార్థులేకాదు ఆదివాసీలు, దళితులు, రైతులు, కార్మికులు సమస్త పీడిత వర్గాలు ముస్లిం, క్రైస్తవులు మీద జరుగుతున్న హిందుత్వ ఫాసిస్టు దాడుల వెనకాల సామ్రాజ్య వాదులకు దేశ వనరులను దోచి పెట్టే దళారీ పాలక వర్గాల కుట్రలు దాగి ఉన్నాయి. ఇదే వాళ్ళకు దేశభక్తి! దీన్నెదిరించి దేశ వనరులను కాపాడుకోవడం కోసం పోరాడే పీడిత ప్రజలు, ఆదివాసీలు దేశద్రోహులు. ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో దేశ వనరులను కాపాడే ప్రయత్నం చేస్తున్న ఆదివాసీలపై సైనిక వైమానిక దాడులతో తన స్వంత ప్రజలను మట్టు పెట్టాలని చూస్తున్న హిందుత్వ పాలక వర్గాలది అసలైన దేశభక్తి. స్వంత ప్రజలపై పరాయి దేశాలకు దేశ సంపద దోచి పెట్టడం కోసం హత్యాకాండలు సాగించడమే దేశభక్తిగా హిందుత్వ చలామణి చేస్కుంటున్నది.

ఈ ఆదివాసీ ప్రజల పోరాటాలను - వాళ్ళ హక్కులను కాపాడే దిశలో వాళ్ళ పక్కన నిలిచిన 90% అంగవికలుడైన ఢిల్లీ ప్రొ. జి.ఎన్. సాయిబాబా లాంటి వాళ్ళను అరెస్టు చేసి రాజద్రోహం నేరం మోపి అండాసెల్‌లో నిర్బంధిస్తుంది. విద్యార్థుల కోసం, ప్రజాస్వామిక తెలంగాణ కోసం గళమెత్తిన ప్రొ. కాశీంపై యుఎపిఎ రాజద్రోహం కేసును నమోదు చేస్తుంది.

యూనివర్సిటీ విద్యార్థులు రాజ్యం అది ఏ పార్టీ అయినా సరే తమ మీద మాత్రమే జరిపే దాడిగా మాత్రమే అర్థం చేస్కోకుండా సమస్త పీడిత ప్రజల మీద వనరుల దోపిడీకోసం జరుగుతున్న దాడిగా అర్థం చేసుకుని సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉంది. దేశభక్తి / దేశద్రోహం లాంటి ఉపరితల అంశాల్ని ఛేదించి పునాదిలో ఉన్న రాజకీయార్థిక కోణాలను ప్రజల ముందు విప్పి చెప్పాల్సిన అవసరం ఉంది. దీని కోసం ఆర్‌ఎస్‌ఎస్ కున్నట్లు భావజాల వ్యాప్తి కోసం ఒక పక్కా వ్యూహాన్ని ఇతర లౌకిక ప్రజాస్వామిక శక్తులతో ప్రజా సంఘాలతో పీడిత ఆదివాసీ, దళిత-కర్షక కార్మిక ప్రజలతో కల్సి ఒక సంఘటిత విద్యార్థి ఉద్యమాన్ని, హిందూ బ్రాహ్మణీయ ఆధిపత్య మతోన్మాద వ్యతిరేక ఉద్యమాన్ని దీర్ఘ కాలిక ప్రణాళికగా రచించి నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది. సావర్కర్ నించి మోడీ మీదుగా తెలుగు రాష్ట్రాల ప్రజలను కబళిస్తున్న హిందూ మతతత్వ ఫాసిజాన్ని సామ్రాజ్యవాద దోపిడీకి అడ్డు కట్ట వేయాల్సి ఉంది. ఇది ఒక్క విద్యార్థి ఉద్యమంగా కాకుండా పాలకవర్గాలకు బ్రాహ్మణీయ భూస్వామ్యానికి, సామ్రాజ్యవాదానికి, దీని దళారీ పాలక వర్గాలకు వ్యతిరేకంగా జరగాల్సిన పోరాటంగా తీర్చిదిద్దాలి. మతమే రాజ్యమయిన చోట మతంతో చేసే పోరాటం రాజ్యంతో చేసే పోరాటంగా, పాలక వర్గంతో చేసే పోరాటంగా వర్గ పోరాటంగా రూపుదిద్దుకుంటుంది. రాజ్యానికి మతం ఒక సాంస్కృతిక ఆయుధం అయినప్పుడు ఖచ్చితంగా సెక్యూలరిస్టులు, రచయితలు, కవులు, కళాకారులు, హేతువాదులు, విద్యార్థులు, ప్రజాస్వామిక వాదులు సాంస్కృతిక భావజాల రంగంలో దీన్ని ఎదుర్కోవల్సి ఉంటుంది.

కేంద్రంలో ఆర్‌ఎస్‌ఎస్ ను సంతృప్తి పరచడానికి కె.సి.ఆర్ వ్యూహాత్మక మౌనాన్ని ప్రశ్నించి నిలదీయాల్సిన అవసరం ఉంది. రోహిత్ మృతికి కారణమైన హిందుత్వ మతవాదులు స్మృతి ఇరానీ, దత్తాత్రేయ వి.సి. అప్పారావులను తక్షణం అరెస్టు చేసే దిశగా, ఒక దీర్ఘకాలిక యుద్ధ వ్యూహాన్ని నిర్ణయించుకోవల్సిన అవసరం ఉంది.

లేకపోతే కెసిఆర్ పంపించిన తెలంగాణ పోలీసు ఉదయభాను చెవిలో ఊదిన మరణ మంత్రాలు రేపు ప్రతీ విద్యార్థి చెవుల్లో మారుమ్రోగుతాయి. తెలంగాణ, ఆంధ్ర, మొత్తం దేశమంతా కాబోయే భయానకమైన మోడీ 2002 గుజరాత్ నమూనాలుగా, వెలివాడలుగా, ఘెట్టోలుగా మారిపోయే ప్రమాదం ఉంది.

ఉదయ్‌భాను చెప్పినట్లు సబ్బండ తెలంగాణ ప్రజలు కలలు కన్న ప్రజాస్వామిక తెలంగాణ, పోలీసు తెలంగాణగా పూర్తిగా మారిపోయే క్రూరమైన కాలం ఎదురు చూస్తున్నదేమో??

అయితే ఈ నవ యువకుల క్రియాశీల ఉద్యమంలో... తూర్పు పవనాలు వీస్తున్నాయి. పదండి ముందుకు పదండి తోసుకు పోదాం పోదాం పైపైకి.....!

ఈ సభకు అందరికీ ఆహ్వానం!

## చలసాని ప్రసాద్ పాతాలు, ప్రసంగాలు, లేఖలు పంపించండి

జూలై 25న చనిపోయిన విరసం నాయకుడు చలసాని ప్రసాద్ గత నలభై ఏళ్లలో వివిధ సందర్భాల్లో ఎన్నో అంశాలపై పాఠాలు చెప్పారు. ప్రసంగాలు చేశారు. మీ దగ్గర నోట్స్ ఏ రూపంలో ఉన్నా పంపించండి. ఆడియోలు ఉన్నా ఇవ్వండి. ప్రసాద్‌తో వ్యక్తిగత సంభాషణల రికార్డులు ఉన్నా పంపించండి. అలాగే గత అరవై ఏళ్లలో చలసాని తన మిత్రులకు విరివిగా ఉత్తరాలు రాశారు. చలసాని పాఠాలు, లేఖలు, ప్రసాద్ ఉన్న ఫోటోలు విరసం సేకరిస్తోంది. మీ దగ్గర ఏవి, ఏ రూపంలో ఉన్నా ఈ కింది చిరునామాకు పంపించండి. ఒరిజినల్స్ అయితే కాపీ చేసుకొని భద్రంగా తిరిగి ఇస్తాం.

చిరునామా : పి. వరలక్ష్మి, 5-1820, గీతాశ్రమం వీధి, ప్రొద్దుటూరు, కడపజిల్లా, పిన్ - 516360
ఈమెయిల్ : varalurwa@gmail. com, arunatara1977@gmail. com ఫోన్ : 8179913123

- సం.

# రచయితపై కుట్ర కేసు భావప్రకటనా స్వేచ్ఛను కాలరాయటమే. డా.కాశీంపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించాలని రచయితలు, కవులు, కళాకారులు, జర్నలిస్టులు, మేధావులు, ప్రజాస్వామిక వాదుల ఉమ్మడి ప్రకటన

ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకుడు, విప్లవ రచయితల సంఘం కార్యవర్గ సభ్యుడు, కవి, విమర్శకుడు, వక్త, నడుస్తున్న తెలంగాణ పత్రిక సంపాదకుడు డా.కాశీంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద రాజద్రోహం, కుట్ర కేసులు బనాయించడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. తెలంగాణ రాష్ట్రంలో నమోదైన మొదటి కుట్ర కేసు ఇది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వాలు నమోదుచేసిన ఏ ఒక్క కుట్ర కేసూ నిరూపణ కాలేదు. రాజద్రోహం కేసు నమోదైన ప్రతిసారీ రచయితలపై, మేధావులపై నేరపూరిత కుట్ర ఆరోపణలు ప్రభుత్వాలు చేస్తూ వస్తున్నాయి. కాళీపట్నం రామారావు కుట్ర కథలో చెప్పినట్లు ఏది కుట్రో, ఎవరిది కుట్రో తెలిపోతూనే ఉంది. మళ్ళీ ఇప్పుడు తాజాగా మెదక్ జిల్లా ములుగు పోలీస్ స్టేషన్ లో మావోయిస్టు కొరియర్ గా అనుమానిస్తున్న వ్యక్తితో పాటు కాశీంను రెండవ ముద్దాయిగా చూపుతూ ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేశారు. మావోయిస్టులకు లేఖలు రాశాడనే అభియోగంతో ఆయనపై దేశంలో పరమ అప్రజాస్వామిక చట్టాల్లో ఒకటైన చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (UAPA) కింద కేసు పెట్టి అరెస్టు చేయడానికి రంగం సిద్ధం చేశారు.

కాశీం కవిగా, రచయితగా తెలుగు రాష్ట్రాల్లో సాహిత్య పాఠకులకు సుప్రసిద్ధుడు. ఆయన రాసిన కవితా సంకలనం (కాశీం కవిత్వం), తెలంగాణ సాహిత్య వ్యాసాల పుస్తకాలు హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో, విరసం మహాసభల్లో ఇటీవలే విడులయ్యాయి. ఆయన సంపాదకత్వం వహిస్తున్న 'నడుస్తున్న తెలంగాణ' మాసపత్రిక తెలంగాణ రాష్ట్రంలో బలమైన ప్రతిపక్ష ప్రజాపక్ష పత్రికగా నడుస్తున్నది. కాశీంది తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో బలమైన గొంతుక. స్పష్టమైన సైద్ధాంతిక, రాజకీయం దృక్పథంతో ప్రజాస్వామిక తెలంగాణ ఆకాంక్షించే మేధావుల్లో ఆయన ఒకరు. సాహిత్యాభిమానులు, ప్రజాసంఘాల కార్యకర్తలు తరచూ తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడో ఒక చోట ఆయన ప్రసంగాలు వింటూ ఉంటారు. ఆయన ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖలో ప్రొఫెసర్. క్రమం తప్పకుండా విద్యార్థులకు పాఠాలు చెప్తూ ఉంటాడు. గతంలో రెండు సార్లు ఆయనపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (UAPA) కింద కేసు నమోదు చేసినప్పుడు విచిత్రంగా ఆయన్ను పరారీలో ఉన్న నిందితుడిగా పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామిక స్వరంపై ప్రభుత్వ దాడిలో భాగమే. ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన భావప్రకటన హక్కుకు ఇది ప్రమాదకరం.

ఒక వైపు దేశమంతా సంఘపరివార్ ఫాసిజంపై అట్టుడికి పోతోంది. సందుసందునా హిందూ మతం పేరుతో అరాచక శక్తులు చెలరేగిపోతున్నాయి. ముస్లింలను, దళితులను, రచయితలను, బుద్ధిజీవులను వెంటాడుతున్నారు. హైదారాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి ఆత్మహత్యకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థిలోకం పోరాడుతోంది. ప్రభుత్వం మాత్రం ప్రజాస్వామికవాదులపై కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తోంది. తెలంగాణ వస్తే అక్రమ కేసులన్నీ ఎత్తేస్తామని హామీ ఇచ్చాడు చంద్రశేఖరరావు. ఇప్పుడు ఆయన ప్రభుత్వమే ఫాసిస్టు మూకల చర్యల పట్ల ఉదాసీనంగా ఉంటూ, ప్రజాస్వామిక భావవ్యక్తీకరణపై మాత్రం అక్రమ కేసులు పెడుతున్నది. డా.కాశీంపై కేసు అప్రజాస్వామికం. నమోదు చేసిన UAPA అంతకన్నా అప్రజాస్వామికం. కాశీంపై కేసును ఎత్తివేయాలని, అట్లాగే భావాలకు, రాజకీయ అభిప్రాయాలకు సంకెళ్లు బిగించే UAPAను రద్దు చేయాలని రచయితలుగా మేము డిమాండ్ చేస్తున్నాం.

**సంతకాలు :**

ఎన్.గోపి, కె.శివారెడ్డి, నందిని సిధారెడ్డి, కె.శ్రీనివాస్, అల్లం రాజయ్య, ముదిగంటి సుజాతరెడ్డి, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, జూలూరు గౌరిశంకర్, గోరటి వెంకన్న, జూకంటి జగన్నాథం, అమ్మంగి వేణుగోపాల్, దేశపతి శ్రీనివాస్, సంగిశెట్టి శ్రీనివాస్, స్కై‌బాబా, బి.ఎస్.రాములు, ప్రొ.ఎస్.వి.సత్యనారాయణ, డా.నాళేశ్వరం శంకరం, వేణు సంకోజు, పాపినేని శివశంకర్, ప్రొ.రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, కందుకూరి శ్రీరాములు, కొండేపూడి నిర్మల, ఎన్.వేణుగోపాల్, ఖాదర్ మొహిద్దీన్, ప్రొ. చల్లపల్లి స్వరూపరాణి, తుమ్మేటి రఘోత్తమ్‌రెడ్డి, పెనుగొండ లక్ష్మినారాయణ, రామచంద్రమౌళి, వాసిరెడ్డి నవీన్, ఆచార్య ఎస్.గంగప్ప, షాజహానా, ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, యాకూబ్, పెద్దింటి అశోక్ కుమార్, అనిశెట్టి రజిత, ప్రొఫెసర్ ఎండ్లూరి సుధాకర్, హెచ్చార్కె, కొత్తపల్లి రవిబాబు, ప్రొఫెసర్, వెలుదండ నిత్యానందరావు, డా.చెన్నకేశవరెడ్డి, చూపు కాత్యాయని, ప్రొ.టి.జ్యోతిరాణి, నారాయణస్వామి, ఎ.కె.ప్రభాకర్, జి. కళ్యాణరావు, వరవరరావు, ఎం. రత్నమాల, వి. చెంచయ్య, సి.ఎస్.ఆర్. ప్రసాద్, నల్లూరి రుక్మిణి, అరసవెల్లి క్రిష్ణ, టి. క్రిష్ణాబాయి, కెక్యూబ్‌వర్మ, పి. కోటయ్య, ఎం. శ్రీనివాస్, నాగేశ్వరాచారి, గీతాంజలి, పొన్నాల బాలయ్య, ఎస్. రఘు,

దాసరాజు రామారావు, వోలేటి పార్వతీశం, బి. హనుమంతాచార్య, సి. వేదవతి, దోర్నాల విజయకుమార్, ఏనుగు నరసింహారెడ్డి, వేముగంటి మురళీకృష్ణ, పి. సుమతి నరేంద్ర, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, జి. చెన్నకేశవాచారి, సాగి కమలాకరశర్మ, రావికంటి వసునందనే, సూర్యాధనంజయ్, డా. పగడాల నాగేందర్, కె. అచిత రామారావు, నలమాస కృష్ణ, ఎ. అరుణ, పి.ఎన్. మూర్తి, ఎం.వి. రమణ, బి. శ్రీనివాస్, పి. లక్ష్మణ్, ఎస్. రఘునాథ్, డా. ఓ. క్రిష్ణయ్య, డా. ఎ. జానకి రెడ్డి, ఇ. దుర్గా ప్రసాద్, కె. నరసింహారావు, జి. యాదగిరి, బి. సంజీవ, ఎన్. ప్రేమ్ కుమార్, రాఘవేంద్ర, ఎస్. విజయ్, పి. నవీన్, సుధాకర్, భూపతి వెంకటేశ్వర్లు, పి. అయోధ్య, కె. వెంకటేశ్వర్లు, అవ్వారు గోవర్ధన్, జి. రాములు, దాసోజు క్రిష్ణమాచారి, జె. కోటేశ్వరరావు, కె. రాజనర్సింహా, తెలకపల్లి రవి, బమ్మిడి జగదీశ్వరరావు, రామకృష్ణ రావు, ఎస్. జగత్, టి. రమేష్ బాబు, బండారు విజయ, అరుణ, జి. అనీల్ కుమార్, డప్పు రమేశ్, డా. ఎ. సిల్మనాయిక్, రామకృష్ణ, పి. ఆంజనేయులు, నిఖిలేశ్వర్, కూర్మనాథ్, కందిమల్ల ప్రతాప్‌రెడ్డి.

అక్బర్, కె. జితేంద్రబాబు, కాట్రగడ్డ దయానంద్, ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు, శీలా వీర్రాజు, ఎం. శ్రీధర్, సీత, జె. సాంబశివరావు, ఖదీర్‌బాబు, మధురాంతకం నరేంద్ర, ఎం. బ్రహ్మయ్య, ఉమా, బమ్మిడి జగదీశ్వరరావు, పి. మోహన్, విమల, వి. వసంతలక్ష్మి, శివలక్ష్మి, వై. వేణుగోపాల్‌రెడ్డి, ఆర్. కె., రమణ జీవి, సి. ప్రసాద వర్మ, జి.ఎస్. రామ్మోహన్, మోతుకూరు శ్రీనివాస్, మన్నం సింధుమాధురి, అనీల్ అట్లూరి, సి.ఎస్. రాంబాబు, ఎన్. భీమార్జున్ రెడ్డి, కిరణ్, రామకృష్ణ, వివినమూర్తి, కె. వేణుగోపాల్‌రావు, జి. నారాయణ రావు, సాదనాల వెంకటస్వామి నాయుడు, నారాయణ వేణు, ఆడెపు లక్ష్మీపతి, దాసరి శిరీష, ఎం.ఎస్.ఆర్. స్వామి, జి. జవహర్‌లాల్.

తాయమ్మ కరుణ, వాసిరెడ్డి నారాయణరావు, టి.జె. రావు, ఆర్.జె. మోహన్ రావు, కె. వరలక్ష్మి, తూర్పు మల్లారెడ్డి, బొగ్గుల శ్రీనివాస్, పి. అన్నపూర్ణ, వి. ఆనంద భారతి, పద్మ పి.రాజు, కుమార్, జి. జలంధర్ రెడ్డి, బి. పద్మావతి, ఆర్. సుదర్శన్, పి. శ్రీనివాసులు, డా. ఎ.వి. వీరబ్రహ్మచారి, టి. రాం మోహన్, రావెల సోమయ్య, సుధామా, వి. బాలరాజ్, రఘుశ్రీ, అరుణ్ సాగర్, డి. నాగలక్ష్మి, ఎల్. రాజ్, గుర్రం సీతారాములు, వసంతరావు దేశపాండే, సుమనస్పతిరెడ్డి, సువర్ణముఖి, అట్టాడ అప్పల్నాయుడు, చింతాడ తిరుమల రావు, దగ్గుమాటి పద్మాకర్, నలజాల కొండయ్య, ప్రసాద్ తుమ్మా, బి. మురళీధర్, ఎం. సుబ్బారావు, వై. అచ్యుత రామయ్య, జి. జె. రెడ్డి, పి. చంద్రశేఖర్, బి. అజయ్ ప్రసాద్, ఎం.ఎస్. నాయుడు, ఆర్. కె. రెడ్డి, బి. హరిత, వి. హరికిషన్, డి.బి. దిబ్బలరావు, పృథ్వీరాజు డి., బి.ఎస్.ఎం. కుమార్, జి. ఎస్. చలం, జి.వి.వి.ఎన్. ప్రతాప్, సిహెచ్ శ్రీనివాస్.

పెనుగొండ లక్ష్మీనారాయణ, ఎస్.కె. గని, కొండా శివరామిరెడ్డి, డా. వై. శివాజీ, మాజీ రాజ్యసభ సభ్యులు, రావెల సాంబశివరావు, ఎ.ఎం.ఆర్. ఆనంద్, వల్లూరు శివప్రసాద్, డా. భూసురపల్లి వెంకటేశ్వర్లు, ఎన్. వి. నరసింహరావు, ఎస్. లక్ష్మారెడ్డి, పి.వి. రమణ, బి. సుధారాణి, జి. నాగేశ్వరరావు, వై.వి. రెడ్డి, ఎల్.ఎస్. భవాని, సి. పటేల్, డా. వై.వి. రమణ, ఎన్. బాలసుబ్రమణ్యం, కె.ఎస్. లక్ష్మణరావు, జె. నరసింహరావు, జి. శాంతకుమార్, సి.హెచ్. మధుకర్ రావు, ఎ. రత్న ప్రసాద్, బి. సుధాకిరణ్, డా. యలమంచిలి శివాజీ, కె.ఎస్. లక్ష్మణరావు, ఎన్. బ్రహ్మారెడ్డి, ఎస్. బ్రహ్మానందరెడ్డి, వై.వి. రెడ్డి.

కొండా శివరామిరెడ్డి, మందరపు హైమవతి, సి. ఉమామహేశ్వర రావు, రాంకుమార్, కొత్తపల్లి రవిబాబు, వై.ఎచ్.కె. మోహన్‌రావు, కొండపల్లి మాధవరావు, వెంకటేశ్వర్లు కోట, సింగంపల్లి అశోక్‌కుమార్, వి.వి.హెచ్. కోటేశ్వర్ రావ్, పి.ఎ. దేవి, సర్వరంజనీ, జి. నారాయణ, దివికుమార్, యలమంచిలి మురళీధర్, మంజరిలక్ష్మి, పెద్దభొట్ల సుబ్బరామయ్య, ఆంజనేయకుమార్, శిఖా - ఆకాష్ , చలపాక ప్రకాష్.

కె. బాబ్జీ, సకల నాగరాజు, ఎం. రవి కుమార్, ఎం. ఆదిశేషయ్య, ఎం. నాగరాజు, డా. వి.ఆర్. రాసాని, ఎం. ప్రసాదరావు, దార్ల బుజ్జిబాబు, విడదల సాంబశివరావు, షేక్ కరిముల్లా, జి.ఎస్. కరిముల్లా, డా. కె. సుధాకర్, షేక్ బహీరున్నీసా బేగం, చుక్క శంకర్, సందుపట్ల భూపతి, పి. నవజీవన్, డా. కె. కోటేశ్వరరావు, రేకా కృష్ణార్జునరావు, జి. సీతారామయ్య.

ఎం. రాఘవాచారి, జక్క గోపాల్, చిట్టిం కిష్టన్న, పి. రాంరెడ్డి, ఆర్. జగన్, జి. చంద్రారెడ్డి, కె. వెంకటయ్య, కె. శ్రీదేవి, జి. రాంచందర్, ఆర్. నాగభూషణ్, మద్దిలేటి, ఎం. లక్ష్మినారాయణ, పానుగంటి నాగన్న, ఎన్. సుభాషిణి, జలజం సత్యనారాయణ, కె.వి.ఎస్. గిరిష్ మిత్ర, గంగారం గోవర్ధన్, విరజాజి, కె. లక్ష్మణ్ గౌడ్, వల్లభాపురం జనార్దన్, ఉదయమిత్ర, సతీష్, జనజ్వాల, కె.పి. లక్ష్మినరసింహ, పొన్నగంటి ప్రభాకర్, సి. కిరణ్ కుమార్, బోల యాదయ్య, సి. రంగారెడ్డి.

కోడెం కుమార్, జోగు అంజయ్య, ఆర్ క్యూబ్, పొట్లపల్లి శ్రీనివాసరావు, పి. రామానుజ చారి, రంగు చక్రపాణి, అన్వర్, పల్లె శ్రీను, ఆడెపు చంద్రమౌళి, టి. శ్రీరంగ స్వామి, నమిలికొండ బాలకిషన్, మెకిరి దామోదర్, డి. భిక్షపతి, డా. ఎ నర్సింహుడు, డా. చింతం ప్రవీణ్, ఎ. నరేందర్, పి. వెంకటస్వామి, ఎం. రాము, వంగల సంపత్‌రెడ్డి, రవిచంద్ర, నల్లెల్ల రాజయ్య, ఆడెపు రాజు, నజ్జీరు ప్రదీప్, చిలువేరు అశోక్, మోహమ్మద్ నజీర్, కె. శ్యాంరావు, తంగెళ్ళ సుదర్శనం, ఎస్. నాగేశ్వర్లు, ఎన్. వెంకటేశ్వర్లు, బాలసాని రాజయ్య, రాజారాం, శాఖమూరి రవి, వడ్డెబోయిన శ్రీనివాస్.

శ్యాం, ప్రభు చంద్ర, నన్నపనేని రవి, మంత్రి కృష్ణమోహన్, కె. సీత, కె. చంద్ర, కె. శ్రీధర్, వంసు రమావత్, స్వాతి శ్రీపద, కె.ఎ. ముని సురేష్ పిళ్లై, దాసరి వెంకట రమణ, రెహానా, కట్ట కవిత, డా. వి. సుజాత, పి.డి.జి. ప్రసున, ముక్తవరం పార్థసారథి, వి. పద్మ, కె. కవిత, కవిని ఆలూరి, పి. రాజలక్ష్మి, డా. బండారి సుజాత, పి.డి.జి. ప్రసున, కె. విజయ భాను, ఎస్. నీలాదేవి, పి.

రాజ్యలక్ష్మి, పి. హేమలత, పి. అమరజ్యోతి, డి.ఆర్. మంజుల, వి. శాంతి ప్రభోద, మందరపు హైమావతి, కె. కాత్యాయని, విష్ణుప్రియ.

ఎస్.శేషయ్య, కె.విజయకుమార్, జి.బొమ్మయ్య, పి.దస్తగిరి, ఆర్.శశికళ, ఎం.శ్రీనివాసులు, ఎం.రామకృష్ణ, డా. ఉద్దండం చంద్రశేఖర్, టి.రాజారాం, చిలకూరి దేవపుత్ర, సి.హరి, వై.రామ్మోహన్, హెచ్.ఎస్.బ్రహ్మజీరావు, సి.ప్రతాప్, ఎస్.మనోజ్ కుమార్, ఎన్.నవీన్, బి.రవిచంద్ర, కె.శశికుమార్, కె.సందీప్, ఆర్.సి.రెడ్డి, జి.అంజన్‌కుమార్, ఎస్.రఘు, ఎం.నాగశ్యాంకిరణ్, ఆస్మాయాస్మిన్, బి.వరప్రసాద్, జి.నాగరత్నమ్మ, జి.లక్ష్మినారాయణ, పి.హరి, షకీర్, ఎం.లోక్‌నాథ్‌రెడ్డి, డి.అక్బర్, జి.డి.రామయ్య, ఎం.గంగాధర్, కె.కాంతికిరణ్, ఎం.కుమారస్వామి, కె.రజనీష్ రెడ్డి, ఎం.జనార్దన్, డి.ఉమేష్‌చంద్రకుమార్, టి.అశోక్‌చక్రవర్తి, ఎం.వెంకటేష్, ఎ.వి.రమణ, డా. టి.సూర్యప్రకాష్, ఎస్.విజయ్, జి.వెంకటరామిరెడ్డి, జె.రంగస్వామి, పి.చంద్రశేఖర్, అమిత్, మల్లేష్ యాదవ్, ఎ.నరసింహమూర్తి, డి.నరసింహులు, డి.రామకృష్ణ, బి.ఆర్.బి.కోటేశ్వర్‌రావు, హెచ్.లక్ష్మినారాయణ, జి.భారతి, డి.భార్గవి, యు.ఎండి.షరీఫ్, జి.బాలస్వామి, ఇ.సాయినాథ్, యు.మురళి, ఆష్రాఫ్, ఎ.చెన్నప్ప, డి.పీరావలి, బి.రవీంద్రకుమార్, జె.మురళి, జి.వెంకటేశులు, పి.శ్రీనివాసులు, వై.పురుషోత్తం, డా.జి.వెంకటలక్ష్మమ్మ, ఆర్.కేశవరెడ్డి, బి.కిషోర్‌సింగ్, కె.శ్రీనివాసరెడ్డి, బి.బుగ్గన్న, ఎస్.జి.మంజునాథ్, కె.ప్రభాకర్, బి.రవీంద్రకుమార్, జె.అంజన్‌కుమార్, ఎం.షమీర్, రాము, జె.పి.బంగారప్ప, సి.రాజరత్నయ్య, ఐ.నాగప్రసాద్, ఎ.పాములేటి, బి.నాగరాజు, జీవన్, ఎల్.ఆర్.లోకేష్, ఎన్.నరసింహ, జి.రంగస్వామి, జి.చంద్ర, జి.అర్జున్, ఎం.ఎస్.ఎం.బాబు, ఎం.సుబ్బారాయుడు, పి.విజయ్‌కుమార్, ఎం.వెంటేష్, ఆర్.శ్రీనివాసులు, ఎన్.ఆదినారాయణ, జి.నవీన్, ఎన్.విష్ణువర్ధన్, కె.సుజన్, జె.హరీష్, ఎస్.ఆంజనేయులు, జె.తిరుమలరాజు, బి.మునిస్వామి, పి.రాకేష్, మహేష్, ప్రసాద్, ఎం.తిరుపాలు, సి.రాము, డి.భాస్కర్, కె.నాగభూషణం, సి.నాగరాజు, ఐ.గోవర్ధన్, డి.నరేష్, ఆర్.ఆదిరెడ్డి, కె.దామోదర్‌రెడ్డి, బి.ఈశ్వరయ్య, డా.హెచ్.టి.తిప్పేస్వామి, డా..శ్రీనివాసులరెడ్డి, డి.ఆర్.తిప్పారెడ్డి, జె.శ్రీనివాసులు, జె.రామకృష్ణ, ఎం.ఆదినారాయణ, కె.రమణారెడ్డి, డి.రామచంద్ర, టి.మోహన్‌రెడ్డి, టి.రాఘవరెడ్డి, ఎం.శంకర్, బి.కొండారెడ్డి, డి.రాము, ఎస్.హుస్సేన్‌సాహెబ్.

పి.గోపీనాయక్, ఎం.శేఖర్‌బాబు, ఎం.భార్గవి, ఎం.భరణ్ సాయి, డా.కల్పనాకృష్ణయ్య, నరీన్, సుభాన్, ఫహీముద్దీన్, జి.పెద్దన్న, టి.ఉపేంద్ర, ఇస్మాయిల్, మద్దిలేటి, ఎస్.ప్రసాద్, ఎ.సుజాత, ఎస్.ఎం.గౌడ్, ఎం.జె.కుమార్, ఎన్.రమేష్, ఎం.భాస్కర్‌రెడ్డి, షేక్ ముబారక్, టి.శివకుమార్‌రెడ్డి, గండవరపు సామాన్య, మంచాల గంగాధర్, పి. తిరుపతి, నటరాజన్, కంపెల్లి ప్రవీన్, శ్రీకాంత్, డా. ఎస్.ఆర్. బత్తుల, అనుపమ పొట్లూరి, బల్‌జీత్ కౌర్, అరుణ్, మరీడు ప్రసాద్ బాబు, డా. రామదేవుడు, సుదగని వెంకటేశ్, నారాయణ స్వామి, ఫర్వేజ్, బత్తుల రామసుందరి, డి.వి. రామక్రిష్ణ రావు, శ్రీకాంత్, ఎ.కె. ప్రభాకర్, బాసిత్ ఎం.ఎ., ఆవుల వెంకట సుబ్రహ్మణ్యం, ఉమర్, నటరాజన్, క్రాంతి, విజయసాదు, కళ్యాణి ఎస్.జె., మంజరి లక్ష్మి, పాణి, సాగర్, వరలక్ష్మి, పావని, రివేరా, పి. రాము, వై.రామచంద్రం, సాగర్, క్రాంతి, పచ్చుల కిరణ్‌కుమార్, ఉజ్వల్, ఎం. భూపాల్, బి.ఎస్. రాజు, సి.హెచ్. సంధ్య, ఎం. మల్లేష్, డి. ఉదయ్‌భాను, చంద్రయ్య, పి. చిన్నయ్య, టేక్మాల్ లక్ష్మణ్, అల్‌ఫతా, ఎస్.ఎస్.ఆర్., చల్లపల్లి నర్సింహారావు, పి. వీరబ్రహ్మచారి, పద్మకుమారి, కె. జగన్, మేడక యుగంధరరావు, ఉదయ్, పి. వెంకన్న, సజ్జా వెంకటేశ్వర్లు, ఉదయ, ఎన్. వెంకటేశ్వర్లు.

పి. మేఘరాజు, టి. జాన్‌రెడ్డి, పి. జగదీశ్వర్, కె. విజయ వెంకన్న, సి.హెచ్. పుష్పకళ, పి. హరికిషన్, గాదాసు బాలయ్య, ఐతరాజు శ్రీనివాస్, బాసరాజు యాదగిరి, ఆర్. విజయ కుమార్, దాసరి లింగస్వామి, మునాస వెంకట్, జి. రమేశ్, నోముల సత్యనారాయణ, పి. ఏడుకొండలు, ఎం. సోమయ్య, రుద్రాక్ష దుర్గయ్య, నిమ్మల వెంకన్న, కందుల వెంకటేశ్వర్లు, వి. గణేశ్, సి.హెచ్. సుధాకర్ రెడ్డి, వి.ఎన్. చారీ, ఎం. శంకరయ్య, డి. నర్సింహులు, పి. ఆనంద్, ఎం. మల్లయ్య, ఎన్. గోపాల్ రెడ్డి, టి. దేవయ్య, డి. బ్రహ్మచారి, వై. వెంకట్‌రెడ్డి, కె. సౌజన్యవతి, ఎ. నర్సింహ్మ, పి. కుమార్, టి. సుదర్శనం, ఇ. వెంకటేశ్వర్లు, ఎ. శ్రీనివాస్‌రెడ్డి, పి. సుదర్శన్ రెడ్డి, బి. రామకృష్ణ, ఎం. వినోద్ కుమార్, పి. వెంకటేశ్, ఎం. రఘు శంకర్ రెడ్డి, మాధవి రమేశ్, కె. రాంరెడ్డి, కె. లక్ష్మినారాయణ, కె. యోగానంద్, ఎం. గణేశ్, ఆర్. వి. కుమార్, టి. లింగారెడ్డి, ఎ. తిరుపతి, కె. చంద్రమౌళి, కె. ప్రకాశ్, కె. నారాయణ, కె. స్వామినాథన్, సంఘమేశ్వర్, లేఖ, ఆర్. వికాస, ఆర్. ప్రతిమ, డా. శ్రీ రామప్ప, డి.ఎం. నర్సింహ్మ మూర్తి, వి. రాజిరెడ్డి, కె. నర్సింహులు, కె. వెంకట్, బి. భాస్కర్, బోయిన్‌పల్లి రాము, అర్ర అఖిల్ కుమార్, నూనె సురేశ్, ఆర్. రాజన్న, ఎం. రవీందర్, ఎం. వి. రమణ, ఎ.ఎన్. రెడ్డి, బి. శ్రీనివాసులు, డి. శ్రీనివాసులు, జి. అన్వేష్, డి. సుధాకర్, పి. గోపాల్ రెడ్డి, ఇ. విజయ్ కన్న, టి. మనోహర్, జి. ప్రశాంత్, జి. ప్రభాకర్, ఎ. సాంబశివ రెడ్డి, జి. రమేశ్, ఎస్. యాదయ్య, ఎన్. సౌందర్య, కె.ఎస్. ప్రదీప్, ఎం. సురేశ్, ఎన్. రాకేష్, విజయ బాబ్వాకర్, మనోహర్ టి. రౌత్, చంద్రరాజు ఎస్., ఎం. హర్షిత, జె. క్రిష్ణ, బి. మధు, ఎం. హన్మేష్, ఎ. అశోక్, సి.వై. పుల్లయ్య, కె. గణేశ్, కె. నారాయణ రెడ్డి, కె. ప్రభాకర్, ఎం. గంగాధర్, సి. బాబురావు, పి. బాల్‌రెడ్డి, బి. కొండల్‌రెడ్డి, అనీల్ సద్గోపాల్, కె. యోగానంద్, కె.వై. రత్నం, పద్మజ షా, ఎం. వెంకటేశ్వర్లు, ఎం.ఎం. కిష్టప్ప, తోక్‌చుమ్ సుర్‌జీత్ సింగ్, కె. లక్ష్మినారాయణ, మధు ప్రసాద్, కె. చంద్రశేఖర్ రావు, డి. రమేశ్ పట్నాయక్, ఎం.వి. నర్సింగ్‌రావు, మితాజ చక్రవర్తి, రోషన్ పదాన్, సొలంకి చక్రబర్తి, టి. సీతారామరాజు, ఎస్. నాగేశ్వర్ రావు, ఎ. శరత్, పి. యాకయ్య, బి. నర్సింహ్మారావు, బి. మధు, డి. విజయ్, ఎ. అరుణ.

| | | |
|---|---|---|
| 10. | రాజకీయ కృషి - మన కృషి అంతటికీ జీవనాడి (చైనా విప్లవోద్యమన పత్రిక హాంకీ వ్యాసాలు) | 35-00 |
| 11. | నక్సల్బరీ వెలుగులో (భారతదేశ నక్సలైట్ ఉద్యమ చరిత్ర) | 125-00 |
| 12. | జగిత్యాల జంగల్‌మహల్ (1) | 75-00 |
| 13. | జగిత్యాల జంగల్‌మహల్ (2) | 100-00 |
| 14. | స్టోలిపిన్ అభివృద్ధి నిరోధక కాలంలో | 15-00 |
| 15. | అంతర్జాతీయ విప్లవోద్యమాల్లోని ఆటుపోట్లు | 60-00 |
| 16. | భారతదేశంలో ఉత్పత్తి విధానం - ఉత్పత్తి సంబంధాలు | 20-00 |
| 17. | ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయోత్పత్తి సంబంధాలు | 30-00 |
| 18. | నేటి రాయలసీమ | 100-00 |
| 19. | గతాన్ని సమీక్షించుకుందాం | 50-00 |
| 20. | చూటే ఏరిన రచనలు | 125-00 |
| 21. | మావో సే టుంగ్ | 80-00 |
| 22. | గెరిల్లా యుద్ధం | 60-00 |
| 23. | చైనా ప్రజా విముక్తి సైన్యం | 40-00 |
| 24. | భూమి సంస్కృతి నాగరికత | 15-00 |
| 25. | స్త్రీవాద ఉద్యమం (అనురాధ గాంధీ) | 25-00 |
| 26. | కొత్త చూపు (ఆర్.ఎస్. రావు) | 120-00 |
| 27. | అభివృద్ధిని ఇలా చూద్దాం (ముదునూరి భారతి) | 80-00 |
| 28. | In Search of Method (Mudunuri Bharati) | 200-00 |
| 29. | On Education (Mudunuri Bharati) | 180-00 |
| 30. | Crisis and Development in Marxian Frame Work (Mudunuri Bharati) | 80-00 |
| 31. | Individual, Sub-Groups, Groups and Freedom (Mudunuri Bharati) | 75-00 |
| 32. | Methodology of Social Enquiry (Mudunuri Bharati) | 150-00 |
| 33 | Fifty Years of Andhra Pradesh 1956-2006 | 300-00 |
| 34. | జనతన సర్కార్ కావాలి మేక్ ఇన్ ఇండియా కాదు | 15-00 |
| 35. | విద్యార్థి ఉద్యమాల్లో విప్లవ దిద్దుబాటు | 30-00 |
| 36. | జాతుల సమస్య రిజర్వేషన్లు కార్మిక వర్గ దృక్పథం | 25-00 |
| 37. | తత్వశాస్త్రం మాయాజాలం కాదు | 20-00 |
| 38. | వైరుధ్యాలు | 20-00 |
| 39. | చైనా తాత్విక రంగాన మూడు ప్రధాన పోరాటాలు 1949-64 | 20-00 |
| 40. | జనతన రాజ్యం (పాణి) | 300-00 |
| 41. | మార్క్సిస్టు మహోపాధ్యాయుల జీవన రేఖలు | 20-00 |
| 42. | దండకారణ్య సాంస్కృతికోద్యమ చరిత్ర (పునర్ముద్రణ) | 100-00 |
| 43. | సీమ గొంతుక వినండి (అరుణ్ వ్యాసాలు) | 70-00 |
| 44. | ఈలం విముక్తి పోరులో మహిళలు | 50-00 |
| 45. | సామ్రాజ్యవాద దోపిడి మండలాలు (రత్నమాల) | 30-00 |
| 46. | డిటెన్యూ డైరీ (కె.వి.ఆర్.) | 170-00 |
| 47. | సమగ్ర తెలంగాణ (సంపాదకులు - ఎన్. వేణుగోపాల్) | 295-00 |

## వర్తమాన సమాజం, ప్రజా ఉద్యమాలు

| | | |
|---|---|---|
| 1. | ముజఫర్‌నగర్ మరో మానని గాయం | 20-00 |
| 2. | ఆకాస ఉద్యమ అమరులు | 10-00 |
| 3. | దండకారణ్యంలో గ్రీన్‌హంట్ | 60-00 |
| 4. | ఉద్యమ ఆకాశంలో సగం | 15-00 |
| 5. | తూర్పు మధ్య భారతంలో విస్థాపన-ప్రజా ప్రతిఘటన | 20-00 |
| 6. | జనతన జైత్రయాత్ర | 20-00 |
| 7. | ఫిలిప్పినో ఉద్యమం | 15-00 |
| 8. | ఖైదీల సైరన్ | 60-00 |
| 9. | విముక్తిబాటలో నారాయణపట్నా | 20-00 |
| 10. | అంతర్యుద్ధంలో ఆదివాసులు | 30-00 |
| 11. | నిత్య జీవితంలో సోషలిజం (భూసారం శివన్న) | 100-00 |
| 12. | ఆకుల భూమయ్య రచనలు | 40-00 |
| 13. | అమలు కానీ హామీల చరిత్ర (శశికళ) | 100-00 |
| 14. | ది ఫ్లేమ్స్ ఆఫ్ నారాయణ పట్నా | 60-00 |
| 15. | దాక్షిణ్య వాదం నుంచి దండకారణ్యం దాకా (రత్నమాల) | 200-00 |
| 16. | నూతన సంభాషణ (రత్నమాల) | 80-00 |
| 17. | జర్నలిజం ప్రొఫెషన్ (రత్నమాల) | 50-00 |
| 18. | సాహిత్య ధోరణులు విప్లవ ధోరణులు | 30-00 |

## స్మృతి సాహిత్యం

| | | |
|---|---|---|
| 1. | ఖాన్‌దాదా (ఎం.టి.ఖాన్ స్మృతి) | 10-00 |
| 2. | ఆదర్శజీవులు అమరులు | 30-00 |
| 3. | గంటి ప్రసాద్ రచనలు | 25-00 |
| 4. | సూర్యుడు మరణించడు | 60-00 |
| 5. | చిరునవ్వు సితార | 80-00 |
| 6. | గెరిల్లా డైరీ | 10-00 |
| 7. | మన్యం వెలుగులు | 15-00 |
| 8. | అక్షర కిరణం | 20-00 |
| 9. | అడవి పుత్రుడు మంగన్న | 10-00 |
| 10. | గజ్జెల సరోజ | 15-00 |
| 11. | మహిత | 10-00 |
| 12. | కోటి జ్ఞాపకాలు | 50-00 |
| 13. | అమరుల యాదిలో | 30-00 |
| 14. | అమరుల జీవిత చరిత్ర | 30-00 |
| 15. | వెగుచుక్కల వెలుతురులో | 10-00 |
| 16. | లంకపల్లి అమరులకు విప్లవ జోహార్లు | 10-00 |
| 17. | శారద స్మృతి శకలాలు | 30-00 |
| 18. | దండకారణ్యంలో చలసాని ప్రసాద్ | 10-00 |
| 19. | సాహసయోధురాలు (గజ్జెల సరోజ రచనలు) | 40-00 |
| 20. | కలం యోధుడు చెరబండరాజు (చెంచయ్య) | 25-00 |
| 21. | అమరుడు కామ్రేడ్ సంజయ్ | 10-00 |
| 22. | రైజింగ్ సన్ (సూర్యం స్మృతి) | 20-00 |

## డివిడిలు

| | | |
|---|---|---|
| 1. | అరుణతార సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక (1977-2013) | 125-00 |

**మరిన్ని వివరాలకు సంప్రదించండి : డి.వి. రామక్రిష్ణారావు,** అరుణతార ఎడిటర్,
ఫోన్ : 99891 89250 (ఉదయం 9 లోపు సాయంత్రం 8 తరువాత మాత్రమే) ఈమెయిల్ : arunatara1977@gmail.com
పుస్తకాల ధరకు సరిపడా డబ్బులతో పాటు, పోస్టింగ్ ఖర్చులను జతచేసి ఎం.ఓ. లేక డిడి ద్వారా పంపి పుస్తకాలను పొందవచ్చు.
ఆన్‌లైన్‌లో డి.వి.రామక్రిష్ణారావు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, లాలాగూడ బ్రాంచ్, హైదరాబాద్, ఎకౌంట్ నెం. 10243583773,
ఐఎఫ్ఎస్‌సి కోడ్ : ఎస్.బి.ఐ.ఎన్.0007112కి చెల్లించి పుస్తకాలను పొందవచ్చు.

***మా ప్రచురణలు : నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ ఎదురుగా, కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్‌లోనూ లభిస్తాయి. ఫోన్ నెం: 040-24652387***
***నవ తెలంగాణ, 1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాదు-500020. ఫోన్ నెం: 040-27608107, 9490099373***

**ARUNATARA** RNI Regn.No.21152/72 Published on 12/5/2016 May, 2016 Vol. : 44 Issue : 4 Hyderabad

A Literary and Cultural Telugu Monthly Journal of Viplava Rachayitala Sangham (VIRASAM - Revolutionary Writers' Association)

# అరుణతార నిర్వహణకు విరాళాలివ్వండి
# శాశ్వత నిధి ఏర్పాటుకు సహకరించండి

విప్లవ రచయితల సంఘం అధికార పత్రిక అరుణతార 1977 నవంబర్ నుంచి మాస పత్రికగా వస్తోంది. సాహిత్య సాంస్కృతిక సంస్థగా విరసం విప్లవ, విప్లవ సాహితోద్యమాల్లో నిర్వచించుకున్న తన రాజకీయ, సాహిత్య, మేధో పాత్రకు వాహికగా తెలుగు సమాజంపై ప్రభావం వేస్తున్నది. గత మూడు తరాలుగా ఎందరో రచయితల, బుద్ధిజీవుల ఆలోచనా వికాసానికి వేదికగా ఉన్నది. సాహిత్య పత్రిక అయినప్పటికీ సామాజిక, రాజకీయార్థిక, సిద్ధాంత విశ్లేషణలకు, చర్చలకు, అన్వేషణకు సృజనశీలమైన మాధ్యమంగా కొనసాగుతున్నది. నక్సల్బరీ శిశువుగా విరసం తాను ఎంచుకున్న విప్లవోద్యమ ప్రచార కర్తవ్యంలో అరుణతార పాత్ర గణనీయం. 1970లలో ఉత్తర తెలంగాణలో విప్లవోద్యమ పునర్నిర్మాణ దశ నుంచి ఇవాళ దేశవ్యాప్తంగా సాగుతున్న విప్లవ, ప్రజా పోరాటాల సంచనాలను అరుణతార తన శక్తినంతా వెచ్చించి అక్షరబద్ధం చేస్తున్నది. మరీ ముఖ్యంగా చత్తీస్‌ఘడ్‌లో సల్వాజుడుం దుర్మార్గాలు మొదలైనప్పటి నుంచి ఇవ్వాల్టి ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడో దశ, సల్వాజుడుం రెండో దశ దాకా దండకారణ్య ప్రజా యుద్ధాన్ని, ప్రజారాజ్యాధికారాన్ని, ప్రత్యామ్నాయ రాజకీయార్థిక విధానాన్నీ, అక్కడి సాహిత్య, సాంస్కృక వికాసాన్నీ తెలుగు పాఠకులకు పరిచయం చేస్తున్నది. విశ్లేషిస్తున్నది. దండకారణ్య విప్లవోద్యమానికి సంఘీభావ హస్తాన్ని అందిస్తున్నది. ఈ పనిలో ఇతర ప్రజాస్వామిక పత్రికల పాత్ర కూడా ఉన్నప్పటికీ అరుణతార దాన్నే ఒక ప్రధాన కర్తవ్యంగా స్వీకరించింది. ఇటీవల పెరిగిపోయిన హిందూ ఫాసిస్టు ప్రమాదానికి వ్యతిరేకంగా లౌకిక ప్రజాస్వామిక కంఠస్వరాన్ని బలంగా వినిపిస్తున్నది. వేర్వేరు సామాజిక ఉద్యమాల ఆకాంక్షలను ఎత్తిపడుతూ వాటి న్యాయబద్ధతను విశ్లేషిస్తున్నది.

ప్రజా ఉద్యమాల్లోని కార్యకర్తల సృజనాత్మక వ్యక్తీకరణలకు అరుణతార అవకాశం ఇవ్వడం వల్ల వాళ్లలోంచి ఎందరో ప్రతిభావంతులైన ఆలోచనాపరులు, రచయితలు తయారువుతున్నారు. అరుణతార ఈ పని ఆది నుంచి చేస్తున్నది. అందువల్ల ఒక పక్క లబ్ధప్రతిష్టుల రచనలతోపాటు ఎప్పటికప్పుడు కొత్త గొంతులు అరుణతారలో వినిపిస్తుంటాయి.

అయితే మొదటి నుంచీ అరుణతార అనేక ఆర్థిక, నిర్వహణ సమస్యలను ఎదుర్కొంటున్నది. ఒక్కోసారి ఈ ఇబ్బందులు కాస్త తక్కువగా ఉన్నా, ఇటీవల తీవ్రమైన సంక్షోభాల మధ్య ఎప్పటికప్పుడు అభిమానుల, మిత్రుల అండదండలతో నడుస్తున్నది. గతంలో ఒకసారి అరుణతారకు విరాళాలు వద్దు.. చందాలు కట్టండనే ఆదర్శాన్ని కూడా అమలు చేసింది. అయితే నానాటికి పెరుగుతున్న ప్రెస్ ఛార్చిలు, నిర్వహణ ఖర్చులు మోయలేని భారమయ్యాయి. దీంతో రెండు నెల్లకో సంచిక వచ్చిన సందర్భాలూ ఉన్నాయి. అయితే పేజీలు పెంచి పాఠకులకు మరిన్ని రచనలు అందిస్తూ వచ్చాం.

ఈ అన్ని అనుభవాల దృష్ట్యా అరుణతారకు శాశ్వత నిధి తయారు చేయకుండా ఇక పత్రికను నాలుగుకాలాల పాటు నడపడం అయ్యేపని కాదని తేలింది. ఇంత కాలం అభిమానుల సహకారంతోనే నడుస్తూ వచ్చిన అరుణతార ఈసారి శాశ్వత నిధి కోసం మీ ముందుకు వచ్చింది. ఇవాళ ఉన్న విప్లవోద్యమ ప్రత్యేక పరిస్థితుల్లో అరుణతార అవసరం ఎంత ఉన్నదో పాఠకులకు తెలుసు. తెలుగు నేల మీద, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో ఉన్న అసంఖ్యాక విప్లవాభిమానులు తలాఒక చేయి వేస్తే శాశ్వత నిధి సమకూరడం కష్టమేమీ కాదని మా నమ్మకం. దాంతోనే మీ ముందుకు వచ్చాం. విప్లవోద్యమ రాజకీయ, సాంస్కృక వేదిక అరుణతారకు మీవంతు విరాళాలు ఇవ్వాలని, ఇప్పించాలని కోరుకుంటూ...

**డి.వి. రామక్రిష్ణారావు,** అరుణతార సంపాదకుడు
**పి. వరలక్ష్మి,** విరసం కార్యదర్శి

**విరాళాలు ఆన్‌లైన్‌లో పంపడానికి / డ్రాఫ్ట్, చెక్‌ల రూపంలో పంపడానికి వివరాలు :**
**డి.వి. రామక్రిష్ణారావు, అకౌంట్ నెం. 10243583773, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్.బి.ఐ.)**
**ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్ నెం. ఎస్.బి.ఐ.ఎన్.0007112, లాలాగుడ, సికింద్రాబాద్.**

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DUVVURI VENKATA RAMAKRISHNA RAO, PRINTED AT CHARITA IMPRESSIONS, DOOR NO: 1-9-1126/B, AZAMABAD, HYDERABAD – 500020, TELANGANA STATE, PUBLISHED AT 12-15-963, MANIKESWARNAGAR, OSMANIA UNIVERSITY CAMPUS, TARANAKA, HYDERABAD – 500007, TELANGANA STATE, EDITOR: DUVVURI VENKATA RAMAKRISHNA RAO.